# క్రాంతి

లోపలి పేజీల్లో...


కా. ఆజాద్, పాండేల చరిత్ర ........ 8
కా. రవి, రమణల చరిత్ర ........ 14
కా. సూర్యం,జగదీష్‌ల చరిత్ర ........ 24
రెక్టిఫికేషన్ వ్యాసం-10...మధ్య పేజీలో
కా. ఆజాద్ ఇంటర్వ్యూ ........ 33
కా. శారద చరిత్ర ........ 44
కా. కుమ్లి హత్య ........ 48
భోపాల్ దారుణం... ........ 50
తాకిలోడు నరమేధం ........ 52
పోరాట వార్తలు ........ 54



సి.పి.ఐ. (మావోయిస్టు) ఎ.పి., ఎన్.టి., ఎ.ఒ.బి. కమిటీల అధికార పత్రిక

సంపుటి: 34 సంచిక: 4 జూలై - ఆగస్టు 2010 వెల: పది రూపాయలు


## అమరుల త్యాగాలు ఎన్నటికీ వృధా కావు!

## అమరుల ఆశయ సాధనకు ప్రజాయుద్ధ మార్గంలో

## దృఢసంకల్పంతో పురోగమిద్దాం!!

**జూలై 28-ఆగస్టు 3, అమర వీరుల సంస్మరణ వారం సందర్భంగా సి.పి.ఐ.(మావోయిస్టు) ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ గణపతి 'క్రాంతి'కి పంపిన సందేశం**



కామ్రేడ్స్, మన పార్టీ స్థాపకులు, మహా నాయకులు, ప్రియతమ కామ్రేడ్స్ చారుమజుందార్, కామ్రేడ్ కన్నయ్ ఛటర్జీలకూ, నక్సల్బరీ నుండి నేటి వరకూ అమరులైన వేలాది ప్రియతమ కామ్రేడ్స్‌కు నేను అమరుల సంస్మరణ వారం సందర్భంగా కేంద్రకమిటీ తరపున, కేంద్ర మిలిటరీ కమీషన్ తరపున, సుకోమా తరపున, నూతనంగా ఏర్పడిన జనతన సర్కార్ తరపున సగౌరవంగా అరుణారుణ జోహార్లు తెలియజేస్తున్నాను. భారత నూతన ప్రజా స్వామిక విప్లవ సాధనలో ఈ సంవత్సరం దాదాపు 300 కామ్రేడ్స్ తమ నులివెచ్చని రక్తం ధారపోసి అమరులయ్యారు. అందులో మన ప్రియతమ సహచరులు కామ్రేడ్స్ ఆజాద్, అప్పారావు, రమణ, హేమంత్, సూర్యం; బీహార్-ఝార్ఖండ్‌లో కామ్రేడ్స్ క్రిష్ణ యాదవ్, డేవిడ్, ఒడిషాలో కామ్రేడ్స్ రింకీ, సింగన్న, ఆంద్రు; ఎఒబిలో కామ్రేడ్ స్వర్ణ; ఉత్తర తెలంగాణలో కామ్రేడ్స్ దయ, పున్నం; దండకారణ్యంలో కామ్రేడ్స్ రుక్మతి, బండు, శాంతి; కర్ణాటకలో కామ్రేడ్ ఆనంద్, బెంగాల్‌లో కామ్రేడ్స్ మహతో, సిద్ధూ సోరేన్, తదితర కామ్రేడ్సందరికీ విప్లవజోహార్లు తెలియజేస్తున్నాను. మన పార్టీ నేతృత్వంలోనే కాకుండా మన దేశంలో, భారత ఉపఖండంలో, ఫిలిప్పైన్స్, నేపాల్, బ్రెజిల్, టర్కీ తదితర దేశాల్లో సామ్రాజ్యవాదులకూ, విప్లవ ప్రతీఘాతకులకూ వ్యతిరేకంగా జరుగుతున్న విప్లవోద్యమాల్లో వందలాది కామ్రేడ్స్ తమ అమూల్యమైన ప్రాణాలను అర్పించి అమరులయ్యారు. వారి లక్ష్యమూ, మన పార్టీ లక్ష్యమూ ఒకటే. వారందరికీ మన సంస్మరణ సభ సందర్భంగా నేను అంతర్జాతీయ విప్లవకర కార్మికవర్గ జండాను సమున్నతంగా ఎత్తిపట్టి మన పార్టీ తరపున, మన భారత ప్రజల తరుపున విప్లవ జోహార్లు అర్పిస్తున్నాను.

అమరుల జీవిత సహచరుల, కుటుంబ సభ్యుల, స్నేహితుల దుఃఖంలోనూ, వారి మనస్తాపంలోనూ, విచారంలోనూ మన సిసి సంపూర్ణంగా పాలుపంచుకుంటున్నది. ప్రాణాలకు తెగించి పోరాడి గాయపడిన కామ్రేడ్స్ త్వరగా కోలుకొని తిరిగి యుద్ధరంగంలో భాగం కావాలని మన సీసీ ప్రగాఢంగా ఆకాంక్షిస్తున్నది. అలాగే ఆపరేషన్ గ్రీన్‌హంట్‌లో వందలాది కామ్రేడ్స్ ఇండ్లు ధ్వంసం అయ్యాయి. వేలాది ప్రజలను, మన కామ్రేడ్స్ తల్లిదండ్రులను, భార్యా బిడ్డలను, సోదరీ సోదరులను హింసించారు, జైళ్లల్లో పెట్టారు. మన తల్లులపై, అక్కా చెల్లెళ్లపై అత్యాచారం చేశారు. ఈ దమనకాండలో భాగంగా ఇబ్బందులు పడిన వందలాది కామ్రేడ్స్‌కూ, వేలాది ప్రజలకూ మన సిసి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నది. వారందరికీ మన పార్టీ మద్దతు నందిస్తుంది. వారంతా తిరిగి విప్లవంలో ముందుకు సాగేలా సహకరించాలనీ, వారిని సంఘటితం చేయాలని ఈ సందర్భంగా నేను సిసి తరపున యావత్తు పార్టీని కోరుతున్నాను. ఈ సంవత్సరం వేలాది మంది అరెస్టయ్యారు. అరెస్టయిన వారిలో కామ్రేడ్స్ బల్‌రాజ్, చింతన్, ఆశ, సీమ తదితర కేంద్ర, రాష్ట్ర కమిటీలకూ చెందిన కామ్రేడ్స్ నుండి స్థానిక పార్టీ సెల్ సభ్యుల వరకూ వున్నారు. జైళ్లలో వున్న కామ్రేడ్స్ చాలా ఇబ్బందులు పడుతున్నారు. మన కామ్రేడ్స్ విప్లవ స్ఫూర్తితో జైళ్లను కూడా పోరాట క్షేత్రాలుగా మలుస్తున్నారు. ఆ కామ్రేడ్స్‌కు మనం మద్దతునివ్వాల్సి వుంటుంది. వీలయినంత త్వరలో వాళ్లను విడుదల చేసుకొని తిరిగి పోరాటంలో భాగస్వాములను చేసుకోవాల్సిన బాధ్యత కూడా మన మీద వుంది.

కామ్రేడ్స్, ఈ సంవత్సరానికి చాలా ప్రాధాన్యత వుంది. భారత విప్లవాన్ని పూర్తిగా నిర్మూలించాలని సామ్రాజ్యవాదులూ, దళారీ నిరంకుశ పెట్టుబడిదారులూ, భూస్వాములు కుమ్మక్కై పెద్ద దమనకాండను ప్రారంభించారు. 'ఆపరేషన్ గ్రీన్‌హంట్' పేరుతో అది బాగా ప్రచారం అయింది. మన పోరాట ప్రాంతాల్లోని ప్రజలూ, మొత్తం దేశంలోని ప్రజలూ, విదేశాల్లోని మావోయిస్టు పార్టీలూ, విప్లవ ప్రజానీకమూ వీళ్లందరికీ ఆపరేషన్ గ్రీన్‌హంట్ అంటే ఏంటో దానిని ఎవరు నడిపిస్తున్నారో, దాని ఉద్దేశ్యం ఏంటో తెలిసిపోయింది. కేవలం దండకారణ్యం, బీహార్-ఝార్ఖండ్‌లలో గెరిల్లా జోన్లను విముక్తి ప్రాంతాలుగా అభివృద్ధి చేయడానికి పిఎల్‌జిఎను పిఎల్ఎగా, గెరిల్లా యుద్ధాన్ని మొబైల్ యుద్ధంగా, అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో పోరాడుతున్నందు వల్లనే మన పైన ఈ దమనకాండ అపూర్వ స్థాయిలో అమలవుతుందని భావించకూడదు. మన పార్టీ ఎక్కడుంటే అక్కడ రాజ్య దమనకాండ అమలవుతున్నది. భారతదేశంలో మన పార్టీ ఇరవై రాష్ట్రాల్లో పని చేస్తున్నది. ఈ ఇరవై రాష్ట్రాల్లో ప్రతిచోటా మనకు పిఎల్‌జిఎ లేదు. సాయుధ పోరాటం చేసేంతగా మనం అభివృద్ధి చెందలేము. బెంగాల్, బీహార్, ఝార్ఖండ్, ఒడిషా, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, అలాగే కర్ణాటక, మధ్యప్రదేశ్, వుత్తర ప్రదేశ్‌లలోని చిన్న చిన్న ప్రాంతాలలో మన పార్టీ నాయకత్వంలో సాయుధ పోరాటం జరుగుతున్నది. ప్రస్తుతం మొత్తం దేశవ్యాపితంగా మనం సాయుధ పోరాటం చేసే స్థాయిలో లేకున్నా చాలా రాష్ట్రాల్లో మన కామ్రేడ్స్ ఎంత తక్కువ వున్నా కూడా మన మీద దమనకాండ తీవ్రస్థాయిలో అమలవుతోంది. ఎందువలన? మన పోరాటాలు బలంగా వున్న చోట్లలో అమలవుతున్న గ్రీన్‌హంట్‌కూ, దేశంలోని మిగతా చోట్ల మన మీద అమలవుతున్న ప్రభుత్వ దమనకాండకూ స్వభావంలో తేడా ఏమైనా ఉన్నదా అనేది మనం స్పష్టంగా అర్థం చేసుకోవాల్సిన అవసరం వుంది. అమరుల సంస్మరణ వారం సందర్భంగా ఇటువంటి చర్చ మనం చేయాల్సిన, అర్థం చేసుకోవాల్సిన, ప్రజలకు అర్థం చేయించాల్సిన అవసరం వుంది. ఇటీవల కాలంలో ఏ ఒక్క సంవత్సరం కంటే ఈ సంవత్సరం ఎక్కువ మంది కామ్రేడ్స్ అమరులయ్యారు. దండకారణంలో ఈ సంవత్సరం అమరులైనంత మంది మునుపెప్పుడూ కాలేదు. శత్రువు ఇంత తీవ్ర దమనకాండను ఎందుకు అమలు జరుపుతున్నాడో చాలా సీనియర్ కామ్రేడ్స్ 30, 35 సంవత్సరాల పార్టీ చరిత్రతో సంపూర్ణంగా పెనవేసుకుపోయిన కామ్రేడ్స్, తాము విశేషంగా అభివృద్ధి చెంది పార్టీనీ, విప్లవాన్నీ కూడా అభివృద్ధి చేసిన కామ్రేడ్స్ ఎందుకు అమరులయ్యారో, మనం స్పష్టంగా తెలుసుకోవాల్సి వుంది.

నేడు యావత్తు ప్రపంచ ఆర్థికాన్ని, రాజకీయాలను, సామ్రాజ్యవాదం, దాని పెట్టుబడి, దాని సైన్యం శాసిస్తున్నాయి. ముఖ్యంగా 1990 దశకం నుంచి చూస్తే ప్రపంచ వ్యాప్తంగా ఆదివాసీ ప్రాంతాలలోకి కూడా లోతుగా దాని పెట్టుబడి చొచ్చుకుని వచ్చి కబళిస్తున్నది. ప్రతిచోటునీ సామ్రాజ్యవాదుల మార్కెట్ ఆక్రమించింది. అది ఆర్థికంగానే కాకుండా ఈ ప్రాంతాలను రాజకీయంగా, సాంస్కృతికంగా, పర్యావరణపరంగా కూడా ఆక్రమించింది. ఈ ఆక్రమణ ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా కొనసాగుతున్నది. 2008 ఆఖరు నుండి పెద్ద ఆర్థిక సంక్షోభం అమెరికా నుండి మొదలయి సామ్రాజ్యవాద దేశాలతో పాటు ప్రపంచమంతా వ్యాపించింది. సామ్రాజ్యవాదం ఈ సంక్షోభం నుండి బయటపడ్డానికి తమ దేశాలలోని కార్మికవర్గాన్ని పీల్చి పిప్పి చేస్తున్నది. అది ప్రపంచ దేశాల మార్కెట్లపై చాలా తీవ్రంగా దాడి చేస్తోంది. రోజు రోజుకూ మరింతగా సామ్రాజ్యవాద దోపిడీ పీడనలు తీవ్రతరం అవుతున్నాయి. అలాగే మనదేశ దళారీ నిరంకుశ పెట్టుబడి దారులు బహుళజాతి కంపెనీలతో మిలాఖత్తై తమ దోపిడీ కబంధ హస్తాలను ప్రపంచ మార్కెట్లోకి విస్తరింప చేయడానికి ప్రయత్నిస్తున్నారు. ముఖ్యంగా దక్షిణ ఆసియాలో తమ దోపిడీని విస్తరింపచేయడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ప్రపంచాధిపత్య

వ్యూహంలో అమెరికా భారత పాలక వర్గాలను దక్షిణ ఆసియాలో తన జూనియర్ భాగస్వాములుగా చేసుకున్నది. సరిగ్గా ఈ పరిస్థితిలోనే సామ్రాజ్యవాదుల, భారత దళారీ నిరంకుశ పెట్టుబడిదారుల, భూస్వాముల ఆర్థిక, రాజకీయ ప్రయోజనాలకు మన పార్టీ పెద్ద ఆటంకంగా మారింది. మన పార్టీ ఉనికిలో వుంటే, మరింత బలపడి విస్తరిస్తే ఇప్పటికే పీకల దాకా సంక్షోభంలో మునిగి వున్న సామ్రాజ్యవాదం పరిస్థితి మరింత విషమిస్తుంది. ఎందుకంటే మనదేశంలో 115 కోట్ల మంది ప్రజలున్నారు. మన దేశం సామ్రాజ్యవాద పెట్టుబడికి ప్రపంచంలోని పెద్ద మార్కెట్లలో ఒకటి. ఇక్కడ విస్తారమైన ప్రకృతి సంపదలున్నాయి, మానవ వనరులున్నాయి. వీటిని దోచుకోవడం ద్వారానే సామ్రాజ్యవాద వ్యవస్థ నిలిచి వుంది. నేడు లాల్‌గఢ్ నుండి సూర్జాగఢ్ వరకు గల విశాల ఆదివాసీ బహుళ్య ప్రాంతం నూతన ప్రజాస్వామిక విప్లవానికి గుండెకాయలా ఉంది. ఇక్కడ అపారమైన ప్రకృతి సంపదలున్నాయి. కోట్లాది ప్రజలున్నారు. భారత ఆర్థిక వ్యవస్థకు జీవనాడుల్లాంటి రవాణా వ్యవస్థ ఉందిక్కడ. ఈ ప్రాంతంలో గల ప్రకృతి సంపదలను కొల్లగొట్టడానికి బహుళ జాతి కంపెనీలు, భారత దళారీ కంపెనీలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లక్షల కోట్ల రూపాయల ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. ఈ ఒప్పందాలను అమలు చేసి ఈ ప్రాంతాలను నిలువునా దోచుకోలేకపోతే దాని ఆర్థిక వ్యవస్థ మరింత సంక్షోభంలో పడిపోతుంది, తలకిందులవుతుంది. సామ్రాజ్యవాదులకు, భారత పాలకవర్గాలకు ఎవరు ప్రమాదంగా వుంటే వాళ్లను రోడ్డు రోలరుకు అడ్డం వచ్చిన వాళ్లను నలిపిపారేసినట్టే నలిపేస్తుంది. కార్మికవర్గ పార్టీ నాయకులెవరినైనా చంపడమూ, అరెస్ట్ చేసి జైళ్లలో పెట్టడమూ, కొత్త కొత్తచట్టాలతో అణచిపెట్టడమూ చేస్తోంది. మన పార్టీ వారిని తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. వారిని అంతం చేయడానికి ప్రజాయుద్ధం కొనసాగిస్తోంది. దోపిడీ రాజ్య వ్యవస్థని ధ్వంసం చేసి జనతా ప్రజాస్వామిక వ్యవస్థను నెలకొల్పుతున్నది. అందుకే మనపైన ఇంత నిర్బంధాన్ని తీసుకువస్తున్నారు. దీన్ని మనం స్పష్టంగా అర్థం చేసుకోవాలి. మనకు ఈ విషయం స్పష్టంగా అర్థమవుతేనే ప్రజలకు స్పష్టంగా అర్థం చేయించగలుగుతాం. ఎంతో వెనుకబడి వున్న మాడ్‌లోకీ, ఇలాంటి ప్రతి చోటకూ కూడా నేడు సామ్రాజ్యవాదులు చొచ్చుకువస్తున్నారు. మరోవైపు ప్రతీ చోటా మనం కూడా విస్తరిస్తున్నాం. ప్రపంచ రాజకీయ పరిస్థితిని చూస్తే, ప్రపంచంలోని నాలుగు, ఐదు దేశాల్లోనే మావోయిస్టు పార్టీల నాయకత్వంలో ప్రజాయుద్ధం నడుస్తోంది. 15–20 దేశాల్లో మావోయిస్టు పార్టీలు ఏర్పడి అభివృద్ధి చెందుతున్నాయి. ఇటువంటి పరిస్థితిలో ప్రపంచ మార్కెట్‌ను కబళించి తమ చేతిలో పెట్టుకున్న సామ్రాజ్యవాదులూ, మన దేశంలో వీరికి దళారీలుగా వుండి సకల సంపదలనూ, వుత్పత్తి సాధనాలనూ తమ గుప్పిట్లో పెట్టుకుని, ప్రజల రక్తమాంసాలను పీల్చి పిప్పి చేస్తున్న దళారీ నిరంకుశ పెట్టుబడిదారులు, భూస్వాములు అణచివేత కొనసాగించడాన్ని ఏకైక మార్గంగా ఎంచుకున్నారు. అందుకే రాజకీయపర దమనకాండను మన మీద అమలుచేస్తున్నారు. ఆర్థిక దోపిడీకి రాజకీయ దమనకాండకు వున్న సంబంధం మనకు అర్థం కావాలి. ప్రస్తుతం మనం వేల సంఖ్యలో వున్నాం. రేపు మనం లక్షల సంఖ్యలో పెరిగితే, ఓ పది లక్షలకు పెరిగితే, ఓ కోటికి పెరిగితే సామ్రాజ్యవాదం పరిస్థితీ, భారత దోపిడీవర్గాల పరిస్థితి ఎలా మారుతుంది? మొత్తం ప్రపంచం – భూమ్యాకాశాలు అతలాకుతలం అవుతాయి – తలకిందులవుతాయి. ఈ దోపిడీ, అణచివేతలను చూసి ప్రతీ చోట ప్రజలు మావోయిస్టు పార్టీ తమ ప్రాంతానికి రావాలని కోరుకుంటున్నారు. మనకు కబురు చేస్తున్నారు. మనం తక్కువ సంఖ్యలో వున్నప్పటికీ మావోయిస్ట్ సిద్ధాంతం, మన పార్టీ రాజకీయాలు, పంథా, విధానాలు, కార్యాచరణ రోజు రోజుకూ దేశంలో చాలా ప్రభావాన్ని వేస్తున్నాయి. శత్రు వర్గాలు ఇటువంటి పెద్ద దమనకాండ వ్యూహాన్ని ఆపరేషన్ గ్రీన్‌హంట్ పేరుతో అమలుచేస్తున్నప్పటికీ దేశంలో ప్రజాయుద్ధాన్ని రూపుమాపలేకపోతున్నారు. ఈ దమనకాండలోనే ఈ ఒక్క సంవత్సర కాలంలోనే 300 మంది మన ప్రియతమ కామ్రేడ్స్ అమరులయ్యారు. వీరిలో కొంత మంది అనారోగ్యంతో, ప్రమాదవశాత్తు అమరులై వుండవచ్చు కానీ అత్యధిక కామ్రేడ్స్ శత్రు దమనకాండలోనే అమరులయ్యారు. ప్రమాదవశాత్తు మరణించిన కామ్రేడ్స్ కూడా పోరాట క్రమంలోనే అమరులయ్యారనేది అర్థం చేసుకోవాలి. 300 మంది కామ్రేడ్స్‌ను చంపిన శత్రువును మనమేం చేయాలి. ఈ నష్టాలను నిరోధించాలంటే మనమేం చేయాలి?

గత సంవత్సర కాలంలో ప్రజాయుద్ధంలో మనం సాధించిన ప్రతి విజయమూ అమరుల రక్తతర్పణతోనే సాధ్యపడింది. అమరుల త్యాగాలను, వారి ఆదర్శాలను మనం స్మరించుకుంటున్నప్పుడు మనం సాధించిన విజయాలను వాటి ప్రాధాన్యతను యావత్తు దేశం ముందుంచాలి. ప్రజాయుద్ధం దేశం నలుమూలలా కార్చిచ్చులా వ్యాపింపజేసేందుకు అమరుల స్ఫూర్తితో మునుముందుకు సాగాలి. మనం సాధించిన విజయాలు చాలా ప్రాధాన్యత కల్గినవీ, చారిత్రాత్మకమైనవే. మన పార్టీ నాయకత్వంలో కేవలం ఒక సమస్యపై, లాల్‌గఢ్ పోరాటం రాజ్య దమనకాండకు వ్యతిరేకంగా ఒక చిన్న ప్రాంతంలో మొదలై అనతి కాలంలోనే దావానలంలా మూడు జిల్లాల్లోని 13 బ్లాకులకు వ్యాపించి రాజ్య వ్యవస్థను స్తంభింపజేసి, దానిని ధ్వంసం చేసే పోరాటంగా అభివృద్ధి చెందింది. అది లక్షలాది మంది ప్రజలను ఏకం చేసింది. ఈ పోరాటం ద్వారానే దోపిడీ సర్కార్‌ను నిర్వీర్యం చేసి పీపుల్స్ కమిటీ పేరుతో ప్రజలు నూతన రాజ్య వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నారు. దశాబ్దాల తరబడి నిరంకుశ

దోపిడీ పాలకుల (వారి రంగేదైనా) నిరాదరణకూ, వివక్షకూ గురవుతూ వచ్చిన ప్రజలు తిరగబడి గాఢాంధకారాన్ని తరిమివేసి నూతన ప్రజా పాలనకు ద్వారాలు తెరిచారు. అలా తమ భవిష్యత్తును తమ చేతుల్లోకి తీసుకొని రోడ్లు, పాఠశాలలు, ఆస్పత్రులు, తాగునీరు, సాగునీరు, పారిశుధ్యం వంటి ప్రజా సంక్షేమ-అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారు. దీర్ఘకాలిక ప్రజా పోరాట మార్గాన్ని ఎంచుకున్నారు. కొద్ది దశాబ్దాలుగా మన పార్టీ ఈ ప్రాంతంలో పనిచేస్తున్నప్పటికీ విప్లవోద్యమం గణనీయంగా సంఘటితపడినదీ, పార్టీ, పిఎల్‌జిఎ, ఐక్యసంఘటన బలపడినదీ ఈ సంవత్సరమే. ఇంతటి విశాల, సమరశీల, సుదీర్ఘ, రాజ్యం పట్ల స్పష్టత గల ప్రజా పోరాటాన్ని – విప్లవ తిరుగుబాటును మన దేశ ప్రజలు చాలా కాలం తర్వాత చూశారు. బెంగాల్ కామ్రేడ్స్, బెంగాల్ పీడిత ప్రజలు ఈ పోరాటాన్ని నిర్మించారు. ఈ పోరాటంలో ఎంతో మంది కామ్రేడ్స్ అమరులయ్యారు. ప్రతీ రోజు సిపిఎం ప్రతీఘాతకులూ, పోలీసు–సిఆర్‌పిఎఫ్ బలగాలూ ప్రజలనూ, పీపుల్స్ కమిటీ సభ్యులనూ చంపుతున్నారు. ఎంతో దమనకాండను అమలుచేస్తున్నారు. దానిని ప్రతిఘటిస్తూ ప్రజలు పోరాడుతున్నారు. లాల్‌గఢ్ పోరాటం దేశాన్ని ఒక్కసారిగా కుదిపివేసింది. అక్కడ ఏం జరుగుతోంది అని అందరూ ఆలోచించారు. ఎందరో మేధావులు అక్కడికి వెళ్లారు. యూనివర్సిటీల నుండి విద్యార్థులు వెళ్లారు. పత్రికా ప్రతినిధులు వెళ్లారు. ప్రపంచంలోని మేధావులూ, విప్లవకారులూ కూడా అక్కడికి వెళ్లారు. చాలాకాలం తర్వాత దేశ విదేశాల్లోని విప్లవ శక్తులు, మేధావులు, ప్రజాస్వామికవాదులు, విప్లవ ప్రజలు ఇంతటి సమరశీల విప్లవ ప్రజా తిరుగుబాటుని చూశారు. వారంతా ఈ పోరాటానికి అండగా నిలిచారు.

ఒడిషాలోని నారాయణపట్నా ప్రాంతంలో భూస్వామ్య వ్యతిరేక రైతాంగ విప్లవ పోరాటం వెల్లువెత్తింది. విప్లవం ముసుగులో సుదీర్ఘకాలం కొనసాగించిన దివాళాకోరు మితవాద అవకాశవాద రాజకీయాలను తన్ని పారేసి అక్కడి రైతాంగ ప్రజలు మన విప్లవ పంథా కింద సమీకృతమై మన పార్టీ నాయకత్వంలో భూమి సమస్యను కేంద్రంగా తీసుకొని పోరాడుతున్నారు. భూసమస్యపై, అధికార సమస్యపై, రాజ్యానికి వ్యతిరేకంగా సాయుధంగా భూస్వామ్య వ్యతిరేక, రాజ్య వ్యతిరేక పోరాటం సాగిస్తున్నారు. ఆ వీరోచిత పోరులోనే ప్రజల ప్రియతమ కామ్రేడ్స్ సింగన్న, ఆంద్రులు అమరులయ్యారు. నేడు లాల్‌గఢ్ నుండి సూర్జాగఢ్ వరకూ వున్న కోట్లాది ప్రజల నడమ, ఎక్కడయినా మావోయిజం అనే ఒక చిన్న నిప్పురవ్వ పడితే అది ఒక మహా కార్చిచ్చులా వ్యాపించే పరిస్థితి వుంది. నారాయణపట్నా ప్రజలు కూడా దీన్ని నిరూపించారు. ఇదే సరైన దారి అని నమ్మి వారు పోరాడుతున్నారు. ఈ పోరాటం భూస్వామ్యాన్నీ, రాజ్యాన్నీ ధ్వంసం చేసే ఒక మహా ప్రభంజనం. ఈ పోరాటానికి చాలా ప్రాధాన్యత వుంది. దీని ప్రభావం ఒడిషా వ్యాప్తంగా వుంటుంది, ఆంధ్రప్రదేశ్ సరిహద్దులోనూ వుంటుంది, దేశవ్యాప్తంగానూ వుంటుంది. లాల్‌గఢ్, నారాయణపట్నా ప్రజా పోరు ప్రభంజనాలు అందించిన అనుభవాలు ఎంతో ముఖ్యమైనవి.

కామ్రేడ్ ఆజాద్ సీసీ ఇచ్చిన కర్తవ్యాన్ని స్వీకరించి, ప్రజలను మోసం చేసేందుకు శత్రువు తలపెట్టిన మానసిక యుద్ధాన్ని తిప్పికొట్టి ప్రపంచ ప్రజలకు వాస్తవాన్ని సమర్థవంతంగా అర్థం చేయించాడు. రాజకీయ ప్రచార యుద్ధాన్ని చూస్తే కూడా ఈ సంవత్సరం జరిగినంత బలంగా, విస్తృతంగా గత ఇరవై ఐదు ఏండ్లలో ఎన్నడూ జరిగి వుండలేదు. లాల్‌గఢ్, నారాయణపట్నా, విశాఖ బాక్సైట్, ప్రత్యేక తెలంగాణా వంటి పోరాటాలను, ఛత్తీస్‌గఢ్, ఒడిషా, ఝార్ఖండ్, బెంగాల్, మరెన్నో రాష్ట్రాల్లో సామ్రాజ్యవాదానికీ, దళారీ నిరంకుశ బూర్జువా వర్గానికీ వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటాలను నిర్మూలించే లక్ష్యంతో శత్రువు తలపెట్టిన మానసిక యుద్ధానికి వ్యతిరేకంగా మన పార్టీ కేంద్రకమిటి అధికార ప్రతినిధి (స్పోక్స్ పర్సన్) కామ్రేడ్ ఆజాద్ నేతృత్వంలో నిరంతరాయంగా రాజకీయ ప్రచార యుద్ధాన్ని నడిపించాం. ఇది కూడా చాలా ప్రాధాన్యత గల పోరాటం. కామ్రేడ్ ఆజాద్ తదితర కామ్రేడ్స్ చేసిన ఇటువంటి కృషి లేకుంటే మన పార్టీ నాయకత్వంలో కొనసాగిస్తున్న ప్రజాయుద్ధానికి ఇంతగా సాధికారత, దేశ విదేశాల్లో ఇంత విస్తృత స్థాయిలో మద్దతు లభించేది కాదు, ప్రజాయుద్ధ ప్రాధాన్యత మరింతగా పెరిగేదీ కాదు.

ఇపుడు భారతదేశ ప్రజాయుద్ధ చిత్రపటాన్ని చూస్తే లాల్‌గఢ్ ప్రాంతం స్పష్టంగా కనిపిస్తుంది. ఈ ప్రాంతం సాయుధ పోరాటం జరుగుతున్న ఒక నూతన ప్రాంతంగా అభివృద్ధి చెందింది. భారత నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని రూపుమాపాలని పాలకవర్గాలు తలపెట్టిన గ్రీన్‌హంట్‌ను తిప్పికొట్టడంలో భాగంగా ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం తాడిమెట్లలో అతి పెద్ద దాడి చేసింది. 1947లో దళారీ పాలకవర్గాలు అధికారం చేపట్టిన తర్వాత వారి పారామిలటరీ–పోలీసు బలగాలకు వ్యతిరేకంగా ఇంత పెద్ద దాడి ఎన్నడూ జరగలేదు. లాల్‌గఢ్ పోరు ఎలాగైతే దేశంలో నిద్రపోతున్న వాళ్లను కూడా కుదిపి లేపిందో, తాడిమెట్ల దాడి కూడా మరో రూపంలో అలాగే చేసింది. మన రాజకీయాలకు దూరంగా వున్న వాళ్లచేత కూడా దంతెవాడలో, దండకారణ్యంలో ఏం జరుగుతోంది అని ఆలోచింపజేసింది. ఇంకా ముఖ్యమైన విషయం ఏంటంటే ప్రపంచంలో వున్న మావోయిస్ట్ పార్టీలూ, భారత ఉపఖండంలోని ఈశాన్య జాతి విముక్తి పోరాటం చేస్తున్న సంస్థలు కూడా బాగా వుత్తేజితులయ్యాయి. మీరు బాగా పోరాటం చేస్తున్నారు, మీరూ, మేమూ, మన లాంటి వాళ్లం సమైక్యంగా భారత సేనకు వ్యతిరేకంగా పోరాడగలిగితే మనందరం తప్పక గెలవగల్గుతాం అని ఒక జాతి

విముక్తి సంస్థ మనకు సమాచారం పంపింది. ఈ దాడిని విజయవంతంగా నిర్వహించిన కామ్రేడ్స్‌కు వారు అభినందనలు కూడా తెలియజేశారు. మణిపూర్‌లో పనిచేసే రివల్యూషనరీ పీపుల్స్ ఫ్రంట్ (దాని సేన పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ) నాయకత్వం తాడిమెట్ల ఆంబుష్‌ను విజయవంతం చేసిన వీరయోధులకూ, కమాండర్లకూ, నేతృత్వం వహించిన పార్టీకీ, సీసీకీ అభినందనలు తెలియజేస్తూ ఉత్తరం రాసింది. ప్రతీ చోట నుండి విప్లవాన్ని సమర్థించే ప్రతి ఒక్కరూ ఈ దాడిని విజయవంతం చేసిన కామ్రేడ్స్‌ను అభినందించారు. అంటే దాని ప్రాధాన్యత అంతగా వుందని అర్థం. అలాగే ప్రజా విముక్తి గెరిల్లా సేన బెంగాల్‌లో సిల్దా, ఝార్ఖండ్‌లో సరెండా, బీహార్‌లో గయ, ఛత్తీస్‌గఢ్‌లో కొంగెర, మహారాష్ట్రలో లాహిరి, ఒడిషాలోని మంత్రిమంబు వంటి చాలా ప్రాధాన్యత కల్గిన దాడులు విజయవంతంగా నిర్వహించింది.

ఆత్మరక్షణా యుద్ధంలో భాగంగా ఈ సంవత్సరం ఇటువంటి ఘటనలు జరగక పోయి వుంటే ఏం జరిగి వుండేది? మనల్ని రూపుమాపడంలో తప్పకుండా శత్రువుకు సానుకూల పరిస్థితి ఏర్పడేది. కానీ, మన పిఎల్‌జిఎ, మన ప్రజలు సాహసోపేతంగా దృఢసంకల్పంతో ఆత్మరక్షణా యుద్ధంలో భాగంగా ఇటువంటి ప్రతిదాడులు నిర్వహించినందువల్లే మనం రక్షించబడినాం. దీనికి రాజకీయంగా చాలా ప్రాధాన్యత వుంది. ఈ ప్రతిఘటనే మన పార్టీ, పిఎల్‌జిఎ, ఐక్య సంఘటన, జనతన సర్కార్, ప్రజలను రక్షించి మనపోరాటాన్ని మరింత ముందుకు తీసికెళ్లడంలో ప్రధాన భూమిక నిర్వహించింది. మన ప్రతిఘటనా యుద్ధం బలహీనంగా సాగితే మన విజయాలు చేజారేవి. ఈ సంవత్సరం ప్రతిఘటనా యుద్ధంలో అమరుల బలిదానాలు లేకుండా విజయాలు సాధ్యం అయ్యేవేకావు. ఈ త్యాగాలకు ఇంత ప్రాధాన్యత వుంది.

మనం ఈ ఒక్క సంవత్సరంలో చేసిన అమూల్యమైన త్యాగాల ఫలితమే ఒకటి – గెరిల్లా యుద్ధ విజయాలు, రెండు – లాల్‌గఢ్, నారాయణపట్నా వంటి సమరశీల ప్రజా విజృంభణల సృష్టి, మూడు – శత్రు మానసిక యుద్ధానికి వ్యతిరేకంగా మన ప్రభావయుతమైన రాజకీయ ప్రచార యుద్ధం కొనసాగించడం. లాల్‌గఢ్ ప్రాంతం భారత సాయుధ పోరాట చిత్రపటంలో స్థానం సంపాదించింది., ఇంకా కొన్ని ప్రాంతాల్లో మనం విస్తరించాం. పార్టీని సంఘటితం చేశాం. పిఎల్‌జిఎను పెంచుకున్నాం. రాజకీయ, మిలిటరీ విషయాలలో శిక్షణను పొందాము. ఇవన్నీ అడుగడుగునా రక్తతర్పణం చేసే మనం సాధించుకున్నాం. మన ఈ సఫలతలే ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను చాలా మంది మేధావులు, ప్రజాస్వామికవాదులు గట్టిగా వ్యతిరేకించడానికి ప్రేరణ నందించాయి. ఒక్కమాటలో చెప్పాలంటే, ఈ సంవత్సరంలో మనం రాజకీయంగా, ప్రజా వుద్యమాలపరంగా, గెరిల్లాయుద్ధపరంగా చేసిన సమరశీల పోరాటాలే వారందరి మద్దతును మనం కూడగట్టడానికి ప్రధాన కారణం.

ఈ కాలంలో మన ఉద్యమానికి లభించిన మద్దతు మునుపెన్నడూ రాలేదు. సల్వాజుడుంను చాలా విస్తృతంగానే ప్రజలు వ్యతిరేకించారు. దాని కంటే మించి లాల్‌గఢ్‌ను సమర్థించారు. ఇప్పుడు దాన్ని కూడా మించి ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను వ్యతిరేకిస్తున్నారు. గ్రీన్‌హంట్‌ను ప్రజలపై యుద్ధంగా మేధావులు, ప్రజాస్వామికవాదులు, దేశభక్తులు, ప్రజలు అభివర్ణిస్తున్నారు. అలాగే ఈ ఫాసిస్టు యుద్ధానికి వ్యతిరేకంగా వీరంతా సంఘటితపడుతున్నారు. అలాగే నేపాల్, బంగ్లాదేశ్, ఫిలిప్పైన్స్, బ్రిటన్, కెనడా, అమెరికా, టర్కీ, ఫ్రాన్స్, జర్మనీ, గ్రీస్, బ్రెజిల్ తదితర దేశాల్లోని మావోయిస్టులు, ప్రజాస్వామికవాదులు ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను వ్యతిరేకిస్తున్నారు. ఇక్కడ పోరాడుతున్న ప్రజలను అభినందిస్తున్నారు. మా మద్దతు కూడా వుంటుంది మీరు పోరాడండి అని ప్రోత్సహిస్తున్నారు.

కామ్రేడ్స్, మన పార్టీ ప్రపంచ కార్మిక వర్గ ఒక అగ్రగామి దళం. మన దేశంలో జరుగుతున్న విప్లవం ప్రపంచ విప్లవంలో అంతర్భాగం. మొత్తం ప్రపంచాన్ని సామ్రాజ్యవాదం దోపిడి పీడనలకు గురిచేస్తున్నది. దానిని నిర్మూలించడానికి మన దేశంలో మనం ప్రయత్నిస్తున్నాం. ఈ చైతన్యంతోనే మనకు ప్రపంచవ్యాప్తంగా చాలా విప్లవ శక్తులు మద్దతునిస్తున్నాయి. మనదేశంలో జరిగే పోరాటాన్ని సమర్థిస్తే వాళ్లకు ఏం ఒనగూరుతుంది? ఏమంటే మన శత్రువు వాళ్ల శత్రువు ఒక్కరే. వాళ్లు కూడా శ్రమ చేసి బతికేవాళ్లే. వాళ్లను దోచుకుంటున్నదీ అణచిపెడుతున్నది – అదే పెట్టుబడిదారీ వ్యవస్థ, అదే సామ్రాజ్యవాద వ్యవస్థ. వాళ్ల లక్ష్యమూ మన పార్టీ లక్ష్యం కూడా ఒక్కటే. పోరాటంలో మనం సాధించిన విజయాలనూ, చేసిన త్యాగాలను చూసి సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడే ధైర్యాన్ని కల్గి వున్న పార్టీ ఇది అని వారు మన వైపు చూస్తున్నారు. అంటే మన దేశంలో జరుగుతున్న పోరు, ప్రపంచంలో జరుగుతున్న పోరు ఏకం అవుతున్నాయి. ఇది భవిష్యత్తులో మన విజయానికి ఒక బలమైన హామీనిస్తుంది. మన దేశంలోని మిగతా సంస్థల నాయకత్వం కింద కూడా పోరాటాలు పెరగడం తప్పనిసరి అవసరం. వారి మద్దతు మనకు తప్పకుండా వుండాలి. అలాగే ప్రపంచంలోని శ్రామిక జనుల క్రియాశీల మద్దతు కూడా తప్పనిసరిగా వుండాలి. ఇలా ప్రపంచవ్యాప్తంగా మనకు మద్దతు వుందనే విషయం మన పోరాట ప్రాంతాల్లోని ప్రజలకు తెలిస్తే మనం ఒక్కళ్లమే లేం విడిగా లేం, చిన్న ప్రాంతంలోనే లేం అనే విశ్వాసం పెరుగుతుంది. 300 మంది కామ్రేడ్స్ అమరులయినప్పటికీ మనం గెలుస్తాం, ప్రజల కోసం మన నెత్తురు, మన ప్రాణాలు ఇచ్చిన ఫలితమే ఇంత మద్దతు అని ఆలోచిస్తారు. ఈ మద్దతుకు చాలా ప్రాధాన్యత

వుంది. వివిధ దేశాల్లోని మావోయిస్టు పార్టీలు, కార్మికులు, కర్షకులు, విద్యార్థులు, మేధావులు, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడుతున్న సంస్థలు తమకు మద్దతునిస్తున్నారని తెలిస్తే తప్పకుండా వారి ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. వారు ఇంకా ఉత్సాహంగా పోరాడుతారు.

కామ్రేడ్స్, ఎవరైనా వయసు ఉడిగి మరణించడం సహజమే. కానీ ఈ సంవత్సరం అమరులయిన మన పార్టీ కామ్రేడ్స్‌లో ఎవరు కూడా అలా మరణించినవారు లేరు. వీరంతా ఇంకా ఎంతో కాలం బతకాల్సిన వాళ్లే. విప్లవానికే కాదు సమాజానికి రకరకాలుగా సేవ చేయాల్సిన వాళ్లే. అటువంటి వాళ్లను పాలకవర్గాలు క్రూరంగా చంపాయి. అన్యాయంగా చంపాయి. దోపిడీ వ్యవస్థను రక్షించి, ఇంకా దోపిడీని పెంచాలనుకొని చంపాయి. పాలకులు ఒక అన్యాయమైన అమానుషమైన యుద్ధం సాగిస్తున్నారు. లక్షలాది ప్రజలను చంపుతున్న, చనిపోయేలాగా చేస్తున్నటువంటి దౌర్జన్య పూరితమైన దోపిడీ వర్గాల రాజ్య వ్యవస్థని అంతం చేయడానికి మన పార్టీ నాయకత్వం కింద ప్రజలు న్యాయమైన యుద్ధం చేస్తున్నారు. ఈ పోరులో మన ప్రియతమ కామ్రేడ్స్ ప్రాణాలిచ్చి తమ బాధ్యతల్ని మనకు ఇచ్చి వెళ్లారు. అమరులు బతికుండగా ఎంత సృజనాత్మకంగా పనిచేశారు? వాళ్లు పాత విషయంతోనే సంతృప్తి పడలేదు. ఉన్నదే సరిపోతుందని అనుకోలేదు. అలా ఎంతో విలువైన, వైవిధ్యపూరితమైన అనుభవాలను ఆ కామ్రేడ్స్ మనముందుంచారు. ఒక కామ్రేడ్ చాలా సాహసి. తూటాల వర్షం కురుస్తున్నా ఒక్క క్షణం కూడా వెనుకడుగు వేసింది లేదు. మరొక కామ్రేడ్‌కు 18 ఏళ్ల వయసే వుండొచ్చు. ఆ కామ్రేడుకు విప్లవ సిద్ధాంతాలు చాలా తెలియకపోవచ్చు. తనకు తెలిసిందేంటంటే ముందటి కామ్రేడ్స్ తన తల్లిదండ్రులు – కుటుంబం, ఊరివాళ్లు, పార్టీ నాయకులు, సభ్యులు కూడా పోరు దారిలో నడిచారనేది. తానూ అదే పోరులో భాగమై అమరుడయ్యాడు. అటువంటి ధైర్యాన్ని సంతరించుకొని ప్రాణాలు పోతాయని తెల్సి పోరులో ముందుకు నడవడం అన్నింటికంటే ఉన్నతమైనది. అది చాలా గొప్పగా అభినందించాల్సిన అంశం. అమరులైన కామ్రేడ్స్ గొప్ప అనుభవాలను కూడా మన ముందుంచి వెళ్లారు. కమ్యూనిస్టు ఆదర్శం అంటే ఏంటో, సాహసం అంటే ఏంటో అమర కామ్రేడ్స్ నుండి మనం నేర్చుకోవాల్సి వుంటుంది. వాళ్లు మనముందుంచిన అనుభవాలను, ఆదర్శాలను మనం తప్పకుండా స్వీకరించాలి. స్వీకరిస్తేనే మనం బలోపేతం అవుతాం. మన చైతన్యం, శక్తి పెరుగుతాయి. అప్పుడే మనం వాళ్లు విడిచి వెళ్లిన బాధ్యతలను స్వీకరించేంత శక్తివంతం అవుతాం. ఇంతవరకు మనం నేర్చుకున్నది కొంచెమే. అమరులైన కామ్రేడ్స్ అందించిన అనుభవాల నుండి కూడా నేర్చుకోవాలి.

కామ్రేడ్ ఆజాద్ విప్లవ మేధావి. ఆ కామ్రేడ్ తుదిశ్వాస విడిచే వరకూ విప్లవానికి ఎంతో సేవ చేశాడు. అటువంటి కామ్రేడ్‌ను శత్రువు చంపాడు. అందువల్ల మన పార్టీకి చాలా నష్టమే చేకూరింది. దాన్నుండి బయటపడాలంటే, ఈ రోజు ప్రతి సంస్మరణ సభలోనూ మనమంతా అధ్యయనం పెంచుకుందామని ప్రతిజ్ఞ చేద్దాం. సిద్ధాంతాన్ని, రాజకీయాలను, మారుతున్న పరిస్థితులను, మన కార్యక్షేత్రాన్ని అధ్యయనం చేద్దాం. నేడు మనం కొన్ని వేల మందిమి వున్నాం. మనం ఒక్కొక్కరం మన అధ్యయనాన్ని కొంచెం కొంచెంగా పెంచుకున్నా మనం ఆజాద్ లేని లోటును కొంతైనా పూడ్చుకోగలుగుతాం. అంతేకాదు ఈ రకంగా మనం కామ్రేడ్ ఆజాద్‌ను గౌరవించినవాళ్లమూ అవుతాం. మనందరం కొంచెం కొంచెం మన అధ్యయనం పెంచుకున్నా మనందరి శక్తి కలిసి ఒక మహాపర్వతంలా బలోపేతం అవుతుంది. మనమీ సందర్భంగా ప్రతిజ్ఞ చేయాల్సింది ఏమంటే అమరులైన కామ్రేడ్స్‌ను నమూనాగా తీసుకొని మనం కూడా అలా తయారు కావాలని.

అమరులకు మనం జోహార్లు చెప్పడం అంటే వాళ్ల సుగుణాలను మనం తప్పక అలవర్చుకోవడం, వారి ఆదర్శాలను దృఢంగా కొనసాగించడం, ప్రజాయుద్ధాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడం. అలా తీసుకెళ్లగలిగినప్పుడే మనకు దేశ–ప్రపంచ ప్రజల మద్దతు లభిస్తుంది. మన విప్లవం మరింత అభివృద్ధి చెందుతుంది. దీన్ని రూపుమాపడం భారత పాలకవర్గాలకే కాదు కదా సామ్రాజ్యవాదుల తరం కూడా కాదు. అటువంటి పరిస్థితి తప్పకుండా వస్తుంది. అమరులైన మన కామ్రేడ్స్ మనకు చెప్పిందిదే. మీరు ధైర్యంగా పోరాడండి కామ్రేడ్స్ అని చెప్పి మనల్ని వీడివెళ్లారు.

మనతో కల్సి వున్న మన కామ్రేడ్స్ అమరులవుతే మనం దుఃఖిస్తాం. అలా బాధపడకుండా ఎవరుండగలరు? కమ్యూనిస్టులకు మానవత్వపు విలువలు బాగా తెలుసు. అందుకే వారు తమ కామ్రేడ్స్ పట్ల, పీడిత ప్రజల పట్ల మృదువుగా వుంటారు. ప్రజల కష్టాలను తమ కష్టాలుగా భావిస్తారు. లేకుంటే మనమీ పోరులో భాగం అయి వుండేవారమే కాము. కానీ, శత్రువు మీద మనకు కొంచెం కూడా దయ ఉండదు, వుండకూడదు. మన కామ్రేడ్స్‌లో ఎందరో తమ జీవన సహచరులను కోల్పోయారు, సహ కామ్రేడ్స్‌ను, నాయకులను, బంధు మిత్రులను కోల్పోయారు. మొత్తం పార్టీయే 300కు పైగా ప్రియతమ కామ్రేడ్స్‌ని కోల్పోయింది. ఇంతమంది అమరులయితే మనకు దుఃఖం కలగడం అసహజం అవుతుందా? నేను చెప్పేది ఏంటంటే మన కన్నీళ్లు వర్గ పోరు పెనుమంటలను రగిలించాలి. మన కన్నీళ్లు ప్రజలందరూ రగిలే విధంగా చేయాలి. దుఃఖానికి కూడా ఒక భావన కారణంగా వుంటుంది. ఆ భావన ఒక సిద్ధాంతానికీ రాజకీయాలకూ సంబంధించినదై వుంటుంది. అవి ఒక పోరాటాన్ని సృష్టిస్తాయి. ఆ పోరాటానికి ఒక భవిష్యత్

దర్శనం వుంటుంది. మనం ఏ ఉద్దేశ్యం లేకుండా ఏడ్వం. మన అమరులను స్మరించుకునేప్పుడు మన హృదయం బరువెక్కుతుంది. గొంతు గద్గదం అవుతుంది. ఈ దోపిడీ రాజ్య వ్యవస్థను భస్మీపటలం చేసేంతగా మన బాధ వర్గకసిని రగిలించాలి. అప్పుడు మనం ప్రతి ఆటంకాన్ని తొలగించుకుని విజయం సాధించే లక్ష్యంగా ముందుకు సాగుతాం. మన దుఃఖం తాత్కాలికమే. కమ్యూనిస్టులు ఎల్లప్పుడూ అంతర్జాతీయ కార్మికవర్గ విప్లవ జెండాను పైకెత్తి పట్టుకొని ముందుకు సాగాల్సివుంటుంది.

కామ్రేడ్స్, మన పార్టీ నాయకులతో సహా 300 మంది కామ్రేడ్స్ అమరులయ్యారు. తప్పకుండా ఈ నష్టాన్ని పూరించుకోవాలి. 300 మందిని కాదు 600 మందిని మనం భర్తీ చేసుకోవాలి. అమరులైన మన నాయకులకు అసంఖ్యాకంగా వారసులను తయారు చేసుకోవాలి. వున్న కామ్రేడ్స్‌కు శిక్షణ ఇచ్చుకోవాలి. ఆజాద్ వలె మన అధ్యయనాన్ని పెంచుకోవాలి. మన పార్టీ జరుపుతున్న రెక్టిఫికేషన్ క్యాంపెయిన్‌ను విజయవంతంగా నడిపించాల్సింది వుంది. అమరులైన ఈ 300 మంది కామ్రేడ్స్‌లోని శక్తివంతమైన కామ్రేడ్స్ వలె మనం కూడా శక్తిని పెంచుకోవాలి. అలా పెంచుకోవడం, అభివృద్ధి చెందడం మనముందు వున్న ఒక ముఖ్యమైన కర్తవ్యం. అలా పెంచుకోవడానికి శత్రువు మనకు ఎన్నో ఆటంకాలు కల్పిస్తాడు. అందుకని మనం తాడిమెట్ల, లాహిరి, సరెండా, సిల్దా, కొంగెర వంటి పలు నూతన దాడులను నిర్వహించాలి. దేశం నలుమూలలా లాల్‌గఢ్, నారాయణపట్నా లాంటి సమరశీల ప్రజా ప్రభంజనాలను సృష్టించాలి. నూతన ప్రజాస్వామిక రాజకీయ అధికారాన్ని నెలకొల్పాలి, సంఘటితపరచాలి, విస్తృతం చేయాలి. ఇవి అత్యంత ముఖ్యమైన కర్తవ్యాలు. అలా చేస్తేనే అమరులు మన మీద వుంచి వెళ్లిన బాధ్యతలను నెరవేర్చగలం. అలాగే, నీటిలో చేపల్లా ప్రజలతో కల్సి పోవాలి. ఇలా కల్సిపోవాలంటే మన పార్టీ రాజకీయ పంథాను దృఢంగా అంటిపెట్టుకొని వుండాలి. ప్రజాపంథా వర్గపంథాలను దృఢంగా అంటిపెట్టుకొని ఉండాలి. ఇలా వుండగలిగితే మనం తప్పక వేలాది మంది కామ్రేడ్స్‌ను నూతనంగా భర్తీ చేయగలుతాం. అందుకే కమ్యూనిస్టులు ప్రజలను పూర్తిగా అంటిపెట్టుకొని వుండాలి. ఈ కర్తవ్యాలను చేపట్టి దృఢంగా పనిచేస్తే మనం తప్పకుండా ఒక సంవత్సరంలోనే మరింత బలోపేతం అవుతాం. అమరులు మనకిచ్చిన బాధ్యతలను మోసి మనం సఫలీకృతంగా ప్రజాయుద్ధ మార్గంలో మునుముందుకు పోగల్గుతాం.

మనందరం ఆలోచించాల్సిన, ప్రజలు ఆలోచించాల్సిన మరో విషయం ఏమంటే శత్రు భావజాలం, శత్రు సిద్ధాంతం, శత్రు రాజ్యం, శత్రు పోరాటం, శత్రు నిర్మాణం, శత్రు సేన, శత్రు సంస్కృతి, శత్రు ఆర్థికం, శత్రు పర్యావరణ విధానం గురించి. ఇవన్నీ ప్రజలకు, మనకు పూర్తిగా వ్యతిరేకంగా వుంటాయి. మనం మన అమరుల వలె తయారు కావాలంటే, మన పార్టీ బలోపేతం కావాలంటే వీటన్నింటిలోనూ శత్రువుకు వ్యతిరేకంగా పోరాడాలి. శత్రువుకూ మనకూ ప్రతి విషయంలో తేడా వుంటుంది. కొన్ని విషయాలు ఒకేలా కనబడుతాయి. కానీ ఒకటి కాదని సారంలోకి వెళ్లి చూస్తే అర్థం అవుతుంది. ప్రతిదీ ప్రజలకు వ్యతిరేకంగానే వుంటుంది. ఉదాహరణకు ప్రజలూ, ప్రజా శత్రువులు అన్నమే తింటారు. కానీ శత్రువులు దోపిడీ చేసి తింటారు, ప్రజలు కష్టం చేసి తింటారు. వాళ్లు ప్రజల నెత్తుటి కూడు తింటారు, ప్రజలు చెమటోడ్చి తింటారు. మన పార్టీ, సేన, సర్కార్ – అన్నీ శత్రు నిర్మాణాలకు భిన్నంగా ఉంటాయి. వుదాహరణకు శత్రువుకు సేన ఉంటుంది. వారి సైనికులు తుపాకులు పట్టుకుంటారు. యూనిఫారాలు వేసుకుంటారు. వాళు కూడా యుద్ధం చేస్తారు. అయితే వాళ్లు కిరాయి మనుషులు. పూర్తిగా పాత వ్యవస్థను రక్షించడం కోసం తుపాకులు పడ్తారు. యుద్ధం చేస్తారు. కానీ మన సేన, ప్రజాసేన. ప్రజల కోసం తుపాకులు పట్టి కుళ్లిన పాత రాజ్య వ్యవస్థని తుత్తునియలు చేయడానికి యుద్ధం చేస్తుంది. మనం అందరం ఆజాద్, అప్పారావు, సూర్యం, బందు, రుక్మతి, స్వర్ణ, మహతో, డేవిడ్, సింగన్న, ఆంద్రు వంటి కామ్రేడ్స్ వలె అభివృద్ధి కావాలంటే ప్రతి రంగంలోనూ మనం పోరాడాలి. ఒక సాయుధపోరాటమే కాదు, భావజాలపర, సైద్ధాంతిక, రాజకీయ, నిర్మాణపర, మిలిటరీపరమైన పోరాటం చేయాలి. మన పార్టీ, ప్రజాసంఘాలు, జనతన సర్కార్ బలోపేతం కావాలంటే, ప్రతీ రంగంలోనూ పోరాటం అవసరం. మన రెక్టిఫికేషన్ విజయవంతం కావాలంటే, మన భావజాలంలో రాజకీయంలో, నిర్మాణంలో, పోరాటంలో ఎక్కడ బలహీనత వుంటే అక్కడ దృష్టి పెట్టి దాని నుండి బయట పడాలి! మనం అన్ని విషయాల్లో కూడా పూర్తిగా ప్రజల మీద ఆధారపడాలి. ప్రతి నిర్మాణాన్నీ – అది జనతన సర్కార్ అయినా, ఐక్య సంఘటన అయినా, పిఎల్‌జిఎ అయినా మన పార్టీ నాయకత్వం వహించేలా తీర్చిదిద్దాలి. కొత్త వ్యవస్థ అంటే నేడు నూతన ప్రజాస్వామిక వ్యవస్థ, తర్వాత సోషలిస్టు – కమ్యూనిస్టు వ్యవస్థ. మనం కేవలం నూతన ప్రజాస్వామిక వ్యవస్థలోనే ఆగిపోము. మనం అక్కడి నుండి సోషలిస్టు – కమ్యూనిస్టు వ్యవస్థలోకి వెళ్లాలి.

మరొక సారి అమరులకు వినమ్రంగా తలవొంచి నేను జోహార్లు అర్పిస్తున్నాను. అమరుల ఆశయ సాధనకు దృఢసంకల్పంతో ప్రజాయుద్ధ మార్గాన మునుముందుకు సాగుదామని శపథం చేద్దాం! అమరుల జీవిత భాగస్వాముల, సహచరుల, బంధు మిత్రుల సంవేదనలో నేను సంపూర్ణంగా పాలుపంచుకుంటున్నాను. మన సీసీ పాలుపంచుకుంటుందనీ, వారందరికి పూర్తి మద్దతునిస్తుందని స్పష్టంజేస్తున్నాను. లాల్‌సలాం!

★

భారత ప్రజాయుద్ధ రాజకీయాలను అసమాన ప్రతిభతో నడిపిన ఆదర్శ కమ్యూనిస్టు నాయకుడు

# కామ్రేడ్ చెరుకూరి రాజకుమార్ (ఆజాద్)కు అరుణారుణ జోహార్లు

ఫాసిస్టు గ్రీన్‌హంట్‌లో భాగంగా విప్లవకారులనూ, సాధారణ ప్రజలను హత్య చేస్తూ పచ్చినెత్తురు తాగుతున్న పాలకవర్గాలు మరోసారి తమ నరహంతక నగ్న స్వరూపాన్ని నిస్సిగ్గుగా బట్టబయలు చేసుకున్నారు. జూలై 1న సిపిఐ (మావోయిస్టు) పొలిట్‌బ్యూరో సభ్యుడు, ఉత్తమోత్తమ కార్మికవర్గ యోధుడు, భారత దేశ పీడిత ప్రజల ప్రియతమ నేత కామ్రేడ్ చెరుకూరి రాజ్‌కుమార్‌ను, ఆయనతో పాటే ప్రయాణిస్తున్న హేమచంద్రపాండే అనే ఒక సాధారణ పాత్రికేయుడినీ పట్టుకొని పాశవికంగా హత్య చేశారు.



నిజానికి ఆ సమయంలో కామ్రేడ్ ఆజాద్ తన కార్యకలాపాల్లో భాగంగా దండకారణ్యానికి వెళ్తున్నాడు. ఆయన ఢిల్లీ నుండి జూన్ 30న రైలులో బయలుదేరాడు. పొలిట్‌బ్యూరో సభ్యుడే కాకుండా, ఆయన పార్టీ ప్రవక్త కూడా కనుక ఆయనకు పాత్రికేయులతో సంబంధాలు ఉండడం, వాళ్లను కలవడం చాలా సహజమైన విషయం. కనుక ఆ సమయంలో ఆయనతో హేమచంద్రపాండే అనే పాత్రికేయుడు కూడా ప్రయాణిస్తున్నాడు. కామ్రేడ్ ఆజాద్‌పై ముందునుండే వల వేసి వున్న ఎపిఎస్ఐబి గూండాలు వాళ్లిద్దర్నీ పట్టుకొని, ఆదిలాబాద్ జిల్లా వాంకిడి మండలం సర్కేపల్లి–జోగాపూర్ అడవిలో వాళ్లను చంపేసి, ఆంధ్రప్రదేశ్ ప్రజానీకం వినీ వినీ విసిగిపోయిన ఎన్‌కౌంటర్ కథను కోటిన్నొకటోసారి వినిపించారు.

సుదీర్ఘ విప్లవానుభవం, అసాధారణ ప్రతిభా పాటవాలు, లోతైన రాజకీయ, సైద్ధాంతిక పరిజ్ఞానం, పీడిత ప్రజల పట్ల అమితమైన ప్రేమాభిమానాలు కల్గిన కామ్రేడ్ ఆజాద్ పార్టీలో ఒక మూల స్థంబం లాంటి వాడు. ఆయన మరణం భారత విప్లవానికి ఎనలేని నష్టం. యావత్తు పార్టీ, విప్లవ ప్రజానీకం ఆయనకు వినమ్రంగా శిరస్సు వంచి నివాళినర్పిస్తున్నది, ఆయన ఆదర్శాలను ఎత్తిపడుతున్నది. ఆయన చరిత్రను స్మరించుకుంటున్నది.

జూలై 1954లో ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా గ్రామం చిలుకూరిలో కరుణ, లక్ష్మయ్య చౌదరిల ఇంట పుట్టిన చెరుకూరి రాజకుమార్ జీవితంలో 1972 నుండి 2010 జూలై వరకు గడిచిన 38 సంవత్సరాలు విప్లవోద్యమంతో పెనవేసుకున్న చరిత్రనే. ధనిక వర్గంలో పుట్టి ఉన్నత విద్యను అభ్యసించిన ఆజాద్ విప్లవ జీవితం వరంగల్ నుండి మొదలయ్యింది. కోరుకొండ సైనిక స్కూలు చదువు తర్వాత వరంగల్ ఆర్.ఇ.సి.లో బి.టెక్. ఆ తర్వాత విశాఖ ఆంధ్రా యూనివర్సిటీలో ఎం. టెక్. చదివేటప్పుడు ఆజాద్‌కు తెలివైన విద్యార్థిగా మంచి పేరు వుండేది.

ఆజాద్‌కు మొదటి నుండి బాగా చదవడం అలవాటు. సామాజిక, రాజకీయ విషయాలను నేర్చుకుంటున్న క్రమంలోనే భారత అర్ధవలస, అర్ధభూస్వామ్య సమాజ చిత్రాన్ని అవగాహన చేసుకొని విశ్లేషించడం, చర్చించడం చేసేవాడు. ఆనాటికి యువతరం మీద నక్సల్బరీ, శ్రీకాకుళ ఉద్యమ ప్రభావం బలంగా వుంది. వరంగల్‌లో గోడల మీది 'మరో శ్రీకాకుళంగా వరంగల్‌ను సృష్టించాలి', 'భూస్వామ్యం నశించాలి' వంటి నినాదాలు రేకెత్తించిన ఆలోచనలు, గిరాయిపల్లి అమరుడు కామ్రేడ్ సూరపనేని జనార్ధన్ ప్రభావం కామ్రేడ్ ఆజాద్‌పై బలంగా పని చేసి విప్లవ రాజకీయాల్లోకి ప్రవేశించాడు. కామ్రేడ్ జనార్ధన్ చుట్టూ అందరూ చేరేవాళ్లు. ఆయన అందరికీ ఆదర్శంగా వుండేవాడు. ఆజాద్ కూడా ఆయనను ఆదర్శంగా తీసుకొని పనిచేశాడు.

నమ్మకం, విశ్వాసం కలిగాక పట్టుదల, నిరంతర కృషి ఆజాద్ స్వాభావిక లక్షణం. ఇది తన 38 సంవత్సరాల జీవిత క్రమం అంతటా కనబడే బలమైన అంశం. ఒకప్పుడున్న ఆర్.ఎస్.ఎస్. రాజకీయాల ప్రభావంతో ఆజాద్ ప్రతిరోజూ జనార్ధన్‌తో రాత్రి పూట అనేక గంటల కొలదీ విప్లవ రాజకీయాలను చర్చించేవాడు, ఘర్షణ పడేవాడు. జనార్ధన్ చెప్పిన నక్సల్బరీ రాజకీయాలు, రుజువుగా చూపించిన ఆధారాలు, గణాంకాలు వాస్తవం కావడంతో కన్విన్స్ అయ్యాడు. వాటితో పాటు గ్రామీణ ప్రజానీకంతో పెనవేసుకుంటున్న జనార్ధన్ జీవిత కార్యాచరణ ఆజాద్‌పై చెరిగిపోని ముద్రవేసింది. తను ఆమోదించిన తర్వాతనే విప్లవ రాజకీయాలకు అంకితమై విప్లవ కృషి సాగించాడు. శ్రీకాకుళం అంటే ఆజాద్‌కు గొప్ప అభిమానం 'విప్లవ పరిస్థితి అద్భుతంగా వుంది. ఐక్యంగా వుండి

కొట్లాడాలి' అనే మన పార్టీ ఇచ్చిన సందేశం మంచి స్ఫూర్తినిచ్చింది.

నక్సల్బరీ, శ్రీకాకుళ పోరాటాలు తాత్కాలికంగా దెబ్బతిని కోలుకోవడం మొదలైన తర్వాత తెలంగాణ కేంద్రంగా కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. గతాన్ని సమీక్షించి తీసుకున్న గుణపాఠాల నూతన వెలుగులో ప్రజా సంబంధాలు మెరుగుపడడమే కాకుండా అన్ని సెక్షన్లు సంఘటితం కావడం, అది ప్రజా ఉద్యమ స్వరూపాన్ని సంతరించుకోవడం మొదలయింది. పీడిత ప్రజల్ని భావజాలపరంగా ముందు గెలవ గలిగితే కార్యాచరణలో వారే ఆయుధాలై పేలతారు అనేది తరువాత జరిగిన ఉద్యమాలన్నీ రుజువు చేశాయి. అలాగే ఆజాద్‌లో కలిగిన చైతన్యం విద్యార్థి శక్తిగా ప్రతిఫలించింది. ఆ తరువాత కాలంలో భారత విప్లవ సారథ్యంలో ముఖ్యపాత్రను పోషించింది.

**భారత విప్లవ విద్యార్థి ఉద్యమ నిర్మాణానికి రాజ్‌కుమార్ (ఆర్.కె.) ముఖ్యమైన పాత్ర:**

కామ్రేడ్ ఆజాద్ 1972లోనే విప్లవోద్యమంలో తన నిబద్ధతను చూపి పార్టీ సభ్యుడయ్యాడు. వరంగల్‌లో విద్యార్థులను కదిలించి వివిధ రూపాల్లో పోరాటాలను చేపట్టి, విద్యార్థి యువజన కార్యక్రమాలను రూపొందించి అమలు చేసేవాడు. ఆజాద్ చురుకైనవాడు, తెలివైనవాడు, చొరవతో లెక్చరర్స్‌తో చర్చలు చేసేవాడు. టీచింగ్ స్టాఫ్‌తో మంచి సంబంధాలు ఏర్పర్చుకున్నాడు. అలాగే అక్కడ పనిచేసే వర్కర్స్‌తో ఉద్యోగులతో కలిసిపోయేవాడు. అలా వారిని ఆర్గనైజ్ చేస్తూ, ఎక్కువ మంది మద్దతును కూడగడుతూ, ఒక కాలేజి నుండి ఇంకో కాలేజీకి కార్యకలాపాలను విస్తరింపచేశాడు. 1974 నాటికి వరంగల్ జిల్లా ఆర్.ఎస్.యు. అధ్యక్షుడుగా జిల్లా విద్యార్థి పోరాటాలను సంఘటితం చేసే క్రమంలో, గుండాయిజాన్ని ఎదిరించకుండా బలంగా దెబ్బ కొట్టకుండా విద్యార్థి సంఘం నిలబడడం కష్టం. వరంగల్‌లో ఆర్.ఎస్.ఎస్. గూండాలతో, కాంగ్రెస్ హయగ్రీవాచారి గూండాలతో, సి.పి.ఎం. ఓంకార్ గూండాలతో అనేక సార్లు ఘర్షణలు జరిగాయి. కోర్టులలో కేసుల విషయాల్ని ఆజాద్ పట్టించుకుని త్వరత్వరగా కామ్రేడ్స్ విడుదలకు కృషి చేసేవాడు.

1974లో విప్లవ విద్యార్థి ఉద్యమాన్ని చీల్చి పి.డి.ఎస్.యు.ను ఏర్పాటు చేయాలనే కొద్దిమంది చర్యలను రాజకీయంగా ఓడించి, రాడికల్ విద్యార్థి సంఘ నిర్మాణానికి కామ్రేడ్ ఆజాద్ ఎంతో కృషి చేశాడు. రాజకీయంగా వారిని ఓడించడమే కాకుండా మెజారిటీ విద్యార్థులను మనవైపు నిలబెట్టాడు. తన కృషి ఫలితంగా మితవాద రాజకీయాలను, అవకాశవాద పద్ధతులను ఓడించి విప్లవ విద్యార్థులంతా శత్రు నిర్బంధాన్ని గేలి చేస్తూ 1974లో మొదటి ఆర్.ఎస్.యు. మహాసభలను విజయవంతం చేశారు. 1975లో గుంటూరులో రెండవ మహాసభను జరుపుకుందామని ప్రయత్నించినా ఎమర్జెన్సీ కారణంగా ఆటంకాలు ఏర్పడ్డాయి. ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా ఐక్య ఉద్యమం చేపట్టి శత్రువుకు టార్గెట్‌గా మారిన కామ్రేడ్ ఆజాద్‌ను 1976లో మీసా కింద అరెస్ట్ చేసి తప్పుడు కేసులతో ఆరునెలలు జైలులో పెట్టారు. కుటుంబ సభ్యులు, మిత్రులు, లెక్చరర్లు, ఆర్.ఇ.సి. వర్కర్స్, వివిధ సెక్షన్ల ప్రజలు ఆజాద్‌ను జైలుకు, కోర్టుకు వెళ్లి కలిసేవారు. అంతటి ప్రభావం విస్తృత సంబంధాలు ఆజాద్‌కు వుండేవి. ఆ తర్వాత విశాఖలో 1979లో నాసా కింద అరెస్ట్ చేశారు. ఆంధ్రా యూనివర్సిటీలో జాతీయ జెండా తొలగించి నల్లజెండా ఎగురవేసిన కేసు పెట్టారు. ఎమర్జెన్సీలో జరిగిన గిరాయిపల్లి బూటకపు ఎదురుకాల్పులకు వ్యతిరేకంగా ఆర్.ఇ.సి.లో జరిగిన నిరసన సభలో, అలాగే సంస్మరణ సభలో విప్లవ రాజకీయాలకు అన్ని సెక్షన్ల నుండి వచ్చిన మద్దతు గొప్పది. బూటకపు ఎదురు కాల్పులకు వ్యతిరేకంగా కోర్టుల్లో జరిగిన వాదనలకు కావల్సిన మొత్తం సమాచారాన్ని కామ్రేడ్ ఆజాద్ సేకరించి పంపాడు, అవన్నీ బూటకపు ఎన్‌కౌంటర్లేనని నిరూపించడానికి భార్గవ కమీషన్‌కు సాక్ష్యాలను సమకూర్చాడు. ఉద్యమం అంతటిలోను ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎంతో కృషి చేశాడు. (ఆజాద్ మెదక్ వెళ్లినపుడు గిరాయిపల్లి వెళ్లి ఆ ప్రాంతాన్ని చూసి, జనార్ధన్‌తో తన జ్ఞాపకాలను నెమరువేసుకోవడాన్ని మన కామ్రేడ్స్ ప్రత్యేకంగా చెప్పుకుంటారు.)

విద్యార్థి రంగం బాధ్యతలు చూస్తూనే చట్టాలను, కోర్టులను అవగాహన చేసుకొని బహిరంగ పోరాటాలను గొప్పగా తీర్చిదిద్దాడు. రాజ్యం పాశవికతను బహిర్గతం చేశాడు.

కామ్రేడ్ ఆజాద్ విద్యార్థి ఉద్యమ అవసరాలరీత్యానే 1977లో విశాఖలో ఎం.టెక్.లో చేరాడు. అక్కడున్న చంటి, గంటి రమేష్, ప్రసన్నలను ఉత్సాహపరచడంతోపాటు విద్యార్థి ఉద్యమానికి తన కృషితో బలం చేకూర్చాడు. స్థానిక సమస్యలను తీసుకుంటూ ఆ ప్రాంతంలోని బలమైన ప్రభావాన్ని వేసిన సిటీ బస్సుల జాతీయకరణ ఉద్యమానికి నాయకత్వాన్ని అందించాడు. ఆ ఉద్యమ విజయంతో ఆర్.ఎస్.యు.కు బహుళ ప్రచారం జరిగింది. విద్యార్థి శక్తి మరింతగా సంఘటితపడింది. అప్పటి వరకు కమ్మ, రెడ్డి కులాల ఆధిపత్య విధానాలను ఎదిరించిన దళిత విద్యార్థులకు ఆర్.ఎస్.యు. బలమైన మద్దతును ఇవ్వడమే కాకుండా, ఆజాద్ వారితో విప్లవ రాజకీయాలు చర్చించి ఆమోదింప చేసి కులపోరాటాన్ని వర్గ పోరాటంగా మలచడంతో విద్యార్థి ఉద్యమంలోనే కాకుండా బయట కూడా వర్గపోరాటం అభివృద్ధి కావడానికి ఎంతో తోడ్పడింది. వరంగల్‌లో అన్ని సెక్షన్ల ఐక్యతను సాధించినట్లే విశాఖలోను అటువంటి ఐక్యతను సాధించగలిగాడు.అలా కామ్రేడ్ ఆజాద్ అన్ని సెక్షన్ల ప్రజల విశ్వాసాన్నీ, అభిమానాన్ని చూరగొన్నాడు.

ఎమర్జెన్సీ సమయం తర్వాత 1977లో వరంగల్ విద్యార్థులు మొట్ట మొదటి 'గ్రామాలకు తరలండి' కేంపెయిన్ చేపట్టి ఎన్నికల బహిష్కరణ పిలుపును ప్రజల్లోకి తీస్కెళ్లారు. ఆ తర్వాత వర్సగా ప్రతీ సంవత్సరం గ్రామాలకు తరలండి కేంపెయిన్ చేపట్టేవారు. కామ్రేడ్ ఆజాద్ కేంపెయిన్‌లో విద్యార్థులకు రాజకీయాలు బోధించడంతో పాటు, స్వయంగా కేంపెయిన్‌లో భాగమయ్యేవాడు. విశాఖ జిల్లాలో గ్రామాలకు తరలండి కేంపెయిన్ విజయవంతం

కావడంలో విశేషంగా కృషి చేశాడు. ఉద్దానంతో పాటు శ్రీకాకుళం నుండి రాజమండ్రి వరకు అనేక ప్రాంతాల్లో విస్తృతంగా తిరిగి సంబంధాలు మెరుగుపరిచాడు.

1977లో విశాఖకు బదిలీ అయిన తర్వాత అప్పలసూరి వాళ్లతో కలిసి వున్న శ్రీకాకుళం- విశాఖ ఉమ్మడి జిల్లా కమిటీలో సభ్యుడయ్యాడు. అప్పలసూరి వాళ్లు మన పార్టీ నుండి వెళ్లిపోయాక అమరుడు గంటి రమేష్‌ను తీసుకొని జిల్లా కమిటీని పునరుద్ధరించాడు. వరంగల్ రెండవ మహాసభలో 1978లో ఆర్.ఎస్.యు. రాష్ట్ర అధ్యక్షుడుగా ఎన్నికయి ఎ.ఐ.ఆర్.ఎస్.ఎఫ్. బాధ్యతలు సైతం నిర్వహించాడు. మద్రాస్‌లో 1981లో జాతుల ఉద్యమాలపై సెమినార్ నిర్వహించి విజయవంతం చేశాడు. జాతుల ఉద్యమాలను అధ్యయనం చేసి, వాటితో సంబంధాలను అభివృద్ధి చేసుకోవడంలోను సెమినార్ పేపర్ తయారు చేయడంలోను ప్రముఖమైన పాత్రను నిర్వహించాడు.

సిరిసిల్లా, జగిత్యాల రైతాంగ పోరాటం కరీంనగర్, ఆదిలాబాద్ పోరాటంగా అనతికాలంలోనే ఉత్తర తెలంగాణ రైతాంగ పోరాటంగా అభివృద్ధి చెందింది. దీన్ని అణచడానికి ప్రభుత్వం కల్లోలిత ప్రాంత చట్టం తెచ్చింది. నిర్బంధం క్రమంగా పెరిగింది. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో పెంపొందుతున్న విప్లవోద్యమం సాయుధ దళాల నిర్మాణ రూపం తీసుకుంది. ఆత్మరక్షణా యుద్ధంలో భాగంగా గెరిల్లా యుద్ధ స్వభావంతో కూడిన ప్రజా యుద్ధాన్ని చేపట్టింది. విముక్తి ప్రాంత లక్ష్యంతో గెరిల్లా జోన్స్ ఏర్పాటు చేయాలనుకుంది. ఉత్తర తెలంగాణా పోరాటాన్ని దండకారణ్యానికి విస్తరింప చేయాలన్న పార్టీ నిర్ణయం విజయవంతం అయింది. మన శక్తులు డీకేలో నిలదొక్కుకున్నాయి.

### కర్ణాటక ఉదయ్‌గా:

ఇతర రాష్ట్రాలలో విప్లవోద్యమ నిర్మాణం కోసం 1983లో కామ్రేడ్ ఆజాద్ కర్ణాటక రాష్ట్రానికి ఆర్గనైజర్‌గా వెళ్లాడు. అక్కడున్న తెలుగు ప్రజలతో, మేధావి వర్గంతో, విద్యార్థులతో వున్న సంబంధాలను వినియోగించుకొని పార్టీనీ, ప్రజా సంఘాలను నిర్మించాడు. విద్యార్థుల్లో, మహిళల్లో, కార్మికుల్లో ఆజాద్ చేసిన విశేష కృషి ఫలితంగా అక్కడ పార్టీ, విప్లవోద్యమం అభివృద్ధి కావడంతో పాటు ప్రజా సంఘాలు విస్తృతమయ్యాయి. పార్టీకి ఒక రూపం కూడా వచ్చింది. 1985 నాటికి లీడింగ్ టీంను ఏర్పరిచి దానిని దృఢపరచడంతో 1987లో రాష్ట్ర కమిటీగా మారింది. దానికి కార్యదర్శిగా కామ్రేడ్ ఆజాద్ ఎన్నికయ్యాడు. షిమోగాలో ఒక జాతి సమస్యపై జరుగుతున్న ఆందోళనకు మద్దతును ఇవ్వడంతో మొదలై ఆ ఉద్యమాన్ని మిలిటెంట్‌గా నడపడంలో ఎంతో కృషి చేశాడు. కర్ణాటకతో పాటు తమిళనాడు, కేరళ, అస్సాం, బెంగాల్, బీహార్, ఢిల్లీ ఇలా అనేక రాష్ట్రాలలో తిరిగి అఖిల భారత విద్యార్థి ఉద్యమాన్ని, కర్ణాటకలో యువజన సంఘాలను, మహిళా వుద్యమాన్ని, కార్మికపోరాటాలను, సాంస్కృతిక సంస్థను అభివృద్ధి చేయడంలో విశేషంగా కృషి చేశాడు.

కర్ణాటక గ్రామీణ ప్రాంత ఉద్యమ నిర్మాణం కోసం హైదరాబాద్-కర్ణాటక ప్రాంతంలోను, ముఖ్యంగా రాయ్‌చూరు ప్రాంతంలోను యువజనులను కూడగట్టి భూస్వామ్య వ్యతిరేక పోరాటాన్ని చేపట్టాడు. కర్ణాటక గ్రామీణ పరిస్థితులను అధ్యయనం చేయడం ద్వారా భూస్వామ్య వ్యతిరేక పోరాట రాజకీయాలను బలంగా అర్థం చేయించాడు. నూతన ప్రజాస్వామిక విప్లవ కార్యక్రమం అమలుకు అది ఎంతో తోడ్పడింది. అదే విధంగా అమరుడు కామ్రేడ్ సాకేత్ రాజన్ కర్ణాటక చరిత్రను అధ్యయనం చేసి రాసిన పుస్తకానికి చాలా ప్రాధాన్యత వచ్చింది. కర్ణాటక విశ్వవిద్యాలయాల్లో అది చరిత్ర పాఠంగా వుంది. దానిని రాయడంలో ఆజాద్ సహకారం అనేక రూపాల్లో నిక్షిప్తమై వుంది.

1985లో పార్టీలో పొడచూపిన ఆరు చెడు ధోరణులపై ఎడ్యుకేషన్ అందించడంలోను, కర్ణాటకలో రెక్టిఫికేషన్‌ను ఒక వుద్యమంగా నిర్వహించి పార్టీని దృఢ పరిచి ఐక్యపరచడంలో రాజకీయంగా ఎంతో కృషి చేశాడు.

1984లో ప్రారంభమై మూడు సంవత్సరాల పాటు కొనసాగిన సంక్షోభం మన పార్టీలో మొదటిది. సత్యమూర్తి, వీరాస్వామి, మాణిక్యంలు సృష్టించిన గందరగోళం నుండి తమిళనాడు పార్టీ క్యాడర్‌ను ఉద్యమంలో నిల్పడంలో కీలక పాత్ర వహించాడు. కర్ణాటక పార్టీని దృఢంగా నిలిపి మితవాదాన్ని బలంగా ఎదుర్కొన్నాడు. పార్టీ నాయకత్వానికి అన్ని రకాలుగా సహకరించాడు. అప్పుడు వచ్చిన రాష్ట్ర నివేదికల్లో కర్ణాటక నివేదిక క్యాడర్లో రాజకీయంగా మంచి ప్రభావాన్ని వేసింది. డాక్యుమెంట్లు రాయడంలో సహకారాన్ని అందించాడు. ఉద్యమ నిర్మాణంలో సాధించిన అభివృద్ధితో పాటు సైద్ధాంతికంగా, రాజకీయంగా ఎదిగిన కామ్రేడ్ ఆజాద్‌ను 1990లో జరిగిన కేంద్ర ప్రత్యేక ప్లీనంలో సి.ఒ.సి.లోకి ఎన్నుకున్నారు.

రాడికల్ మార్చ్, కలం పత్రికలను నిర్వహించి విప్లవ రాజకీయ ప్రచారాన్ని కొనసాగించడంలో ఆజాద్ కృషి చెప్పుకోదగినది. మొదటి నుండి రాతపనుల్లో ముందుండే వాడు. రాజకీయ సిద్ధాంత విషయాల్లో రచనలు, వివిధ రకాల డాక్యుమెంట్లు, సావనీర్లు, పరిశోధన రిపోర్టులు రాశాడు. ఇతరులకు రాతపనుల్లో సహకరించడమే కాకుండా అనువాదం చేసి ఇచ్చి చదవమని ప్రోత్సహించేవాడు.

1991, 1992 సంవత్సరాలలో మరల (రెండవ సారి) పార్టీలో సంక్షోభం ముందుకు వచ్చింది. తనపై బలమైన ప్రభావాన్ని వేసిన కె.ఎస్.లో వచ్చిన మార్పును మితవాద రాజకీయాలను ఆజాద్ వ్యతిరేకించాడు. గొప్ప చైతన్యంతోను, పట్టుదలతోను, కార్మికవర్గ పార్టీ సిద్ధాంత రాజకీయాలను లోతుగా అధ్యయనం చేసి ఎదిగిన కొత్త నాయకత్వంలో ఆయన ఒకరు. కామ్రేడ్ ఆజాద్ సహా నూతన నాయకత్వం సమిష్టి కృషితో కె.ఎస్. దిగ్గజాన్ని ఢీకొని ఆ కుట్రలను

బహిర్గతం చేసింది. ఆనాటి సిద్ధాంత రాజకీయ పత్రాల రాత పనుల్లోను, కేడర్‌ను ఎడ్యుకేట్ చేయడంలోను ఆయన పాత్ర ఎన్నదగినది.

కామ్రేడ్ ఆజాద్ రాజకీయ కృషి చాలా పట్టుదలతో కూడినది. చాలా శ్రమతో కూడినది. గొప్ప పఠనాశక్తి గల కామ్రేడ్ ఆజాద్ రోజూ పని చేసే సమయం ఎక్కువ. ఎటువంటి అననుకూల పరిస్థితుల్లోనయినా చదవగలడు, రాయగలడు. సిద్ధాంత, రాజకీయ విషయాలను అన్ని కోణాల నుండి పరిశీలించేవాడు. యుద్ధ వార్తలకు బాగా స్పందించేవాడు. ప్రజల విజయాలను కీర్తించేవాడు. మన ఉద్యమానికి వ్యతిరేకంగా శత్రువు చేసే దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టేవాడు. మన పార్టీ పత్రికల నిర్వహణలో సంపాదక వర్గంలో ఉండడమే కాకుండా ప్రధాన బాధ్యతలు కూడా తీసుకున్నాడు. వేన్‌గార్డ్, పీపుల్స్‌మార్చ్, ప్రస్తుతం మావోయిస్ట్ ఇన్ఫర్మేషన్ బులిటెన్‌లను నడపడంలోను కృషి చేశాడు.

## సిద్ధాంత రాజకీయ విషయాలలో విశేష కృషి

స్కోప్ స్టడీ మెటీరియల్ తయారు చేయడంలోనూ ప్రధాన బాధ్యత చేపట్టాడు. అలాగే 1985–95ల మధ్య రాజకీయ అధ్యయనానికి 'అంతర్జాతీయ పరిస్థితిపై నోట్సు' తయారు చేయడంలోను, అందుకు అవసరమైన పదకోశం తయారీలోను చాలా సమాచారం సేకరించాడు. రాష్ట్ర మహాసభలు, కాంగ్రెస్‌ల సందర్భంగా డాక్యుమెంట్ల తయారీలోను విశేష కృషి చేశాడు. సిద్ధాంత, రాజకీయ విషయాల్లోను, కార్యక్రమం రూపకల్పనలోను డైనమిక్‌గా వుండి కమిటీలో సమర్థవంతమైన పాత్రను పోషించాడు. ఆజాద్‌కు ప్రజల ఎడల, పార్టీ సిద్ధాంతం పట్ల అచంచల విశ్వాసం, సంకల్ప శుద్ధి వుండేవి. సిద్ధాంతాన్ని సృజనతో నిర్దిష్ట పరిస్థితులకు అన్వయించడంలో ఆజాద్ నాయకత్వ ప్రతిభ పార్టీకి, ఉద్యమానికి ఎంతో తోడ్పడ్డాయి. ఊగిసలాటకు తావులేని కచ్చితమైన వైఖరి ప్రకటించే ఆజాద్ పాలకవర్గాల రాజకీయాలను, ఫాసిస్ట్ విధానాలను ఎండగట్టడంలోను, ఓడించడంలోను బాగా అనుభవాన్ని సంపాదించాడు. పార్టీ ప్రవక్తగా మన పార్టీ సిద్ధాంత రాజకీయాలను, మన కార్యాచరణ విధానాన్ని బలంగా ప్రచారం చేయడంతో అన్ని సెక్షన్ల ప్రజలను మన వైపు నిలుపుకోగలిగాం. ప్రభుత్వ విధానాలను బహిర్గతం చేసి, ప్రజలను ఉద్యమాల వైపు తీసుకువచ్చి ఐక్యపరచాం. నిశిత దృష్టి, వేగంగా స్పందించడం, నిబ్బరంగా కార్యక్రమాన్ని రూపొందించడం, సమర్థవంతంగా సమన్వయించడం ఆజాద్ ప్రత్యేకత. దోపిడీ వర్గాల ఆర్థిక, రాజకీయ సంక్షోభాన్ని, లోతుగా విశ్లేషించి భవిష్యత్తులో మనం సాధించే విజయాన్ని వీక్షించడం ద్వారా ప్రజాయుద్ధ విజయాన్ని గొప్పగా కీర్తించేవాడు. చారిత్రక పరివర్తన మీద దృష్టి కేంద్రీకరిస్తూ, సామాజిక, ఆర్థిక, రాజకీయ సాంస్కృతిక విషయాలలో సంవిధానాన్ని సాధించిన ఆజాద్ స్థలకాలాలకనుగుణంగా సృజనశీలంగా విప్లవ కార్యాచరణను కొనసాగించాడు.

1995లో ప్రత్యేక మహాసభకు ముందు చేసిన రాజకీయ సన్నాహకాల్లోను, పాత సి.పి.ఐ.(ఎం-ఎల్.) (పీపుల్స్‌వార్) 2001 కాంగ్రెస్ కోసం చేసిన రాజకీయ కృషిలో, 2004కు ముందు గత ఎం.సి.సి.ఐ.తో ఐక్యత కోసం చేసిన రాజకీయ కృషిలో, ఇతర గ్రూపులు, పార్టీలతో, అంతర్జాతీయంగా ఇతర దేశాల సంస్థలతో జరిగిన చర్చలలో కామ్రేడ్ ఆజాద్ కృషి విశేషమైనది. ప్రపంచ విప్లవ పార్టీలను, సోషలిస్ట్ క్యాంపులో జరుగుతున్న పరిణామాలను విశ్లేషించడంలో కామ్రేడ్ ఆజాద్ పరిణతి సాధించాడు. ఆర్థిక, సామాజిక, రాజకీయ విషయాలను నిర్మాణ విషయాలను, మిలిటరీ, సాంస్కృతిక అంశాలను అధ్యయనం చేసి, సలహాలు ఇవ్వడంలో కార్యక్రమాలు రూపొందించడంలో సునిశిత దృష్టితో కూడిన కామ్రేడ్ ఆజాద్ సలహాలు మెరుగులు దిద్దడానికి ఎంతో తోడ్పడ్డాయి.

పోలిమిక్స్ నడపడంలో ఆజాద్ కృషి చాలా గొప్పది. బాలగోపాల్ తాత్విక గందరగోళంను బహిర్గతం చేసి పోస్ట్ మోడర్నిజాన్ని సైద్ధాంతిక మూలాల్లోకి వెళ్లి అర్థం చేయించాడు. బాలగోపాల్‌ను సైద్ధాంతికంగా, రాజకీయంగా విమర్శించిన మరో పుస్తకం 'చీకటిదారి' రాయడంలో కూడా ఆజాద్ సలహాలు తోడ్పడ్డాయి.

కామ్రేడ్ ఆజాద్ హిందూ ఫాసిజాన్ని బహిర్గతపర్చడం ముస్లిం మైనారిటీ ప్రజలతో ఐక్యం కావాల్సిన అవసరాన్ని బలంగా నొక్కి చెప్పడం, గుజరాత్ మారణకాండ లాంటి ఘటనలను నిరసించడం బలంగా చేశాడు.

హైదరాబాద్, డిల్లీ, బెల్జియంలతో పాటు అనేక చోట్ల మావోయిజం గురించి, విప్లవ పంథా గురించి జరిగిన సెమినార్లలో ప్రవేశపెట్టిన పత్రాలలో మన పార్టీ సిద్ధాంత రాజకీయ అవగాహనను బలంగా రూపొందించడంలో ఆజాద్ కృషి గొప్పది.

మావోయిస్టు సిద్ధాంత రాజకీయ శిక్షణకు సంబంధించి ఏర్పడిన సబ్ కమిటీ (స్కోప్)కి 1995 నుండి 2004 వరకు బాధ్యతను నిర్వహించాడు. 'భారతీయ ఆర్థిక వ్యవస్థ' కొత్త సబ్జెక్ట్‌ను రూపొందించి భారత సామాజిక ఆర్థిక విషయాలను సమగ్రంగా అర్థం చేసుకోవడానికి పార్టీ శ్రేణులకు బాగా ఉపయోగపడే విధంగా ఆజాద్ కృషి చేశాడు.

పార్టీ, ప్రజా సైన్యం, ప్రజా ఐక్య సంఘటనల విషయాలలోను వాటిని సమన్వయించి నడపడంలోను ఉన్నత చైతన్యాన్ని ప్రదర్శించిన కామ్రేడ్ ఆజాద్ అనేక విషయాలలో సమర్థవంతమైన పాత్రను పోషించాడు. పి.ఎల్.జి.ఎ. ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పేవాడు. ప్రజా సైన్యం–ప్రజా యుద్ధం గురించి విస్తృతంగా అధ్యయనం చేసి కమిటీలో చర్చించేవాడు. ప్రజా సైన్య నిర్మాణానికి తన వంతు కృషి చేశాడు.

కామ్రేడ్ ఆజాద్ మాతృ భాష తెలుగు. ఇంగ్లీష్, హిందీ భాషలతో పాటు కన్నడ, తమిళ భాషల్లో కూడా అనర్గళంగా మాట్లాడేవాడు.

అర్బన్ పర్‌స్పెక్టివ్ రూపొందించడంలో కీలక భూమికను

నిర్వహించడంతో పాటు పట్టణోద్యమ నిర్మాణ బాధ్యతలు తీసుకుని శక్తివంతంగా కృషి చేశాడు. ఆ రంగంలో విలువైన అనుభవాలను అందించాడు. నూతన ఆర్థిక విధానాల (ఎల్.పి.జి.) ప్రమాదాన్ని భారత ఆర్థిక రాజకీయాలలో వచ్చే పరిణామాలను సరిగ్గా విశ్లేషించి ఎద్యుకేట్ చేశాడు. పార్టీ రూపొందించిన మహిళా దృక్పథం, కుల సమస్య– మన దృక్పథంకు సంబంధించి ఆయన కృషి చాలా వుంది. జాతుల ఉద్యమాల ఎడల మన అవగాహనను మెరుగుపరచడంలోను ఎంతో కృషి చేశాడు. మనం రూపొందించిన పార్టీ డాక్యుమెంట్లను మెరుగుపరిచి సుసంపన్నం చేయడంలో విశేష కృషి చేశాడు. మహాసభలకు పూర్తి స్థాయిలో ప్రిపేర్ అయ్యి (సర్వ సన్నద్ధంగా) వెళ్లి ఆజాద్ ప్రతి విషయాన్ని సమగ్రంగా పొందు పరిచేవాడు. ప్రస్తుత పరిస్థితులకు ప్రజాయుద్ధ సూత్రాలను అన్వయించడంలో గొప్ప నేర్పును సంపాదించి, క్లిష్ట సమస్యలను కూడా సునాయాసంగా పరిష్కరించేవాడు.

కామ్రేడ్ ఆజాద్ సుదీర్ఘ కాలం శత్రు శిబిరాల మధ్య తిరుగాడుతూ వివిధ కవర్లలో ఒదిగిపోతూ రహస్యంగా విప్లవోద్యమ కర్తవ్యాలను మెళకువగా నడిపి అనుభవం సంపాదించాడు. ఆయన పెద్ద ఆఫీసర్లాగానూ వుండగలడు, సాధారణ కార్మికుల్లోనూ కల్సిపోగలడు. ఇది ఆకృతికి సంబంధించిన విషయమే కాదు. ప్రజలతో కేడర్లతో కమిటీలతో రాజకీయంగా మంచి సంబంధాలను కల్గి వుండడంతో అన్ని స్థాయిల వారితో గొప్పగా ఐక్యం కావడంలో ఆదర్శంగా వుండేవాడు.

కామ్రేడ్ ఆజాద్ తన తప్పుల ఎడల నిజాయితీతో కూడిన ఆత్మవిమర్శ చేసుకునేవాడు. కార్మిక వర్గ తత్వాన్ని జీర్ణించుకొని కేంద్రీకృత ప్రజాస్వామిక సూత్రానికి అనుగుణంగా మెజారిటీ నిర్ణయాన్ని కచ్చితంగా అమలు చేసేవాడు. తన అభిప్రాయాలను నిక్కచ్చిగా వేదికలపై మాట్లాడ్డం, ఇతరులకు అర్థం చేయించడంలోను, తప్పులు సరిదిద్దడంలోను ఓపికను, బాధ్యతను గుర్తెరిగి సహకరించేవాడు.

కార్మికవర్గతత్వం, మమేకత, గాఢత, విశాలత్వం, భవిష్యత్ దృష్టి గల కామ్రేడ్ ఆజాద్ పని విధానంలోని శైలిని ఎంతో అభ్యాసం చేస్తే తప్ప నేర్చుకోవడం కష్టం. ధైర్యసాహసాలు, మంచి సామర్థ్యం గల కామ్రేడ్ ఆజాద్ జీవితం భవిష్యత్ తరాలకు ఆదర్శం.

సాదాసీదాగా జీవించడం ఆజాద్ జీవిత విధానంగా వుండేది. కామ్రేడ్ ఆజాద్ వ్యక్తిగత జీవితంలోని నిరాడంబరత నిస్వార్థం నేర్చుకునే అంశాలు. 1980ల ప్రారంభంలో అమరుడు కామ్రేడ్ మహదేవ్ సహచరిని వివాహం చేసుకున్నాడు. వాళ్లిద్దరూ పరస్పర సహకారం, ప్రోత్సాహంతో సహజీవనం సాగించారు. ఆ కామ్రేడ్ రాజకీయ అభివృద్ధికి, అనువాదాలు చేయడానికి, రచనా వ్యాసాంగానికి, నిర్మాణ సామర్థ్యాలు పెంచుకోవడానికి ఆజాద్ సహకారం స్నేహపూర్వకంగా వుండేది. వారిది ఆదర్శవంతమైన జంట.

ఎమర్జెన్సీలో మీసా కింద జైలులో పెట్టి వంటరిగదిలో బంధించినపుడూ 1979లో నాసా కింద అరెస్ట్ అయినపుడు ధైర్యంగానే వున్నాడు. రెండు సార్లు జైలునుండి విడుదలై ఉద్యమ స్రవంతిలోనే భాగమయ్యాడు.

తాను ఉద్యమంగా ఎదిగిన క్రమాన్ని నిరంతరం గుర్తుంచుకొని ప్రవర్తించడం ద్వారా జనార్దన్ లాంటి అమరుల ఆశయాలకు న్యాయం చేసే కృషిలో ఎక్కడా వెనుకాడలేదు. తండ్రి చనిపోయినా, తల్లికి వృద్ధాప్యం వచ్చినా వెనక్కి చూడలేదు. వ్యక్తిగత కుటుంబాన్ని విశ్వ కుటుంబంలో భాగంగా చూశాడు.

1992 నుండి పూర్తికాలం సీసీ బాధ్యతలు నిర్వర్తించాడు. 1987 నుండి 1993 వరకు కర్ణాటక కార్యదర్శిగా వున్నాడు. అలా పనిచేసిన అనుభవంతో ఈ మధ్య కాలంలో వచ్చిన మితవాద ప్రమాదాన్ని ఓడించడానికి అక్కడి నాయకత్వానికి ఎంతో సహాయ సహకారాలు అందించాడు. ఉత్తర తెలంగాణ సమావేశాలకు హాజరై ఉద్యమ పురోగమనానికి సహకరించాడు. కర్ణాటక రాష్ట్ర వుద్యమానికి నిరంతరం అందుబాటులో వుండే వాడు. 1995 నుండి 2001 వరకు సీసీ సెక్రటేరియట్ సభ్యుడిగా, 2001 నుండి అమరుడయ్యే నాటి వరకూ పి.బి. సభ్యుడిగా మొత్తం ఇరవై సంవత్సరాల పాటు సీసీ నిర్మాణంలో పని చేసి భారత విప్లవోద్యమ చరిత్రలో గొప్ప పాత్రను, వున్నత సాంప్రదాయాలను నెలకొల్పాడు. 2001 కాంగ్రెస్ తర్వాత ఎపిని గైడ్ చేయడంతో పాటు 2004లో ఎ.పి. ప్రభుత్వంతో జరిగిన చర్చలకు సమర్థవంతమైన నాయకత్వాన్ని అందించాడు.

2004 నుండి సీసీ ప్రవక్తగా విశేష కృషి చేసి మన పార్టీ రాజకీయాలను, పంథా చుట్టూ అన్ని సెక్షన్ల ప్రజల్ని విస్తృతంగా సమీకరించడానికి కృషి చేశాడు. పి.బి. ఆధ్వర్యంలో నడిచే పార్టీ సైద్ధాంతిక పత్రిక 'పీపుల్స్‌వార్'ను తీసుకురావడంలో ఆజాద్ పాత్ర ముఖ్యమైనది. ఏ రాష్ట్రానికి వెళ్లినా, ఏ కామ్రేడ్‌ను కల్సినా వుద్యమ అనుబంధాన్ని ప్రతిబింబింపజేసేవాడు. ఆజాద్‌ను కలవడానికి, మాట్లాడడానికి క్యాడర్ ఎప్పుడూ ఉత్సాహం చూపేవారు. సరదాగా, స్నేహంగా వుంటూ రాజకీయాలు చెప్పేవాడు.

కామ్రేడ్ ఆజాద్ లేని పార్టీని ఊహించడం కష్టంగా వుంటుంది. పది మంది పనిని ఒక్కడే చేశాడు. ఆజాద్ చేసిన పనిని సమన్వయించే శక్తులుగా ఎదగడం మనందరి బాధ్యత. ఆయన మేధో సంపత్తి ఉద్యమ పురోగమనంలో సంలీనమైందని గుర్తిద్దాం.

2010 మార్చిలో కామ్రేడ్ ఆజాద్ అరెస్ట్ వార్త భారత విప్లవ ప్రజల్ని ఆందోళనకు గురిచేసింది. అది నిజం కాదని తెల్సిన తర్వాత అందరూ సంతోషించారు. ఆ సంతోషం ఎక్కువ కాలం నిలబడలేదు. దంతెవాడ (ముకురాం) లాంటి ప్రతిఘటనతో అల్లకల్లోలం అయిన శత్రు క్యాంపు తన బలగాల మనోస్థైర్యాన్ని నిలబెట్టడానికి కామ్రేడ్ ఆజాద్‌ను లక్ష్యంగా చేసుకొని వెంటాడి వేటాడారు.

⇨

# ప్రజాస్వామ్యవాది పీడిత ప్రజల పక్షపాతి హేమచంద్ర పాండేకు అరుణాంజలి!

కామ్రేడ్ ఆజాద్‌తో పాటు పోలీసులు పాశవికంగా పొట్టనపెట్టుకున్న పాత్రికేయుడు హేమచంద్రపాండే ఉత్తరాఖండ్ రాష్ట్రం పిథోర్‌గఢ్ జిల్లా దేవకల్ గ్రామానికి చెందినవాడు. బబిత ఆయన జీవిత భాగస్వామి. మధ్య తరగతి కుటుంబంలో పుట్టిన ఆయన కుమాయూన్ యూనివర్సిటీలో ఆర్థిక శాస్త్రంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేశాడు. అనువాద ప్రక్రియలో డిప్లొమా, జర్నలిజంలో మరో డిప్లొమా పూర్తి చేసి జర్నలిస్ట్ వృత్తిలోకి ప్రవేశించాడు. ప్రస్తుతం ఆయన స్వచ్ఛంద సేవా సంస్థలపై పిహెచ్‌డి చేస్తున్నాడు. నయీదునియా, దైనిక్ జాగరణ్, రాష్ట్రీయ సహారా వార్తా పత్రికలకు ఆయన సామాజిక స్పృహతో కూడిన 99 వార్తా కథనాలు రాసినట్లు సమాచారం వుంది. 'చేతనా' పత్రికకు



ఆయన సబ్ ఎడిటర్‌గానూ పనిచేశాడు. జర్నలిజాన్ని ఆయన కేవలం జీవిక కోసమే కాకుండా ఒక సామాజిక స్పృహతో, సమాజం పట్ల, పీడితుల పట్ల ఒక నిబద్ధతతో ఎంచుకున్నాడు. ఆ సామాజిక స్పృహతోనే ఆయన అల్మోరాలో జంగల్ బచావో, ఉత్తరాఖండ్ వుద్యమాల్లో పాల్గొన్నాడు. ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్‌లో చాలా చురుగ్గా పాల్గొనేవాడు. ఎక్కడ అన్యాయం జరిగినా మానవీయంగా స్పందించేతత్వం గలవాడు. ప్రజాస్వామిక విలువల కోసం తపించినవాడు. నిజానికి ఒక పాత్రికేయుడికి వుండి తీరాల్సిన లక్షణాలన్నీ వున్నవాడు. బహుశా అందుకే గ్రీన్‌హంట్ దురాగతాలను తెలుసుకొని వెలుగులోకి తేవడం కోసమే ఆజాద్‌ను కల్సివుండవచ్చు.

మనుషులు మనుషుల్లాగా వుండడం, మానవీయంగా స్పందించడం అంటే పాలకవర్గాలు ఉలిక్కిపడకుండా వుండవు. అందుకే హేమచంద్రపాండేను అవి సహించలేక పోయాయి. ముఖ్యంగా ఇటీవలి కాలంలో అరుంధతీరాయ్ వంటి వాళ్లు దండకారణ్యాన్ని సందర్శించడం, ఇక్కడ సాగుతున్న గ్రీన్‌హంట్ దురాగతాలను వెలుగులోకి తేవడం చిదంబరం ముఠాకు మింగుడుపడ్డం లేదు. అందుకే అటువంటి వారికి ఒక హెచ్చరిక చేయడం కోసం కూడా హేమచంద్రపాండేను హత్య చేశారు. అంతేకాదు ఆజాద్ హత్యకు సాక్ష్యం లేకుండా చేయడం కోసం కూడా ఈ పాశవిక హత్యకు పాల్పడ్డారు. పత్రికా స్వేచ్ఛకు ఈ చర్య గొడ్డలిపెట్టు వంటిది.

ఒక జర్నలిస్టును హత్య చేయడాన్ని దేశవ్యాప్తంగా, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో మీడియా, ప్రజాస్వామికవాదులూ, మేధావులూ విస్తృతస్థాయిలో ఖండించడమే కాకుండా దేశంలో ప్రజాస్వామ్యం

*(మిగతాది 23వ పేజీలో...)*

---

⇨

కామ్రేడ్ ఆజాద్ విప్లవ జీవితం నుండి విప్లవ శ్రేణులు నేర్చుకోవాల్సింది ఎంతో వుంది. చదవడంతో పాటు, విశ్లేషణ, సంశ్లేషణ చేసి చెప్పగల మార్క్సిస్టు సిద్ధాంత జ్ఞానాన్ని ఆయన సంతరించుకున్నాడు. కార్మిక వర్గ సిద్ధాంత రాజకీయాల పట్ల నమ్మకం, విశ్వాసం కలిగి పట్టుదలతో నిరంతరం శ్రమించే తత్వాన్ని, సాదా సీదా జీవితాన్ని అలవర్చుకున్నాడు. చిన్న వయసు నుండి తెలివి తేటలతో గుర్తింపు పొందిన కామ్రేడ్ ఆజాద్ 38 సంవత్సరాల అవిశ్రాంత విప్లవ కృషి భారత విప్లవోద్యమానికి, ప్రపంచ సోషలిస్ట్ విప్లవ పురోగమనానికి ఎంతో దోహద పడింది. మూడు అద్భుత ఆయుధాలను సమన్వయించి పార్టీ రాజకీయ సిద్ధాంత విషయాలను అభివృద్ధి చేశాడు. సృజనశీలమైన విప్లవ శైలితో, సుహృద్భావ సంబంధాలతో పార్టీ, విప్లవోద్యమ అభివృద్ధికి విశేష కృషి చేశాడు. నిర్బంధాన్ని తాను నిబ్బరంగా ఎదుర్కొని రాజ్య ఫాసిస్టు స్వభావాన్ని ఎదిరించేలా ప్రజా యుద్ధాన్ని తీవ్రతరం చేసి ఓడించేలా పార్టీని ఉద్యమాన్ని తీర్చి దిద్దాడు. అనేక రంగాలలో ప్రవేశం కలిగి, బహు భాషలు తెల్సి, ఎన్నో రకాలుగా సేవలు అందించిన సమర్థుడైన కామ్రేడ్ ఆజాద్ విప్లవ జీవితం మనకు ఆదర్శం, అనుసరణీయం.

1999 డిసెంబర్ 2న మన పార్టీ ఉన్నత శ్రేణి నాయకులు కామ్రేడ్స్ శ్యాం, మహేష్, మురళిలను కోల్పోయి క్రమంగా ఆ లోటును పూడ్చుకుంటున్నది. నేడు మరలా ఆ స్థాయిలో ఎదిగి, భవిష్యత్ ఆశగా రూపొందిన నేత అమరత్వం ఉద్యమానికి తీవ్ర నష్టమే. విప్లవోద్యమంలో కష్టాలు, నష్టాలు సాధారణమే. నేడు ప్రపంచంలోనూ, దేశంలోనూ తీవ్ర ఆర్థిక, రాజకీయ సంక్షోభ పరిస్థితులు నెలకొన్నాయి. ప్రతీ చోట అనేక సెక్షన్ల ప్రజలు, వివిధ జాతుల ప్రజలు పోరాటాలు చేపట్టారు. వర్గపోరాటాలు తీవ్రతరమయ్యాయి. పోరాటాలను అణచడానికి రాజ్యం పాశవిక దాడులకు తలపడుతుంది. నిర్బంధం పెంచుతుంది. ప్రజా రాజకీయాలు సాయుధ పోరాట అవసరాన్ని గుర్తించాయి. నక్సల్బరీ పంథా సరైనదని మరోసారి రుజువైంది. నేటి విప్లవ పరిస్థితే మన శక్తులను అభివృద్ధి చేయడానికి, అనేక మంది ఆజాద్‌లను సృష్టించడానికి తోడ్పడుతుంది. కామ్రేడ్ ఆజాద్ ఆదర్శాలను కొనసాగిద్దాం. విప్లవ విజయాన్ని సాధిద్దాం.

ప్రజాయుద్ధ బావుటాకు రక్తాన్నిచ్చి చరిత్రకెక్కిన యోధుడు కామ్రేడ్ ఆజాద్‌కు జోహార్లు!

# మృత్యువును ధిక్కరించి తమ వెచ్చని రక్తంతో త్యాగ సాంప్రదాయాల్ని ఎత్తిపట్టిన కామ్రేడ్ శాఖమూరి అప్పారావు (రవి/జయలాల్), సోలిపేట కొండల్‌రెడ్డి (రమణ)లకు అరుణారుణ జోహార్లు!

మార్చ్ 12, 2010న రక్తపిపాసులైన ఆంధ్రప్రదేశ్ ఎస్ఐబీ హంతకులు మరోసారి పంజా విసిరారు. మన పార్టీ సీనియర్ నేత కామ్రేడ్ శాఖమూరి అప్పారావును హత్య చేసి నల్లమల అడవిలో పోలీసులతో జరిగిన 'ఎన్‌కౌంటర్'లో మృతి చెందినట్టుగా పాత కథనే వినిపించారు. అదే రోజున వరంగల్ జిల్లాలోని అటవీప్రాంతంలో పార్టీ టెక్నికల్ విభాగానికి చెందిన ఒక ముఖ్యమైన కామ్రేడ్ కొండల్‌రెడ్డి (రమణ)ని హత్య చేసి మరో ఎన్‌కౌంటర్ కథల్లారు. ఈ ఇద్దరు కామ్రేడ్లను వేర్వేరు ప్రాంతాల్లోంచి పట్టుకొచ్చి క్రూరమైన చిత్రహింసలకు గురి చేసి ఆ తర్వాత వేర్వేరు స్థలాల్లో దారుణంగా కాల్చి చంపారు. ఈ లైసెన్స్‌డ్ హంతకులు కామ్రేడ్ అప్పారావును మార్చ్ 10 వుదయం చెన్నై పరిసరాలలో పట్టుకున్నారు. ఆ సమయంలో తను ఒక వ్యక్తిని కలవడానికి పోతున్నాడు. కామ్రేడ్ కొండల్‌రెడ్డిని మహారాష్ట్రలోని పూణె నగరంలో 11వ తేదీ ఉదయం పట్టుకున్నారు. ఈ ఇద్దరినీ అమానుష చిత్రహింసలకు గురి చేసినప్పటికీ ఏమీ రాబట్టలేని ఎస్ఐబీ హంతకులు శత్రువు ముందు తలవంచని ఈ ఇద్దరు కామ్రేడ్స్‌ను 'ఎన్‌కౌంటర్' చేశారు. ఇప్పటి వరకూ లభించిన సమాచారం ప్రకారం కామ్రేడ్ కొండల్‌రెడ్డిపై గత కొంత కాలంగా శత్రు నిఘా వుండింది. కామ్రేడ్ అప్పారావు చెన్నైలో వున్నాడన్న సమాచారం ముందు నుండే వుండింది. పోలీసుల 'ఎన్‌కౌంటర్' కథలిప్పుడు ఎంతగా బూటకమయ్యాయంటే చిన్న పిల్లలు కూడా వాటిని విశ్వసించరు.



రవి, జయలాల్, వినోద్ మొదలైన పేర్లతో పిలవబడే కామ్రేడ్ అప్పారావు మన పార్టీలో సీనియర్ రాష్ట్ర స్థాయి నాయకుడు. గత మూడు దశాబ్దాల నుండీ దేశంలో విప్లవోద్యమాన్ని పురోగమింపజెయ్యడానికి నిర్విరామంగా కృషి చేస్తున్న కామ్రేడ్. ఆంధ్రప్రదేశ్ విప్లవోద్యమ చరిత్ర పుటలపై చెరగని ముద్ర వేసిన కామ్రేడ్ అప్పారావు గత కొద్ది సంవత్సరాలుగా పార్టీలో మిలిటరీ ఇంటలిజెన్స్ విభాగానికి కేంద్ర డైరెక్టర్‌గా పని చేస్తున్నాడు. ముప్పయి సంవత్సరాలుగా వర్గపోరు కొలిమిలో కాకలుదీరి ఉక్కుగా మారిన కామ్రేడ్ అప్పారావు మరణంతో భారత విప్లవోద్యమానికి, ముఖ్యంగా పార్టీలో ఇటీవలే నిర్మాణమైన ఇంటలిజెన్స్ విభాగానికి చాలా పెద్ద నష్టం వాటిల్లింది. కామ్రేడ్ కొండల్‌రెడ్డి సుదీర్ఘ కాలంగా టెక్నికల్ విభాగంలో కృషి చేస్తున్న సీనియర్ కామ్రేడ్. ఆయన మరణంతో పార్టీకి పెద్ద నష్టం జరిగింది. యావత్తు పార్టీఈ అమరులిద్దరికీ వినమ్రంగా శ్రద్ధాంజలి ఘటిస్తూ వాళ్ల వున్నత కమ్యూనిస్టు ఆదర్శాల్ని ఎత్తిపడుతున్నది. అసంపూర్ణంగా మిగిలిన వాళ్ల లక్ష్యాల్ని పరిపూర్తి చేయడానికి మరోసారి ప్రతిన బూనుతున్నది. ఈ సందర్భంగా ఈ అమరులిద్దరి జీవితచరిత్రల్ని మననం చేసుకుందాం.

### కత్తి అంచుపై సాగిన కామ్రేడ్ అప్పారావు (రవి) ప్రయాణం

1962, డిసెంబర్ 25న వరంగల్ జిల్లాలోని ఖానాపూర్ గ్రామానికి చెందిన ఒక మధ్య తరగతి రైతు కుటుంబంలో కామ్రేడ్ శాఖమూరి అప్పారావు జన్మించాడు. తల్లి సరోజనమ్మ, తండ్రి కోటేశ్వరరావులకు కలిగిన ఎనిమిది మంది సంతానంలో ఆరోవాడు కామ్రేడ్ అప్పారావు. ఆయనకు ఇద్దరు అక్కాచెల్లెలు, ఐదుగురు అన్నాదమ్ములు వున్నారు. విప్లవోద్యమ చరిత్రలో ఖానాపూర్‌కు చెప్పుకోదగిన స్థానం వుంది. ఆ గ్రామం నుండి మండలం నుండి ఎందరో అమరవీరులున్నారు. మహత్తర తెలంగాణా సాయుధ రైతాంగ పోరాటంలో ఈ ప్రాంతం నుండి పలువురు తమ ప్రాణాల్ని త్యాగం చేశారు. ఎమర్జెన్సీ చీకటి రోజుల్లో గిరాయిపల్లి 'ఎన్‌కౌంటర్'లో చనిపోయిన విద్యార్థి కార్యకర్త కామ్రేడ్ ఆనందరావు, 1986లో అమరుడైన రాడికల్ విద్యార్థి నేత కామ్రేడ్ నాగేశ్వరరావు ఈ గ్రామంలో పుట్టినవాళ్లే. గిరాయిపల్లి అమరవీరుల సభలకు, బూటకపు ఎన్‌కౌంటర్లపై విచారణ కోసం నియమించబడిన భార్గవ కమీషన్‌కు మద్దతుగా జరిగిన ప్రజాసమీకరణల్లోను ఈ గ్రామం చురుగ్గా కదిలింది. ఈ ప్రాంతంలో పనిచేసిన కామ్రేడ్ జన్ను చిన్నాలు, కామ్రేడ్ ఆర్కేలకు ఈ గ్రామంతో ప్రత్యేక అనుబంధం వుంది. ఈ పోరు వారసత్వాన్నీ, త్యాగ సాంప్రదాయాల్నీ కొనసాగించిన కామ్రేడ్ అప్పారావు ఆంధ్రప్రదేశ్ విప్లవోద్యమ చరిత్రలో ముఖ్యమైన పాత్ర పోషించి ఎర్రజెండా ఎరుపులో మెరుపయ్యాడు.

### రాడికల్ విద్యార్థి వుద్యమంలో విరిసిన ఎర్ర మందారం

ఎమర్జెన్సీ ఎత్తివేసిన తర్వాత వరంగల్–హన్మకొండ జంట పట్టణాల్లో 1977 నుండి 84 వరకు విద్యార్థి, యువజనులు పెద్ద

ఎత్తున కదిలారు. నక్సల్బరీ రాజకీయాలతో ప్రభావితమైన విద్యార్థి, మేధావి, యువజనులు రాడికల్ సంఘాల్లో సంఘటితమయ్యారు. కాలేజీల్లో ఎబివిపి గూండాయిజాన్ని ఎదిరించడం, పట్టణంలో బస్తీ రౌడీల్ని ఎదిరించడంతో పాటు 'గ్రామాలకు తరలండి' అనే పార్టీ పిలుపునందుకొని ఆర్.ఇ.సి., పాలిటెక్నిక్, మెడికల్ కాలేజీ, సి.కె.ఎం. తదితర కాలేజీల విద్యార్థులు పెద్దఎత్తున క్యాంపెయిన్‌లో కదిలి గ్రామాలకు విప్లవ రాజకీయాల్ని తీసుకెళ్లి గ్రామీణ పీడిత ప్రజల్లో విప్లవ బీజాలు నాటారు. ఆ సమయంలో వరంగల్ నగరంలో రాడికల్ విద్యార్థి సంఘం వేగంగా అభివృద్ధి చెందుతూ వుండింది. ఎందరో విద్యార్థులు తమ చదువుతో పాటు సర్వస్వాన్ని త్యాగం చేసి విప్లవాన్నే వృత్తిగా చేసుకుంటున్న రోజులవి. అలాంటి సమయంలో 1978లో వరంగల్‌లో పాలిటెక్నిక్ చదువుతున్న కామ్రేడ్ అప్పారావు పార్టీ పరిచయాల్లోకి వచ్చాడు. కామ్రేడ్ పులి అంజన్న నేతృత్వంలో విప్లవ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడం మొదలు పెట్టాడు. వరంగల్ నగరంలో అప్పారావు అద్దెకుండే ఇల్లు కామ్రేడ్ అంజన్నకు ఒక సురక్షితమైన షెల్టర్‌గా వుండేది. ఆ రోజుల్లో కామ్రేడ్ పులి అంజన్న వందలాది విద్యార్థి యువజనుల్ని ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ప్రభావితం చేశాడు. కామ్రేడ్ అప్పారావు కూడా అతనితో ప్రభావితమైన వాడే... మరింత ముందుకు సాగి అతనికి నమ్మకమైన, దృఢమైన సహచరుడిగా ఎదిగిన వాడు కూడా.

1979లో కామ్రేడ్ అప్పారావు గ్రామాలకు తరలండి క్యాంపెయిన్‌లో పాల్గొని ప్రేరణను పొందాడు. ఆ సమయంలో గ్రామ విశ్లేషణ రిపోర్ట్‌ను సేకరించడంలోనూ, ఫండ్స్ సేకరించంలోనూ పాల్గొన్నాడు. ఆర్.ఎస్.యు.లో చురుగ్గా పనిచేస్తూ 80లో ఆర్.ఎస్.యు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడయ్యాడు. ఆనాడు వరంగల్ పట్టణంలో ఆర్.ఇ.సి. తర్వాత పాలిటెక్నిక్ కాలేజి రాడికల్ వుద్యమాలకు బలమైన కేంద్రంగా వుండిందంటే, కామ్రేడ్ అప్పారావు వంటి ఎందరో చురుకైన కార్యకర్తల కృషే కారణం. 1979 – 1982 మధ్య కాలంలో వివిధ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర వ్యాప్తంగా సుదీర్ఘ కాలం పాలిటెక్నిక్ విద్యార్థుల సమ్మె జరిగింది. ఈ సమ్మెలో కామ్రేడ్ అప్పారావు చురుకైన పాత్ర వహించాడు. చాలా తక్కువ సమయంలోనే అతను వృత్తి విప్లవకారుడిగా మారడానికి నిశ్చయించుకున్నాడు. డిప్లొమా తర్వాత హైదరాబాద్‌లో ఇంజనీరింగ్ డిగ్రీ కోర్సులో అడ్మిషన్ తీసుకున్నాడు. పార్టీ పిలుపివ్వగానే మధ్యలోనే దాన్ని వదిలేసి 1982లో పూర్తి కాలం కార్యకర్తగా మారాడు. వరంగల్ విప్లవోద్యమ చరిత్రలో 1982 పీరియడ్‌కు ఒక చెప్పుకోతగిన ప్రాధాన్యత వుంది. 1982 నాటికి వరంగల్, హన్మకొండ పట్టణాల్లో విద్యార్థి, యువజనుల్లో ఒక పెద్ద వెల్లువ వచ్చింది. అందులోంచి ఎంతో మంది మెరికల్లాంటి విద్యార్థి యువజనులు పూర్తికాలం కార్యకర్తలుగా విప్లవోద్యమంలో కీలక పాత్ర పోషించారు.అందులో ఒకరు కామ్రేడ్ అప్పారావు. వరంగల్ జిల్లా ఉద్యమానికి ఒక ప్రత్యేకత కూడా వుంది. కరీంనగర్ విప్లవోద్యమం గ్రామీణ ప్రాంతంలో ప్రారంభమై పట్టణాలకు విస్తరిస్తే వరంగల్ విప్లవోద్యమం పట్టణాల్లో విద్యార్థి, మేధావుల్లో ప్రారంభమై గ్రామాలకు విస్తరించింది. అలా వరంగల్ పట్టణోద్యమం నుండి వచ్చిన వాడే కామ్రేడ్ అప్పారావు. కొంత కాలంపాటు అతను ఆనాటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ కార్యదర్శి కామ్రేడ్ ప్రహ్లాద్‌కు కొరియర్‌గా పని చేశాడు. అలా కామ్రేడ్ అప్పారావు విప్లవ రాజకీయాల్లో దృఢంగా ముందుకు సాగి ఇక మరెన్నడూ వెనుదిరిగి చూడలేదు.విప్లవోద్యమంలోకి పూర్తి కాలం కార్యకర్తగా వచ్చిన కొన్నాళ్లకు అతను తన పేరును 'రవి'గా మార్చుకున్నాడు. ఆ తర్వాత ఆ పేరు ఆంధ్రప్రదేశ్ ప్రజల్లో చిరస్థాయిగా నిలిచిపోయింది.

**మెదక్ మట్టిలో విప్లవ బీజాలు నాటిన వాడు**

ఆ రోజుల్లో ఉత్తర తెలంగాణా ప్రాంతంలో సాయుధ రైతాంగ ఉద్యమం సర్కారీ దమనకాండను గేలిచేస్తూ వేగంగా పురోగమిస్తూ వుండింది. ఆ వుద్యమాన్ని దక్షిణ తెలంగాణాలోని మెదక్ జిల్లాకు విస్తరింపజెయ్యాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ నిర్ణయించింది. ఈ నిర్ణయాన్ని అమలు చేయడం కోసం 1984లో అమరుడు కామ్రేడ్ అంకం బాబూరావు నాయకత్వంలో ఒక టీంను ఏర్పాటు చేసింది. ఆ టీంలో కామ్రేడ్ రవి ఒక ముఖ్యమైన సభ్యుడు. కరువు, పేదరికం, దుర్భర భూస్వామ్య దోపిడీ పీడనలకు నెలవైన మెదక్ జిల్లాలో విప్లవ బీజాల్ని నాటడం కోసం కామ్రేడ్ రవి తీవ్రంగా కృషి చేశాడు. ముఖ్యంగా సిద్దిపేట పట్టణంలో విద్యార్థి యువజనుల్లోకి చొచ్చుకుపోవడం కోసం ఒక్కో వ్యక్తిని కలుస్తూ, సంబంధాలు ఏర్పర్చుకుంటూ ఓపికగా, దృఢ సంకల్పంతో అతను చేసిన కృషి కమ్యూనిస్టు కార్యకర్తలందరికీ ఆదర్శంగా వుంటుంది. సిద్దిపేట డిగ్రీ కళాశాల, దుబ్బాక, గజ్వేల్, మెదక్, జోగిపేట పాలిటెక్నిక్ కళాశాలలన్నీ ఆర్.ఎస్.యు. నాయకత్వం కింద సంఘటితమై ఎబివిపి, ఆర్.ఎస్.ఎస్., బి.జె.పి. గూండాల ఆగడాల్ని అరికట్టడంలో కామ్రేడ్ రవి అందించిన మార్గదర్శకత్వమే కీలకమైనది. ఈ ప్రభావంతో ఆ కాలంలో కనకరాజు, సముద్రుడు, కొండల్‌రెడ్డి లాంటి అనేక మంది కామ్రేడ్స్ విప్లవోద్యమంలోకి వచ్చారు. 1986లో కామ్రేడ్ అంకం బాబూరావు గుండెపోటుతో ఆకస్మికంగా చనిపోవడంతో మెదక్ జిల్లాలో పార్టీ పనికి పెద్ద దెబ్బ తగిలింది. ఆనాటికి ఉద్యమం అక్కడ ప్రాథమిక స్థాయిలో వుండింది. ఆ తర్వాత జిల్లా ఆర్గనైజర్ బాధ్యతల్ని కామ్రేడ్ రవి చేపట్టి మెదక్ జిల్లాలో విప్లవోద్యమానికి రూపుదిద్దాడు. 1986లో ఏర్పడిన జిల్లా కమిటీకి తను కార్యదర్శిగా బాధ్యత చేపట్టాడు. అమరుడు బాబూరావు, అమరుడు మహేందర్, మరెందరో కామ్రేడ్లతో పాటు కామ్రేడ్ రవి చేసిన నిర్విరామ కృషి ఫలితంగా మెదక్ జిల్లాలో విప్లవోద్యమం బలోపేతమయ్యింది. 1986 నుండే మెల్లగా మొదలైన భూపోరాటాలు చిట్టాపూర్, అనాజిపురం, కాజీపేట, అల్లపూర్ భూస్వాముల భూముల ఆక్రమణ పోరాటాలుగా మారి 1990 లీగల్ పీరియడ్ నాటికి ఉధృతమయ్యాయి. ఇటు గ్రామీణ ప్రాంతాల్లో బలమైన రైతాంగ పునాదిని ఏర్పర్చుకోవడంతో పాటుగా పట్టణాల్లో కేవలం విద్యార్థులకే పరిమితం కాకుండా కార్మిక, ఉద్యోగ, కవులు, కళాకారులతో కూడా సంబంధాలు పెంచుకొని వాళ్లందర్ని కదిలించే స్థితికి ఉద్యమం బలోపేతం కావడంలో అంకం బాబూరావు

అమరత్వం తర్వాత కామ్రేడ్ రవి కృషే కీలకమైంది. ఇదే కాలంలో ఫారెస్ట్ అధికారుల జులుం, మేక పుల్లర, అరక పుల్లర పేర్లతో గొల్లల్ని, ఇతర కాయస్త కులాల రైతాంగాన్ని ముప్పు తిప్పలు పెడుతున్న అటవీ అధికార్లకు వ్యతిరేకంగా ప్రజల్ని కూడగట్టి పోరాటాన్ని నడపడంలో ఫారెస్టోల్ల జులుంను అరికట్టడంలో కూడా రవి పాత్ర వుంది. ఉత్తర తెలంగాణా జిల్లాల తర్వాత పార్టీకి విస్తృతంగా ప్రజాపునాది ఏర్పడింది మెదక్ జిల్లాలోనే. విశాల ప్రాంతాల్లో ప్రజా సమస్యల్ని చేపట్టి పోరాటాలు మొదలయ్యాయి. విద్యార్థి యువజనుల్లో, మేధావుల్లో సంబంధాలు బలపడి వేర్వేరు సంఘాలు నిర్మాణం చేయడంలో అక్కడి పార్టీ సఫలీకృతం అయ్యింది. దీని వెనుక కామ్రేడ్ రవి చేసిన కృషి ఎంతో గొప్పది.

### పోరాట బావుటా సదా సమున్నతం

ఆనాడు మెదక్ జిల్లాలో 'జనశక్తి' గ్రూపు మితవాద అవకాశవాదులకు వ్యతిరేకంగా మన పార్టీ ఎంతో పోరాడాల్సి వచ్చింది. వాళ్ల రాజకీయ దివాళాకోరుతనాన్ని ఎండగడ్తూ రాజకీయంగా, సైద్ధాంతికంగా ఎదుర్కోవడంలో కామ్రేడ్ రవి కృషి చాలా వుంది. దక్షిణ తెలంగాణాలోని మిగతా జిల్లాలైన నల్లగొండ, మహబూబ్‌నగర్‌లలో విప్లవోద్యమం ప్రభావయుతంగా పురోగమించసాగింది. ఆ సమయంలో రాష్ట్రకమిటీ ఈ మూడు జిల్లాల్ని కలుపుతూ 1989లో రీజనల్ కమిటీని ఏర్పాటు చేసింది. దానికి కార్యదర్శిగా కామ్రేడ్ రవి బాధ్యతలు చేపట్టాడు. ఆ క్రమంలో మొత్తం దక్షిణ తెలంగాణాలోని పార్టీ శ్రేణుల్లో కామ్రేడ్ రవి ఒక మిలిటెంట్, దృఢమైన, అంకితభావం గల నాయకుడిగా పేరు పొందాడు. 1990లో జరిగిన ఆంధ్ర రాష్ట్ర కమిటీ ప్లీనంలో కామ్రేడ్ రవిని ప్రత్యామ్నాయ రాష్ట్రకమిటీ సభ్యుడిగా ఎన్నుకున్నారు. కొద్ది నెలలకే అతన్ని రాష్ట్రకమిటీలోకి కో-ఆప్ట్ చేసుకున్నారు. పిన్న వయస్సులోనే రాష్ట్రకమిటీలోకి ఎన్నికైన కామ్రేడ్ అతను. రాష్ట్రకమిటీలోకి వచ్చిన తర్వాత అప్పటి కమిటీ కార్యదర్శి కామ్రేడ్ పులి అంజన్న మార్గదర్శకత్వంలో ఆయన ప్రభుత్వ దాడిని ఎదిరిస్తూ దక్షిణ తెలంగాణాలో విప్లవోద్యమాన్ని పురోగమింపజెయ్యడంలో కీలక పాత్ర పోషించాడు. అనేక మంది విప్లవకారుల్ని బూటకపు ఎన్‌కౌంటర్లలో హతమార్చిన హంతకుడూ, గ్రేహౌండ్స్ ఫోర్స్‌ను స్థాపించిన క్రూరుడైన డీఐజీ వ్యాస్‌ను హైదరాబాద్ నగరంలో ఖతం చేసిన చర్యకు పథకం రచించడంలో కామ్రేడ్ రవి ముఖ్యపాత్ర వహించాడు.

### ఉక్కు సంకల్పం ముందర చిత్తయిన శత్రు క్రూరహింసలు

జనవరి 1993లో కామ్రేడ్ రవి ఒక ఆర్గనైజేషనల్ పనిపై మద్రాస్ (ఇప్పుడు చెన్నై) వెళ్లగా ఇంటలిజెన్స్ గూండాలు అరెస్టు చేశారు. వాస్తవానికి ఆ స్థలానికి రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ పులి అంజన్న పోవల్సి వుండింది. కానీ ఉన్నత నాయకత్వ రక్షణకు ప్రాధాన్యతనిస్తూ రవి స్వయంగా అక్కడికి వెళ్లాడు. అయితే ముందే అరెస్టయిన ఒక కామ్రేడ్ దగ్గర రాతపూర్వకంగా దొరికిన సమాచారం ఆధారంగా శత్రువు ముందే అక్కడ పొంచి వుండి రవి అక్కడికి వెళ్లగానే పట్టుకున్నాడు. ఆ సమయంలో కార్యదర్శి కామ్రేడ్ పులి అంజన్నతో పాటు రాష్ట్రకమిటీ సభ్యులందరూ సమావేశం కోసం జమయ్యి వున్నారు. సమావేశ స్థలంతో పాటు అనేక షెల్టర్ల కామ్రేడ్ రవికి తెలుసు. ఆయన శత్రువు పెట్టిన అమానుష హింసలన్నీ భరించాడు కానీ నోరు విప్పలేదు. స్వయంగా కామ్రేడ్ పులి అంజన్న మాటల్లోనే చెప్పాలంటే 'ఒకవేళ రవి నోరు విప్పి వుంటే పార్టీ పదేళ్లు వెనక్కి వెళ్లి వుండేది'. భవిష్యత్తులో జైలు నుండి విడుదలైన తర్వాత తిరిగి తనను భౌతికంగా పార్టీలో పని చేయలేని విధంగా చేయడం కోసం కూడా అతనిని తీవ్ర హింసలకు గురి చేశారు. వాస్తవానికి శత్రువు తనను పట్టుకున్న వెంటనే బూటకపు ఎన్‌కౌంటర్లో చంపాలనే అనుకున్నాడు కానీ కామ్రేడ్ అంజన్న వెంటనే స్పందించడంతో అతను అరెస్టయ్యాడనే వార్త పాకిపోయింది. అంతేకాదు ఈస్ట్ డివిజన్‌లో బాలరాజు అనే ఎం.ఎల్.ఎ.ను ఆ సమయంలో మన గెరిల్లాలు కిడ్నాప్ చేసి వుండినారు. రవిని ఏం చేసినా బాలరాజు ప్రాణాలకు ముప్పు ఏర్పడుతుందనే భయంతో కూడా అలా చెయ్యలేకపోయాడు.

### జైలును కూడా పోరాటరంగంగా మల్చుకున్న వాడు

1993 నుండి 2001 వరకూ 8 ఏళ్ల పాటు కామ్రేడ్ రవి జైలు జీవితం గడిపాడు. ఈ ఎనిమిదేళ్ల కాలం అతని విప్లవజీవితంలో చాలా ముఖ్యమైన భాగం. జైలును కేవలం ఖైదుగా కాకుండా ఒక పోరాట రంగంగా చూశాడతను. ఆ సమయంలో పటేల్ సుధాకర్ (నిరుడు మే నెలలో అమరుడైన కామ్రేడ్), భాస్కర్ (ప్రస్తుతం పార్టీలో కేంద్రకమిటీ సభ్యుడిగా పని చేస్తున్న కామ్రేడ్), రవిల నాయకత్వంలో రాజకీయ ఖైదీలు ఆంధ్రప్రదేశ్ జైళ్ల చరిత్రలోనే ఒక గొప్ప అధ్యాయాన్ని రచించారు. ఆంధ్రప్రదేశ్ జైళ్లన్నింటిలో బందీలుగా వున్న రాజకీయ ఖైదీలు ఏర్పర్చుకున్న జైలు కమిటీకి కామ్రేడ్ రవి కార్యదర్శిగా వ్యవహరించాడు. జైళ్లల్లో బందీలయ్యే ఖైదీలందరూ దాదాపుగా పీడిత వర్గాల వాళ్లే. సాధారణంగా సామాజిక, ఆర్థిక కారణాలతోనే వాళ్లు జైళ్లల్లోకి వస్తారు. ఈ అవగాహనతో కామ్రేడ్ రవి, తదితర కామ్రేడ్లు జైలును ఒక కమ్యూనిస్టు పాఠశాలగా మార్చి అనేక మందిని విప్లవోద్యమం వైపు ఆకర్షించారు. జైళ్లల్లో వున్న వివిధ స్థాయిల కామ్రేడ్స్‌కు, సానుభూతి పరులకు రాజకీయ శిక్షణనిస్తూ, వాళ్ల మనోస్థైర్యాన్ని నిలబెడుతూ, వాళ్ల ఇబ్బందుల్ని దూరం చేయడంలో కామ్రేడ్ రవి, మిగతా నాయకత్వ కామ్రేడ్స్ పోషించిన పాత్ర దేశవ్యాప్తంగా విప్లవకారులందరికీ అనుసరణీయమైన నమూనాగా వుంటుంది. వారి కృషి ఫలితంగా విడుదలైన సాధారణ ప్రజలు, సానుభూతిపరులు కూడా ఆ తర్వాత విప్లవోద్యమంలో క్రియాశీల భాగస్వాములయ్యారు. అంతే కాకుండా జైలు అధికారుల దౌర్జన్యాలకూ, ఖైదీల హక్కుల హననానికీ, జైళ్లల్లో నెలకొని వున్న దుర్భరమైన పరిస్థితులకూ వ్యతిరేకంగా ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జైళ్లలోని ఖైదీలు 1994లో నిర్వహించిన ఒక గొప్ప, చారిత్రాత్మక పోరాటంలో కామ్రేడ్ రవి ప్రశంసనీయమైన పాత్ర పోషించాడు.

మన కామ్రేడ్స్ 42 రోజుల పాటు ఆమరణ నిరాహారదీక్షను పట్టుదలతో కొనసాగించి జైలు అధికార్ల మెడలు వంచి ఘన విజయం సాధించారు. కామ్రేడ్ రవి తన ప్రాణాల్ని కూడా లెక్కచేయకుండా ఈ పోరాటానికి ముందు నిలబడ్డాడు. ఈ విధంగా కామ్రేడ్ రవి జైలును నిజమైన అర్థంలో ఒక గొప్ప పోరాటరంగంగా మల్చుకున్నాడు.

### ఆదర్శాల్నీ, విలువల్నీ ఉన్నతంగా నిలబెట్టిన వాడు

ఇక్కడ కామ్రేడ్ రవి వైవాహిక జీవితం గురించి కూడా చెప్పుకోవల్సి వుంటుంది. 1990 మధ్యలో అతను మెదక్ జిల్లాలో కమాండర్‌గా పని చేస్తున్న కామ్రేడ్ సుగుణను పెళ్లి చేసుకున్నాడు. పెళ్లయిన కొంత కాలంలోనే కామ్రేడ్ రవి అరెస్టయ్యాడు. ఆ కాలంలో తెలుగుదేశం ప్రభుత్వం విప్లవోద్యమాన్ని నిర్మూలించే లక్ష్యంతో జైళ్లల్లో వున్న రాజకీయ ఖైదీలకు బెయిల్ ఇవ్వకుండా నిరవధికంగా బంధీలుగా వుంచేది. ఎవరైనా బెయిల్‌పై విడుదలైతే వెంటనే జైలు పరిసరాల్లోనే తిరిగి అరెస్టు చేసి బూటకపు కేసులు బనాయించి తిరిగి జైలుకు పంపేది. కామ్రేడ్ రవి విడుదలయ్యే అవకాశం సమీప భవిష్యత్తులో కనిపించని అనిశ్చిత పరిస్థితిలో కామ్రేడ్ సుగుణ ఎంతో మానసిక సంఘర్షణకు గురయ్యింది. కామ్రేడ్ రవితో వైవాహిక బంధాన్ని తెంచుకొని, కామ్రేడ్ కౌముదిని జీవిత భాగస్వామిగా ఎంచుకోవాలనే నిర్ణయానికి వచ్చింది. తన అభిప్రాయాన్ని తెలియజేస్తూ ఆమె జైల్లో వున్న కామ్రేడ్ రవికి వుత్తరం పంపింది. రవి ఆమె నిర్ణయాన్ని గౌరవించాడు. తన సమ్మతిని తెలుపుతూ ఆయన పార్టీకి, కామ్రేడ్ సుగుణకూ వుత్తరం రాశాడు. ఈ నిర్ణయం ఇద్దరికీ కూడా చాలా కష్టమైందీ, బాధాకరమైందీ అయినప్పటికీ వాళ్లిద్దరూ ఒకరి అభిప్రాయాల్ని మరొకరు గౌరవించారు. ఎంతో మానసిక సంఘర్షణ తర్వాత కామ్రేడ్ సుగుణ కామ్రేడ్ కౌముదిని పెళ్లి చేసుకుంది. అయితే విచిత్రకరమైన కాకతాళీయం అని చెప్పుకోగలిగే విధంగా వాళ్ల పెళ్లి జరిగి పది రోజులు కూడా కాకముందే 2001, జనవరి 10న కామ్రేడ్ రవి విడుదలయ్యాడు. కామ్రేడ్ సుగుణ నిర్ణయం తప్పని భావించిన కొందరు పార్టీ కార్యకర్తల నుండి ఎదురైన ప్రశ్నలనూ, అనుమతినీ దూరం చేయడానికి పార్టీ వైపు నుండి సమాధానపర్చాల్సిన, అర్థం చేయించాల్సిన బాధ్యత కామ్రేడ్ రవి భుజాలపై కూడా పడింది. ఆ సందర్భంగా ఒక ఉత్తమ కమ్యూనిస్టు కార్యకర్తగా కామ్రేడ్ రవి నిర్వహించిన పాత్ర ఎంతో ఆదర్శమైంది. ఆ తర్వాత 2003లో జరిగిన ఒక బూటకపు ఎన్‌కౌంటర్లో కామ్రేడ్స్ సుగుణ, కౌముదిలిద్దరూ అమరులయ్యారు. 2005లో కామ్రేడ్ రవి ఒక కామ్రేడ్‌ను జీవిత భాగస్వామిగా ఎంచుకున్నాడు. తన అమరత్వంతో వాళ్లిద్దరి వైవాహిక జీవితం కూడా విషాదంగా ముగిసింది.

### ఆంధ్రప్రదేశ్ విప్లవోద్యమ నేతగా

2001లో జైలు నుండి విడుదల కాగానే కామ్రేడ్ రవి నల్లమల ప్రాంతంలో వుద్యమానికి ప్రత్యక్ష నాయకత్వం వహిస్తూ తిరిగి రాష్ట్రకమిటీ సభ్యుడిగా పని ప్రారంభించాడు. తను అరెస్టయిన సమయంలో కింది కమిటీల్లో వుండిన జూనియర్ కామ్రేడ్స్ తన విడుదల సమయానికి రాష్ట్ర, కేంద్ర కమిటీల లోకి వచ్చారు. అయినప్పటికీ కామ్రేడ్ రవి ఎలాంటి సంకోచం లేదా ఎలాంటి కుహనా ప్రతిష్ఠకు లోను కాకుండా తనకన్నా జూనియర్ కామ్రేడ్స్ నాయకత్వాన్ని మనస్ఫూర్తిగా స్వీకరించాడు. వాళ్లతో కలగలసి పని చేశాడు. ఆంధ్రప్రదేశ్ విప్లవోద్యమ పురోగమన క్రమంలో ఎదురైన అనేక సవాళ్లనూ, సమస్యలనూ పరిష్కరించడంలో ఆయన కీలక పాత్ర పోషించాడు. శత్రు దాడుల్ని ఎదిరిస్తూ విప్లవోద్యమాన్ని ముందుకు నడపడం కోసం అవసరమైన రాజకీయ, మిలిటరీ ఎత్తుగడల్ని రూపొందించడంలో ఆయన చేసిన కృషి చాలా ముఖ్యమైంది. రాష్ట్రకమిటీ సభ్యుడిగా, సెక్రటేరియట్ సభ్యుడిగా, రాష్ట్ర సైనిక కమిషన్ ఇంచార్జ్‌గా ఆయన వేర్వేరు బాధ్యతల్ని నిర్వహించాడు.

జైలు జీవితం వల్ల ఉద్యమంతో తనకున్న ప్రత్యక్ష సంబంధం దెబ్బ తిన్నప్పటికీ, జైలు నుండి విడుదలైన తర్వాత, ప్రతీ విషయాన్ని కింది స్థాయి నుండి పై స్థాయి క్యాడర్ వరకూ, అందరి నుండి ఓపికగా అడిగి తెలుసుకుంటూ అనతి కాలంలోనే అన్ని విషయాలపై పట్టు సంపాదించాడు. ముఖ్యంగా ఆనాటికి ఎ.పి. ఉద్యమం ఎదుర్కుంటున్న కొన్ని ముఖ్యమైన సమస్యలను పరిష్కరించడంలో చొరవగా నేతృత్వం వహించాడు. 9వ కాంగ్రెస్ మార్గదర్శకత్వంలో, ఏపీలో ప్రజాయుద్ధాన్ని పురోగమింపచేయడంలో తనది ఒక విశిష్టమైన కృషి అని చెప్పాలి. నిర్దిష్టంగా చూసినప్పుడు ప్రజలతో సంబంధాలు బలహీనపడ్డ నల్లమల ఫారెస్టు డివిజన్లో తిరిగి పార్టీని ప్రజలతో మమేకం చేయడంలో ప్రత్యక్షంగా కృషి చేశాడు. 2002 చివరి నుండి మిలిటరీ కమీషన్ బాధ్యతలు చేపట్టి ప్రజాయుద్ధాన్ని అభివృద్ధి చేయడంలో భాగంగా ఒక సమగ్రమైన పథకంతో కార్యకలాపాలు చేపట్టాడు. ముఖ్యంగా ప్రజలను సాయుధులను చేసే వైపు కృషి సల్పుతూ, ప్రధాన, ద్వితీయ బలగాలకు రాజకీయ, మిలిటరీ తర్ఫీదును అందించడంలో ప్రత్యేక కృషి చేశాడు. స్వతహాగా తాను ఇన్‌స్ట్రక్టర్ కావడం వల్ల ఈ పనిని మెరుగ్గా నిర్వహించగలిగాడు. జోన్‌లో ఆయుధాల తయారీ క్యాంపులు ఏర్పాటు చేసి వందలాది తుపాకులు తయారు చేయడంలో తనది ప్రత్యేక కృషి అని చెప్పాలి. ఆయనకున్న సాంకేతిక విద్యతో పాటు, ఈ రంగంలో ఆయనకున్న అభిరుచి వల్ల ప్రత్యేక శ్రద్ధ, సమయం కేటాయించి టెక్నీషియన్ కామ్రేడ్స్‌కు సాంకేతిక పరమైన సలహాలు ఇచ్చేవాడు. 2003 తర్వాత రాష్ట్రంలోని యాక్షన్ టీంకు తానే నేతృత్వం వహించాడు. ఈ విధంగా రాష్ట్రంలో ప్రజా యుద్ధాన్ని పురోగమింప చేయడంలో, వివిధ రంగాలకు ప్రత్యక్షంగా నేతృత్వం వహిస్తూ, ప్రభావవంతమైన కృషి చేశాడు.

జనశక్తి పార్టీ మితవాద రాజకీయాల్ని ఎండగట్టడంలో మెదక్‌లో పని చేసిన నాటి నుండీ మంచి పాత్ర పోషించాడు. రాజకీయంగా వాళ్లను బహిర్గతం చేయడంలో, రాజకీయంగా చర్చలు

నిర్వహించడంలో మంచి నేర్పుతో వ్యవహరించేవాడు. దానికి కొనసాగింపుగానే 2003 తర్వాత రాష్ట్రకమిటీ ఇచ్చిన బాధ్యతలకు అనుగుణంగా జనశక్తి వారితో సిద్ధాంత, రాజకీయపరమైన చర్చలు జరిపాడు. నాయకత్వ మితవాద అవకాశవాద రాజకీయాల్ని ఎండగడుతూనే అందులోని కింది కార్యకర్తల్లో గల విప్లవ ఆకాంక్షను ప్రోత్సహించి రాజకీయంగా కన్విన్స్ చేసి మన పార్టీ వైపు తీసుకురావడంలో కూడా కామ్రేడ్ రవి సీరియస్ కృషి చేశాడు. ఆ కృషి ఫలితంగా కర్నూల్, గుంటూర్ జిల్లాల నుండి 60 తుపాకులు తీసుకొని, 19 మంది జనశక్తి కార్యకర్తలు తమ పార్టీ మితవాద రాజకీయాల్ని తిరస్కరించి మనతో చేరిపోయారు.

2004 ప్రారంభం నాటికి నల్లమల తీవ్రమైన శతృదాడికి గురై ప్రజలతో సంబంధాలు దెబ్బతిని పోయి బలహీనపడిన పరిస్థితుల్లో కామ్రేడ్ రవి 2004 జనవరి నుండి 2004 ఏప్రిల్ వరకు నాలుగు నెలలు తను ప్రత్యక్షంగా కింది క్యాడర్లతో కలిసి గ్రామాల వరకు వెళ్లి ప్రజలతో సంబంధాలను పునరుద్ధరించడంతో తిరిగి నిర్మాణాలను ఒక మేరకు ఏర్పర్చడంలో తీవ్రమైన కృషి చేసి కింది క్యాడర్ల ఆత్మ విశ్వాసం పెంచడంతో పాటు నల్లమల వుద్యమం తిరిగి కొద్దిగా పుంజుకునేలా చేయడంలో గట్టి కృషి చేశాడు.

ఈ క్రమంలోనే 2004లో ఆంధ్రప్రదేశ్ విధానసభకు జరిగిన బూటకపు ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ పరాజయం పాలయ్యింది. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ చర్చల తంతును ముందుకు తీసుకొచ్చినపుడు పార్టీ నిర్ణయం ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లోని మూడు జోన్ల నుంచి ప్రతినిధి వర్గం ఎపి రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ రామకృష్ణ నాయకత్వంలో చర్చలలో పాల్గొన్నది. ఈ ప్రతినిధివర్గంతో రెగ్యులర్‌గా సమన్వయం నెరపుతూ ఈ సందర్భంగా అన్ని రాజకీయ నిర్ణయాలలో తాను భాగస్వామిగా వుంటూ కామ్రేడ్ రవి ముఖ్యమైన పాత్ర పోషించాడు. ఆ సందర్భంగా తీసుకున్న అనేక కీలక నిర్ణయాల్లో రవి ప్రత్యక్ష పాత్ర వుంది. పార్టీ శ్రేణుల్ని సమన్వయిస్తూ ఆ సమయంలో ముందుకొచ్చిన అనుకూల పరిస్థితిని వుపయోగించుకుంటూ పార్టీ నిర్మాణాన్ని బలోపేతం చేయడంలో కామ్రేడ్ రవి చొరవ చూపించాడు. చర్చల మాటున శత్రువు చేయగల దాడుల్ని అంచనా వేస్తూ వాటిని ఎదుర్కోవడానికి పార్టీనీ, పీఎల్‌జీఏనూ అప్రమత్తంగా వుంచడంపై కామ్రేడ్ రవి ప్రత్యేక శ్రద్ధ చూపాడు. చర్చలకు విఘాతం కలిగిస్తూ శత్రువు ఆంధ్రప్రదేశ్ విప్లవోద్యమాన్ని సమూలంగా నిర్మూలించే లక్ష్యంతో మళ్లీ భారీ దాడికి పూనుకోగా పీఎల్‌జీఏను ప్రతిఘటనా చర్యలలోకి దించడంలో కామ్రేడ్ రవి కీలక పాత్ర పోషించాడు. 2005 తర్వాత నల్లమల ప్రాంతంలో తీవ్రమైన శత్రు దాడి ప్రారంభమైంది. ఇంత పెద్ద దాడి అంతకు ముందు ఎప్పుడూ జరగలేదనే చెప్పాలి. ఈ దాడిలో శత్రువుకు కామ్రేడ్ రవి ప్రత్యేక టార్గెట్‌గా మారాడు. శత్రువు చేసిన వరుస దాడుల్లో పి.ఎల్.జి.ఎ. బలగాలతో ప్రత్యక్షంగా వుంటూ ఈ దాడులను తిప్పి కొడుతూ మన బలగాలలో ఆత్మ స్థైర్యాన్ని నింపాడు. ఈ క్రమంలోనే పార్టీ నిర్ణయానుసారం, క్యాడర్‌ను కాపాడుకుంటూ ఇతర జోన్లకు తరలించడంలో ముఖ్యమైన పాత్ర పోషించాడు.

ఈ విధంగా కామ్రేడ్ రవి మూడు దశాబ్దాల పాటు విప్లవోద్యమంలో జరిపిన అవిరళ కృషితో ఆంధ్రప్రదేశ్ మావోయిస్టు ఉద్యమంలో ప్రముఖ నాయకుల్లో ఒకరుగా నిలిచాడు. 1978 నుండి 84 వరకు ఆంధ్రప్రదేశ్‌లో ఉవ్వెత్తున ఎగిసిన రాడికల్ విద్యార్థి యువజనోద్యమంలో, చురుకైన పాత్ర వహించాడు. ఆ తర్వాత ఫాసిస్టు నిర్బంధం విరుచుక పడ్డ సమయంలో ఉద్యమాల్ని రక్షించుకోవడంలో భాగంగా విస్తరింపజేయడం కోసం దక్షిణ తెలంగాణలో ఉద్యమాన్ని నిర్మించాలనే కృషిలో భాగమయ్యాడు. 1984 నుండి మెదక్ జిల్లాలో తన కృషిని ప్రారంభించి రైతాంగ ఉద్యమంతో మమేకమై, ప్రాథమిక స్థాయిలో వున్న ఉద్యమాన్ని 1990 వరకు ఉన్నత స్థాయికి చేర్చాడు. ఫలితంగా గిరాయిపల్లి, దుబ్బాక ఏరియాల్లో 1990లో ఉవ్వెత్తున ఎగిసిన భూపోరాటాలు భూస్వామ్య పునాదులను కదిలించి వేశాయి. ఈ ఉద్యమ ఊపుతోనే వరంగల్‌లో జరిగిన రైతుకూలీ రాష్ట్ర మహాసభలకు మెదక్ జిల్లా నుండి లక్షకు పైగా జనం హాజరైనారు.

90వ దశకంలో ఎక్కువ సంవత్సరాలు జైలు జీవితం గడిపినప్పటికీ, ప్రజలతో సంబంధాలు కొనసాగించడానికి వీలైన మేరకు ప్రయత్నించేవాడు. 90వ దశకం నాటికి తను ఆంధ్రప్రదేశ్ మావోయిస్టు అగ్రనేతల్లో ఒకరుగా ముందుకు వచ్చాడు. 90వ దశకం ప్రారంభం నుండి మిలిటరీ రంగంలో తన కృషిని ప్రారంభించి చివరి వరకు ఈ రంగంలో బహుముఖ పాత్ర వహించాడు. దక్షిణ తెలంగాణ, రాయలసీమ, కోస్తా ఆంధ్రా, శ్రీకాకుళాల్లో గెరిల్లా బలగాలకు మిలిటరీ ట్రైనింగ్ ఇచ్చి గెరిల్లా యుద్ధంలో బలగాలను తీర్చి దిద్దాడు. ఆంధ్ర ప్రదేశ్‌లో అభివృద్ధి చెందిన గెరిల్లా యుద్ధంలో ప్రముఖ పాత్ర వహించాడు. జైలు నుండి విడుదలైన తర్వాత నల్లమల ఉద్యమంలో భాగస్వామి అయినాడు. 2004లో మన పార్టీకి ప్రభుత్వానికి జరిగిన చర్చల ప్రక్రియలో రాజకీయ గైడెన్స్ అందించి తన రాజకీయ దక్షతను చాటుకున్నాడు. అలా ఆంధ్రప్రదేశ్ ఉద్యమంలోనూ, దేశ వ్యాప్త ఉద్యమంలోనూ తన పాత్రను చాటి చెప్పాడు. కామ్రేడ్ రవి రాజకీయ నిర్మాణ మిలటరీ రంగాల్లో అత్యద్భుతమైన కృషి చేశాడు. ఆయనలో గల విప్లవోద్యమ పట్టుదల వలన అన్ని దశల్లో క్రియాశీలకంగా పాల్గొన్నాడు. ఆంధ్రప్రదేశ్ నేల తల్లి నుండి వుద్భవించిన గొప్ప మావోయిస్టు ఉద్యమ నేతల్లో ఆయన ఒకరిగా సదా జీవించి వుంటాడు.

**అంతర్గత సంక్షోభాల్లో చెక్కుచెదరని వాడు**

పార్టీలో తలెత్తిన అంతర్గత సంక్షోభాల కాలంలో కామ్రేడ్ రవి విప్లవ పక్షం వైపు దృఢంగా నిలబడ్డాడు. అన్ని రకాల అవకాశవాదుల్నీ ఆయన దృఢంగా వ్యతిరేకించాడు. 1985లో సత్యమూర్తి తదితర అవకాశవాదుల మూలంగా తలెత్తిన మొదటి అంతర్గత సంక్షోభంలోనూ, 1991లో కేఎస్-బండయ్య తదితర ముఖ్య నేతల మూలంగా తలెత్తిన రెండో అంతర్గత సంక్షోభంలోనూ కామ్రేడ్ రవి విప్లవ పక్షాన్ని దృఢంగా అంటిపెట్టుకొని నిలబడ్డాడు. 1991లో

సంక్షోభం పరిష్కారం కోసం జరిగిన ప్లీనం నిర్ణయాలను కేఎస్‌కు వివరించడానికి ఎన్నుకున్న ప్రతినిధివర్గానికి కామ్రేడ్ రవి నాయకత్వం వహించాడు. ఆ సమయంలో కేఎస్ పార్టీ సీనియర్ నాయకత్వంతో కలిసి మాట్లాడ నిరాకరించడంతో యువ నాయకత్వంతో ప్రతినిధివర్గాన్ని ఎన్నుకున్నారు. కామ్రేడ్ రవి తన బాధ్యతను గొప్పగా నిర్వహించాడు. పార్టీ ఐక్యతను నిలబెట్టడానికి గట్టిగా ప్రయత్నించాడు. అవకాశవాదుల్ని పార్టీలోంచి బైటికి పంపాల్సిన అనివార్య పరిస్థితి ముందుకు వచ్చినపుడు ఆయన నిస్సంకోచంగా పార్టీ ప్రయోజనాల్ని ఎత్తిపట్టాడు. కె.ఎస్. సృష్టించిన సంక్షోభం సందర్భంగా మహబూబ్‌నగర్‌లో వేణుగోపాల్‌లాంటి వాళ్లు జిల్లా పార్టీలో గందరగోళం సృష్టించే పద్ధతుల్లో సృష్టించిన అనేక చిక్కుల్ని ఓపిగ్గా, సజావుగా పరిష్కరించి జిల్లా పార్టీనంతా సరిగ్గా అర్థం చేసుకొని ఐక్యంగా విప్లవ పక్షాన నిలబెట్టేలాగా చేసిన కృషిలో పులి అంజన్నకు గట్టి మద్దతుగా నిలిచి క్రియాశీల పాత్ర పోషించాడు.దక్షిణ తెలంగాణా పార్టీని విప్లవ పక్షంవైపు దృఢంగా నిలబెట్టాడు.



## సైనిక రంగంలో చురుకైన పాత్ర

కామ్రేడ్ అప్పారావు 1988లో మొదటిసారి మిలిటరీ క్యాంపులో విద్యార్థిగా పాల్గొని మిలిటరీ మెళకువలన్నీ శ్రద్ధగా అవగాహన చేసుకున్నాడు. అప్పుడే అతనికి అడవిలోని పెద్ద దళాలతో పరిచయం. దళ జీవితాన్ని ప్రత్యక్షంగా చూసి కొంతకాలం దళాల్లో గడిపి అనుభవం పొందాడు. మిలిటరీ విషయాలపై మంచి ఆసక్తి కలిగిన రవి తొందరలోనే తానే ఒక ఒక మంచి సైనిక ఇన్‌స్ట్రక్టర్‌గా ఎదిగాడు. ఎన్నో సార్లు ఆయన సైనిక శిక్షణా క్యాంపుల్ని నిర్వహించి ఎందరో గెరిల్లాల్ని సుశిక్షితుల్ని చేయడం కోసం కృషి చేశాడు. ఏపీలో జరిగిన అనేక క్యాంపుల్లో క్యాంపు ఇన్‌ఛార్జ్‌గా, క్యాంపు కమాండర్‌గా వుంటూ ఇన్‌స్ట్రక్టర్‌గా మిలిటరీ తర్ఫీదును అందించడం అనే ప్రక్రియను ఆయన చివరి వరకూ కొనసాగించాడు. నిజానికి ఆయనను అరెస్ట్ చేసినపుడు ఇక అతను మళ్లీ అటవీ జీవితానికి గానీ, ఇన్‌స్ట్రక్టర్‌గా గానీ పనికిరాకుండా చేయాలనే ఉద్దేశ్యంతో శత్రువు చిత్రహింసలు పెట్టాడు. కానీ జైలు నుండి తిరిగి వచ్చాక కూడా తీవ్రమైన నొప్పుల్ని భరిస్తూనే ఆయన అటవీ జీవితంలో కొనసాగడమే కాదు, ఇన్‌స్ట్రక్టర్‌గానూ సేవలు అందించాడు.

సైనిక చర్యలలో, ముఖ్యంగా కరడుగట్టిన ప్రజా శత్రువులైన పోలీసు అధికార్లనూ, రాజకీయ నాయకుల్నీ నిర్మూలించే సింగిల్ యాక్షన్‌లకు పథకాల్ని రచించడంలో కామ్రేడ్ రవి ఒక నిపుణుడైన వ్యూహకర్త. ప్రతి విషయాన్నీ సూక్ష్మంగా, లోతుగా అర్థం చేసుకునే సామర్థ్యం కలిగిన కామ్రేడ్ రవి శత్రువు తాలూకు బలమైన, బలహీనమైన అంశాల్ని లోతుగా అవగాహన చేసుకునే వాడు. ప్రతి విషయాన్నీ శ్రద్ధగా వినే, అర్థం చేసుకునే గొప్ప నేర్పు తనది. 1993లో పేరుమోసిన పోలీసు డీఐజీ వ్యాస్‌ను హతమార్చే చర్యకు విజయానికి గ్యారంటీనిచ్చిన పథకరచన చేయడంలో ఆయన పాత్ర వుంది. ఆ తర్వాత జైళ్లల్లో వున్న పార్టీ సీనియర్ నేతల్ని విడిపించుకునేందుకు కాంగ్రెస్ నాయకుడు సుధీర్‌కుమార్‌ను బందీగా పట్టుకోవడం కోసం చేసిన చర్యకు పథకం రూపొందించడంలో ఆయన పాత్ర వున్నది. 2005లో ప్రకాశం జిల్లాలో పేరుమోసిన ఎస్‌పీ మహేష్‌చంద్ర లడ్హాపై, 2007లో మాజీ ముఖ్యమంత్రి జనార్దన్‌రెడ్డిపై చేసిన దాడుల్లో, ఎర్రగొండపాలెం, అచ్చంపేట పోలీసు ఠానాలపై చేసిన రెయిడ్స్ తదితర చర్యల ప్లానింగ్, నిర్వహణలో కామ్రేడ్ రవి క్రియాశీల పాత్ర వుంది.

పీఎల్‌జీఏ బలగాలను కమ్యూనికేషన్, రిమోట్ కంట్రోల్ వంటి కొత్త సాంకేతిక పరిజ్ఞానంతో సాయుధం చేయడం కోసం ఆయన చేసిన కృషి గొప్పది. అతనెప్పుడూ కొత్త ఆలోచనలతో సృజనాత్మకంగా పనిచేసే వాడు. ప్రజాసైన్యానికి అన్ని హంగులు కల్పిస్తూ దాన్ని అభివృద్ధి చేయడం కోసం నిరంతరం ఆలోచించేవాడు. తన ప్రతిపాదనల్ని కమిటీలో ప్రవేశపెట్టి చర్చ జరిపి ఆమోదంతో వాటి అమలుకు తపించేవాడు.

2006లో ఆంధ్రప్రదేశ్ వుద్యమం వెనుకంజ వేసిన తర్వాత కామ్రేడ్ రవి దాని నుండి సరైన గుణపాఠాలు తీసుకోవడానికీ, మనవైపు నుండి జరిగిన తప్పుల నుండి పాఠాలు నేర్చుకోవడానికి తీవ్రంగా కృషి చేశాడు. ఆంధ్రప్రదేశ్‌లో విప్లవోద్యమాన్ని పునరుజ్జీవింపజేయాలనీ, ఈ అనుభవం ఆధారంగా ఇతర రాష్ట్రాలలో శత్రువుకు ధీటైన జవాబునివ్వాలనీ కామ్రేడ్ రవి నిరంతరం దృష్టిని కేంద్రీకరించాడు.

## 'శత్రువును గురించి తెలుసుకునే' బాధ్యతను చేపట్టిన వాడు

"శత్రువును గురించి తెలుసుకో, నీ గురించి తెలుసుకో. ఇక ఓటమి భయం లేకుండా వంద యుద్ధాలైనా గెలవొచ్చు" – చైనా యుద్ధ నిపుణుడు సున్ జూ చెప్పిన ఈ ప్రఖ్యాత సూక్తిని కామ్రేడ్ రవి ఒంటబట్టించుకోవడంతో పాటు దాన్ని అమలు చెయ్యడం కోసం కూడా చొరవ చేశాడు. ప్రజాయుద్ధాన్ని పురోగమింపజెయ్యాలంటే ప్రజా ఇంటలిజెన్స్ విభాగం ఏర్పాటు తప్పనిసరి అని గుర్తిస్తూ ఆ దిశలో చేసిన కృషిలో కామ్రేడ్ రవి పాత్ర ఎంతో వుంది. అమరుడు కామ్రేడ్ సూర్యం (పటేల్ సుధాకర్)తో పాటుగా కామ్రేడ్ రవి విప్లవ ప్రతిఘాతుక ఎల్ఐసీ సిద్ధాంతాన్నీ, కౌంటర్–ఇంటలిజెన్స్ మాన్యువల్స్‌నూ, ఇంటెలిజెన్స్ పని గురించీ చాలా అధ్యయనం చేశాడు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రకమిటీ 2004 డిసెంబర్‌లో మొట్టమొదటి సారి ఇంటెల్ విభాగాన్ని ఏర్పాటు చేసింది. ఈ బాధ్యతను కామ్రేడ్ రవికి అప్పజెప్పింది. అతని మార్గదర్శకత్వంలో ఈ విభాగానికి చెందిన కామ్రేడ్స్ శత్రువుకు

చెందిన ఎన్నో స్థావరాల్ని రెక్కీ చేశారు. 2006 తర్వాత పార్టీ అతనికి పూర్తిగా ఇదే బాధ్యతనిస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రకమిటీ నుండి రిలీవ్ చేసింది. 2007లో కేంద్రకమిటీ అతన్ని మిలిటరీ ఇంటలిజెన్స్ విభాగానికి కేంద్ర డైరెక్టర్‌గా నియమించింది. దీనిలో భాగంగా ప్రజాయుద్ధం వున్నత స్థాయికి చేరుకున్న బీహార్-ఝార్ఖండ్, దండకారణ్యాలలో కొత్తగా ఏర్పడిన మిలిటరీ ఇంటెల్ విభాగపు కార్యకర్తలకు శిక్షణ ఇచ్చే బాధ్యత తీసుకున్నాడు. ఉద్యమ ప్రాంతాల్లో పెరుగుతున్న శత్రు ఇంటెల్ నెట్‌వర్క్‌ను అర్థం చేసుకుంటూ, కామ్రేడ్స్‌కు అర్థం చేయించడంలో కామ్రేడ్ రవి ప్రశంసనీయమైన కృషి చేశాడు. పార్టీనీ, ఉద్యమాన్నీ రక్షించుకోవడం కోసం చేపట్టవలసిన చర్యల గురించి పార్టీ కమిటీలలో అతను వుపయోగకరమైన చర్చ చేశాడు. ఏరియా స్థాయి నుండీ రాష్ట్ర స్థాయి వరకూ శిక్షణ గరపడంలో అతను చేసిన కృషి చాలా వుంది. నిరుడు మే 24న కామ్రేడ్ పటేల్ సుధాకర్ అమరుడైన తర్వాత పార్టీకీ, ముఖ్యంగా ఇంటలిజెన్స్ విభాగానికీ జరిగిన భారీ నష్టాన్ని పూడ్చుకోవడం కోసం ప్రారంభించిన కృషిలో కామ్రేడ్ రవి పాత్ర ముఖ్యమైనది. కానీ ఇప్పుడు తను కూడా అమరుడవడంతో పార్టీకీ, ప్రత్యేకించి మన ఇంటలిజెన్స్ విభాగానికీ పూడ్చుకోలేని లోటు జరిగింది.

**దండకారణ్య ఉద్యమంలో 'జయలాల్'**

2008 నుండి కామ్రేడ్ రవి దండకారణ్య విప్లవోద్యమంతో గాఢంగా పెనవేసుకుపోయాడు. ముఖ్యంగా దండకారణ్యంలో మిలిటరీ ఇంటలిజెన్స్ విభాగాన్ని ఏర్పాటు చేయడంలో ఆయన ముఖ్యమైన పాత్ర పోషించాడు. జనవరి 2008లో రవి దండకారణ్యంలో తొలిసారి అడుగుపెట్టాడు. ఇక్కడ తను 'జయలాల్' పేరుతో కామ్రేడ్స్‌కు పరిచయమయ్యాడు. తన బాధ్యత రీత్యా దండకారణ్యంలో మిలిటరీ ఇంటలిజెన్స్ విభాగానికి చెందిన కామ్రేడ్స్‌తో కలిసి సమిష్టి అధ్యయనంలో, క్లాసులలో ఆయన పాల్గొన్నాడు. అదే సమయంలో, 2008, మార్చ్ 16న దక్షిణ బస్తర్‌లోని కంచాల్ దగ్గర ఆంధ్రప్రదేశ్ గ్రేహౌండ్స్ జరిపిన క్రూర దాడిలో 17 మంది కామ్రేడ్స్ అమరులైన ఘోరమైన సంఘటన జరిగింది. ఈ సంఘటన వెనుక కోవర్టు కుట్రా, శత్రు నెట్‌వర్క్ పాత్రా వున్నాయి. ఆ సమయంలో జయలాల్ కూడా అదే ప్రాంతంలో వున్నాడు. తను మిగతా కామ్రేడ్స్‌తో కలిసి కంచాల్ హత్యాకాండకు కారణాల్ని పరిశోధించి దానికి బాధ్యులైన ఇన్‌ఫార్మర్లను, కోవర్టులను గుర్తు పట్టడంలో ఎంతో కృషి చేశాడు. శత్రు నెట్‌వర్క్‌లో భాగమైన ఒక్కో వ్యక్తిని గుర్తించి, వాళ్లను అరెస్టు చేసి ఇంటరాగేషన్ చేస్తూ, దాని ఆధారంగా ఒక్కో లింకును కలుపుతూ మొత్తం నెట్‌వర్క్‌నంతా గుర్తించడంలో కామ్రేడ్ జయలాల్ ఒక అనుకరణీయమైన ఉదాహరణను నెలకొల్పాడు. కంచాల్ కోవర్ట్ నెట్‌వర్క్‌ను ఛేధించడం అనేది దండకారణ్య ఉద్యమంలో శత్రువు నెట్‌వర్క్‌ను అర్థం చేసుకొని ఛేధించడంపై కేంద్రీకరించడానికి ఒక ప్రేరణ, ఒక ఊపు, ఒక డ్రైవ్‌ను ఇచ్చింది. దాని తర్వాత అదే ప్రేరణతో డీకే అంతటా చాప కింద నీరులా పరుచుకుంటున్న శత్రువు ఇన్ఫార్మర్ నెట్‌వర్క్‌ను ఏరివేయడం అనేది ఒక ముఖ్య కార్యక్రమంగా కొనసాగుతూ అనేక మంది ఇన్ఫార్మర్లను, కోవర్టులను పట్టుకొని ప్రజల్లో పెట్టి శిక్షించడం జరిగింది. ఈ మొత్తం కృషికి ప్రేరకంగా కామ్రేడ్ జైలాల్ నిలిచాడు. ఉత్తరాన మాన్‌పూర్ డివిజన్ నుండి దక్షిణాన దక్షిణ బస్తర్ డివిజన్ దాకా తనెక్కడికి వెళ్లినా, ఏ మాత్రం సమయం దొరికినా ఇంటలిజెన్స్ రంగానికి చెందిన కార్యకర్తలతో, వివిధ స్థాయిల కామ్రేడ్స్‌తో శత్రు నెట్‌వర్క్ గురించి చర్చించాడు. వాళ్లకు అవసరమైన సూచనలు చేశాడు. ఈ విధంగా దండకారణ్యంలో పార్టీ వైపు నుండి ఇంటలిజెన్స్ విభాగాన్ని స్థాపించడంలో అతను ప్రేరణగా నిలిచాడు. ఆపరేషన్ గ్రీన్‌హంట్ పేరుతో శత్రువు దండకారణ్యంలో భారీ దాడిని ప్రారంభించగా కామ్రేడ్ జయలాల్ దానికి ధీటైన ప్రతి-ఎత్తుగడల్ని రూపొందించడానికి ఉపయోగపడేలా నాయకత్వ కమిటీలతో, కామ్రేడ్స్‌తోనూ విస్తృతంగా చర్చించాడు. శత్రు భారీ దాడిని ఓడించి దండకారణ్య ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోవడం కోసం రాజకీయ, సైనిక, నిర్మాణ రంగాల్లో ఆయన ఎంతో విలువైన, నిర్దిష్టమైన సూచనల్ని పార్టీ ముందుంచాడు.

కొత్తా, పాతా కామ్రేడ్స్ ఎవరైనా, భాష సరిగా అర్థమైనా కాకున్నా, దండకారణ్యంలోని కామ్రేడ్స్‌తో ఆయన చాలా గాఢంగా మమేకమయ్యాడు. అందుకే అతను అమరుడైనాడన్న వార్త వినగానే ఎంతో మంది కామ్రేడ్స్ కంటనీరు పెట్టారు. ఆయనకు శ్రద్ధాంజలి ఘటిస్తూ చాలా చోట్లలో స్మారకసభలు జరిగాయి. ఈ సభలలో పార్టీకి చెందిన వివిధ స్థాయిల కామ్రేడ్స్ మాట్లాడుతూ కామ్రేడ్ జయలాల్ ఆదర్శాల్ని సమున్నతంగా ఎత్తిపట్టాలని పిలుపునిచ్చారు. ఒక చోట జరిగిన సభలో ఒక పార్టీ కార్యకర్త గద్గద స్వరంతో మాట్లాడుతూ 'మేం పార్టీలో మాతో ఇంత స్నేహపూరితంగా కలగలిసిపోయిన నాయకుణ్ని ఇంతవరకూ చూడలేదు' అని అన్నాడు. ఇక్కడి కామ్రేడ్స్ మనస్సుల్లో ఆయన ఎంత గాఢంగా ముద్రవేశాడోననే దానికి ఇది ఒక ఉదాహరణ. పార్టీలోనూ, పీఎల్‌జీఏలోనూ కార్యకర్తలతో నాయకుల సంబంధం ఎలా వుండాలోననే దానికి అతనో నమూనా కూడా.

**ప్రజల ప్రయోజనాలనే మిన్నగా నిలిపిన వాడు**

పోలీసుల క్రూర చిత్రహింసలతో, సుదీర్ఘమైన నిరాహారదీక్షతో, జైళ్లలోని దుర్భర పరిస్థితులతో కామ్రేడ్ రవి ఆరోగ్యం చాలా దెబ్బతిన్నది. ఎనిమిదేళ్ల జైలు జీవితం తర్వాత 2001లో విడుదలైనపుడు అతనికి అడవుల్లో, కొండల్లో నడవడం, తిరగడం ఇబ్బందయ్యేది. మోకాళ్లలో, నడుంలో అతనికి తీవ్రమైన నొప్పులుండేవి. పైగా నల్లమల అడవుల్లో గెరిల్లా జీవితంలో వుండే ఇబ్బందులు అదనం. అయితే కామ్రేడ్ రవి ఎంతో ఓపికతో, సహనంతో దీన్ని ఎదుర్కొన్నాడు. కఠిన పరిస్థితుల్లో కూడా తన్ను తాను ఫిట్‌గా వుంచుకోవడంపై అతను శ్రద్ధ పెట్టాడు. శారీరక ఇబ్బందుల్ని లెక్క చేయకుండానే అతను వివిధ గెరిల్లాజోన్లను

పర్యటించాడు. 2005 తర్వాత నల్లమల అడవుల్లో అతన్ని హత్య చేసే లక్ష్యంతో గ్రేహౌండ్స్ హంతకులు అనేక సార్లు దాడులు చేశారు. ఎస్ఐబీ ఎన్నో కుట్రలకు పాల్పడింది. 2003లో ఎస్ఐబీ ఒకసారి వెంకటేశం అనే దర్జీని కోవర్టుగా మల్చుకొని, రాష్ట్ర స్థాయి మిలటరీ క్యాంపులోకి చొప్పించి పార్టీ నాయకత్వాన్ని హత్య చేసే కుట్రకు పాల్పడింది. వాడిని వెంటనే గుర్తించి, పట్టుకొని ఇంటరాగేషన్ చేయడంలో, కుట్రను బట్టబయలు చేయడంలో కామ్రేడ్ రవి కీలక పాత్ర పోషించాడు. కేడర్లు, ప్రజలూ కామ్రేడ్ రవిని ఎల్లప్పుడూ కంటికి రెప్పలా కాపాడుకున్నారు. 2004 నుండి రెండు సంవత్సరాల కాలంలో రవి వున్న ప్లాటూన్‌కు శత్రువుతో దాదాపు ఎనిమిది సార్లు ఎదురుకాల్పులు జరిగాయి. ఈ కాల్పుల నుండి తోటి కామ్రేడ్లు రవిని కాపాడుకున్నారు. రెండుసార్లు క్యాంపును చుట్టుముట్టి జరిపిన కాల్పుల్లోనూ, ఒకసారి తనపైకే కేంద్రీకరించి చేసిన రాపిడ్ ఫైరింగ్‌లోనూ కామ్రేడ్ రవి నిబ్బరంగా ప్రతిఘటిస్తూ క్యాడరందరినీ ప్రతిఘటనలోకి దించాడు. కఠిన పరిస్థితుల్లో కూడా శత్రువు నుండి ఎదురయ్యే ప్రతి సవాలునూ ఎదుర్కొంటూ చొరవగా పని చేయడం ఆయనలోని మరో విశిష్ట లక్షణం.

## ఆదర్శవంతమైన కమ్యూనిస్టు

పార్టీలో, పీఎల్‌జీఏలో, ప్రజలలో కామ్రేడ్ రవి తలలో నాలుకగా మెదిలే ప్రియతమ నాయకుడు. అతను ఎల్లప్పుడూ నేలను అంటిపెట్టుకొనే నిలబడ్డాడు. కింది స్థాయి కామ్రేడ్లతో చాలా సులువుగా కలగలిసి మెదిలే వాడు. గర్వం, అహం, ఫాల్స్ ప్రిస్టేజ్, పెత్తందారీతనం వంటి కార్మికవర్గేతర ధోరణులు అతనిలో కనిపించేవి కావు. అతనెక్కడికి వెళ్లినా అక్కడి కామ్రేడ్లు అతన్ని బాగా అభిమానించారు. అన్ని వయస్సుల వాళ్లతోనూ తను కలుపుగోలుగా వుండేవాడు. కామ్రేడ్ల వ్యక్తిగత సమస్యలనూ, కష్టాలనూ పట్టించుకోవడంతో పాటు వాళ్ల రాజకీయ, సైనిక, నిర్మాణపరమైన భావాలను శ్రద్ధగా వినడం, అర్థం చేసుకోవడం, వాళ్లకు అవసరమైన సూచనలు చేయడం, వాళ్ల మనోస్థైర్యాన్ని పెంపొందించడం... ఇవన్నీ కామ్రేడ్ రవి సహజ గుణాలుగా వుండేవి. అందుకే అతనిని ఒకసారి చూసిన వాళ్లు కూడా ఎప్పటికీ మర్చిపోయేవాళ్లు కాదు. అతనో మంచి ఆర్గనైజర్. ప్రజల మధ్య పని చేసే క్రమంలో ఉద్యమానికి పనికొచ్చే అవకాశాలున్న వ్యక్తులను వెంటనే గుర్తించే వాడు. వాళ్లను పార్టీ వైపు మల్చుకోవడానికి నిర్విరామంగా పాటుపడే వాడు. ఆలాంటి వ్యక్తులతో స్నేహం చేస్తూ, అనేక మార్లు వాళ్ల దగ్గరికి వెళ్తూ, పోలీసు నిర్బంధానికి భయపడి కుటుంబ సభ్యులు ఒక్కోసారి వ్యతిరేకించినప్పటికీ బాధ పడకుండా వాళ్లతో సంబంధాల్ని కొనసాగించేవాడు. ఆ విధంగా అతను మెదక్ జిల్లాలో ఎందరో యువజనుల్నీ, మేధావుల్నీ పార్టీ వైపు ఆకర్షించాడు. ఓపికకూ, సహనశీలతకూ ఆయన పెట్టింది పేరు. తన ముప్పయి ఏళ్ల విప్లవ జీవితంలో అతను ఎన్నో రకాల పనులు చేశాడు. ఒక కొరియర్‌గా, ఆర్గనైజర్‌గా, సైనిక రంగ ఇంఛార్జ్‌గా, ఇంటలిజెన్స్ విభాగ డైరెక్టర్‌గా.... పార్టీ ఏ పని ఇచ్చినా దాన్ని ఉత్సాహంగా స్వీకరించాడు. దాన్ని పూర్తి చేయడానికి కఠోర శ్రమ చేశాడు. పార్టీలో ఆయన విశ్వాసపాత్రుడైన మిలిటెంట్ నాయకుడు. ముఖంపై చెదరని చిరునవ్వు, వినమ్ర స్వభావం, మృదువైన పలుకు – ఇవి ఆయనలోని విశిష్టమైన సుగుణాలు.

## మృత్యువు ముంగిట కూడా తలవంచని వాడు

శత్రువుకు కామ్రేడ్ రవి ఎప్పుడూ ఒక కఠిన సవాలుగా నిలిచాడు. 1993లో మొదటి సారి పట్టుబడ్డప్పుడు శత్రువు అతన్ని అమానుష చిత్రహింసలకు గురి చేశాడు. అప్పుడు కూడా ఆయన పార్టీ రహస్యాల్ని పట్టుదలగా కాపాడాడు. మార్చ్ 10న అతను చివరిసారిగా శత్రువు చేతికి చిక్కినపుడు కూడా శత్రువు పాశవిక హింసలకు గురి చేశాడు. 12వ తేదీన 'ఎన్‌కౌంటర్' ప్రకటన చేసి మృతదేహాన్ని నల్లమల అడవిలో పడేసినపుడు ఒక కన్ను చితికిపోయి వుంది. శరీరంపై పోలీసుల బీభత్సానికి సాక్ష్యంగా అనేక గుర్తులు వున్నాయి. తుది శ్వాస విడిచే ముందు పార్టీ రహస్యాల్ని కాపాడడం కోసం శత్రువు పెట్టిన పాశవిక హింసలన్నిటినీ భరించాడన్నది స్పష్టం. అతనికి పార్టీపై, ప్రజలపై ఎనలేని నమ్మకం. మృత్యువు తన ముందు నిలబడ్డపుడు కూడా, అసంపూర్తిగా మిగిలిన తన లక్ష్యాన్ని మనమంతా కలిసి విజయం ముంగిటి వరకూ కొనసాగిస్తామనే అతని నమ్మకం అణుమాత్రమైనా బలహీనపడలేదు. తను చిందించే ఒక్కో రక్తపు చుక్కకూ ప్రజలు తప్పక ప్రతీకారం తీర్చుకుంటారని తను చివరి దాకా బలంగా విశ్వసించాడు. ఆ దృఢ విశ్వాసంతోనే, ఆ మొక్కవోని అంకితభావంతోనే అతను శత్రువుకు తలవంచకుండా విజేతగా నిలబడ్డాడు. పార్టీ ప్రతిష్టనూ, గౌరవాన్నీ దృఢంగా ఎత్తిపట్టాడు. పులి అంజన్న, శ్యాం, మహేష్, మురళి, చంద్రమౌళి, కరుణ, సోమన్న, రాజమౌళి, సుధాకర్ వంటి ఎంతో మంది కామ్రేడ్లు నెలకొల్పిన గొప్ప త్యాగ సాంప్రదాయాన్ని కామ్రేడ్ రవి మరింత దృఢంగా నిలబెట్టాడు. ఈరోజు కామ్రేడ్ రవి మన మధ్యలో లేడు. అయితే ఆయన నెలకొల్పిన ఆదర్శాలు, ఆయన అందించిన ప్రేరణ, తన్ను తాను ఒక ఉదాహరణగా నిలబెట్టుకున్న తీరు... వీటన్నిటినీ మనం ఎన్నటికీ మర్చిపోలేం.

కామ్రేడ్ రవి హత్య వార్త విని ఆంధ్రప్రదేశ్ పీడిత ప్రజానీకంలో, వివిధ గెరిల్లా జోన్లలో, పార్టీ శ్రేణులన్నిటిలో విషాదం వ్యాపించింది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అనేక సంఘాలు, ప్రజాస్వామికవాదులు, మేధావులు ఈ బూటకపు ఎన్‌కౌంటర్‌ను ఖండించారు. ఆయనకు తుది వీడ్కోలు చెప్పడానికి వేలాది మంది ప్రజలు ఆయన స్వగ్రామమైన ఖానాపూర్‌కు తరలి వచ్చారు. ఎందరో అమరవీరుల తల్లులు కూడా ఎంతో దూరం నుండి వచ్చి కామ్రేడ్ రవి అంతిమయాత్రలో పాల్గొన్నారంటే వాళ్ల హృదయాల్లో ఆయనకున్న స్థానమేంటో అర్థం చేసుకోవచ్చు. ఈరోజు శత్రువు రవిని హతమార్చి పండుగ చేసుకోవచ్చు, కానీ ఇలాంటి వందల వేల తల్లుల హృదయాల్లో రగిలిన నిప్పురవ్వ దావానలమై దోపిడీ వ్యవస్థను బూడిద చెయ్యక తప్పదు.

# టెక్నికల్ రంగానికి చెందిన దృఢమైన, నిపుణుడైన కార్యకర్త
# కామ్రేడ్ సోలిపేట కొండల్‌రెడ్డి (రమణ)

44 ఏళ్ల వయస్సున్న కామ్రేడ్ కొండల్‌రెడ్డి (రమణ) మెదక్ జిల్లా దుబ్బాక మండలంలోని చిట్టాపూర్ గ్రామంలో పుట్టాడు. తల్లి లక్ష్మీనరసవ్వ, తండ్రి వెంకటరెడ్డిల నలుగురు సంతానంలో కామ్రేడ్ కొండల్‌రెడ్డి రెండో వాడు. ఆయన తండ్రి గ్రామంలో మొట్టమొదటి సర్పంచ్‌గా పని చేశాడు. హైద్రాబాద్ నగరంలోని బద్రుకా కాలేజ్‌లో బీఏ చదువుతూ 1984లో కామ్రేడ్ కొండల్‌రెడ్డి విప్లవోద్యమం వైపు ఆకర్షితుడయ్యాడు. 1990లో అతను పూర్తికాలం కార్యకర్తగా మారాడు. అమరవీరులు కామ్రేడ్స్ అంకం బాబూరావు, మేకల దామోదర్‌రెడ్డిల ప్రభావం అతనిపై వుండింది. కామ్రేడ్ శాఖమూరి అప్పారావు (రవి)తో అతనికి ప్రగాఢ అనుబంధం వుంది. ఆయన ప్రేరణతోనే కామ్రేడ్ రమణ పార్టీలో చేరాడు. మొట్టమొదట తను కామ్రేడ్ రవికి కొరియర్‌గా పని చేశాడు. 1992లో పోలీసులు అతన్ని అరెస్టు చేసి తీవ్రమైన చిత్రహింసలు పెట్టారు. ఆ సమయంలో తనకు కామ్రేడ్ రవితో కాంటాక్ట్ వుండే. కానీ ఆయన శత్రువు ఎన్ని చిత్రహింసలు పెట్టినా నోరు విప్పకుండా తన బాధ్యుడినీ, మరెన్నో పార్టీ రహస్యాలనూ కాపాడాడు. శత్రువు ఎదుట తను దృఢంగా నిలబడ్డాడు. 5 నెలల పాటు జైలు జీవితం గడిపిన తర్వాత బెయిల్‌పై విడుదలైన వెంటనే తిరిగి తన బాధ్యతల్లోకి వచ్చాడు.



తర్వాత రాష్ట్ర కమిటీ ఆయనకు టెక్నికల్ పనిని అప్పగించింది. 1996–98 మధ్యలో ఆయన కేంద్ర టెక్నికల్ విభాగానికి కొరియర్‌గా, సప్లయర్‌గా బాధ్యతలు చేపట్టాడు. ఫీల్డులో ఆర్గనైజేషన్ పనిలో ప్రత్యక్ష అనుభవం సంపాదించేందుకు 1998–99లో ఒక సంవత్సరం పాటు కామ్రేడ్ రమణ మహబూబ్‌నగర్ జిల్లాలోని కల్వకుర్తి ఏరియాలో పని చేశాడు. అరెస్టయినప్పుడు శత్రువు పెట్టిన చిత్రహింసల వల్ల శారీరకంగా అనేక అనారోగ్య సమస్యలు ఎదురైనా ఆర్గనైజేషన్ అనుభవం కోసం పట్టుదలతో కల్వకుర్తి దళంకు వచ్చాడు. కల్వకుర్తి దళం ఏరియాలో శత్రు నిరంతర కూంబింగ్‌ల మధ్య నడకకు ఎంతో ఇబ్బంది ఎదురవుతున్నా ఓపికగా తిరిగాడు. నిర్మాణాల సమావేశాల్లో ప్రత్యక్షంగా పాల్గొంటూ ప్రజల సమస్యలను అవగాహన చేసుకోవడానికి ఎంతో ఆసక్తి చూపేవాడు. అదే సమయంలో దళం సంచరించే పద్ధతుల్లో టెక్నికల్‌గా జరిగే లోపాల గురించి శత్రుదాడికి గురికాకుండా తీసుకోవలసిన జాగ్రత్తల గురించి తనకున్న అనుభవాన్ని అందించి ఎంతో సహకరించేవాడు. తను అక్కడ వున్న మొత్తం కాలంలో పరిశీలించిన అనేక అంశాలను జిల్లా నాయకత్వానికి సూటిగా గుర్తింపజేశాడు. క్యాడర్‌తో ఎంతో కలుపుగోలుగా వుంటూ అందరి అభిమానాన్ని చూరగొన్నాడు.

ఆ తర్వాత 2000 నుండి 2002 వరకు రాష్ట్రకమిటీ ఆయనకు ప్రెస్ విభాగంలో ట్రాన్స్‌పోర్ట్ బాధ్యతలు అప్పగించింది. ఈ పనిని కూడా కామ్రేడ్ రమణ చాలా బాధ్యతగా చేశాడు. 2004లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రకమిటీ తనకు టెక్నికల్ రంగంలో ఒక కీలక బాధ్యత అప్పజెప్పింది. 2006 చివరి నుండి మధ్య రీజనల్ బ్యూరో బాధ్యతలో తను ఈ పనిని చూశాడు. పోరాటరంగంలో వున్న గెరిల్లా యోధులకు గ్రెనేడ్లు, తదితర పేలుడు పదార్థాలను సరఫరా చేయడంలో ఆయన నిర్వహించిన పాత్ర ఎంతో గొప్పది.

తీవ్ర నిర్బంధం మధ్యలో కూడా పార్టీ అప్పజెప్పిన టెక్నికల్ పనుల్ని నైపుణ్యంతో పూర్తి చేయడం కామ్రేడ్ రమణలోని ప్రత్యేకత. టెక్నికల్ జాగ్రత్తల్ని పాటించడంలో కూడా ఆయన ఎంతో పట్టుదలతో వుండేవాడు. పార్టీ టెక్ నియమాల్ని ఉల్లంఘించే కామ్రేడ్స్‌ను ఆయన నిశితంగా విమర్శించేవాడు. కేంద్రకమిటీ సభ్యులు టెక్ విషయాల్లో పొరపాటుగా వ్యవహరించినా అతను నిర్మొహమాటంగా విమర్శించేవాడు. శత్రువు అనుసరించే పద్ధతుల పట్ల కామ్రేడ్ రమణ స్పష్టమైన అవగాహనతో వుండేవాడు. మారుతున్న పరిస్థితులను అర్థం చేసుకుంటూ అందుకు తగిన విధంగా వ్యవహరించటంలో చురుకుగా వుండేవాడు. టెక్నికల్ రంగంలో పనుల రీత్యా అనేక ప్రాంతాలు తిరిగేవాడు. అత్యవసరమైన పనుల కోసం ఆకస్మికంగా దూర ప్రయాణాలు చేయవలసి వచ్చినప్పుడు రైల్లోనైనా , బస్‌లోనైనా కింద పేపర్ పరుచుకు పడుకొని నిద్రకాచి అయినా అనుకున్న సమయానికి పనులు పూర్తి చేయటం అతనికి అలవాటు. ఇటువంటి నిద్రలేని ప్రయాణాల వల్ల అల్సర్ సమస్యతో ఇబ్బంది పడుతున్నా మొండి పట్టుదలతో తిరిగేవాడు. సమయపాలనకు రమణ పెట్టింది పేరు.

టెక్నికల్ రంగంలో వుండవలసిన అప్రమత్తత రీత్యా తనచుట్టూ వున్న మనుషులను అంచనా కట్టటంలో, వారి గురించి వివరాలు తెలుసుకోవటంలో, తనకేదైనా ఇబ్బంది ఎదురయ్యే పరిస్థితి వుంటే దాన్నుంచి బయట పడటానికి ఎంతో చొరవను ప్రదర్శించేవాడు. అజానుబాహుడైన రమణ చూడటానికి ఎంత సీరియస్‌గా కన్పించేవాడో, అందరితో కలిసిపోవటంలో అంత మృదువుగా వుండేవాడు. తను ప్రత్యేకంగా కన్పించకుండా అందరితో మాటలు

కలిపి పరిస్థితుల గురించి విస్తృతమైన సమాచారం సేకరించేవాడు. టెక్నికల్ రంగంలో ఎక్కువకాలం పని చేయటం వల్ల ఇటువంటి జాగ్రత్తలు అతని దినచర్యలో భాగమయ్యాయి. ఒకరకంగా ఇంటలిజెన్స్ రంగంలో వున్న వారికి కావలసిన అర్హతలన్నీ రమణ సంతరించుకున్నాడు.చాలా కాలం పాటు టెక్ రంగంలో అనామకంగా వుండిపోయి పని చేయాల్సి వచ్చినప్పటికీ అతను ఎలాంటి అసంతృప్తికి లోను కాలేదు. విప్లవం కోసం ప్రతి పనినీ కూడా ఆయన నిజాయితీతో చేశాడు. పార్టీ నిర్ణయాల్నీ, పార్టీ ప్రయోజనాల్నీ అతను శిరోధార్యంగా స్వీకరించేవాడు.

ప్రారంభం నుండీ చివరి దాకా టెక్నికల్ పనుల్లోనే కొనసాగిన కామ్రేడ్ రమణ వివిధ నగరాల్లో, పట్టణాల్లో వుంటూ అనేక పనులు నేర్చుకున్నాడు. దానికి అనుగుణమైన ఉద్యోగాలు కూడా చేశాడు. పార్టీ అవసరాల్ని గుర్తిస్తూ కంప్యూటర్ నడపడం కూడా నేర్చుకున్నాడు. ఏ ప్రాంతంలో వున్నా అక్కడి స్థానిక భాషను నేర్చుకోవడానికి కూడా అతను తీవ్రంగా కృషి చేశాడు. 2001లో అతను కామ్రేడ్ మాధవిని వివాహం చేసుకున్నాడు. మార్చ్ 12న తను 'ఎన్‌కౌంటర్' అయిన వార్త వినగానే కామ్రేడ్ మాధవి మానవహక్కుల కమిషన్ ఎదుట పిటిషన్ వేసి దీన్ని బూటకపు ఎన్‌కౌంటర్ అని పేర్కొంది. ఆమె మీడియాకు చెప్పిన సమాచారం ప్రకారం 11వ తేదీన ఉదయం పూణెలో తాము వుంటున్న ఇంటిలోంచి కామ్రేడ్ రమణ ఒక పనిపై బైటికి వెళ్లి తిరిగి రాలేదు. బైట నుండే అతన్ని ఎస్ఐబీ హంతకులు అపహరించుకుపోయారు. సాయంత్రం వరకూ అతను తిరిగి రాకపోవడంతో అనుమానం వచ్చి తనను 'ఎన్‌కౌంటర్' పేరుతో హత్య చేసే అవకాశం వుందంటూ మానవహక్కుల సంఘాల కార్యకర్తలకు తెలియజేసింది. శత్రువు అతన్ని తీవ్ర చిత్రహింసలకు గురి చేసి ఏమీ రాబట్టలేక మరుసటి రోజు వుదయం హత్య చేశాడు.

పార్టీలో కామ్రేడ్ రవితో కలిసి చాలా కాలం పాటు పని చేసిన కామ్రేడ్ రమణ అమరత్వంలో కూడా తోడు నిలిచాడు. ఆయన అంత్యక్రియలు చిట్టాపూర్ గ్రామంలో వేలాది మంది ప్రజల సమక్షంలో జరిగాయి. అనేక ప్రజాసంఘాల వాళ్లూ, ప్రజాస్వామిక వాదులూ, ప్రజలూ అతని హత్యను ముక్తకంఠంతో ఖండించారు. విప్లవోద్యమంలో ఆయన చేసిన కృషిని తలచుకుంటూ ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు.

నేడు ఆంధ్రప్రదేశ్‌లో విప్లవోద్యమాన్ని రూపు మాపగలిగామని పాలకులు ఎంత గొంతు చించుకొని అరిచినా ఆంధ్రప్రదేశ్ ప్రజల హృదయాల్లో విప్లవోద్యమ ప్రభావాన్ని ఎవరూ రూపమాపలేరనేది వాస్తవం. ఆంధ్రప్రదేశ్ ప్రజలు మరోసారి ఒక పెద్ద శక్తిగా వెల్లువెత్తి విప్లవ సునామీని సృష్టించకా తప్పదు, అందులో పీడకులు-దోపిడీదార్లు కూకటివేళ్లతో సహా కొట్టుకుపోకా తప్పదు. వాస్తవానికి శత్రువుకు కూడా ఈ అంచనా వుంది. అందుకే ప్రజలకు నాయకత్వం లేకుండా చేయడం కోసం దేశం మూలమూలనా గాలింపు జరిపి మావోయిస్టు నాయకత్వాన్ని పట్టుకొని హత్య చేస్తున్నాడు. ముఖ్యంగా 2006 నుండి ఆంధ్రప్రదేశ్ ఎస్ఐబీ హంతకులు మన పార్టీ సీనియర్ నాయకులైన చంద్రమౌళి, సోమన్న, రాజమౌళి, సుధాకర్‌రెడ్డి తదితరులను హత్య చేశారు. మరి కొందరిని అరెస్టు చేసి విప్లవోద్యమానికి భారీ నష్టం చేశారు. నేడు దేశవ్యాప్తంగా మావోయిస్టు వుద్యమాన్ని సమూలంగా నిర్మూలించే లక్ష్యంతో సాగుతున్న గ్రీన్‌హంట్ ఆపరేషన్‌లో భాగమే ఈ హత్యలు. సోనియా-మన్మోహన్- చిదంబరం ముఠా ప్రత్యక్ష నేతృత్వంలో, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి రోశయ్యతో కుమ్మక్కయ్యి మన కామ్రేడ్లను హత్య చేశారు. ఈ హత్యల నుండి గుణపాఠం తీసుకుందాం. ఇలాంటి ఘటనలు ఇక ముందు జరగకుండా నివారించేందుకు తీవ్రంగా ప్రయత్నిద్దాం. అమరులైన పార్టీ నాయకుల లోటును పూడ్చుకోవడం కోసం పెద్ద సంఖ్యలో పార్టీలోకి భర్తీ చేసుకుందాం. శత్రువు కొనసాగిస్తున్న ఆపరేషన్ గ్రీన్‌హంట్‌కు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా వివిధ సెక్షన్ల ప్రజలు సమైక్యమవుతున్నారు. దండకారణ్యం, బీహార్-ఝార్ఖండ్‌లలో మన పీఎల్‌జీఏ ప్రజాయుద్ధాన్ని వున్నత స్థాయికి అభివృద్ధి చేస్తూ తాడిమెట్ల వంటి పెద్ద పెద్ద సైనిక చర్యలను నిర్వహిస్తూ ముందుకు సాగుతున్నది. దండకారణ్యంలో జనతన సర్కార్ రూపంలో ప్రజల ప్రజాస్వామిక రాజ్యాధికారం సంఘటితపడుతున్నది. ఈ ప్రక్రియను మరింత వేగవంతం చేస్తూ అమరుల వారసులుగా వేలాది, లక్షలాది మందిని సమైక్యం చేయడమే రవి, రమణలతో పాటు వేలాది అమరవీరులకు నిజమైన శ్రద్ధాంజలి. ఈ దిశగా ముందుకు సాగుదాం! ★

---

*(...13వ పేజీ తరువాయి)*

పేర ఫాసిజం అమలవుతున్నదని వ్యాఖ్యానించారు. ఢిల్లీలో బోధ్‌ఘాట్ స్మశాన వాటికలో జరిగిన ఆయన అంత్యక్రియల్లో అరుంధతీరాయ్, బి.డి.శర్మ లాంటి ప్రముఖులు పాల్గొన్నారు. అందరూ స్వామి అగ్నివేష్ కార్యాలయంలో ఆయనకు నివాళు లర్పించి, న్యాయ విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

పొంచి వున్న ప్రమాదాలకూ, ప్రాణాంతకమైన రాజ్యహింసకు వెరవకుండా వృత్తి పట్ల నిబద్ధతను కల్గిన ఈ పీడిత ప్రజల పక్షపాతినీ, ఎక్కడో పుట్టి పోరాటాల గడ్డపై, కామ్రేడ్ ఆజాద్ సరసనే నేలకొరిగిన ఈ చైతన్యవంతమైన క్రియాశీల జర్నలిస్టునూ మావోయిస్ట్ పార్టీ శ్రేణులూ, విప్లవ ప్రజానీకమూ సదా స్మరించుకుంటారు. విప్లవ చరిత్రలో అమరుల సరసన ఆయనకు సగౌరవమైన, సముచితమైన స్థానాన్ని కల్పిస్తారు. ఆయన అమరత్వాన్ని కీర్తిస్తారు.

హేమచంద్ర పాండే అమర్ రహే! ★

# విముక్తి పోరులో సాహస పరిమళాలు వెదజల్లిన కామ్రేడ్స్ సూర్యం, జగదీష్‌ల అమరత్వాన్ని కీర్తిద్దాం!

మన సెంట్రల్ రీజినల్ కంపెనీ పొలిటికల్ కమీస్సార్ అయిన కామ్రేడ్ వీరేష్ (సూర్యం, ప్రకాష్, జీవన్), ఆయన గార్డు కామ్రేడ్ నందా (జగదీష్)లు 09-05-2010న శత్రువు చేసిన ఒక మాటుదాడిలో అమరులయినారు. నేడు దేశవ్యాపితంగా ప్రభావం వేస్తున్న మిలిటెంట్ ప్రజా ఉద్యమాలలో కోరాపుట్ జిల్లాకు చెందిన నారాయణపట్నా ఆదివాసి రైతాంగం చేస్తున్న భూపోరాటం ఒకటి. ఈ పోరాటాన్ని అణచివేసేందుకు రాష్ట్రం దారుణమైన నిర్బంధాన్ని అమలు చేస్తోంది. ఈ పరిస్థితిలో అక్కడి ఆదివాసి రైతాంగ పోరాటానికి మద్దతుగా, మన పార్టీ కేంద్రకమిటి కామ్రేడ్ సూర్యం నాయకత్వంలో రీజనల్ కంపెనీ-1 బలగాలను పంపింది. ఈ బలగాలు ఆరు నెలల పాటు ప్రభుత్వ, సాయుధ బలగాలను మూడు చెరువుల నీళ్లు తాగించి ముప్పతిప్పలు పెట్టారు. కామ్రేడ్ సూర్యం కమాండర్‌గా ప్రధాన, ద్వితీయ, పునాది బలగాలు చేసిన దాడిలో ఒక ఎస్‌ఓజి కానిస్టేబుల్ చనిపోగా, 17 మంది గాయపడ్డారు. మన పిఎల్‌జిఏ బలగాలు చేసిన సాహసిక దాడుల మద్దతుతో రైతాంగం తమ ఉద్యమాన్ని మరింత ముందుకు తీసికెళ్లారు. పంటలను స్వాధీనం చేసుకున్నారు. ఉద్యమం నిలదొక్కుకొని పురోగమన దిశగా ఒక అడుగు ముందుకు వేసింది.



పార్టీ తనకు అప్పజెప్పిన బాధ్యతను కామ్రేడ్ సూర్యం విజయవంతంగా చేసుకొని తిరుగు ప్రయాణంలో వుండగా శత్రు బలగాలు పోరాట గ్రామాలలోకి ప్రవేశించాయి. ఈ విషయం తెలిసి మే 8వ తేదిన కామ్రేడ్ సూర్యం నాయకత్వంలో శత్రువును ప్రతిఘటించేందుకు పిఎల్‌జిఏ బలగాలు ఎంగేజ్ అయ్యాయి. శత్రు బలగాలు పెద్దసంఖ్యలో, పారలల్‌గా రావడంతో, ఏర్పడిన అననుకూల పరిస్థితిని దృష్టిలో వుంచుకొని కొద్దిసేపు ఫైరింగు చేసి రిట్రీట్ అయ్యాయి. ఈ సందర్భంగా రిట్రీట్ క్రమంలో కామ్రేడ్ సూర్యంతో పాటు మరో ముగ్గురు కామ్రేడ్స్ విడిపోయారు. మరుసటి రోజు వుదయం వీరు ఆర్‌వికి వెళుతున్న క్రమంలో శత్రువు ఆంబుష్‌లో ఇరుక్కున్నారు. శత్రువును ప్రతిఘటించే క్రమంలో శత్రు కాల్పుల్లో గార్డు కామ్రేడ్ జగదీష్ అక్కడే అమరుడయ్యాడు. కామ్రేడ్ సూర్యం తీవ్రంగా గాయపడినప్పటికీ ఏదో ఒకలాగా శక్తిని కూడగట్టుకొని 10 గజాలు క్రాలింగ్ చేసుకుంటూ గుట్ట మీదకు ఎగబాకి ఇక కదలటం కష్టం కావటంతో తిరిగి జారి కిందపడిపోయాడు. తీవ్రరక్త స్రావం జరిగి కొంతసేపటికి అమరుడయ్యాడు. (అప్పటికి తన వయస్సు 41 సంవత్సరాలు.) మే 17న సంఘటనా స్థలాన్ని పరిశీలించగా వారిరువురి శవాలు కనిపించాయి. విప్లవ ప్రజానీకం, పిఎల్‌జిఏ గెరిల్లాలు తమ ప్రియతమ విప్లవకారులకు అశ్రునయనాలతో అంతిమ సంస్కారం చేశారు. సుదీర్ఘకాలంగా పార్టీలో పనిచేస్తూ అంచెలంచెలుగా ఎదుగుతూ వచ్చిన కామ్రేడ్ సూర్యం అమరత్వం మన పార్టీకి, ప్రత్యేకించి సెంట్రల్ రీజినల్ కమాండ్‌కు, అభివృద్ధి చెందుతున్న పిఎల్‌జిఏ బలగాలకూ తీవ్రమైన నష్టం. శత్రువుతో పోరాడుతూ అమరత్వం చెందిన కామ్రేడ్స్ సూర్యం, జగదీష్‌లకు తలవంచి వినమ్రంగా అరుణారుణ జోహార్లు అర్పిద్దాం.

కామ్రేడ్ సూర్యం స్వగ్రామం కర్నూలు జిల్లా ఆదోని మండలంలోని కడితోట. వెనుకబడిన నిరుపేద రైతు కుటుంబంలో పుట్టాడు. ఆయన తండ్రి పేరు ఎల్లయ్య. తల్లిదండ్రులు కామ్రేడ్ సూర్యంకు పెట్టుకున్న పేరు వీరేష్. తనకు ఒక అన్న, చెల్లె వున్నారు. తన చిన్నతనంలోనే బతుకుదెరువు కోసం వీరేష్ కుటుంబం 1978లో గుంటూరు నగర శివార్లలోని ఏటుకూరు గ్రామానికి వలస వచ్చింది. తండ్రి నగరంలోని పత్తి మిల్లులో రోజుకూలి చేసే కార్మికుడు. ఆ రోజుల్లో గుంటూరులో విప్లవ కార్మిక సంఘ కార్యకలాపాలు విస్తృతంగానే వుండేవి. పేటల్లో రాడికల్ యువజన సంఘం కార్యకలాపాలు కూడా ముమ్మరంగా సాగేవి. వీరేష్ తన తండ్రి, అన్నతో పాటు పత్తి మిల్లులో కూలి చేస్తూనే స్కూల్‌కు వెళ్లి చదువుకునేవాడు. అలా 9వ తరగతి వరకు చదివాడు. ఈ సమయంలో విప్లవ ప్రజా సంఘాల కార్యక్రమాలు చూడడం, విప్లవ గీతాలు వినడం ద్వారా, స్వయంగా పేదరికంలో పుట్టిపెరిగిన కారణంగా సమాజంలో జరుగుతున్న దోపిడి గురించి అర్థం చేసుకోగలిగాడు. సమాజంలో దోపిడి నిర్మూలనకు వర్గపోరాటమే సరైన మార్గమని ఆ వైపుగా తను పయనించాలని నిశ్చయించుకున్నాడు. రాడికల్ యువజన సంఘం కార్యకలాపాల్లో పాల్గొనటం మొదలు పెట్టాడు. 1987లో పూర్తి కాలం కార్యకర్తగా పార్టీలోకి రిక్రూట్ అయ్యాడు.

మొదట గుంటూరు పట్టణంలోనే యువజన సంఘం కార్యకలాపాల్లో పాల్గొన్నాడు. ప్రకాష్ పేరుతో యువజనులను కూడగట్టేందుకు కృషి చేశాడు. మంచి క్రమశిక్షణ, తక్కువ మాట్లాడుతూ ఎక్కువ పనిచేసే స్వభావం కల కామ్రేడ్ ప్రకాష్‌కు

1987 చివర్లో పార్టీ జిల్లా కమిటీ కార్యదర్శికి కొరియర్‌గా బాధ్యతలను అప్పగించింది. 1985లో మన పార్టీపై ఎన్‌టిఆర్ ప్రభుత్వం ప్రకటించిన అప్రకటిత యుద్ధంలో గుంటూరు జిల్లాలో కూడా నిర్బంధపు ఛాయ పడింది. ఆ నిర్బంధంలో కొరియర్‌గా ఖచ్చితంగా సమయపాలన చేస్తూ తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాడు.

**నల్లమల అడవులను ఎరుపెక్కించే కృషిలో ....**

1989లో నల్లమలను గెరిల్లాజోన్‌గా మార్చే లక్ష్యంతో మన పార్టీ ఆ ప్రాంతంలోకి కార్యకర్తలను పంపాలని నిర్ణయించింది. దశాబ్ద కాలంగా ఇటువంటి అనేక ప్రయత్నాలు జరిగినా విఫలం కావటంతో ఈసారి గ్రామీణ ప్రాంత వుద్యమంపై ప్రధానంగా దృష్టిని కేంద్రీకరిస్తూ దృఢసంకల్పంతో పనిచేసే కార్యకర్తలను ఎంపిక చేసి గుంటూరు జిల్లా కమిటి అనేక మంది కార్యకర్తలను అడవులకు పంపింది. అందులో భాగంగా 1989 మధ్యలో కామ్రేడ్ ప్రకాష్‌ను పుల్లలచెరువు ఏరియాలో 1+1 దళంలో సభ్యుడిగా పంపటం జరిగింది. అప్పటి నుండి నల్లమల అడవులను ఎరుపెక్కించటం కోసం అవిశ్రాతంగా సాగిన కృషిలో ఆదర్శ దళసభ్యుడుగా, కమాండర్‌గా, డివిసి సభ్యుడిగా కామ్రేడ్ ప్రకాష్ ముఖ్యమైన భూమిక పోషించాడు.

ఆయన నల్లమలలోకి అడుగు పెట్టిన నాటికే పెద్దయెత్తున సాగిన తునికాకు వుద్యమ ప్రభావంతో అనేక గ్రామాల్లో ప్రజల్లో విస్తృతమైన సంబంధాలు వచ్చాయి. మరోవైపు ఫారెస్టు అధికారుల దోపిడి పీడనలకు వ్యతిరేకంగా కూడా అన్ని ప్రాంతాల్లో పెద్దయెత్తున పోరాటాలు బద్దలయ్యాయి. పుల్లలచెరువు ఏరియాలో కూడా ఫారెస్టు అధికారుల దోపిడి పీడనలకు వ్యతిరేకంగా వాచర్లను, గార్డులను, డిప్యూటీ ఫారెస్టు అధికారులను ప్రజల మధ్యకు లాగి ప్రజా పంచాయితీలు నిర్వహించి వారి దోపిడిని అరికట్టే పోరాటాల్లో కామ్రేడ్ ప్రకాష్ మిలిటెంట్‌గా పాల్గొన్నాడు. దీంతో ప్రజలకు మేక పుల్లెర పీడ నుంచి విముక్తి కలిగింది. అనంతరం 1990 నుంచి సారారేటు తగ్గింపు పోరాటంలో, 1992 నుంచి సాగిన సారా నిషేధ పోరాటంలో కూడా కామ్రేడ్ ప్రకాష్ చొరవగా తనకు ఇచ్చిన బాధ్యతలను నిర్వహించాడు. ఈ పోరాటాల ప్రభావంతో ప్రజల్లో పార్టీ పలుకుబడి పెరిగింది. ప్రజలు మన సంఘాల చుట్టూ సమీకృతం కావటం పెరిగింది. అనేక గ్రామాల్లో పెత్తందార్లకు, భూస్వాములకు వ్యతిరేకంగా సాగిన ప్రజా పంచాయితీలలో ప్రజలను సమీకరించటంలో కామ్రేడ్ ప్రకాష్ అవిశ్రాంతంగా కృషి చేశాడు. అటవీ అధికారుల దోపిడికి అడ్డుకట్టపడటంతోనూ, వుద్యమ ప్రభావంతోనూ ప్రజలు అనేక గ్రామాల్లో అటవీ భూములను నరికి సాగు చేసుకున్నారు.

వివిధ పోరాటాల ప్రభావంతో వుద్యమంపై మొదటి నుంచి ప్రభుత్వ నిర్బంధం కూడా పెరుగుతూ వచ్చింది. ఆ నిర్బంధంలో పార్టీ ఆర్గనైజరుకు ఒక్క సభ్యుడే రక్షణ బాధ్యతలు నిర్వహించాల్సి వచ్చేది. పుల్లలచెరువు ప్రాంతంలో అడవుల్లో దారులను సర్వే చేయటంలో, వాటిని గుర్తు పెట్టుకోవటంలో, పగలంతా అడవిలో షెల్టర్ తీసుకున్నప్పుడు, ఒక్కడే రహస్యంగా గ్రామంలోకి వెళ్లి ఆర్గనైజర్ కోసం అన్నం తీసుకొని రావటంలో, ఆర్గనైజర్ ప్రజలతో, సంఘ కార్యకర్తలతో మాట్లాడేటప్పుడు, విశ్రాంతి తీసుకునేటప్పుడు, రాత్రిపూట గ్రామంలోకి వెళ్లి ప్రజలతో, సంఘాలతో సమావేశాలు వేసి మాట్లాడేటప్పుడు తాను ఒక్కడే గంటల తరబడి సెంట్రీ చేస్తూ ఆర్గనైజర్‌ను కంటికి రెప్పలా కాపాడేవాడు. ఆర్గనైజర్ నిర్వహించే సమావేశాలకు ప్రజలను, సంఘ సభ్యులను, కార్యకర్తలను తానే ఇల్లిల్లు తిరిగి పిలుచుకొని వచ్చేవాడు. ఆ సమయంలోనే చొరవగా వారిని విప్లవ రాజకీయాలతో ప్రభావితం చేసేవాడు. ప్రకాషన్న వచ్చాడంటే పుల్లలచెరువు ప్రాంతంలోని ప్రతి గ్రామంలో ప్రత్యేకించి దళితవాడల్లో ప్రజలంతా గుమికూడి ఎంతో ఆప్యాయంగా పలుకరించేవారు, ఆదరించేవారు. ఆ విధంగా కామ్రేడ్ ప్రకాష్ సభ్యుడిగా వున్నప్పుడే ప్రజలతో అంతటి సజీవ సంబంధాలను ఏర్పర్చుకోవటం వల్లనే ఏ పని చేయాలన్నా ఆర్గనైజర్‌కు చేదోడు వాదోడుగా వుండగలిగేవాడు. క్రమంగా దళం అవసరాల రీత్యా సభ్యుల సంఖ్య 2, 3, 4కు పెరిగింది. 1991లో దళం సంఖ్య ఐదుకు చేరటంతో సహజంగానే ఆయన ఆ దళానికి డిప్యూటీ కమాండర్ అయ్యాడు. 1993లో దళ కమాండర్ ఒక యాక్షన్‌కు వెళ్లి అరెస్ట్ కావటంతో ఆ దళాన్ని నడిపే బాధ్యత కామ్రేడ్ ప్రకాష్ భుజస్కంధాలపైనే పడింది. అయితే తాత్కాలికంగా పార్టీ అవసరాల రీత్యా దళాన్ని దుర్గి దళంతో కలపటం జరిగింది.

ఈ విధంగా దళాల ప్రవేశంతో నల్లమల అంచుల్లోని పుల్లలచెరువు ప్రాంతంలోనూ గుంటూరు జిల్లాలోని పల్నాడు ప్రాంతంలోనూ మన పార్టీ నాయకత్వంలో ప్రజా పోరాటాలు వెల్లువెత్తాయి. తునికాకు, సారా, అటవీ, పోరంబోకు భూముల పోరాటాల వల్లనూ, ప్రత్యేకించి గుంటూరు జిల్లా దాచేపల్లి ప్రాంతంలో రామాపురంలో దళితులు మన పార్టీ నాయకత్వంలో తిరగబడి భూస్వాములను ఖతం గావించటంతోనూ, వెల్దుర్తిలోని శిరిగిరిపాడు భూస్వాములకు వ్యతిరేకంగా ప్రజా పోరాటం వంటి పోరాటాల ప్రభావంతోనూ పల్నాడు ప్రాంతంలోని భూస్వాములకు, తునికాకు, సారా కాంట్రాక్టర్లకు, అటవీ అధికార్లకు మన పార్టీ ఒక సవాలుగా నిలిచింది. దీంతో పార్టీపై నిర్బంధాన్ని ప్రయోగించటం కోసం వారికి దన్నుగా తెలంగాణాలో వుద్యమంలో అనేక మంది విప్లవకారులను చంపిన జిల్లా ఎస్‌పి మీనాను జిల్లాకు తీసుకొచ్చారు. జిల్లా అంతటా నిర్బంధ వాతావరణం ఏర్పడింది. గుంటూరు జిల్లాలో 1992 ఏప్రిల్ 1న ఈ క్రూరమైన పోలీసు అధికారి ఆర్‌పి మీనా నాయకత్వంలో చంద్రవంక వాగు ఒడ్డున డిసిఎం కా.ఏసన్న, చంద్రవంక దళ కమాండర్ కా.రామకృష్ణ, దళ సభ్యురాలు కా.మాధవీలతలతో పాటు నలుగురు జాలర్లను అత్యంత పాశవికంగా హత్య గావించారు. స్పెషల్ పోలీసు బలగాలు దళాల కోసం వేట సాగించాయి. గ్రామాలపై దాడులు పెరిగాయి. ప్రజల్లో భయానక వాతావరణం ఏర్పడింది. ఈ నిర్బంధాన్ని బద్దలు చేయటానికి ప్రజల్ని కదిలించటంలో భాగంలో ఈ కాలంలో పల్నాడు

ప్రాంతంలో తీవ్రమైన సమస్యగా ముందుకు వచ్చిన కరువును ఆధారం చేసుకొని అప్పటి జిల్లా కమిటీ కార్యదర్శిగా వున్న అమరుడు కామ్రేడ్ మస్తాన్‌రావు నాయకత్వంలో పార్టీ ప్రజల్లోకి వెళ్లింది. పల్నాడులో కరువు వ్యతిరేక పోరాటంలో దుర్గి దళంలో డిప్యూటీ కమాండర్‌గా కామ్రేడ్ ప్రకాష్ వేలాది మంది ప్రజల్ని కదలించటం కోసం అహర్నిశలు పనిచేశాడు. దొమ్మర్లగొంది ఎత్తిపోతల పథకాన్ని అమలు చేయాలని వేలాది ప్రజలు కరువు వ్యతిరేక పోరాట కమిటీ నేతృత్వంలో కదిలారు. దీంతో ప్రజల్ని కదిలిస్తే ఎంతటి నిర్బంధాన్ని అయినా ఓడించగలమనే ఆత్మవిశ్వాసాన్ని ప్రజల్లోనూ, దళాల్లోనూ పాదుకొల్పటంలో పార్టీ విజయం సాధించింది.

1994 చివరి నుంచి పుల్లలచెరువు ప్రాంతంలో తిరిగి కామ్రేడ్ ప్రకాష్ కమాండర్‌గా దళం పనిచేయటం ప్రారంభించింది. 1995 మధ్యలో నల్లమల్ల డివిజన్ ఆవిర్భావంతో పుల్లలచెరువు దళం ఎర్రగొండ దళంగా ఆ డివిజన్‌లో భాగమైంది. 1996లో ఎర్రగొండ దళం టైగర్ ప్రాజెక్టు దళంలో భాగమైంది. దోర్నాల ప్రాంతంలో అగ్రకుల భూస్వాములు రజక కులస్తుల చేత చేయించుకునే వెట్టిచాకిరికి వ్యతిరేకంగా కామ్రేడ్ ప్రకాష్ తీవ్రమైన వర్గకసితో స్పందించాడు. ప్రజలను పెద్దయెత్తున సభలకు, ధర్నాలకు కదిలించి వారికి నాయకత్వం వహించాడు. ఈ పోరాట ఫలితంగా వారిని వెట్టిచాకిరి నుండి విముక్తం చేసి వారి హృదయాల్లో చెరగని ముద్ర వేశాడు. అగ్రకుల భూస్వాములు దళితులను వెలివేస్తే వై. చెర్లోపల్లె, చిన్న దోర్నాల, జిమ్మి దోర్నాల, చిన్నగుడిపాడు, పెద్దగుడిపాడు, గంటవానిపల్లె గ్రామాల్లో దళితులకు మద్దతుగా అన్ని కులాల ప్రజల్ని ఐక్యం చేసి అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించాడు. గాలి వీరారెడ్డి, ఆళ్ల వెంకటేశ్వరరెడ్డిలతో దళితులకు క్షమాపణ చెప్పించి వారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టడంలో తీవ్రంగా కృషి చేశాడు. ప్రజాకంఠకులైన వై. చెర్లోపల్లి భూస్వామి సంగిరెడ్డిని, పెద్దగుడిపాడు సుబ్బయ్యను, గంటవానిపల్లె బ్రహ్మయ్యలను ఖతం చేసిన యాక్షన్ టీంలకు నేతృత్వం వహించాడు.

కామ్రేడ్ ప్రకాష్ నాయకత్వంలో నల్లమలలోని అనేక చెంచు ఆదివాసీ గూడేలైన కొర్రపోలు, అంకమ్మ గూడెం, చెరువు గూడెం, పెద్దచెరువు, జెరిపెంట, గుట్టల చెరువు, పాలుట్లలలో అటవీ భూపోరాటాలు జరిగాయి. చెంచులను దోర్నాల పట్టణానికి కదిలించి ప్రభుత్వ వ్యతిరేక పోరాటాలు సాగించి ఫారెస్టు భూములను పంపిణీ చేయటంలో, వాటికి పట్టాలు యిప్పించటంలో వారికి నేతృత్వం వహించాడు. పేరుకుపోయిన ఐటిడిఏ అవినీతికి వ్యతిరేకంగా చెంచు ఆదివాసీల్లో వున్న ఆగ్రహాన్ని చూసి వారిని కూడగట్టి ప్రజల డబ్బులు, పథకాలు ప్రజలకు చెందే విధంగా పోరాటాలు నిర్వహించి వారి హక్కులను సాధించటం ద్వారా తమ సంఘటిత శక్తిపై వారికి విశ్వాసం పెంచాడు. తద్వారా విద్య, వైద్యం, బోరింగుల ద్వారా మంచి నీటి సౌకర్యం, నాగటెద్లు, అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర వంటి కొన్ని డిమాండ్లను సాధించుకొని పోరాటం ద్వారా చెంచు ఆదివాసీలు తమ జీవితాన్ని మెరుగుపర్చుకోగలిగారు.

నల్లమలలో బలపడుతున్న విప్లవోద్యమాన్ని దెబ్బతీయటం కోసం శత్రువు రూపొందించే ఇన్ఫార్మర్ నెటవర్క్‌ను పసిగట్టి వై.చెర్లోపల్లి దిబ్బయ్య, చిలకచర్ల వెంకటేశ్వర నాయక్, భీమానాయక్, మాజీ నక్సలైటు కొత్తూరు బాబు, నల్లగుంట్ల అల్లూరయ్య, తమ్మడపల్లె వెంకటసుబ్బయ్య, పెద్ద దోర్నాల మండలాధ్యక్షుడు, భూస్వామి, ఇన్‌ఫార్మర్ అయిన బ్రహ్మానందయ్య వంటి చీడపురుగులను ఏరివేయటంలో ముందున్నాడు.

టైగర్ ప్రాజెక్టు ఏరియాలో భూస్వామ్య వ్యతిరేక పోరాటాన్ని దున్నేవానికి భూమి నినాదంతో తీవ్రతరం చేస్తూ చిలకచర్ల, వై.చెర్లోపల్లి, కొత్తూరు, తమ్మడపల్లె, బొమ్మలాపురం, చిన్నగుడిపాడు, పెద్దగుడిపాడు గ్రామాల్లో దేవుని మాన్యం భూములు, భూస్వాముల పట్టా భూముల్లోకి భూమిలేని, పేద రైతాంగాన్ని కదలించి భూపోరాటాలకు నాయకత్వం వహించాడు కామ్రేడ్ ప్రకాష్.

అలాగే మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను, హత్యలను ఖండిస్తూ, పెద్ద దోర్నాల రాజ్యలక్ష్మిని, మెరుగులదిన్నెపాడు బలచిపాటి పిచ్చమ్మను అత్యాచారం చేసిన అగ్రకుల భూస్వాములకు వ్యతిరేకంగా టైగర్ ప్రాజెక్టు ఏరియాలోని మహిళలను కదిలించి పోరాటాలు నిర్వహించాడు. అంతిమంగా రాజ్యలక్ష్మిపై అత్యాచారం చేసిన పెద్ద దోర్నాల భూస్వామిని, పిచ్చమ్మపై అత్యాచారం చేసిన కుంట సుబ్బారెడ్డిని ఖతం గావించి వారిని ఆస్తులను ప్రజలకు పంపిణీ చేయటం ద్వారా అవి భూస్వామ్య వ్యతిరేక భూపోరాటాలుగా అభివృద్ధి అయ్యేలా కామ్రేడ్ ప్రకాష్ కృషి చేశాడు. వందల ఎకరాల భూస్వాముల భూములు ప్రజలపరమయ్యాయి. ఈ క్రమంలో ఏరియాలో మహిళా టీంను ఏర్పాటు చేసి, మహిళా సంఘాలు నిర్మించి మహిళా వుద్యమాన్ని అభివృద్ధి చేసేందుకు కూడా తపనపడ్డాడు. ఈ క్రమంలో 2000లో నల్లమల డివిజనల్ కమిటీ సభ్యుడిగా ఎన్నికయ్యాడు.

**గుంటూరు జిల్లా విప్లవోద్యమ సారథిగా...**

2002లో గుంటూరు జిల్లా వుద్యమ అవసరాల రీత్యా బదీలి అయ్యి కామ్రేడ్ ప్రకాష్ గుంటూరు జిల్లా కమిటీ సభ్యుడిగా చంద్రవంక ఏసీని గైడ్ చేస్తూ, జిల్లా కమాండర్ ఇన్ చీఫ్‌గా, రీజినల్ కమాండ్ సభ్యుడుగా బాధ్యతలను నిర్వహించాడు. ఆయన జిల్లాలోకి అడుగిడే నాటికే జిల్లా వుద్యమంలో తీవ్రమైన పెడధోరణులు వుండినాయి. వాటిని సరిదిద్దటంలో కామ్రేడ్ ప్రకాష్ తన వంతు పాత్ర నిర్వహించాడు. అదే సమయంలో 2001లో మన పార్టీ కాంగ్రెస్ చేపట్టిన కర్తవ్యాలను అమలు జరపటంలో భాగంగా జిల్లాలో వర్గపోరాటం అభివృద్ధి అయ్యింది. పల్నాడు ప్రాంతాన్ని గెరిల్లాజోన్‌గా అభివృద్ధి చేసే లక్ష్యంతో వినుకొండ, కారంపూడి, దుర్గి, వెల్దురి ప్రాంతాలలో కరువు, కరెంటు కోత, జీతగాళ్ల పోరాటాలు, కూలిరేట్ల పోరాటాలు, తాగునీటి సమస్య, గిట్టుబాటు ధరలు, పులిచింతల ప్రాజెక్టు వ్యతిరేక పోరాటం, శ్రీచక్ర సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యానికి వ్యతిరేకంగా కార్మిక జీతాల పెంపుదలకై పెద్దయెత్తున సాగిన పోరాటం, భూస్వాముల

మిగులు పట్టా భూముల ఆక్రమణ పోరాటాలు మరింత తీవ్రతరమయ్యాయి. మద్యపానానికి వ్యతిరేకంగా వేలాది మహిళలు కదిలి నాటుసారా, ప్రభుత్వ సారా నిషేధించాలని డిమాండ్ చేశారు. సామ్రాజ్యవాద ప్రపంచీకరణకు వ్యతిరేకంగా ప్రజలు వుద్యమించారు. ఈ వుద్యమాలకు కామ్రేడ్ ప్రకాష్ నాయకత్వాన్ని అందించాడు. వర్గపోరాటాన్ని తీవ్రతరం చేయటంలో భాగంగా తాను స్వయంగా శిరిగిరిపాడు, అడిగొప్పుల, నరమాలపాడు, పేట సన్నిగండ్ల, గుమ్మనంపాడు, పమిడిపాడు, మేళ్లవాగు, జూలకల్లు, గుత్తికొండ, ఒప్పిచర్ల, ముటుకూరు, జంగమేశ్వరపాడు, మర్రివేముల వంటి పలు గ్రామాల్లో భూస్వామ్య వ్యతిరేక పోరాటాలకు నేతృత్వం వహించాడు. ప్రజలను పెద్దయెత్తున ఈ పోరాటాల్లో కదిలించాడు. వేలాది ఎకరాల భూస్వాముల పట్టా భూముల్ని, దేవుని మాన్యం భూముల్ని ప్రజలకు పంపిణీ చేయటంలో నాయకత్వం వహించాడు.

అడిగొప్పుల లాంటి పెద్ద గ్రామాల్లోనే (15 వేల జనాభా) పథకం ప్రకారం ప్రజా మిలీషియాను, ప్రజలను పెద్దఎత్తున కదిలించి భూస్వాముల ఇండ్లను కూల్చివేయడం, వారి ట్రాక్టర్లు, ఆస్తులను జప్తు చేసి ప్రజలకు పంచడం, శిరిగిరిపాడు భూస్వామి అంజిరెడ్డిని, మేళ్లవాగులోని తెలుగుదేశం నాయకుడు, గ్రామ సర్పంచి గాదె నాగిరెడ్డి, అడిగొప్పులలోని ఎద్దు పిచ్చయ్య వంటి ముఖ్యమైన రాజకీయ నాయకులను అంతమొందించి అనేక గ్రామాలను మన ఆధిపత్యంలోకి తీసుకొని రావడంలో కామ్రేడ్ ప్రకాష్ ముఖ్య భూమిక పోషించాడు. గ్రామాల్లో సంఘ ఆధిపత్యాన్ని సవాలు చేసిన భూస్వాములను ప్రజా కోర్టులు నిర్వహించి దేహశుద్ధులు చేసి వారిని నియంత్రించే విషయంలో కూడా తన పాత్ర ముఖ్యమైందే. ప్రజలపై తప్పుడు కేసులు పెట్టించినందుకు పమిడిపాడు కాసరగడ్డ వీరయ్య, యోగేశ్వరరావు, మండల అధ్యక్షురాలు వెంకటమ్మ, మరిపాలెం నాగిరెడ్డి, అయినపాలెం రమణయ్యలు ఈ విధంగా ప్రజాకోర్టులలో దేహశుద్ధులు చేయించుకున్నవారే.

వేమగిరిలో, ఒప్పిచర్లలో జనశక్తి (వీరయ్య వర్గం) అవకాశవాద రాజకీయాలను ఎండగట్టడంలోనూ, నకరికల్లులో శివయ్య అవకాశవాద రాజకీయాలను బహిర్గతం చేసి ప్రజలను విప్లవ రాజకీయాల వైపు తీసుకురావడంలో కామ్రేడ్ ప్రకాష్ రాజకీయ కృషి ముఖ్యమైంది.

కరువు వ్యతిరేక పోరాటంలో భాగంగా ప్రభుత్వ గోడౌన్లపైన, భూస్వాముల, షావుకార్ల ఇండ్లపైన దాడి చేసి వేలాది బస్తాల ధాన్యాన్ని ప్రజలకు పంపిణీ చేయటంలో మిలిటెంట్‌గా ముందున్నాడు. కామ్రేడ్ ప్రకాష్ గైడెన్స్‌లో వెల్లటూరు, వెల్దుర్తి, పిడుగురాళ్ల, మేళ్లచెరువు ప్రభుత్వ బ్యాంకులపై దాడులు చేసి డబ్బులు, బంగారం జప్తు చేసి ప్రజల కరువు సమస్యను పరిష్కరించేందుకు మన దళాలు, ప్రజా సంఘాలు పూనుకున్నాయి. ఈ దాడుల్లో 8 తుపాకులు కూడా స్వాధీనమయ్యాయి. ఇందులో భాగంగా 15 గ్రామాల్లో తాగునీరు కోసం బోరింగులు వేయించి, నీళ్ల ట్యాంకులు కట్టించడం, సాగునీరు కోసం వేమగిరి, గుడిపాటి చెరువు, అడిగొప్పుల, చెంచుకుంట, గుమ్మనంపాడు, షోలాయిపాలెం వంటి పలు గ్రామాల్లో కుంటలు, చెరువులు తవ్వించడం జరిగింది.

అనేక గ్రామాల్లో సంఘ నిర్మాణాలు చేయటంలో, గ్రామ రాజ్య కమిటీలు పెట్టి ప్రజలందరినీ విప్లవ రాజకీయాల ద్వారా సంఘటితం చేయటంలో కామ్రేడ్ ప్రకాష్ కృషి వుంది. ప్రజా మిలీషియాను నిర్మాణం చేయటంలో, వారికి శిక్షణ నిచ్చి సాయుధం చేయటంలో వారిని శత్రువుకు వ్యతిరేకంగా అనేక దాడుల్లో భాగస్వామ్యం చేయటంలో ప్రత్యేకించి కేంద్రీకరించేవాడు. ముగ్గురు గ్రేహౌండ్స్ పోలీసుల్ని మట్టుబెట్టిన కొత్తూరు మందుపాతర పేల్చివేత, ఒక ఎస్ఐతో పాటు ఇద్దరు పోలీసులు గాయపడిన రావులాపురం ఘటనలు మిలీషియా చేసిన చర్యలే.

జిల్లాలో మహిళా దళం ఏర్పాటు చేసి మహిళలపై జరిగే అత్యాచారాలకు వ్యతిరేకంగా మహిళలను కూడగట్టటంలో కామ్రేడ్ ప్రకాష్ చొరవ చేశాడు. ఆయన గైడెన్స్‌లోనే ఈ దళం జూలకల్లు, వేమవరం, కల్లగుంట గ్రామాల్లో ముగ్గురు మహిళలపై అత్యాచారాలు సాగించిన ముగ్గురిని ప్రజల ముందుకు లాగి వారి పీడ వదిలించటం జరిగింది.

2002లో మాస్‌వర్క్‌ను (రైతాంగ పోరాటాలను), మిలిటరీ వర్క్‌ను సమన్వయిస్తూ సాగిన కృషి ద్వారా జిల్లా వుద్యమం మరో అడుగు ముందుకు వేసింది.

2003 చివరికి జిల్లాలో మొట్టమొదటగా ఏర్పాటు చేసిన ప్లాటూన్‌కు కమాండర్‌గా కామ్రేడ్ ప్రకాష్ బాధ్యతలు చేపట్టాడు. 2004 చివరికి జిల్లా కమిటి కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టాడు. అప్పటి నుంచి జీవన్ పేరుతో జిల్లా అంతటా తిరిగి గుంటూరు జిల్లా వుద్యమ అభివృద్ధికి ఎనలేని కృషి చేశాడు. జిల్లా వుద్యమాన్ని గెరిల్లాజోన్ స్థాయికి ఎదిగించటంలో కామ్రేడ్ జీవన్ భూమిక ఎంతో వుంది. 2006 ఫిబ్రవరిలో రాష్ట్ర కమిటీ సభ్యుడుగా కోఆప్ట్ అయ్యాడు.

2004లో చర్చల సమయంలో దొరికిన లీగల్ అవకాశాన్ని వుపయోగించుకొని మన వుద్యమ ప్రాంతమంతటా వేలాది ఎకరాల భూస్వాముల పట్టా భూముల్ని ప్రజలకు పంపిణీ చేయటం, ప్రజలను అనేక ప్రజా నిర్మాణాలలోకి తీసుకురావటం, బహిరంగ ప్రజా సంఘాలను కూడా సమన్వయంతో పనిచేయించటం, ప్రభుత్వ వ్యతిరేక పోరాటాలలో ప్రజలను కదిలించటం కోసం కామ్రేడ్ జీవన్ కృషి చేశాడు. వరంగల్, హైదరాబాద్ సభలకు వేలాది మందిని తరలించటం కోసం కృషి చేశాడు. ఈ కాలంలోనే భారత విప్లవ నేత కామ్రేడ్ చారుమజుందార్ స్మృతికి చిహ్నంగా ఆయన ఆనాడు అడుగిడిన గుత్తికొండ వద్దనే చారిత్రాత్మక స్మారక స్థూపాన్ని (65 అడుగుల ఎత్తు) నిర్మించటంలో నాయకత్వం వహించాడు. ఈ సభకు 10 లక్షల మంది ప్రజలు వచ్చి తమ ప్రియతమ నాయకునికి నివాళులర్పించారు. అదే విధంగా జూలకల్లు గ్రామంలో జిల్లా అమరవీరుల స్మారక స్థూపం నిర్మించారు.

## మిలటరీ రంగంలో కామ్రేడ్ సూర్యం భూమిక

కామ్రేడ్ సూర్యం అనేక మిలిటరీ చర్యల్లో ముందుండి కమాండర్‌గా నాయకత్వం వహించాడు. మిలిటరీ చర్యలలో ఎప్పుడూ కూడా చొరవ మన చేతుల్లోనే వుండాలనేవాడు. తన ప్లానింగ్ కూడా అలాగే వుండేది. శత్రువుకు అర్థం కాని రీతిలో ఆంబుష్‌ను ఏర్పాటు చేసి, శత్రువును రకరకాల పద్ధతుల్లో ఆకర్షించి మట్టుబెట్టాలని అంటూ కామ్రేడ్ సూర్యం ఆచరణలో చేసి చూపించి మంచి అనుభవాన్ని పార్టీకి అందించాడు.

ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం (పిఎల్‌జిఏ) ఏర్పడిన తర్వాత చేపట్టిన మొట్టమొదటి టిసిఓసి (టాక్టికల్ కౌంటర్ అఫెన్సివ్ క్యాంపెయిన్)లో 2001 ఫిబ్రవరిలో శ్రీశైలం, సుండిపెంట జంట రెయిడ్లలో శ్రీశైలం రెయిడింగ్ పార్టీ కమాండర్‌గా, మే నెలలో జరిగిన ఎర్రగొండపాలెం రెయిడ్‌లో అస్సాల్ట్ టీం కమాండర్‌గా గెరిల్లా బలగాలకు నాయకత్వం వహించాడు.

2001 నవంబర్‌లో కామ్రేడ్ ప్రకాష్ నేతృత్వంలోనే నర్సరావుపేటలోని ఎస్‌ఎస్‌ఎన్ కాలేజిపై రెయిడ్ చేసి 30 పోలీసు ట్రైనింగ్ తుపాకులను, ఒక ఎల్‌ఎంజిని స్వాధీనం చేసుకున్నారు.

2002లో ప్రజలను మానవ కవచాలుగా అడ్డం పెట్టుకొని వస్తున్న పోలీసులకు బుద్ధి చెప్పేందుకు జరిగిన రేమిడిచర్ల బస్సు ఆంబుష్‌కు, బొల్లాపల్లి స్టేషన్‌పై రాకెట్ లాంచర్‌తో దాడి చేసిన చర్యకు, అడిగొప్పుల వద్ద కాలినడకన వచ్చే గ్రేహౌండ్స్ బలగాలపై సర్‌ప్రైజుగా దాడి చేసి నలుగురు గ్రేహౌండ్స్ పోలీసులను మట్టుబెట్టిన చర్యకు కమాండర్‌గా నేతృత్వం వహించాడు. అడిగొప్పుల చర్య వల్ల ఏరియాలో గ్రేహౌండ్స్ బలగాల దూకుడును కొంతవరకు ఆపగలిగారు.

2003లో ఎస్‌సిఎం కామ్రేడ్ కారుమంచి ప్రసాద్ ఎన్‌కౌంటర్‌కి నిరసనగా అద్దంకి పోలీస్‌స్టేషన్‌పై రెయిడ్ చేసి 24 తుపాకులను, 5 వేల తూటాలను స్వాధీనం చేసుకొన్నది కూడా కామ్రేడ్ ప్రకాష్ నేతృత్వంలోనే.

చర్చల అనంతరం ప్రభుత్వం మొత్తం విప్లవోద్యమాన్ని నిర్మూలించటంలో భాగంగా జిల్లా వుద్యమంపై విరుచుకపడింది. ఈ దాడిని తిప్పికొట్టటం కోసం చిలకలూరిపేట, దుర్గి పోలీస్‌స్టేషన్‌లపై రెయిడ్లను నిర్వహించటంలో, కోవర్టులపై దాడులు, శత్రువు హోంగార్డ్‌ల నెట్‌వర్క్‌ను, ఇన్‌ఫార్మర్ నెట్‌వర్క్‌ను ధ్వంసం చేయటంలో ముందుండి నడిపించాడు.

2004లో మానాల ఎన్‌కౌంటర్‌కు (10 మంది కామ్రేడ్స్ కోవర్టు కుట్రకు బలయ్యారు) నిరసనగా చిలకలూరిపేట రెయిడ్‌కు కమాండర్‌గా వుండి నాయకత్వం వహించాడు. ఈ చర్యలో కొన్ని లోపాలు జరిగినప్పటికీ కోవర్టు కుట్రకు ప్రతిఘటనగా వెంటనే జరిగిన ఈ చర్య వల్ల ఆనాడు రాష్ట్ర ప్రభుత్వం వులిక్కిపడింది. ఎంఎల్‌ఏ జంగా కృష్ణమూర్తిపైన దాడి చేసి అతడి గార్డుల దగ్గరున్న స్టెన్ కార్బైన్లను స్వాధీనం చేసుకున్న కొండ్రముట్ల వద్ద సంతకు వచ్చిన పోలీసులపై దాడిచేసి ఎస్‌ఎల్‌ఆర్‌ను గుంజుకున్న దాడిలో కూడా కామ్రేడ్ ప్రకాష్ పాత్ర వుంది.

అట్లాగే గురజాల మండలం మాడుగుల వద్ద మందుపాతర పేల్చి ఎస్ఐ, సిఐలతో సహా 7గురు పోలీసులను గాయపర్చిన ఘటన, కారంపూడి సిమెంట్ ఫ్యాక్టరి వద్ద ఆంబుష్‌లో 7 గురు పోలీసులను గాయపర్చిన ఘటన, 2006లో రావులాపురం వద్ద ఇద్దరు పోలీసులను హతమార్చిన చర్యకు కూడా నాయకత్వం వహించాడు.

అలాగే జిల్లాలో శత్రువు ఏర్పరిచిన హోంగార్డుల నెట్‌వర్క్‌ను అంతమొందించటంలో భాగంగా గుల్లవల్లిలో ఇద్దరు హోంగార్డులను, మర్రివేములలో ఒకడిని నిర్మూలించటంలో పిఎల్‌జిఏను గైడ్ చేశాడు.

శత్రువు రహస్యంగా అభివృద్ధి చేసిన కోవర్టు నెట్‌వర్క్‌ను పసిగట్టి దానిని దెబ్బతీయటంలో కూడా కామ్రేడ్ ప్రకాష్ పాత్ర వుంది. టైలర్ వెంకటేష్, సిరాజ్, నరేష్, అడిగొప్పుల అన్నమ్మ, గరికపాడు కమలమ్మ, శిరిగిరిపాడు వెంకటమ్మలను గుర్తించటంలో వారిని నిర్మూలించటంలో తన కృషి వుంది. అలాగే శత్రువు రకరకాల ఆశలు చూపి తయారు చేసుకున్న ఇన్‌ఫార్మర్ నెట్‌వర్క్‌ను అంతమొందించడంలో భాగంగా దుర్గి మండలంలో పున్నారావును, నలుగురు కామ్రేడ్స్ అమరత్వానికి దారితీసిన పమిడిపాడు ఎన్‌కౌంటర్‌కు కారకులైన మంగలి లక్ష్మయ్య, దారం కోటిరెడ్డిలను పట్టి శిక్షించటం కామ్రేడ్ ప్రకాష్ నాయకత్వంలోనే జరిగింది. 2006లోనే ప్రజా పీడకులైన వాసుదేవరెడ్డి, కాంగ్రెస్ నాయకుడు తుమ్మా రామిరెడ్డి, పోలీస్ ఏజెంట్ అయిన లాయర్ రవి, అడిగొప్పుల వెంకటేశ్వరరావు, భూస్వామి రామాంజనేయులు, పిడుగురాళ్ల నీటిపారుదల శాఖ అధ్యక్షుడు, కాంగ్రెస్ నాయకుడు అయిన గుత్తికొండ వెంకటేశ్వర్లు వంటి నాయకుల్ని, గుత్తికొండ శ్రీను, శిరిగిరిపాడు మాజి సర్పంచ్ వెంకటరెడ్డిని అంతమొందించటంలో కామ్రేడ్ జీవన్ పాత్ర వుంది.

## అనేక శత్రు దాడుల్లో దృఢంగా నిలిచి ప్రతిఘటించిన సమరశీల కమాండర్‌గా...

1999లో పనకమడుగు వద్ద, సుంకేసుల వద్ద, చింతల అగ్రహారం వద్ద, 2001లో దద్దనాల వద్ద, 2003లో అడిగొప్పుల వద్ద, 2004 మార్చిలో పమిడిపాడు, 2005లో నకరికల్లు వద్ద, మర్రివేముల వద్ద ప్లాటూన్‌పై జరిగినదాడిలో, 2006లో చెన్నారంపెంట, బొమ్మలింగం, తమ్మడపల్లె, పచ్చర్ల, మాలకొండపెంట, బోగోలు వద్ద, 2007లో పాపినేనిపల్లె, తిరుమలనాయుని చెరువు వద్ద జరిగిన ఎన్‌కౌంటర్లలో శత్రువుతో వీరోచితంగా పోరాడుతూ క్యాడర్‌ను సమన్వయంతో రిట్రీట్ చేయటంలో సమర్థవంతమైన మిలిటరీ కమాండర్‌గా కా.జీవన్ ఎంతో సమయస్ఫూర్తితో పిఎల్‌జిఏ బలగాలకు నేతృత్వం వహించాడు. 2004 పంచాయితీ ఎన్నికల సందర్భంగా గండిగనుమల వద్ద జరిగిన శత్రు ఆంబుష్‌లో కా.జీవన్‌కు తూటా తగిలి భుజానికి గాయమైంది. అయినా ఏమాత్రం గందరగోళ పడకుండా ప్రతిఘటిస్తూ పిఎల్‌జిఏ బలగాలు రిట్రీట్

అయ్యే విధంగా తోడ్పడ్డాడు. అలాగే 2006లో రాష్ట్ర కమిటీ సమావేశం కోసం బయటకు వెళ్లి ప్రయాణంలో వున్నప్పుడు ఒక ద్రోహి ఇచ్చిన సమాచారంతో కర్నూలు జిల్లా ఆళ్లగడ్డ వద్ద శత్రువు వెంటాడి చేసిన ఫైరింగ్‌లో నిరాయుధంగా వున్న కా.జీవన్ గాయపడినప్పటికీ శక్తినంతటినీ కూడదీసుకొని రాత్రంతా నడుస్తూ ప్రజల సహాయంతో తిరిగి పార్టీ కాంటాక్టుకు రాగలిగాడు.

2006 జూన్‌లో ఎస్‌సిఎం కామ్రేడ్ శ్రీధర్ అమరత్వం, జులైలో రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ మాధవ్ అమరత్వం, ఆ తర్వాత అక్టోబర్‌లో జిల్లా వుద్యమంతో సన్నిహితంగా పెనవేసుకొనిపోయిన ఎస్‌సిఎం కామ్రేడ్ రాఘవులు అమరత్వం వంటి వరుస నష్టాల మధ్యనే వుద్యమాన్ని అంటిపెట్టుకొని శత్రువు చుట్టివేతల మధ్యనే వుద్యమాన్ని కాపాడటానికి తీవ్రంగా కృషి చేశాడు కామ్రేడ్ జీవన్. తాను ధైర్యంగా వుంటూ మిగతా కామ్రేడ్స్‌కు ధైర్యం చెబుతూ వచ్చాడు. ఉద్యమంపై నిర్బంధం విరుచుకపడి పై కమిటితో లింకు తెగిపోయినప్పటికీ శత్రువుకు ఏమాత్రం వెరవకుండా జిల్లా ఉద్యమానికి నాయకత్వం వహించాడు. నష్టాల మధ్యనే నల్లమల, గుంటూరు ఉద్యమాలను నడిపించేందుకు రెండింటిని ఒకే డివిజన్ కమిటి కిందకు తెచ్చి ప్లాటూన్ నిర్మాణం చేపట్టి శత్రువును ప్రతిఘటిస్తూనే ప్రజలతో సజీవ సంబంధాలు కొనసాగించేందుకు ప్రయత్నించాడు.

**సెంట్రల్ రీజినల్ కంపెనీల పొలిటికల్ కమిస్సార్‌గా ....**

2007 జూన్‌లో అనేక ఆదివాసీ తెగలకు, భాషలకు, సంస్కృతులకు, దట్టమైన అడవులకు నిలయమైన దండకారణ్యం, తూర్పుకనుమలతో నిండి వున్న సెంట్రల్ రీజియన్‌లోకి అడుగుపెట్టిన కామ్రేడ్ సూర్యం ఆగస్టులో రీజినల్ కంపెనీ-1 పొలిటికల్ కమీస్సార్‌గా బాధ్యతలు స్వీకరించాడు. అప్పటికే సెంట్రల్ రీజియన్‌లో ప్రజాయుద్ధాన్ని అభివృద్ధి చేయడానికి, రీజినల్ కంపెనీలతో పాటే రీజినల్ కమాండ్ కూడా ఏర్పడగా, సహజంగానే కా.సూర్యం అందులో సభ్యుడయ్యాడు. నూతన ప్రాంతంలోని ప్రజలను, వారి సంస్కృతిని, వారి పోరాట వారసత్వాన్ని, అంతకు మించి వారితో, అక్కడి క్యాడర్లతో మమేకం అయ్యేందుకు వారధి లాంటి భాషలను అధ్యయనం చేస్తూ, కోయ, కుయి, ఒడియాలను నేర్చుకుంటూ, ప్రజల భాషను నేర్చుకునే విధంగా తన కంపెనీలోని కామ్రేడ్స్‌ను నిరంతరం ప్రోత్సహిస్తూ ఆదర్శంగా నిలిచాడు. తనకు ఏమాత్రం పరిచయంలేని హిందీ భాష నేర్చుకోవటం కోసం తన కంపెనీలోనే రోజూ హిందీ స్కూలుకు వెళ్లేవాడు. అనతి కాలంలోనే అక్కడి ప్రధాన భాషల్లో ఒకటైన 'కోయ' నేర్చుకొని పార్టీ డాక్యుమెంట్లపై తన కంపెనీ కామ్రేడ్స్‌కు క్లాసులు కూడా చెప్పాడు.

**చారిత్రాత్మక 'ఆపరేషన్ రోప్ వే'-నయాగఢ్ ఆపరేషన్‌లో ఒక కమాండర్‌గా...**

పిఎల్‌జిఏ బలగాలు దాదాపు 600 కి.మీ. దూరం మార్చింగ్ చేసి, 2008 ఫిబ్రవరి 15న నిర్వహించిన చారిత్రాత్మక 'ఆపరేషన్ రోప్ వే' - నయాగఢ్ ఆపరేషన్‌కు నాయకత్వం వహించిన కోర్‌గ్రూపులో కామ్రేడ్ సూర్యం ఒకరు. ఈ ఆపరేషన్‌లో పిఎల్‌జిఏను శత్రు గుండెలపైకి నడిపించి పాలకవర్గాల్లో గుబులు పుట్టించటంలో తన వంతు పాత్ర నిర్వహించాడు. గోసామా సమరం ఒక పక్క జరుగుతుండగానే వందల తుపాకులను, వేలాది తూటాలను డంపుకు తరలించటంలో శక్తినంతటినీ కూడగట్టుకొని పాల్గొన్నాడు. ఈ ఆపరేషన్ తర్వాత రీజినల్ కంపెనీ-2 నిర్మాణం అయినప్పుడు సిఆర్‌సి కామ్రేడ్ సూర్యంను దానికి బదిలీ చేసింది.

2008 ఆగస్టులో జరిగిన సెంట్రల్ మిలటరీ క్యాంపులో పాల్గొని అనేక విషయాలను నేర్చుకునేందుకు ప్రయత్నించాడు. ఆ క్యాంపులో నేర్చుకున్న విషయాలను తన కంపెనీ కామ్రేడ్స్‌కు, ఎన్‌టి కామ్రేడ్స్‌కి ఇన్‌స్ట్రక్టర్‌గా ట్రైనింగ్ ఇవ్వడంలో తన వంతు పాత్ర నిర్వహించాడు.

2008 జూన్‌లో జరిగిన బండ (ముర్లిగూడ-2) ఆంబుష్‌కు కమాండర్‌గానూ, 2009 ఏప్రిల్‌లో ఒడిషాలోని నాల్కో గనులపై పిఎల్‌జిఏ సాగించిన సాహసిక రెయిడ్‌లో టోటల్ డిప్యూటీగానూ బాధ్యతలు నిర్వహించాడు. దాదాపు 8 గంటలకు పైగా శత్రువుతో హెూరాహెూరీ పోరులో గెరిల్లా బలగాలకు ప్రత్యక్షంగా నేతృత్వం వహించి ఒక నూతన అనుభవాన్ని అందించటంలో ముఖ్య పాత్ర పోషించాడు.

**నారాయణపట్నా భూస్వామ్య వ్యతిరేక ఉద్యమానికి అండగా ..... ప్రజా విజయాలను కాపాడుతూ.....**

ఒడిషాలోని కోరాపుట్ జిల్లా నారాయణ్‌పట్నం ప్రాంతంలో గత 2009 సంవత్సరంలో భూస్వామ్య వ్యతిరేక ఆదివాసీ రైతాంగ పోరాటం ఒక వెల్లువ లాగా సాగింది. అక్కడి ఫాసిస్టు ప్రభుత్వం దానిని పాశవికంగా అణచివేయాలని నిశ్చయించుకొని పాశవిక దాడి ఆరంభించటంతో 2009 నవంబర్ చివర్లో ఆ వుద్యమానికి కీలకమైన నాయకుడిగా వున్న కామ్రేడ్ సింగన్న, కార్యకర్త ఆంధ్రులను పోలీసులు క్రూరంగా హత్య గావించారు. దీంతో ఉద్యమం నూతన మలుపు తిరిగింది. ఉద్యమాన్ని సాయుధ రైతాంగ పోరాటంగా అభివృద్ధి చేయకుండా ముందుకుపోలేని స్థితి ఎదురైంది. సరిగ్గా ఆ సమయంలో అక్కడి కుయి ఆదివాసీ రైతాంగ పోరాటానికి మద్దతుగా పార్టీ పిలుపు మేరకు కామ్రేడ్ సూర్యం నేతృత్వంలో తన కంపెనీ బలగాలు ఆ ప్రాంతానికి వెళ్లి ఆ ఉద్యమానికి సాయుధ మద్దతు అందించాయి. ఇందుకోసం ప్రధాన, ద్వితీయ బలగాలతో కలిపి ఏర్పాటు చేసిన కమాండ్‌కు కమాండర్ ఇన్ చీఫ్‌గా కామ్రేడ్ సూర్యం తన బాధ్యతలను నిర్వహించాడు. ప్రజలు భూస్వాముల నుంచి స్వాధీనం చేసుకున్న పొలాలలో పంట కోస్తున్నప్పుడు తన నేతృత్వంలో పిఎల్‌జిఏ బలగాలు ప్రజలకు రక్షణ వలయాన్ని ఏర్పరచేవి. ఇందులో ప్రజల పాత్రను పెంచటం కోసం ప్రజా మిలీషియాను పెద్దఎత్తున అభివృద్ధి చేసేందుకు కామ్రేడ్ సూర్యం కృషి చేశాడు. రాత్రిపూట శత్రువు ఏరియాలోకి చొచ్చుకొని వచ్చేందుకు ప్రయత్నించినప్పుడు సమయానికి మైన్లు పేలకపోయినా సమయస్ఫూర్తితో తోపులను పేల్చటం ద్వారా ఒక ఎస్‌ఓజి కమాండోను

*(మిగతాది 42వ పేజీలో...)*

రెక్టిఫికేషన్ క్యాంపెయిన్‌లో భాగంగా అధ్యయనం కోసం - 10

# నాయకత్వ పద్ధతులకు సం

జూన్, 1943

1. కమ్యూనిస్టులమైన మనం కార్యనిర్వహణలో రెండు పద్ధతులను తప్పనిసరిగా అవలంభించాలి. అందులో ఒకటి, సాధారణత్వాన్ని నిర్దిష్టత్వంతో జోడించడం; ఇంకొకటి, ప్రజాబాహుళ్యంతో నాయకత్వాన్ని జోడించటం.

2) ఏ లక్షసాధనకైనా, సార్వత్రికమైన విస్తృతమైన పిలుపు ఇవ్వకపోతే విశాల ప్రజారాశులను కార్యాచరణకు కదిలించజాలం. నాయకత్వ స్థానాల్లో వున్న కామ్రేడ్లు సార్వత్రిక పిలుపుకే పరిమితమైతే, దేనికోసం పిలుపు ఇవ్వబడిందో ఆ లక్ష్య సాధనకై వారు వ్యక్తిగతంగానైనా, నిర్మాణపరంగానైనా పిలుపును ఆచరణలో వాస్తవం చేయటానికి నిర్దిష్టంగా పనిలోకి దిగకపోతే, అనుభవాన్ని గడించి ఆ అనుభవాన్ని ఇతర యూనిట్లకు మార్గదర్శకత్వం వహించటానికి ఉపయోగించకపోతే, సార్వత్రిక పిలుపు సరైనదో కాదో పరీక్షించటానికి, తన సార్వత్రిక పిలుపులోని సారాంశాన్ని సంపన్నం చేయడానికి వారికి వీలుండదు. దీనివలన ఆ పిలుపుకు ఫలితం రాకపోయే ప్రమాదం కూడా వుంటుంది. ఉదాహరణకు, 1942 దిద్దుబాటు (రెక్టిఫికేషన్) ఉద్యమంలో సార్వత్రిక పిలుపును నిర్దిష్టత్వంతో జోడించే పద్ధతిని అనుసరించిన, నిర్దిష్టమైన మార్గదర్శకత్వాన్ని ఉపయోగించిన ప్రతిచోటా విజయాలు లభించాయి. ఈ పద్ధతిని అనుసరించనిచోట విజయాలు లభించలేదు. 1943 దిద్దుబాటు ఉద్యమంలో కేంద్ర కమిటీ యొక్క ప్రతి బ్యూరో, సబ్ బ్యూరో, ప్రతి ప్రాంతం, ఆ ప్రాంతానికి సంబంధించిన పార్టీ కమిటీ సార్వత్రిక పిలుపు (సంవత్సరానికంతటికీ దిద్దుబాటు పథకం)ని ఇవ్వడంతోపాటు, ఈ కింది విషయాలను అమలు జరిపి ఆ క్రమంలో అనుభవం సంపాదించాలి. ఆర్గనైజేషన్‌లో నుండి, ఇతర ఆర్గనైజేషన్ల నుండి, పాఠశాలలు సైనిక యూనిట్ల నుండి రెండు లేక మూడు (అంతకు మించకుండా) యూనిట్లను ఎంపిక చేసుకోవాలి. ఆ యూనిట్లను క్షుణ్ణంగా అధ్యయనం చేయాలి. వాటిలో దిద్దుబాటు ఉద్యమ అభివృద్ధికి సంబంధించిన సవివరమైన జ్ఞానాన్ని సంపాదించాలి. ఇంకా, ఈ యూనిట్లలో పనిచేసే వారికి ప్రాతినిధ్యం వహించే సభ్యులలో కొంత మంది యొక్క (ఎక్కువమంది కాకుండా) రాజకీయ చరిత్రను సైద్ధాంతిక స్వభావానికి అధ్యయనంలో వారి ఉత్సుకతకు వారి పనిలో బలమైన బలహీనమైన అంశాలకు సంబంధించిన సవివరమైన జ్ఞానాన్ని సంపాదించాలి. అంతేగాక, ఆ యూనిట్లు ఎదుర్కొంటున్న సమస్యల్ని పరిష్కరించటంలో స్వంతంగా మార్గదర్శకత్వం ఇవ్వాలి. ప్రతి ఆర్గనైజేషన్, పాఠశాలలు, సైనిక యూనిట్ల నాయకులు కూడ కింది యూనిట్ల విషయంలో ఇలాగే చేయాలి. నాయకులు నాయకత్వాన్ని అధ్యయనాన్ని జోడించే పద్ధతి ఇదే. నిర్దిష్టమైన వ్యక్తుల నుండి నిర్దిష్టమైన కింది యూనిట్లలో జరిగిన సంఘటనల నుండి నిర్దిష్టమైన అనుభవాన్ని పొందితే తప్ప నాయకత్వ స్థానంలోని ఎవ్వరుగాని అన్ని యూనిట్లకు సాధారణ మార్గదర్శకత్వాన్ని ఇవ్వగలిగే స్థితిలో వుండరు. అన్ని స్థాయిలలోని నాయకత్వ కేడర్లు అన్వయించటం నేర్చుకునేందుకు ఈ పద్ధతి ప్రతిచోట అనుసరించబడాలి.

3) దిద్దుబాటు ఉద్యమం విజయవంతం కావాలంటే ఉద్యమ క్రమంలో ప్రతి యూనిట్‌లోను కొద్ది మంది కార్యకర్తలతో యూనిట్ నాయకులతో ఆ యూనిట్‌కు కేంద్ర బిందువుగా (న్యూక్లియస్‌గా) నాయకత్వ గ్రూపునొకదానిని ఏర్పరచాలని, ఉద్యమంలో పాల్గొంటున్న ప్రజా బాహుళ్యంతో ఈ నాయకత్వ గ్రూపు సన్నిహిత సంబంధం కలిగి వుండాలని 1942 దిద్దుబాటు ఉద్యమం రుజువు చేస్తున్నది. నాయకత్వ గ్రూపు ఎంత చురుకైనప్పటికీ ప్రజాబాహుళ్యం యొక్క కార్యాచరణతో జతకలవకపోతే దాని కృషి నిష్ఫలమైన కృషే అవుతుంది. అదే విధంగా, తమ కార్యాచరణను సరిగా సంఘటితం చేయడానికి దృఢమైన నాయకత్వ గ్రూపు లేకుండా కేవలం ప్రజాబాహుళ్యం కార్యాచరణ సాగిస్తే ఆ కార్యాచరణ ఎక్కువ కాలం కొనసాగటంగానీ, సరైన దిశలో ముందుకు తీసుకువెళ్లటంకానీ, ఉన్నత స్థాయికి అభివృద్ధి చెందటంకానీ, సాధ్యం కాదు. ఏ ప్రాంతంలోనైనా ప్రజలు సాపేక్షికంగా చురుకైనవారు, మధ్యరకం, సాపేక్షికంగా వెనుకబడినవారు అనే మూడు విధాలుగా వుంటారు. అందుచేత, కొద్ది సంఖ్యలో వుండే చురుకైనవారిని నాయకత్వం వెనుక సమీకరించి, వీరిపై ఆధారపడి మధ్యరకం వారిని అభివృద్ధి చేసి, వెనుకబడిన వారిని తమవైపు తిప్పుకోవటంలో నాయకులు ప్రావీణ్యం కలిగి వుండాలి. ప్రజాపోరాట క్రమంలోనే నెమ్మదిగా, ప్రజాబాహుళ్యంతో సంబంధం కలిగిన సుదృఢమైన నాయకత్వ గ్రూపు ఏర్పడుతుంది. గొప్ప పోరాట క్రమంలోని ప్రారంభ దశలోను, మధ్య దశలోను, చివరి దశలోను, నాయకత్వ గ్రూపు పూర్తిగా మారకుండా అలాగే వుండటం సాధ్యంకాదు. నాయకత్వ గ్రూపులో తక్కువ రకం సభ్యులను దిగజారిన వారిని తొలగించి ఆ స్థానాలలో పోరాట క్రమంలో ముందుకు వచ్చిన చురుకైన కార్యకర్తలను ఉంచాలి. చాలాచోట్ల, చాలా ఆర్గనైజేషన్లలో పని ముందుకు సాగకపోవటానికి ఒక మౌలికమైన కారణం, సంఘటితమైన, ప్రజాబాహుళ్యంతో సంబంధం కలిగిన ఎల్లప్పుడూ ఆరోగ్యవంతంగా వుండే నాయకత్వ గ్రూపు లేకపోవటమే. వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా (కృత్రిమంగా తయారైనది కాదు), చురుకైన సూటియైన అప్రమత్తులైన ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది, విద్యార్థులు కొద్దిమందితోనో ఎక్కువ మందితోనో కూడిన నాయకత్వ గ్రూపు లేకపోయినట్లయితే వంద

# బంధించిన కొన్ని సమస్యలు

– కామ్రేడ్ మావో

మందివున్న పాఠశాలను సరిగా నడపడం సాధ్యంకాదు. పెద్దదైనా, చిన్నదైనా ప్రతి ఆర్గనైజేషన్లో, పాఠశాలలో, సైనిక యూనిట్లో, ఫ్యాక్టరీలో లేక గ్రామంలోనైనా పార్టీని విప్లవీకరించటానికి (బోల్షివైజ్ చేయటానికి) కామ్రేడ్ స్టాలిన్ పేర్కొన్న 12 షరతులలో తొమ్మిదవదైన, నాయకత్వ కేంద్రం (న్యూక్లియస్) ఏర్పాటుకు సంబంధించిన షరతును మనం అనుసరించాలి. ఈ నాయకత్వ గ్రూపుకు నాలుగు అంశాలతో కూడిన పద్ధతిని కేడర్ల విధానానికి సంబంధించిన తన చర్చలో కామ్రేడ్ డిమిట్రోవ్ పేర్కొన్నాడు. అవి ఆశయానికి పూర్తిగా నిబద్ధమై వుండటం, ప్రజాబాహుళ్యంతో సంబంధం కలిగి వుండటం, పరిస్థితులను అన్ని కోణాల నుండి తనకు తానుగా అవగాహన చేసుకోగల నేర్పు, క్రమశిక్షణకు కట్టుబడి వుండటం, యుద్ధం, ఉత్పత్తి, విద్య (దిద్దుబాటుతో కలిపి) – ఈ కేంద్ర కర్తవ్యాలను నిర్వర్తించటంలోను, లేక పనిని తనిఖీ చేయటంలోను, కేడర్ల చరిత్రను పరిశీలించటంలోను ఇతర కార్యకలాపాలలోను సార్వత్రిక పిలుపును నిర్దిష్ట మార్గదర్శకత్వంతో జోడించటంతోపాటు నాయకత్వ గ్రూపును ప్రజాబాహుళ్యంతో జోడించే పద్ధతిని అవలంభించటం చాలా అవసరం.

4) మన పార్టీ కార్యాచరణ అంతటిలోను "ప్రజల నుండి ప్రజల వద్దకు" అనే సూత్రంపై ఆధారపడి మాత్రమే సరైన నాయకత్వం అభివృద్ధి చెందుతుంది. దీని అర్థం: (విడి విడిగా క్రమంలేకుండా) ప్రజలలో వుండే భావాలను తీసుకోవాలి. వాటిని సమీక్షించాలి. (అధ్యయనం ద్వారా వాటిని సమన్వయపరచి క్రమమైన భావాలుగా మలచాలి). తిరిగి ప్రజల వద్దకు తీసుకువెళ్లాలి. ప్రజలు వాటిని తమవిగా భావించి స్వీకరించే వరకు వాటి కోసం నిలబడి కార్యాచరణకు ఉపక్రమించేట్లు చేసేంత వరకు ఆ భావాలను ప్రజలలో ప్రచారం చేస్తూ వివరించాలి. ఈ భావాలు సరైనవోకావో ఆచరణలో పరీక్షించాలి. తర్వాత మరలా ప్రజల నుండి భావాలను గ్రహించి సమీక్షించి, తిరిగి ప్రజల వద్దకు తీసుకెళ్లి వారు ఆ భావాలను హృదయపూర్వకంగా ఆమోదించేట్లు చేయాలి. ఈ విధంగా మరలా మరలా ఎడతెరపి లేకుండా చేయటం వలన ప్రతిసారీ భావాలు మరింత సరైనవిగా, మరింత శక్తివంతంగా, మరింత సంపన్నంగా తయారవుతాయి. ఇదే మార్క్సిస్టు జ్ఞాన సిద్ధాంతం.

5) ఒక ఆర్గనైజేషన్లోగానీ, పోరాటంలోగానీ నాయకత్వ గ్రూపుకు ప్రజాబాహుళ్యానికి మధ్య సరైన సంబంధముండాలనే సూత్రీకరణ, 'ప్రజల నుండి ప్రజల వద్దకు' అనే పద్ధతి ద్వారానే నాయకత్వానికి సరైన భావాలు ఏర్పడతాయనే సూత్రీకరణ, నాయకత్వం యొక్క భావాలు ఆచరణలోకి తీసుకెళ్లినపుడు సార్వత్రిక పిలుపును నిర్దిష్ట మార్గదర్శకత్వంతో జోడించాలనే సూత్రీకరణలను; ఈ సమస్యలపైన మన కేడర్లకు గల తప్పుడు అభిప్రాయాలను సరిదిద్దేందుకు ఇప్పటి దిద్దుబాటు ఉద్యమ సందర్భంలో ప్రతిచోట ప్రచారం చేయాలి. నాయకత్వ కేంద్రాన్ని ఏర్పాటు చేయటానికై చురుకైన కార్యకర్తలను సమీకరించాల్సిన ప్రాముఖ్యతను, ఈ నాయకత్వ కేంద్రాన్ని ప్రజాబాహుళ్యంతో అతి సన్నిహితంగా జోడించాల్సిన ప్రాముఖ్యతను చాలా మంది కామ్రేడ్లు గుర్తించరు, లేదా సరిగా చేయరు. అందుచేత వారి నాయకత్వం పెత్తందారీగా తయారై ప్రజాబాహుళ్యానికి దూరమవుతుంది. ప్రజాపోరాటాల అనుభవాలను క్రోడీకరించుకోవలసిన (సమ్మింగ్ ఆఫ్) ప్రాముఖ్యతను చాలా మంది కామ్రేడ్లు గుర్తించరు, లేదా సరిగా చేయరు. పైగా తాము తెలివైనవారమని విర్రవీగుతూ స్వీయమానసిక ధోరణిని ప్రదర్శిస్తారు. తద్వారా వారి భావాలు ఒట్టివై ఆచరణకు పనికిరానివి అవుతాయి. చాలా మంది కామ్రేడ్లు ఒక లక్ష్యాన్ని నెరవేర్చటానికై సార్వత్రిక పిలుపునిచ్చి దానితోనే సంతృప్తిపడతారు. వెంటనే దానిని నిర్దిష్టమైన మార్గదర్శకత్వంతో అనుసరించవలసిన ప్రాముఖ్యతను గుర్తించరు, లేదా సరిగా చేయరు. అందుచేత వారి పిలుపు పెదవులపైన, కాగితంపైన, లేక సమావేశ స్థలంలోన మిగిలిపోతుంది. వారి నాయకత్వం పెత్తందారీగా తయారవుతుంది. నేటి దిద్దుబాటు కార్యక్రమంలో ఈ తప్పులను మనం సరిదిద్దాలి. మన అధ్యయనంలోను, పనిని తనిఖీ చేయటంలోను, కేడర్ల చరిత్రను పరీక్షించటంలోను భవిష్యత్తులో మన పని మొత్తంలోను నాయకత్వాన్ని ప్రజాబాహుళ్యంతో జోడించే పద్ధతిని, సామాన్యత్వాన్ని నిర్దిష్టత్వంతో జోడించే పద్ధతిని ఉపయోగించటం నేర్చుకోవాలి.

6) నాయకత్వానికి సరైన భావాలు ఏర్పడటానికి ప్రజల నుండి భావాలను తీసుకుని వాటిని సమీక్షించాలి. తర్వాత ప్రజల వద్దకు తీసుకెళ్లి వాటిని వారు తమవిగా భావించి స్వీకరించేవరకు పట్టుదలతో వివరిస్తూ ప్రచారం చేయాలి. వాటిని ఆచరించాలి. ఇదే నాయకత్వానికి ప్రాథమిక పద్ధతి. భావాలను సమీక్షించి వాటిని, తిరిగి ప్రజల వద్దకు తీసుకువెళ్లటంలో సార్వత్రిక పిలుపును నిర్దిష్ట మార్గదర్శకత్వంలో జోడించే పద్ధతిని ఉపయోగించటం చాలా అవసరం. ప్రాథమిక పద్ధతిలో ఇది ఒక భాగం. అనేక విషయాలలో ఇచ్చిన నిర్దిష్ట మార్గదర్శకత్వం నుండి సాధారణ భావాలను (సార్వత్రిక పిలుపును) రూపొందించాలి. వాటిని వివిధ యూనిట్లలో పరీక్షకు గురిచేయాలి. (వ్యక్తిగతంగా చేయటమేగాక అలా చేయమని ఇతరులకు చెప్పటం ద్వారా కూడా) కొత్త అనుభవాలను క్రోడీకరించాలి. ప్రజలకు మార్గదర్శకత్వం ఇవ్వటానికి

మార్గదర్శకాలను రూపొందించాలి. కార్యకర్తలు దీనిని ఉద్యమంలోనేగాక ప్రతి ఇతర పనితోను అమలుపరచాలి. అలా చేయటం ద్వారా గొప్ప నైపుణ్యంతో కూడిన మెరుగైన నాయకత్వం వస్తుంది.

7. కింది యూనిట్లకు ఏ పనినైనా చెప్పటంలో (విప్లవ యుద్ధానికి సంబంధించినదికానీ, ఉత్పత్తి, లేక విద్యకు సంబంధించినది కానీ, పనిని తనిఖీ చేయటానికి, ఆర్గనైజేషనల్ పనికి, గూఢచారి వ్యతిరేక కార్యక్రమానికి సంబంధించినది కానీ), పై ఆర్గనైజేషన్, దాని డిపార్టుమెంట్లు కింద ఆర్గనైజేషన్‌కు బాధ్యుడైన నాయకుని ద్వారా చేయాలి. తద్వారా ఆ పనికి అతను బాధ్యత వహిస్తాడు. ఈ పద్ధతి ద్వారా పని విభజనను, సంఘటితమైన కేంద్రీకృత నాయకత్వాన్ని సాధించవచ్చు. పై స్థాయిలో వున్న డిపార్టుమెంటు కింద స్థాయిలో తనకు అనుబంధంగా వున్న డిపార్టుమెంటు (ఉదాహరణకు, ఆర్గనైజేషన్‌కు, ప్రచారానికి, గూఢచారి వ్యతిరేక కార్యకలాపాలకు సంబంధించిన పైస్థాయి డిపార్టుమెంటు తనకు అనుబంధంగా కింది స్థాయిలో వున్న డిపార్టుమెంటు వద్దకు మాత్రమే పోకూడదు) వద్దకు, కిందిస్థాయి ఆర్గనైజేషన్ మొత్తానికి బాధ్యుడైన వ్యక్తికి (ఉదాహరణకు కార్యదర్శి, అధ్యక్షుడు, డైరెక్టరు, పాఠశాల ప్రిన్సిపాల్) ఏమీ తెలియజేయకుండా బాధ్యతలేని స్థితిలో వుంచి వెళ్లకూడదు. కింది ఆర్గనైజేషన్ మొత్తానికి బాధ్యత వహించే వ్యక్తికి, నిర్దిష్టమైన బాధ్యత కలిగిన వ్యక్తికి తెలియజేసి బాధ్యతనివ్వాలి. పని విభజనను సంఘటిత నాయకత్వంతో జోడించే ఈ కేంద్రీకృత పద్ధతి, మొత్తమంతటికి బాధ్యత వహించిన వ్యక్తిద్వారా నిర్దిష్ట కర్తవ్యాన్ని నెరవేర్చటానికి పెద్ద మొత్తంలోను, అవసరమైనపుడు ఆర్గనైజేషన్‌లోని మొత్తం కేడర్‌ను కదిలించటానికి వీలు కల్పిస్తుంది, తద్వారా వేరు వేరు డిపార్టుమెంట్లలో వున్న కేడర్లలోని లోపాలను అధిగమించడానికి, ఇపుడు చేస్తున్న పనికోసం చాలా మందిని చురుకైన కార్యకర్తలుగా మలచటానికి వీలు కల్పిస్తుంది. ప్రజలతో నాయకత్వాన్ని జోడించటానికి ఇది కూడా ఒక పద్ధతే. ఉదాహరణకు, కేడర్ల చరిత్రను పరీక్షించటం తీసుకుందాం. ఈ పనిని ఏకాకిగా చేసినట్లయితే ఆర్గనైజేషన్ డిపార్టుమెంటులో ఆ పనికి బాధ్యులైన ఏ కొద్దిమందో దానిని నిర్వహించినట్లు ఇదే అది ఏవిధంగానూ సరిగా జరగదు. పనిలో భాగం పంచుకోవడానికి తన సిబ్బందిలో చాలా మందిని, లేక తన మొత్తం సిబ్బందిని తన విద్యార్థులలో అధిక భాగాన్ని లేక మొత్తాన్ని కదిలించగలిగిన నిర్దిష్ట పాఠశాల పాలనాధికారి ద్వారాగానీ, నిర్దిష్ట డిపార్టుమెంటు పాలనాధికారి ద్వారాగానీ ఇది జరిగినట్లయితే, ఇదే సమయంలో నాయకత్వాన్ని ప్రజలతో జోడించే సూత్రాన్ని అన్వయిస్తూ ఆర్గనైజేషన్ డిపార్టుమెంటులోని పైస్థాయి నాయకులు సరైన మార్గదర్శకత్వం ఇవ్వగలిగినట్లయితే అప్పుడు కేడర్ల చరిత్రను పరీక్షించే పని నిస్సందేహంగా సంతృప్తికరంగా జరుగుతుంది.

8. ఏ నిర్దిష్ట స్థలంలోనైనా ఒకే సమయంలో అనేక కేంద్ర కర్తవ్యాలు వుండవు. ఏ సమయంలోనైనా ఒకే ఒక కేంద్ర కర్తవ్యం వుంటుంది; దీనికి అనుబంధంగా ద్వితీయ తృతీయ ప్రాముఖ్యత కలిగిన ఇతర కర్తవ్యాలు వుంటాయి. అందుచేత, ఆ ప్రాంతంలో మొత్తానికి బాధ్యత వహించే వ్యక్తి అక్కడి పోరాట పరిస్థితులను, పోరాట చరిత్రను పరిగణనలోకి తీసుకోవాలి. వివిధ కర్తవ్యాలను సరైన క్రమంలో పెట్టాలి. అతను సొంత ప్లాను లేకుండా, పై స్థాయి ఆర్గనైజేషన్ పంపిన ప్రతి సూచననూ అనుసరించకూడదు. అలా అనుసరించి అనేక కేంద్ర కర్తవ్యాలను, అస్తవ్యస్తతను క్రమరాహిత్యాన్ని సృష్టించకూడదు. వాటి సాపేక్షిక ప్రాముఖ్యతను, అత్యవసరాన్ని తెల్పకుండా, లేదా ఏది కేంద్ర కర్తవ్యమో సూచించకుండా పైస్థాయి ఆర్గనైజేషన్ కింది స్థాయి ఆర్గనైజేషన్‌కు అనేక కర్తవ్యాలను ఇవ్వకూడదు. అలా ఇచ్చినట్లయితే కిందిస్థాయి ఆర్గనైజేషన్లు తమ పనిలో తీసుకోవాల్సిన చర్యలలో అస్తవ్యస్తత ఏర్పడుతుంది. తద్వారా కోరుకున్న ఫలితాలు లభించవు. (చారిత్రక పరిస్థితుల, ఇప్పటి పరిస్థితుల వెలుగులో) ప్రతి ప్రాంతంలోని మొత్తం పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని దానికి అనుగుణంగా ప్లాను చేయటం, పని కేంద్ర బిందువును, ప్రతి దశకు అనుగుణంగా పనిని సరిగా నిర్ణయించటం, ఊగిసలాట లేకుండా నిర్ణయాన్ని అమలుచేయటం, నిర్దిష్ట ఫలితాలను తప్పక సాధించేట్లు చూడటం నాయకత్వ కళలో ఒక భాగం. ఇది నాయకత్వ పద్ధతికి సంబంధించిన సమస్యకూడా. నాయకత్వాన్ని ప్రజలతో జోడించటమనే సూత్రీకరణను, సాధారణత్వాన్ని నిర్దిష్టత్వంతో జోడించటమనే సూత్రీకరణను అమలు జరిపేటప్పుడు ఈ సమస్యను పరిష్కరించటానికి శ్రద్ధ వహించాలి.

9. నాయకత్వ పద్ధతులకు సంబంధించిన వివరాలను ఇక్కడ చర్చించడంలేదు. ఇక్కడ చెప్పబడిన సూత్రాలను ఆధారం చేసుకుని, అన్ని ప్రాంతాలలోని కార్యకర్తలు వీటి విషయంపై లోతుగా ఆలోచిస్తారని తమ సృజనాత్మకతను పూర్తిగా వినియోగిస్తారని ఆశిస్తున్నాం. పోరాటం కష్టతరమయ్యే కొద్దీ స్వీయమానసిక ధోరణులను పెత్తందారీ నాయకత్వ ధోరణులను పూర్తిగా రూపుమాపేందుకు విశాల ప్రజానీకం కోర్కెలతో వారి నాయకత్వాన్ని అతిసన్నిహితంగా జోడించాల్సిన ఆవశ్యకత, సార్వత్రిక పిలుపును నిర్దిష్ట మార్గదర్శకత్వంలో జోడించాల్సిన ఆవశ్యకత చాలా ఎక్కువగా వుంటుంది. మన పార్టీలోని నాయకత్వ స్థాయిలోని కార్యకర్తలు అన్ని సమయాలలోను స్వీయమానసిక పెత్తందారీ నాయకత్వ పద్ధతులకు వ్యతిరేకంగా శాస్త్రీయమైన, మార్క్సిస్టు నాయకత్వ పద్ధతులను నెలకొల్పి మొదటివాటిని నాశనం చేయటానికి రెండవ వాటిని ఉపయోగించాలి. స్వీయమానసిక ధోరణి పెత్తందారీ ధోరణి కలవారు నాయకత్వాన్ని ప్రజలతోను, సాధారణత్వాన్ని నిర్దిష్టత్వంతోను జోడించాలనే సూత్రాలను అర్థం చేసుకోరు. వారు పార్టీ పని పురోగమనాన్ని ఆటంకపరుస్తారు. స్వీయమానసిక పెత్తందారీ నాయకత్వ పద్ధతులను ఎదిరించటానికి విస్తృతంగాను, ప్రగాఢంగాను శాస్త్రీయమైన మార్క్సిస్టు నాయకత్వ పద్ధతులను వృద్ధి చేయాలి. ★

# గెరిల్లా యుద్ధతంత్ర సూత్రాలకు సరైన విధంగా కట్టుబడి వుండడం ద్వారా మేం అత్యంత శక్తివంతమైన శత్రువును కూడా ఓడించగలం!

**– కామ్రేడ్ ఆజాద్**

*(కామ్రేడ్ ఆజాద్ ఎం.ఐ.బి.కీ, హిందూ పత్రికకూ ఇచ్చిన రెండు ఇంటర్వ్యూల నుండి కొన్ని భాగాలను ప్రచురిస్తున్నాం. - సంపాదకమండలి)*

**ప్ర:** మునుపెన్నడూ లేనంత భారీ స్థాయిలో మిలిటరీ దాడి ఏ క్షణంలోనైనా మీ మీద మొదలవ్వచ్చు అని వార్తలు వస్తున్నాయి. మీ పార్టీ దాన్ని ఏవిధంగా ఎదుర్కుంటుంది?

**ఆజాద్:** వాస్తవం ఏమిటంటే, మున్నెన్నడూ లేనంత స్థాయిలో భారీ దాడి ఇప్పటికే మొదలైపోయింది. సెప్టెంబర్ మూడవ వారంలో ఆపరేషన్ గ్రీన్‌హంట్ పేరుతో ఇప్పటిదాకా అన్నిటికంటే పెద్దదైన విప్లవ–ప్రతిఘాతుక ఆపరేషన్‌ను దాదాపు 4 వేల మంది పోలీసులు, కేంద్ర బలగాలూ, యాంటీ–నక్సల్ కోబ్రా బలగాలకు చెందిన 600 మంది ఉన్నతస్థాయి కమాండోల నేతృత్వంలో దంతెవాడ జిల్లాలోని చింతగుప్ప ప్రాంతంలో చేపట్టారు. కొన్ని మీడియా నివేదికలు దీన్ని ఆపరేషన్ రెడ్‌హంట్‌గా వర్ణించాయి. పేరు ఏదైనప్పటికీ, మావోయిస్టుల నేతృత్వంలోని పీడిత ప్రజల చేతుల నుండి ఒక భూభాగాన్ని లాక్కోవడానికి కేంద్ర, రాష్ట్ర బలగాలు చేసిన మొదటి పెద్ద ప్రయత్నం ఇది. దేశవ్యాప్తంగా మా గెరిల్లా జోన్‌లన్నిటిపైనా కేంద్ర పథకంతో ఒకే సమయంలో చేయబోయే దాడికి ఇది ఒక రిహార్సల్ వంటిది.

శత్రువు సింగనమడుగు గ్రామం మీద దాడి చేసినప్పటికి అక్కడ వుండిన మా బలగాల సంఖ్య కేవలం యాభై లేదా అరవై మాత్రమే. కానీ వారు వీరోచితంగా పోరాడి, సంపూర్ణంగా ప్రజల మీదే ఆధారపడుతూ తమకంటే ఎన్నో రెట్లు బలమైన బలగాలు చేసిన దాడిని తిప్పికొట్టాయి. శత్రు బలగాల ప్రతి కదలికకు సంబంధించీ మాకు సమాచారం అందించిందంతా ప్రజలే. అందుకే మా గెరిల్లాలు జంగల్ వార్‌ఫేర్‌లో ప్రత్యేక శిక్షణ పొందిన సోకాల్డ్ కోబ్రాలకు మొట్ట మొదటి అతి పెద్ద దెబ్బను కొట్టగలిగారు. మావోయిస్టు విప్లవకారుల మీద అన్యాయ యుద్ధాన్ని చేయడానికి అక్కడకు పంపారు. ఇద్దరు అసిస్టెంట్ కమాండెంట్‌లతో సహా (ఒకరు మణిపూర్‌కీ, మరొకరు యు.పికి చెందినవారు) వారి మనుషులు ఆరుగురు ఈ నిజమైన యుద్ధంలో తుడిచిపెట్టబడ్డారు. ఈ 'వీర' కోబ్రాలు ఏడుగురు నిరాయుధ ఆదివాసీ గ్రామీణుల్ని హత్య చేయడం ద్వారా, నాలుగు గ్రామాల్ని తగులబెట్టడం ద్వారా తమ 'వీరత్వాన్నీ', తమ 'ధైర్యాన్నీ' చాటుకున్నారు. చనిపోయిన వారిలో ఇద్దరు ముసలివాళ్లు, ఒక ముసలామె ఉన్నారు. 22 మంది మావోయిస్టులు చనిపోయారు అని పోలీసులు చెప్పిన కథనాలు అబద్ధం, అక్కడ ఒక్క మావోయిస్టు కూడా చనిపోలేదు. మా బలగాలు వారిని పది కిలోమీటర్ల దూరం వరకూ తరిమికొట్టాయి. కేంద్రంలోని మన్మోహన్–చిదంబరం ఖాదీ గ్యాంగూ, ఛత్తీస్‌గఢ్‌లోని కాషాయ గ్యాంగూ కలిసి పంపిన ఈ దుండగులపై చేసిన ఎదురు దాడిలో ఆ ప్రాంతం ప్రజలందరూ మాతోనే నిలబడ్డారు. **కొద్దిమంది మావోయిస్టు గెరిల్లాలు చేసిన ఈ వీరోచిత ప్రతిఘటన గెరిల్లా యుద్ధతంత్ర ఎత్తుగడల ఆధిక్యతనూ, మావోయిస్టులకున్న బ్రహ్మాండమైన ప్రజా మద్దతునూ నొక్కి వక్కాణిస్తున్నాయి. తమకన్నా సంఖ్యలో ఎంతో పెద్దదైన, అత్యాధునిక ఆయుధాలతో సాయుధులైన, వైమానిక మద్దతు మొదలైన హంగులు కలిగిన శత్రు బలగాన్ని ఎదుర్కుని ఓడించగలిగిన మా మావోయిస్టు గెరిల్లాల సామర్థ్యాన్ని ఇది సూచిస్తుంది. ప్రజా సముద్రంలో చేపలవలే వుంటూ వారి మీద ఆధారపడ్డం వల్లే ఇది సాధ్యమయింది.**

అక్టోబర్ రెండవ వారంలో మరోసారి చిదంబరం మనుషులు మరో భారీ దాడిని మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో ఎక్కుపెట్టారు. పది వేల మంది గల బలగాలు, ఆకాశం నుండి ఎం.ఐ.–17 హెలికాప్టర్లు సర్వేలెన్స్ చేస్తుండగా ఈ దాడిని చేపట్టారు. శత్రుదేశపు సైన్యం భారత ప్రజల మీద యుద్ధం చేస్తున్నట్లుగా వుండిందది. కానీ మా బలగాలు అక్టోబర్ 13న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల ప్రహసనానికి వ్యతిరేకంగా భారీ రాజకీయ క్యాంపెయిన్ విజయవంతంగా కొనసాగించినాయి.

సామ్రాజ్యవాదుల, దళారీ బడా వ్యాపార సంస్థల తరపున భారత పాలకవర్గాలు అత్యంత పీడితులైన ప్రజానీకంపై ఎక్కుపెట్టిన పాశవికమైన, అపూర్వమైన, భారీ దాడిని ఎదుర్కుని ఓడించడానికి మేం నిర్దిష్టంగా తీసుకునే ఎత్తుగడల వివరాల్లోకి నేను పోదల్చుకోలేదు. నేను ప్రస్తుతం ఒక విషయాన్ని మాత్రం ఆత్మవిశ్వాసంతో చెప్పగలను: **ఈ ఆత్మరక్షణా యుద్ధంలో మా వ్యూహాలు, విధానాలూ, వ్యూహమూ–ఎత్తుగడలూ అన్నీ కూడా విశాల ప్రజారాశుల క్రియాశీలమైన పాత్ర మీదే సంపూర్ణంగా ఆధారపడి రూపొందుతాయి. మా అధీనంలోని ప్రాంతాల్లోని ప్రజలను పూర్తిగా నిర్మూలించకుండా శత్రు వర్గానికి మమ్మల్ని నిర్మూలించడం సాధ్యంకాదు. ఒకవేళ అది ఆదివాసీ జనాభానే నిర్మూలించే విధంగా ఆలౌట్ వార్‌లోకి దిగే సాహసం చేస్తే కనక భారతదేశంలోని మొత్తం సామాజిక–ఆర్థిక చిత్రపటం**

**ఒక మౌలిక మార్పుకు గురవుతుంది, వర్గ శక్తులు రాడికల్‌గా తిరిగి ధృవీకరణ చెందుతాయి.** శాంతికాముక, ప్రజాస్వామిక, దేశభక్తియుత, సెక్యులర్ శక్తులన్నీ, సమాజంలోని అట్టడుగు సెక్షన్ల ప్రజలందరూ ఒకవైపుకు చేరుతారు. అత్యంత అభివృద్ధి నిరోధకమైన, ప్రజావ్యతిరేక నియంతృత్వ, కుట్రపూరిత, ఉన్మాదపూరిత విప్లవ ప్రతీఘాతుక శక్తులన్నీ దానికి వ్యతిరేక దిశలో చేరుతారు. యుద్ధం పురోగమిస్తున్న కొద్దీ, శత్రు కిరాయి బలగాలు మధ్య, తూర్పు భారతాల్ని శ్మశానవాటికలుగా చేసినకొద్దీ ఇటువంటి ధృవీకరణ జరిగి తీరుతుంది. యుద్ధ పిపాసులు వేరుపడిపోయి, అపూర్వమైన సామాజిక, రాజకీయ సంక్షోభాన్ని ఎదుర్కొంటారు. అయితే, మా పార్టీ, పి.ఎల్.జి.ఎ., విప్లవ ప్రజాసంఘాలు, ప్రజల ప్రజాస్వామిక అధికార అంగాల తరపున దేశ ప్రజలకు నేను చెప్పేదేమంటే వారి ప్రత్యక్ష, పరోక్ష మద్దతుతో మేం శత్రు కిరాయి బలగాలను చావుదెబ్బలు కొడతామనీ, ఈ ప్రాంతాలను అంతర్జాతీయ, దేశీయ పందికొక్కులకు అప్పజెప్పాలని చూస్తున్న వారి పథకాలను ఓడిస్తామనీ వారికి హామీ ఇస్తున్నాను.

**ప్ర:** ఇటీవల ప్రపంచంలోని అనేకచోట్ల, ఉదాహరణకు శ్రీలంకలోలాగ, సాయుధ జాతివిముక్తి పోరాటాలు తీవ్రమైన సెట్‌బ్యాక్‌కు గురైన విషయాన్ని పరిగణనలోకి తీసుకున్నప్పుడు, మీరు ఈ అతి శక్తివంతమైన భారత రాజ్యాన్ని ఎదుర్కొని విజయవంతం కాగల్గుతామని ఎలా భావిస్తున్నారు?

**ఆజాద్:** ప్రతి యుద్ధానికీ దాని ప్రత్యేక, విశిష్ట లక్షణాలు వుంటాయి. శ్రీలంకలో ఎల్.టి.టి.ఇ. చేసిన యుద్ధం వివిధ కారణాల రీత్యా తీవ్రమైన సెట్‌బ్యాక్‌కు గురైంది. ఆ కారణాల్ని మా పార్టీ జనరల్ సెక్రటరీ గణపతి ఇటీవల ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో స్పష్టంగా వివరించారు. కార్మికవర్గ నాయకత్వంలో ఒక విశాలమైన భూభాగంలో కొన్ని లక్షల చదరపు కిలోమీటర్ల ప్రాంతంలో జరుగుతున్న ప్రజాయుద్ధాన్ని, ఒక కార్మికవర్గేతర నాయకత్వం కింద ఇండియాలో ఒక జిల్లా అంత ప్రాంతంలో జరిగిన యుద్ధంతో పోల్చలేం. అంతేగాక, మేం నడుపుతున్న ప్రజాయుద్ధం మావో గెరిల్లా యుద్ధతంత్ర సూత్రాల మీద ఆధారపడినది. మా యుద్ధంలో మేం ఒక నిర్ణయాత్మకమైన దశకు చేరుకునేవరకూ ఒక చిన్న ప్రాంతంలో, అవసరమైతే విమానాల నుండి బాంబులు కురిపించగల, మాకన్నా బలవంతుడైన శత్రువుతో మేం స్థావర యుద్ధానికి దిగం. **గెరిల్లా యుద్ధతంత్ర సూత్రాలకు సరైన విధంగా కట్టుబడి వుండడం ద్వారా మేం అత్యంత శక్తివంతమైన శత్రువును కూడా ఓడించగలం. మాకు అనుకూలంగా వున్న దగ్గర, అనుకూలమైన సమయంలో మేం వాడిని దెబ్బకొడతాం తప్ప వాడు మమ్మల్ని ఎప్పుడు, ఎక్కడ రెచ్చగొడితే అక్కడ కొట్టం.** ప్రజలతో కలగలసిపోయి వుండే లేదా నిరంతరం చలనంలో వుండే గెరిల్లాలను వాడి ఏరియల్ సర్వేలు గుర్తించలేవు. వాడి వైమానిక దాడులు తప్పు టార్గెట్లను కొడతాయి, ఒకోసారి వాడి స్వంత బలగాలనే అవి కొట్టచ్చు (చిరునవ్వు). అలా చాలాసార్లు ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్‌లలో జరిగింది. మేం మా మిలటరీ దుస్తుల్ని విడిచేసి సివిల్ దుస్తుల్లో తిరుగుతాం కూడా. మేం ఈ పద్ధతులకు కట్టుబడి వుంటే శత్రువుకు మమ్మల్ని టార్గెట్ చేయడం కష్టతరమౌతుంది.

గెరిల్లాలు భారత సైన్యాన్ని ఎలా ఎదుర్కొని ఓడించాలో నేర్చుకుంటారు, వాళ్లు అమెరికా సైనికుల్ని ఓడించడం కూడా నేర్చుకుంటారు. ఈ విధంగానే గెరిల్లా సైన్యం పుట్టి, ఈ దశదాకా అభివృద్ధి చెందింది. అత్యాధునికమైన నక్సల్–వ్యతిరేక ప్రత్యేక బలగాల్నీ, వివిధ కమాండో బలగాల్నీ ఎలా ఎదుర్కొని వారిని చావుదెబ్బలు కొట్టాలో వారు నేర్చుకున్నారు. కేంద్ర పారా మిలటరీ బలగాల్నీ, అజేయమైన బలగాలుగా వారు చెప్పుకున్న నాగా, మిజో బెటాలియన్లనూ ఎలా ఎదుర్కొని ఓడించాలో వారు నేర్చుకున్నారు. కోబ్రా బలగానికి కూడా మొదటి పెద్ద దెబ్బను కొట్టారు. మావోయిస్టు గెరిల్లా జోన్‌లలోకి ఎప్పుడైనా లోపలకంటా ప్రవేశించే సాహసం చేస్తే భారత సైన్యానికి కూడా వారు తగిన బుద్ధి చెప్తారు. బ్రహ్మాండమైన ప్రజామద్దతుతో, ప్రజాయుద్ధంలో వారి క్రియాశీల భాగస్వామ్యంతో చిదంబరం అండ్ కో పన్నుతున్న కుట్రలను ఓడించి, యుద్ధం తీవ్రం అయ్యే కొలదీ మరింత శక్తివంతంగా ఎదుగుతామని మావోయిస్టులు ఆత్మవిశ్వాసంతో వున్నారు. గతంలో దండకారణ్యంలో సల్వాజుడుం, ఝార్ఖండ్‌లో సేంద్ర, ఎన్.ఎస్.ఎస్., పశ్చిమ మేదినీపూర్‌లో హర్మద్‌బాహిని, సోషల్ ఫాసిస్టుల ద్వారా అభివృద్ధి నిరోధక పాలకులు క్రూరమైన టెర్రరిస్టు క్యాంపెయిన్ ఎక్కుపెట్టిన తర్వాత మా గెరిల్లా సైన్యం గుణాత్మకంగా మరింత శక్తివంతంగానూ, అత్యున్నతమైన దృఢ చిత్తంగల బలగంగానూ అవతరించినట్టే ఇప్పుడూ జరుగుతుంది.

**అణచివేత ప్రతిఘటనకు దారి తీస్తుంది. చిదంబరం మనుషులు ఎంత ఎక్కువగా ప్రజల్ని భయభీతుల్ని చేస్తూ పోతుంటే, ఎంతగా లైంగిక అత్యాచారాలు, బీభత్సం సృష్టిస్తూ పోతుంటే అంతగానూ ప్రజల సాయుధ ప్రతిఘటన తీవ్రమూ, విస్తారమూ అవుతూ పోతుంది.** మా సైన్యమూ అంతే శక్తివంతంగా మారుతూపోతుంది. ఇది చారిత్రక అభివృద్ధిలోని తర్కం. అందుకని మేం శత్రువు తెల్ల బీభత్సం సృష్టించే పరిస్థితిని గతంలో కంటే విస్తృతంగా, మరింత విస్తారంగా సాయుధ ప్రతిఘటనను ఆర్గనైజు చేయడానికి ఉపయోగించుకొంటాం. నేను గతంలో చెప్పినట్టుగా, మేం ప్రజల మధ్యన జీవిస్తాం, శత్రువు మొత్తం జనాభాను నాశనం చేయపూనుకుంటే, మేమూ వారితో పాటు చనిపోడానికే సిద్ధపడతాం తప్ప శత్రువుకు లొంగిపోం.

ప్రజలే చరిత్ర నిర్మాతలు, జార్జి బుష్‌లూ, మన్మోహన్ సింగ్‌లూ, చిదంబరాలూ కాదు. నిస్సహాయులైన కోట్లాది ప్రజల్ని పీక్కుతినే ఈ రాబందులు దేశవ్యాప్తంగా సునామీలా పెంపొందుతున్న ప్రజా తిరుగుబాట్ల వెల్లువలో కొట్టుకుపోకతప్పదు.

**ప్ర:** ప్రభుత్వమూ, ప్రధాన స్రవంతి రాజకీయ పార్టీలూ, కొందరు పౌర సమాజ నాయకులూ కూడా మావోయిస్టులు తమ ఆధీనంలోని ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలను అడ్డుకుని, ప్రజల్ని దుర్భర దారిద్ర్యంలో వుంచేయడం వల్ల వారికి మిలటరీ పరిష్కారాన్ని

ఎంచుకోవడం తప్ప మరో మార్గం లేకుండా పోయిందని నొక్కి చెప్తున్నారు. మీరు అభివృద్ధి కార్యక్రమాలను అనుమతించవచ్చు కదా?

**ఆజాద్:** పాలకవర్గాలు ప్రచారం చేసే మరో భ్రమ ఇది. దీన్నే మీడియా, పౌర సమాజం అనే ముసుగు వేసుకున్న కొందరు సర్కారీ (ప్రభుత్వానుకూల) మేధావులూ చిలకపలుకుల్లా వల్లె వేస్తారు. కాస్సేపు మావోయిస్టులు ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి(?) కార్యక్రమాలను అడ్డుకుంటున్నారనే అనుకుందాం, దాని ప్రభావం ఎంత శాతం జనాభా మీద పడుతోంది? ప్రస్తుతం మావోయిస్టు ఆధీనంలోని ప్రాంతాల్ని తీసుకుంటే, భారత జనాభాలో రెండు శాతం కూడా అక్కడ లేదు. మా ప్రత్యక్ష ప్రభావంలో ఉన్న ప్రాంతాలను తీసుకున్నా, అవి భౌగోళికంగా పెద్ద ప్రాంతంగా వున్నా అక్కడ జనాభా 5 శాతాన్ని మించిలేదు. మరి మావోయిస్టుల ప్రాంతాల్లో అభివృద్ధి జరగడంలేదని ఎడతెరిపి లేకుండా గొంతు చించుకునే ఈ పెద్ద మనుషులు 98 శాతం భారతదేశ జనాభా నివసించే ఇతర ప్రాంతాల్లో ఏం చేస్తున్నట్టు? 77 శాతం భారత ప్రజల్ని కటిక దారిద్ర్యంలో ఉంచుతున్నదెవరు? రోజుకు కేవలం 20 రూపాయల ఆదాయంతో దుర్భర దారిద్ర్యంలో వారు ఎందుకు నివసిస్తున్నారు? ఈ ప్రాంతాల్లో వారి బతుకుల్ని మెరుగుపడనివ్వకుండా, అభివృద్ధి జరపకుండా ప్రభుత్వాన్ని ఆపుతున్నదెవరు? కేవలం పది సంవత్సరాల్లో రెండు లక్షల రైతుల ఆత్మహత్యలకు కారకులెవరు? సామ్రాజ్యవాదుల ఆదేశిత నయా–ఉదారవాద విధానాల ప్రత్యక్ష ఫలితమైన ఈ దారుణమైన మానవ విషాదానికి మన్మోహన్‌సింగ్, చిదంబరంలు బాధ్యులు కారా?

బి.జె.పి., కాంగ్రెస్‌లు రెండూ సామాన్య ప్రజల జీవితాల్ని ప్రత్యక్ష నరకంగా మార్చేశాయి. తమ రక్తసంబంధీకులైన కార్పొరేట్ వ్యాపార సంస్థలకూ, రియల్ ఎస్టేట్ మాఫియాకీ లాభాలు చేకూర్చడానికి వారు ఎస్.ఇ.జడ్.లను పట్టుకొచ్చారు. మావోయిస్టు ప్రభావం వున్న ప్రాంతాలకు అభివృద్ధి కోసం కేటాయిస్తున్న నిధుల్లో ఎంత శాతం నిజంగా అవసరమైనవారికీ, పేదవారికీ చేరుతోంది? ఎంత శాతం రాజకీయ నాయకుల, ప్రభుత్వాధికారుల, కాంట్రాక్టర్ల జేబుల్లోకి పోతోంది? **మావోయిస్టులపై విషం కక్కే ఈ ప్రభుత్వాధికారులూ, పోలీసు ఉన్నతాధికారులూ, రాజకీయ నాయకులే సోకాల్డ్ అభివృద్ధి కోసం కేటాయించిన నిధుల్లో యాభై శాతానికి పైగా మింగేస్తారని అనేక స్వతంత్ర అధ్యయనాలు తెలుపుతున్నాయి.**

**ప్రముఖులైన స్వతంత్ర వ్యక్తులూ, సామాజిక కార్యకర్తలతో కూడిన ఒక ప్రజా కమిటీని ఏర్పర్చి ఈ ప్రభుత్వాధికారులూ, పోలీసు అధికారులూ, రాజకీయ నాయకులూ, వ్యాపారస్తుల ఆస్తుల విషయంలో ఒక ఎంక్వయిరీని నడిపిస్తే, చట్టవిరుద్ధంగా వీరు పోగు చేసుకున్న వేల కోట్ల రూపాయలు బైటకొస్తాయి. వాటిని అప్పుడు సద్వినియోగం చేయవచ్చు. సామ్రాజ్యవాదులూ, భూస్వామ్య శక్తులూ, దళారీ బడా వ్యాపార సంస్థలే నిజమైన అభివృద్ధిని అడ్డుకుంటున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో నిజమైన అభివృద్ధిని అడ్డుకుంటున్నది స్థానిక పెత్తందార్లు, భూమాఫియా, నల్లబజారు వ్యాపారస్తులు, నిర్దాక్షిణ్యమైన వడ్డీ వ్యాపారస్తులు, భూస్వాములే.** అభివృద్ధి పేరుతో లక్షలాది మంది ఆదివాసీలనూ, ఇతర రైతాంగాన్నీ తమ గ్రామాల నుండి నిర్వాసితులను చేస్తున్నారు. అది వాజ్‌పేయి కాషాయ ముఠాగానీ, మన్మోహన్‌సింగ్ ఖాదీ ముఠాగానీ, అధికారంలోని అన్ని ప్రభుత్వాలూ ఇదే పని చేస్తున్నాయి. **ఈ ప్రాంతాల్లో పాలకులు చేస్తున్నదంతా అభివృద్ధి కాదు వినాశనమే.**

ప్రభుత్వం చేపడుతున్న పథకాలన్నింటినీ మావోయిస్టులు వ్యతిరేకిస్తున్నారనడం కూడా వాస్తవం కాదు. ప్రజలకు నిజంగా వుపయోగపడే ఏ పథకాన్నైనా, అది ప్రభుత్వానిది కానివ్వండి లేదా ఎన్.జి.ఒ.లది కానివ్వండి, మేం ఆపం. మా ప్రాంతాలకు ఒకసారి వస్తే ఇది ఏమాత్రం సందేహానికి తావు లేకుండా రుజువు అయిపోతుంది. ఒకవేళ మేం ప్రజల ఆశలు, ఆకాంక్షలకు వ్యతిరేకంగా ఏమన్నా చేస్తుంటే మరి మా పార్టీకి రోజు రోజుకీ పెరుగుతున్న ప్రజాదరణను ఏమని విశ్లేషిస్తారు? మేం కేవలం భారీ విస్థాపనకు దారితీసి, మొత్తం గ్రామాలకు గ్రామాలనే ముంచేసి లేదా రైతాంగం నుండి ఫలవంతమైన పొలాల్ని లాక్కునే ప్రాజెక్టులను మాత్రమే వ్యతిరేకిస్తున్నాం. అంటే పలామూ, గుమ్లా, లాతేహార్ జిల్లాల్లో 223 గ్రామాలను నిర్వాసితం చేసే నేత్రహాట్ ఫైరింగ్ రేంజినీ, మండల్, ఔరంగా వంటి ఆనకట్టల్నీ, లాతేహార్‌లో అభిజీత్ పవర్ ప్రాజెక్టు, ఎస్సార్ స్టీల్ ప్లాంట్‌లను, తూర్పు సింగ్‌భూం, సరైకెలా–ఖార్‌సెవాన్ జిల్లాల్లో భూషన్, జిందల్ ప్రాజెక్టులను (ఇవన్నీ ఝార్ఖండ్‌లోనివి); పల్లెమాడ్ గనులు, బోధ్‌ఘాట్ ప్రాజెక్టు, లోహండిగుడలో టాటా స్టీలు ప్లాంట్ (ఇవన్నీ ఛత్తీస్‌గఢ్‌లోనివి); సాల్బనీలో జిందల్ స్టీల్ ప్లాంట్, ఒడిషాలోని పోస్కో కళింగనగర్ స్టీల్ ప్లాంట్‌లు, ఉత్తరాంధ్రలోని జిందల్ బాక్సైట్ మైనింగ్ ప్రాజెక్టు మొదలైనవాటినే మేం వ్యతిరేకిస్తున్నాం. వీటిని స్థానిక ప్రజల ఆమోదం లేకుండా అనుమతించారు. చాలా కేసుల్లో బలవంతంగా పోలీసుల, మేనేజిమెంట్ గూండాల సహాయంతో భూముల్ని గుంజుకున్నారు. కొన్ని కేసుల్లో గ్రామ సభల్ని పెట్టడం, వారి ఆమోదాన్ని తీసుకోవడం (భయపెట్టీ, గన్నులు గురి పెట్టీ కూడా) అనే నాటకాన్ని ఆడారు. సామ్రాజ్యవాదులతోనూ, దళారీ పెట్టుబడిదారులతోనూ పాలకులు చేసుకున్న రహస్య ఒప్పందాలకు వ్యతిరేకంగానూ, ఈ ప్రజా వ్యతిరేక ప్రాజెక్టులకు వ్యతిరేకంగానూ మేం పోరాడతాం. ప్రజావ్యతిరేకులుగా కరుడుగట్టిన వాళ్లు తప్ప మరెవరూ మేం తీసుకున్న ఈ వైఖరి అభివృద్ధికి వ్యతిరేకం అని అనజాలరు.

**ప్ర:** మీ ఆధీనంలోని ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాల గురించి చెప్పండి

**ఆజాద్:** ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్, బీహార్, పశ్చిమ బెంగాల్, ఆంధ్రప్రదేశ్, ఒడిషా, మహారాష్ట్రలోని విశాలమైన ప్రాంతాల్లో మా ప్రాంతంగా వున్న కొన్ని వేల ఆదివాసీ గ్రామాల్లో మీరు పర్యటిస్తే కనక ఈ దేశ పేద ప్రజలకు నిజమైన అభివృద్ధి అంటే ఏమిటనేది మీరు చూడచ్చు. అన్నిటికంటే మౌలికమైనది, ప్రజల జీవితాల్లో నిజమైన అభివృద్ధిని సాధించడానికి ముందు షరతూ ఏంటంటే వారిపై జరుగుతున్న

భూస్వామ్య, ఇతర రకాల దారుణమైన దోపిడీల్ని అంతం చేయడం. ఆదివాసీ ప్రాంతాల్లో ఫారెస్టు అధికారుల, రెవెన్యూ అధికారుల, కాంట్రాక్టర్ల, గ్రామ పెద్దల, ఆదివాసేతర భూస్వాముల, వ్యాపారస్తుల, పోలీసుల నిర్దాక్షిణ్యమైన దోపిడీ ప్రజల జీవితాల్ని దుర్భరం చేస్తోంది. మన్మోహన్‌సింగ్‌లూ, చిదంబరాలూ పైనుండి కిందకి అభివృద్ధి ఫలాలు బొట్టు బొట్టుగా అందుతాయనీ, ఎదుగుదల కూడా అలా కిందకి మెల్లగా జారుతుందనీ రక రకాల అర్థంలేని పదజాలాన్ని పట్టుకొని ఇల్లెగిరిపోయేలా అరుస్తుండొచ్చు, కానీ పేద ప్రజలకు మాత్రం ఇవన్నీ ఏమాత్రం అర్థం లేనివి, ప్రాసంగికత లేనివి. దయా దాక్షిణ్యం లేని జలగల్లాంటి దోపిడీదారుల చేతుల్లో చిక్కుకుని వున్నంతకాలం పేద ప్రజల జీవితాల్లో ఎటువంటి మెరుగుదలనూ మీరు ఊహించలేరు. ఇది ఆదివాసీ ప్రాంతాలకే కాదు మొత్తం దేశమంతటికీ వర్తిస్తుంది.

అందుకని నేను నొక్కి చెప్పాలనుకుంటున్న మొదటి విషయం ఏంటంటే మా ప్రజాయుద్ధం మా పోరాట ప్రాంతాల్లో జీవిస్తున్న ప్రజలపై జరుగుతున్న ఈ దారుణమైన దోపిడీకీ, పీడనకూ అంతం పలికింది. ఇది దానికదిగానే వారి జీవన స్థితిగతుల్లో ఒక గుణాత్మకమైన గెంతును సాధించింది. బానిస బతుకు నుండి, జంతువుల వంటి జీవనం నుండి ఈ అట్టడుగు మనుషులు నేడు సాపేక్షికమైన స్వాతంత్ర్యాన్ని సాధించారు. తమ జీవితాలను తామే పాలించుకుంటూ తమ భవిష్యత్తును తామే నిర్ణయించుకుంటున్నారు. అయితే పోయిన తమ అధికారాన్ని పునర్ స్థాపించుకుని, ఈ సగర్వమైన స్వాతంత్ర్య సముదాయాల్ని తిరిగి తమ దారుణమైన దోపిడీ కిందకు ఎలాగైనా తేవాలనుకునే ప్రభుత్వ సాయుధ బలగాల, రాజ్య ప్రాయోజిత హంతక ముఠాల దాడులను వారు తిప్పికొట్టాల్సి వస్తోంది. అందుకని ప్రజా ప్రభుత్వాల కింద తాము కొత్తగా సంపాదించుకున్న స్వాతంత్ర్యాన్నీ, గౌరవప్రదమైన జీవితాన్నీ, స్వేచ్ఛనూ కాపాడుకోడానికి చివరి మనిషి వరకు ఆ ప్రజలు పోరాడుతారు.

నేను నొక్కి చెప్పాలనుకుంటున్న రెండో విషయం అభివృద్ధి అనేది మౌలికంగా ప్రజల వర్గపోరాటంతో ముడిపడి వుందనేది. మా పార్టీ నాయకత్వంలో ఆదివాసులు చేస్తున్న పోరాటాల వివరాల్లోకి నేను వెళ్లను. దానిమీద విడిగా సాహిత్యం వున్నది. తునికాకు కాంట్రాక్టర్లు, వెదురు కాంట్రాక్టర్లు, ఫారెస్టు డిపార్టుమెంటు, రోడ్లు పోసే కాంట్రాక్టర్లు, వ్యాపారస్తులు, వడ్డీ వ్యాపారస్తులు, భూస్వాములు మొదలైనవారు చేసే దోపిడీకి వ్యతిరేకంగా మేం పోరాటాలు తీసుకున్నాక ప్రజల నిజ వేతనాలు గణనీయంగా పెరిగాయి. ఈ పోరాటాల ద్వారా ప్రజలు తమ ఆదాయాల్నీ, జీవన ప్రమాణాల్నీ పెంచుకోగలిగారు. మా పార్టీ చేసిన చైతన్యయుతమైన కృషి వల్ల భూస్వామ్య ఆచారాలు, సంప్రదాయాలు, విలువలూ, వైఖరుల నుండి ప్రజలు విముక్తి పొందడం అనేది కూడా ప్రజల చొరవను వెలికితీయడంలో ముఖ్యంగా మహిళల చొరవను వెలికితీయడంలో బ్రహ్మాండమైన భూమికను నిర్వహించింది.

ఇప్పుడిక ప్రజా ప్రభుత్వాలు ఏర్పడ్డాక, వ్యవసాయంలో ఉత్పాదకత పెరగడం, సహకార సంఘాల, పరస్పర సహాయక బృందాల ఏర్పాటు, స్థానిక వనరుల్ని సరిగా వినియోగించడం, చిన్న అటవీ ఉత్పత్తుల మార్కెటింగ్, కోళ్ల ఫారాల ఏర్పాటు, పందుల పెంపకం, చేపల పెంపకం ఇంకా ఇతర ఉత్పాదక కార్యకలాపాల వల్ల వారి జీవితాల్లో మరింత మెరుగుదల వచ్చింది. మా ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలను ప్రజా ప్రభుత్వాలు కొనసాగిస్తాయి. మేం ఈ అభివృద్ధి కార్యక్రమాలను నిరంతరం రాజ్య సాయుధ బలగాలూ, రాజ్య ప్రాయోజిత హంతక ముఠాలూ చేస్తున్న దాడుల మధ్యనే అంటే చాలా తీవ్రమైన పరిమితుల మధ్యనే కొనసాగిస్తున్నామనేది దృష్టిలో వుంచుకోవాలి. అందుకని ప్రజా ప్రభుత్వాన్నీ, ప్రజలు సాధించిన విజయాల్నీ రక్షించుకోవడం కూడా ఈ ప్రభుత్వాల ముఖ్య కర్తవ్యాల్లో ఒకటిగా వుంటుంది. మాకు ప్రతి ప్రజా ప్రభుత్వం కిందా ఎనిమిది విభాగాలు వుండినాయి. కొన్ని నెలల క్రితం మేం వ్యాపారం, పరిశ్రమల విభాగాన్ని కూడా ఏర్పరచడంతో అవి తొమ్మిది అయినాయి. అవి: వ్యవసాయం, విద్య–సంస్కృతి, ఆరోగ్యం, ఆర్థిక వ్యవహారాలు, న్యాయం, అటవీ సంరక్షణ, ప్రజా సంబంధాలు.

ప్రభుత్వం ఎన్నడూ కాలు పెట్టే ప్రయత్నం చేయనిచోట మేం పాఠశాలలు నెలకొల్పాం. ప్రభుత్వం పాఠశాల భవనాల్ని నిర్మించిన చోట వాటిని పోలీసు, కేంద్ర బలగాలకు ఆవాసాలుగా వుపయోగిస్తున్నారు. పేపర్ల మీదే నిర్మించే ఈ పాఠశాలల్లో ఉపాధ్యాయులు అని చెప్పుకోదగ్గ వారు ఎవ్వరూ వుండరు. ఈ గ్రామాలన్నింటిలో మా ఉపాధ్యాయులే పిల్లలకు మౌలికమైన పాఠ్యాంశాలు చెప్పి వారిని అక్షరాస్యులను చేస్తున్నారు. మేం ఆదివాసీ భాషను అభివృద్ధిపరిచి వారి మాతృభాషలో పాఠ్య పుస్తకాలను తయారు చేసి సంస్కృతీ, సంపన్నమైన వారసత్వమూ వికసించే అవకాశాలు కల్పించాం.

అటవీ పరిరక్షణ కోసం, వ్యవసాయంలో ఉత్పాదకతను మెరుగుపర్చడానికీ చైతన్యయుతమైన ప్రజాఉద్యమం వున్నది. ఇప్పుడిక మా గ్రామాలు వేటినుండీ పోలీసు స్టేషన్లకు తగాదాలు పోవు. సహజంగానే, పోలీసులకు తమ చట్టవిరుద్ధమైన సంపాదన పోతోందనే కోపం వుంటుంది. ఒక దశాబ్దం, రెండు దశాబ్దాల క్రితంతో పోలిస్తే ఆరోగ్య పరిస్థితులు గణనీయంగా మెరుగైనాయి. గ్రామాల్లో మేం మౌలిక ఆరోగ్య వసతులను కల్పించాం.

అయితే, ఈ అభివృద్ధి అంతా ఇప్పుడున్న సామాజిక–ఆర్థిక వ్యవస్థ పరిధిలోనే జరుగుతోంది కనక దానికి పరిమితులున్నాయి. అంతేకాక, భారత రాజ్యం, హంతక ముఠాలూ నిరంతరం చేస్తున్న దాడులు అభివృద్ధిని అడ్డుకుని, సాధించిన వాటిని కూడా ధ్వంసం చేస్తున్నాయి.

**ప్ర:** మావోయిస్టులకు కూడా చర్చలకు తమ ముందు షరతులు ఉన్నాయి. జాన్‌మిర్డాల్, నవలఖాలకు ఇటీవల ఇచ్చిన ఇంటర్వ్యూలో గణపతి చర్చల విషయంలో ఈ కింది సూత్రీకరణ చేశారు:

"కుప్లంగా చెప్పాలంటే, ఎటువంటి చర్చలకైనా గానీ మా పార్టీ ప్రభుత్వం ముందు పెట్టిన ప్రధాన డిమాండ్లు ఏంటంటే, 1. ఆలౌట్

యుద్ధాన్ని వెనక్కి తీసుకోవాలి; 2. ఎటువంటి ప్రజాస్వామిక కార్యకలాపాలను కొనసాగించాలన్నా పార్టీ మీదా, ప్రజాసంఘాల మీదా ఉన్న నిషేధాన్ని ఎత్తివేయాలి; 3. కామ్రేడ్స్‌ను చట్టవిరుద్ధంగా బంధించడం, చిత్రహింసలు పెట్టడం నిలిపివేయాలి, వారిని తక్షణమే విడుదల చేయాలి. ఈ డిమాండ్లను ప్రభుత్వం నెరవేరిస్తే, అప్పుడు జైళ్ల నుండి విడుదల అయిన ఆ నాయకులే చర్చలకు నాయకత్వం వహించి చర్చల్లో పార్టీకి ప్రాతినిధ్యం వహిస్తారు."

**నా ప్రశ్నేంటంటే ఇవి వాస్తవికమైన ముందు షరతులేనా అనేది. ఉదా:కు "ఆలౌట్ యుద్ధాన్ని" వెనక్కి తీసుకునే ముందు దాన్ని తాత్కాలికంగా నిలిపివేయచ్చు (సస్పెండ్) అంటే కాల్పుల విరమణ జరగచ్చు. కాబట్టి ముందే దాన్ని వెనక్కి తీసుకోవాలి అనేదాని మీద వక్కాణింపు ఎందుకు? మీరు కాల్పుల విరమణను కోరుకుంటున్నారా లేక అంతకంటే ఎక్కువగా ఇంకేమన్నా కోరుకుంటున్నారా?**

**రెండవది, మీరు పార్టీ మీదా, దాని ప్రజాసంఘాల మీదా నిషేధాన్ని ఎత్తివేయాలనీ, ఖైదీల్ని విడుదల చేయాలనీ కోరుతున్నారు. సాధారణంగా ప్రపంచ వ్యాప్తంగా ప్రభుత్వాలకూ, తిరుగుబాటుదార్లకూ మధ్య జరిగే ఇలాంటి చర్చల్లో నిషేధాన్ని ఎత్తివేయడం చర్చల లక్ష్యాల్లో ఒకటిగానే వుంటుంది తప్ప ముందు షరతుగా వుండదు, అలాగే రాజకీయ ఖైదీల విడుదల మధ్యలో జరిగే చర్యగా వుంటుంది. ప్రతిపాదిత చర్చల్లో చివరగా సాధించే అంశాలుగా కాకుండా ప్రభుత్వం బహుశా ఆమోదించే అవకాశం లేని డిమాండ్లను ప్రారంభ బిందువుగా పెట్టడం ద్వారా మావోయిస్టు పార్టీ గుర్రానికి ముందు బండిని కట్టడం లేదంటారా?**

**ఆజాద్:** నేను మీ వాదనల్లోని తర్కంతో ఏకీభవిస్తున్నాను. ఇటువంటి డిమాండ్లను నిజంగా జరిగే చర్చల్లో భాగంగా పరిష్కరించుకోవచ్చనీ, వాటిని ముందు షరతులుగా పెట్టకూడదనే వాదన తర్కపరంగా తగినదే. కానీ గణపతి వారికిచ్చిన ఇంటర్వ్యూలో చెప్పిన అంశాల స్పిరిట్ ఏంటనేది కూడా మీరు అర్థం చేసుకోవాలి. ఇక్కడ కొంత వివరణ అవసరం. కా. గణపతి చెప్పిన విషయం ఏంటనేది నేను వివరించే ప్రయత్నం చేస్తాను.

**మొదటగా,** ప్రభుత్వం తన ఆలౌట్ యుద్ధాన్ని వెనక్కి తీసుకోవాలి అన్నప్పుడు ఆయన ఉద్దేశ్యం కూడా యుద్ధాన్ని నిలుపుదల చేయాలన్నదే లేదా మరో మాటలో పరస్పర కాల్పుల విరమణే. ఈ విషయంలో ఇంకే విధమైన గందరగోళం అవసరం లేదు. చిదంబరంకు కావల్సినది మావోయిస్టులు ఏకపక్షంగా కాల్పుల విరమణ చేయాలి, కానీ రాజ్యం మాత్రం తన పాశవిక టెర్రర్ క్యాంపెయిన్‌ను కొనసాగిస్తుంది. ఇందుకు భిన్నంగా, సి.పి.ఐ. (మావోయిస్టు)కు కావాల్సినది ఏకకాలంలో ఇరుపక్షాలూ హింసాత్మక చర్యలను ఆపుకోవడం. మొదటి అంశానికి అర్థం ఇది. ఇరువైపులా కాల్పుల విరమణను ముందు షరతు అనలేం. అది యుద్ధంలో మునిగి ఉన్న ఇరుపక్షాలూ చర్చల్లో తర్వాతి దశకు వెళ్లడానికి ఒక అనుకూల వాతావరణాన్ని ఏర్పర్చుకోడానికి సంసిద్ధంగా వున్నాయనడానికి ఒక వ్యక్తీకరణ.

**రెండవది,** పౌర సమాజంలో అనేక మంది వ్యక్తులూ, అనేక సంస్థలూ కోరుకున్నట్లుగా మావోయిస్టులు శాంతియుత చట్టబద్ధ కార్యకలాపాలు చేయాలంటే నిషేధాన్ని ఎత్తివేయడం ఒక ముందస్తు విషయం అవుతుంది. పార్టీపై, ప్రజాసంఘాలపై నిషేధాన్ని ఎత్తివేయకుండా మేం చట్టబద్ధ పోరాటాలనూ, మీటింగులూ వగైరాలను మా పేరు మీద ఎలా ఆర్గనైజు చేస్తాం? ఒకవేళ అలా చేస్తే, వాటికి నిషేధిత పార్టీ మార్గదర్శకత్వం వహిస్తోంది కాబట్టి వాటిని చట్టవిరుద్ధం అని అనరా? మా అభిప్రాయంలో నిషేధం అనేదే ఒక నియంతృత్వ, అప్రజాస్వామిక, ఫాసిస్టు చర్య. కాబట్టి నిషేధం ఎత్తివేత అనేది న్యాయమైన డిమాండ్. దానిని నెరవేరిస్తే కనక అది బహిరంగ ప్రజాస్వామిక పోరాట రూపాలను ప్రోత్సహించడంలో, చర్చలకు అనుకూల వాతావరణాన్ని సృష్టించడంలో చాలా ఉపయుక్తంగా వుంటుంది.

**మూడవది,** కా. గణపతి అడిగింది ఏంటంటే ప్రభుత్వం రాజ్యాంగానికి కట్టుబడి వుండి ఎన్‌కౌంటర్ల పేరుతో చేసే చట్టవ్యతిరేక హత్యలు, చిత్రహింసలూ, అరెస్టులూ ఆపాలనేది. మూడవ అంశంలో 'హత్యలు' అనే పదం చేర్చాలి, అది అక్కడ మిస్ అయింది. ప్రభుత్వాన్ని తన రాజ్యాంగానికి దాన్ని కట్టుబడి వుండమని అడగడంలో నిర్హేతుకమైనది ఏం లేదు. రాజకీయ ఖైదీల విడుదలకు సంబంధించి ఆ డిమాండ్ స్వభావానికి సంబంధించినంత వరకూ అది ఒక మధ్యంతర చర్యగా వుండచ్చు. అయితే చర్చలు జరపడానికి కొంతమంది నాయకుల్ని విడుదల చేయడం అవసరమవుతుంది. లేకుంటే చర్చలు జరపడానికి ఎవరూ వుండరు ఎందుకంటే మొత్తం పార్టీ చట్టవిరుద్ధమైనది కనక. చర్చల కోసం మా నాయకులెవర్నీ మేం అజ్ఞాతం నుండి బైటకు తేలేం.

**ప్ర:** మావోయిస్టులు చర్చల విషయంలో తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవడానికి చర్చల క్రమానికి సౌకర్యంగా వుండేలా ఒక ప్రత్యేకమైన తారీకునుంచి ఏకపక్ష కాల్పుల విరమణను లేదా కంబాట్ ఆపరేషన్లను మొదలుపెట్టకపోవడాన్ని (నాన్ ఇనీషియేషన్ ఆఫ్ కంబాట్ ఆపరేషన్స్–ఎన్ఐసిఒ) ప్రకటించడానికి సిద్ధంగా వున్నారా?

**ఆజాద్:** ఒక పక్కన భారీగా సాయుధమై ఉన్న భారత ప్రభుత్వం తన పాశవిక సాయుధ దాడినీ, విప్లవ ప్రతీఘాతుక యుద్ధాన్నీ నడుపుతుండగా మావోయిస్టులను ఏకపక్ష కాల్పుల విరమణను ప్రకటించమని మీలాంటి మేధావులు అడగడం చాలా వింతగా వుంది. ఒక ప్రత్యేకమైన తారీకు తర్వాత ఏకపక్ష కాల్పుల విరమణ లేదా ఎన్ఐసిఒను ప్రకటించడం కాల్పుల విషయంలో మా చిత్తశుద్ధిని ఎలా నిరూపిస్తుంది? అటువంటి చర్య వల్ల ప్రయోజనం ఏంటి? ప్రజల సంక్షేమం పట్ల ఎటువంటి అక్కరా లేకుండా, దారుణమైన హత్యలూ, లైంగిక అత్యాచారాలూ, అపహరణలూ, చిత్రహింసలూ, వూహకు అందని భయానక అత్యాచారాలన్నీ చేయడంలో పైశాచిక ఆనందం పొందే ఒక శత్రువు పట్ల మమ్మల్ని 'ఇటువంటి ఉదారత్వాన్ని ప్రదర్శించమని'

ఎందుకడుగుతున్నారో నాకర్థం కావడంలేదు. మేం చేసే ఇటువంటి 'ఉదార గాంధీవాద చర్య' దంతెవాడలో, ఇతర చోట్ల పని చేస్తున్న అహింసాయుత గాంధీవాద సామాజిక కార్యకర్తలను కూడా వదిలిపెట్టని హోంమంత్రిత్వ శాఖలోని ఉన్మాదులతో చర్చల క్రమాన్ని ఏ విధంగా సౌకర్యవంతం చేస్తుంది?

ప్ర: ఇటీవల కిషన్‌జీ చేసిన చర్చల ప్రతిపాదనకూ, దాని తర్వాత మావోయిస్టులు కొనసాగించిన హింసకూ, హత్యలకూ వైరుధ్యం వున్నది. హోంమంత్రిత్వ శాఖ అటువంటి సంఘటనల లిస్టు తయారు చేసి మీడియాకు సర్కులేట్ చేశారు. ఈ కాలంలో ప్రభుత్వ దాడిలో ఎటువంటి విరామమూ లేకుండింది అనేదాంట్లో సందేహం లేదు, మీరు కూడా దీనికి ప్రతిగా మీ లిస్టును ఇస్తుండచ్చు, కానీ మావోయిస్టులు చేసిన ఈ దాడుల్లో అనేకం 'ఆత్మరక్షణాత్మకం'గా (డిఫెన్సివ్) కాక 'దాడి పూర్వకం'గా (అఫెన్సివ్) వుండినాయి. చర్చల ప్రతిపాదనకూ, అఫెన్సివ్ మావోయిస్టు దాడులు తీవ్రతరం కావడానికీ పొసుగుతుందా?

**ఆజాద్:** ఇది పైకి చూపిస్తున్నంత క్లిష్టమైన విషయమేమీ కాదు. అసలు విషయం ఏంటంటే మావోయిస్టులు గానీ ప్రభుత్వంగానీ కాల్పుల విరమణను ప్రకటించింది లేదు. మావోయిస్టులు చర్చలకు ప్రతిపాదన చేశారు గానీ ప్రభుత్వం వెంటనే దాన్నో జోక్ కింద కొట్టిపడేసింది. ఇక చిదంబరం వాడే భాష ఏదైనా గానీ అతనికి కావల్సింది మావోయిస్టుల లొంగుబాటు కనక అతను దాన్ని తిప్పికొట్టేశాడు. కాల్పుల విరమణ, చర్చల విషయంలో ప్రభుత్వం సీరియస్‌గా లేనపుడు, తాను కూడా ఏకకాలంలో కాల్పుల విరమణను ప్రకటిస్తానా లేదా అనేది తేల్చకుండానే మావోయిస్టులు హింసను విడనాడాలనే షరతును అది విధిస్తున్నప్పుడు, మావోయిస్టుల హింసాత్మక చర్యల గురించి గొణగడం వల్ల వుపయోగం ఏముంది? కాల్పుల విరమణ ప్రకటించిన రోజు నుండి ఇరువైపుల నుండీ హింసాత్మక చర్యలు ఆగిపోతాయి.

చిదంబరం పంపిన పోలీసు బలగాలూ, పారా మిలిటరీ గ్యాంగులూ చేసిన అసంఖ్యాకమైన అత్యాచారాల వివరాల్లోకి నేను పోవడం లేదు. తెహెల్కా, ఔట్‌లుక్, అలాగే మా మావోయిస్టు ఇన్ఫర్మేషన్ బులెటిన్‌లలో వీటి గురించి విస్తృతంగా వచ్చింది. వివిధ సంస్థల, హిమాంశు కుమార్ లాంటి గాంధీవాదుల ప్రకటనలూ, నిజనిర్ధారణ నివేదికలూ సోనియా–మన్మోహన్‌సింగ్–చిదంబరంల ఫాసిస్టు పాలనలో రాజ్యం ఎంత ఆటవికంగా తయారయ్యిందో స్పష్టంగా చూపుతున్నాయి.

మావోయిస్టుల ప్రతిపాదనను తిప్పికొట్టడాన్ని సమర్థించుకోవడానికి వారి హింసాత్మక చర్యల గురించి కేంద్ర హోంమంత్రిత్వ శాఖ తయారు చేసిన లిస్టు కూడా అంతే ఘోరంగా వుంది. తమ మానసిక యుద్ధంలో భాగంగా హోం మంత్రిత్వ శాఖలోని యుద్ధ పిపాసులు ఎన్ని అబద్ధాల్ని ప్రచారం చేస్తారనేదానికి మీరు ప్రశ్నావళికి జత చేసి పంపిన అనుబంధం పెద్ద ఉదాహరణ. అక్కడ ఉదహరించిన సంఘటనలన్నింటిలోకీ నేను వెళ్లను, ఒక్కటి చెప్తే సరిపోతుంది.

తన అన్యాయ యుద్ధానికి ఆమోదం ఉత్పత్తి చేయడం కోసం మీడియాకి సర్కులేట్ చేసిన అనుబంధంలో కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ప్రస్తావించిన మొదటి "దారుణమైన హింసాత్మక చర్య" ఇదీ: "పశ్చిమ బెంగాల్‌లోని పశ్చిమ మిద్నపూర్ జిల్లా లాల్‌గఢ్‌లో 2010 ఫిబ్రవరి 22న రాష్ట్ర పోలీసు బలగాలు–సి.ఆర్.పి.ఎఫ్. బలగాల సంయుక్త పెట్రోలింగ్ పార్టీ మీద దాడి జరిగింది. తర్వాత జరిగిన ఎదురుకాల్పుల్లో పోలీసే సంత్రాష్ విరోధి జనగనేర్ కమిటీ (పి.ఎస్.బి.జె.సి.) అధ్యక్షుడు లాల్‌మోహన్ టుడు మరణించాడు".

కా. కిషన్‌జీ 72 రోజుల కాల్పుల విరమణకై ప్రతిపాదించిన మూడు గంటల్లోనే ఈ సంఘటన జరిగిందని అంటున్నారు. మావోయిస్టుల ప్రతిపాదనను నిరాకరించడానికి నానా పాట్లు పడుతూ చిదంబరం స్వయంగా ఈ అబద్ధాల "దారుణమైన హింసాత్మక చర్య"ను పదే పదే చెప్తూ వచ్చాడు. **ప్రజాస్వామిక ప్రభుత్వం అని చెప్పుకునే దాని అసలైన ఫాసిస్టు ముఖాన్నీ, ప్రజలపై ఆలౌట్ యుద్ధాన్ని సమర్థించుకోడానికి దాని నీచమైన ప్రయత్నాల్నీ ఈ సిగ్గుమాలిన అబద్ధం బహిర్గతం చేస్తోంది.**

గతంలో చిదంబరం ఖగడియా జిల్లాలో గ్రామస్తుల్ని సి.పి.ఐ. (మావోయిస్టు) చంపేసింది అని కావాలని ఒక ఆరోపణను చేశాడు. ఇటువంటి ఆధారం లేని ఆరోపణను చేసినందుకు సి.పి.ఐ.(మావోయిస్టు)కూ, అబద్ధాల ద్వారా తప్పుదోవ పట్టించినందుకు ప్రజలకూ క్షమాపణ చెప్పాలనే కనీసమైన మర్యాద కూడా అతనికి తెలీదు.

ఇక సంయుక్త పెట్రోలింగ్ పార్టీపై మావోయిస్టుల దాడి అనేది వంద శాతం అబద్ధం. అటువంటి దాడి జరగనే లేదు. ప్రజాదరణ గల నాయకుడూ, పిసిఎపిఎ అధ్యక్షుడూ అయిన లాల్‌మోహన్ టుడునూ, మరో ఇద్దరినీ అంటే పిసిఎపిఎ సభ్యులైన సుచిత్ర ముర్మునూ, ఆమె భర్త యుబరాజ్ ముర్మునూ హత్య చేయాలనే నిర్ణయంలో చిదంబరం స్వయంగా పాలుపంచుకున్నాడని మాకు కచ్చితమైన సమాచారం వుంది. తన ఆధ్వర్యంలోని పారా మిలిటరీ బలగాలు చేసిన ఆకృత్యాన్ని దాచాలనే ఉద్దేశంతోనే చిదంబరం ఈ అబద్ధాన్ని కూస్తున్నాడు. నార్చా గ్రామంలోగానీ, కాంటాపహారిలో గానీ టుడు కుటుంబ సభ్యుల్నే కాదు ఏ ఒక్కర్ని అడిగినా గానీ చెప్తారు– ఆ రోజు రాత్రి దాదాపు వంద మంది సి.ఆర్.పి.ఎఫ్. జవాన్లు ఆయన ఇంటి వద్ద మాటుగాసి, ముగ్గుర్నీ పట్టుకుని దారుణంగా హత్య చేశారు. క్యాంపుకు కాపలాగా ఉన్న సి.ఆర్.పి.ఎఫ్. జవాన్లు కూడా మావోయిస్టులు ఏమీ కాల్పులు జరపలేదని చెప్పారు. ఎందుకంటే పశ్చిమ మిద్నపూర్ ఎస్పీ, ముఖ్యమంత్రి బుద్ధదేవ్, చిదంబరంలు ఏమేం అబద్ధాలు చెప్తున్నారో వాళ్లకు తెలీదు పాపం.

మొదట్లో ఎస్పీ, కోటలాంటి కాంటాపహారి సి.ఆర్.పి.ఎఫ్. క్యాంపు మీద మావోయిస్టు గెరిల్లా దాడిని 'సాహసోపేతం'గా తిప్పికొట్టినపుడు టుడు చనిపోయారని అన్నాడు. తర్వాత, తన కథ ఎంత బోలుగా వుందో, సూర్యుడి మొదటి కిరణాలతోనే అది యెలా ఆవిరైపోతుందో

అర్థమై ఈ గోబెల్స్ శిష్యులు కథనాన్ని మార్చేసి సి.ఆర్.పి.ఎఫ్. రెయిడింగ్ పార్టీ మీద మావోయిస్టు గెరిల్లా దళం (వీరు ముగ్గురూ దీనిలో సభ్యులనేది మరో అబద్ధం!) దాడి చేసినపుడు వీళ్లు ముగ్గురూ చనిపోయారని మరో అబద్ధం సృష్టించారు. **తాము చేస్తున్న భయానక దాడిని సమర్థించుకోవడానికి మన దేశీ జార్జి బుష్‌లూ, డొనాల్డ్ రమ్స్‌ఫెల్డులూ వకఠ్భందీగా రూపొందించుకున్న వ్యూహం ప్రకారమే ఈ అబద్ధాన్ని ప్రచారం చేస్తున్నారు.**

తెహెల్కా పత్రిక, స్టార్ ఆనంద, ఇతర మీడియావారూ ఈ చిదంబరం అబద్ధాన్ని వివరంగా బహిర్గతం చేశాయి. మావోయిస్టు దాడి అనే తన కాకమ్మ కథ గురించి తెహెల్కా, ఇంకొన్ని వార్తా పత్రికలు ఇచ్చిన కథనాల్ని సవాలు చేసే దమ్ముందా చిదంబరానికి? **ఈ అబద్ధం ద్వారా చిదంబరం ఒకే దెబ్బకు రెండు పిట్టల్ని కొట్టాననుకున్నాడు : ఒకటి, కాంటావహారిలో సంయుక్తంగా పోలీసు పార్టీ మీద మావోయిస్టులు దాడి చేసినపుడు చనిపోయాడు అని కథ అల్లడం ద్వారా ఒక ప్రజాదరణ గల ప్రజానాయకుడిని మట్టుబెట్టడాన్ని సమర్థించుకోవచ్చుననుకున్నాడు. రెండు, కల్పిత దాడిని సాకుగా చూపి సి.పి.ఐ. (మావోయిస్టు) నాయకుడు చేసిన 72 రోజుల కాల్పుల విరమణ ప్రతిపాదనను విజయవంతంగా తిప్పికొట్టాననుకున్నాడు.**

చిదంబరం వున్న ఇబ్బందికరమైన స్థితి ఎవరికైనా అర్థమౌతుంది. అతనిపుడు పులి మీద స్వారీ చేస్తున్నాడు. అతనిపుడు రోజూ తన క్రూరమైన దాడిని సమర్థించుకోడానికీ, యూనిఫారం వేసుకున్న తన బలగాలు చేస్తున్న పాశవిక నేరాలకూ, లైంగిక అత్యాచారాలనూ, ఆదివాసుల హత్యలనూ, పెరుగుతున్న అపహరణలనూ, రాజ్య టెర్రరిస్టు దాడి ఫలితంగా గ్రామాలకు గ్రామాలు ఖాళీ చేయించడాన్నీ సమర్థించుకోడానికీ సాకులు వెతుక్కుంటూ ఉండాలి.

ఇక అఫెన్సివ్ చర్యల గురించి –మావోయిస్టుల వైపు నుండి హింస తగ్గిపోవాలని కోరుకునే సుజనులందరికీ నేను స్పష్టం చేయదల్చుకునేదేంటంటే ఒకసారంటూ యుద్ధం మొదలయ్యాక అఫెన్సివ్, డిఫెన్సివ్ చర్యలు అనేవేం వుండదు. అయితే మా విప్లవకర ప్రతిహింస ఒక గణనీయమైన కాలం వరకూ మొత్తంగా ఆత్మరక్షణాయుతంగానే వుంటుంది. దీనర్థం మా మీద ఫైరింగ్ అయితేనే మేం తిప్పికొడతాం అనీ, మిగతా సమయంలో పోలీసులూ, పారా మిలిటరీ, హంతక దళాలూ టెర్రర్‌ని సృష్టించి సామూహిక నరసంహారం చేయడానికి ఆల్ రౌండ్ తయారీలు చేసుకుంటుంటే కూడా మేం ఏం చేయకుండా కూచుంటామనీ కాదు. ఇది స్పష్టం చేయడానికి ఒక ఉదాహరణ – చిదంబరం పంపిన మనుషులు ఒక ఏరియాలో కూంబింగ్ చేస్తున్నారనుకోండి, మాకు ఆ విషయం తెలిస్తే మేం దాడి చేస్తాం, అక్కడి పరిస్థితిని బట్టి ఎన్ని బలగాలను వీలైతే అన్ని బలగాలను మట్టుబెడతాం, తుపాకులూ, మందుగుండూ స్వాధీనం చేసుకుంటాం. వీలైన దగ్గర యుద్ధ బందీలను కూడా పట్టుకుంటాం. ఇదంతా ఎత్తుగడల ఎదురుదాడి అయినప్పటికీ అది మా మొత్తం ఆత్మరక్షణాత్మక వ్యూహంలో భాగంగా వుంటుంది.

యుద్ధ రంగంలో మేం చొరవ చేయకపోతే, శత్రువు చేతుల్లోకి చొరవ పోతుంది.

**ప్ర:** జాన్ మిర్దాల్, నవలఖాలకు ఇచ్చిన ఇంటర్వ్యూలో గణపతి ఇలా అన్నారు: "దేశంలోని అన్ని విప్లవ, ప్రజాస్వామిక, ప్రగతిశీల, దేశభక్తియుత శక్తులకూ, ప్రజలకూ సమీకరణ కేంద్రంగా ఉండగల సామర్థ్యం మరే ఇతర పార్టీకీ, సంస్థకూ లేదని నేను దృఢంగా నొక్కి వక్కాణిస్తున్నాను. అందుకని ప్రస్తుత సందర్భంలో మా పార్టీ అన్ని విప్లవ, ప్రజాస్వామిక, ప్రగతిశీల, దేశభక్తియుత శక్తులనూ, ప్రజలనూ సమీకరించడంలో ప్రముఖ పాత్రను వహించగలదు." దీని ప్రకారం మీరు మావోయిస్టులను ప్రగతిశీల, దేశభక్తియుత విశాల ప్రజల శక్తుల్లో ఒక భాగంగా చూస్తున్నారనుకోవాల్సి వుంటుంది. ఈ శక్తుల్లో ఇంకెవరెవర్ని మీరు భాగంగా చూస్తున్నారు? ఈ శక్తుల్లో ఏ సంస్థలనూ, పార్టీలనూ మీరు ప్రగతిశీల, దేశభక్తియుత శక్తులుగా భావిస్తున్నారు? ఇందులో సి.పి.ఐ., సి.పి.ఐ.(ఎం)లు కూడా భాగమా? కాదా? అలా అనుకుంటే సి.పి.ఐ.(ఎం) లాంటి ఇతర కమ్యూనిస్టు పార్టీల కార్యకర్తలను బెంగాల్‌లో మావోయిస్టులు ఎందుకు చంపుతున్నారు?

**ఆజాద్:** ఇప్పుడే కాదు, ఎప్పుడూ కూడా మమ్మల్ని మేం ఇతర విప్లవకర, ప్రజాస్వామిక, దేశభక్తియుత ప్రజా సెక్షన్ల విశాలమైన శక్తిలో విడదీయరాని భాగంగానే భావిస్తూ వచ్చాం. మొదటగా, ప్రపంచ కార్మికవర్గ అంతర్జాతీయ డిటాచ్‌మెంట్‌లోని అనేక డిటాచ్‌మెంట్లలో మాదీ ఒకటి; విశాలమైన ప్రపంచవ్యాప్త సామ్రాజ్యవాద వ్యతిరేక ఫ్రంటులో మమ్మల్ని మేం భాగంగా పరిగణించుకుంటాం. మా ప్రజా సంఘాలు ఇంటర్నేషనల్ లీగ్ ఆఫ్ పీపుల్స్ స్ట్రగుల్స్ (ఐ.ఎల్.పి.ఎస్.)లో భాగం. అవి అమెరికన్ సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంలో ముందు పీఠిన నిలుస్తున్నాయి.

భారతదేశం లోపల, 1960ల చివరినాటి విప్లవ వెల్లువ మధ్యలో, ప్రత్యేకించి మహత్తర నక్సల్బరీ తిరుగుబాటుతో మా పార్టీ ఉనికిలోకి వచ్చింది. అందుకని మేం భారత రాజకీయ స్రవంతిలోని విప్లవకరమైన అంశం అంతటిలోనూ విడదీయరాని భాగం. మేం 1946–51 నాటి మహత్తర తెలంగాణ సాయుధ వ్యవసాయక తిరుగుబాటుకూ, 1946 నాటి తెభాగా తిరుగుబాటుకూ, మన దేశ విప్లవ రాజకీయ చరిత్రలో ప్రతి ఒక్క కీలకమైన మలుపు వద్దా కేంద్ర నాయకత్వం ద్రోహం చేస్తూ వచ్చినప్పటికీ కూడా, 1921లో ఆవిర్భవించినప్పటి నుండి కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం వహించిన విప్లవకర పోరాటాలన్నిటికీ కూడా వారసులమే.

రెండవదీ, మీ ప్రశ్నకు మరింత ప్రాసంగికత కలదీ ఏంటంటే, కమ్యూనిస్టు విప్లవకారులు రాజకీయంగా (అంటే వారి కార్యక్రమానికి సంబంధించినంత వరకూ) దేశంలోని అన్ని భూస్వామ్య వ్యతిరేక,

సామ్రాజ్యవాద వ్యతిరేక శక్తులతో కూడిన విశాల ప్రజాస్వామిక స్రవంతిలో ఒక భాగం. మా నూతన ప్రజాస్వామిక విప్లవ కార్యక్రమం సారం ఇది.

ప్రగతిశీల (ప్రజాస్వామిక అనడం మరింత తగినదిగా వుంటుంది), దేశభక్తియుత సంస్థలనూ, పార్టీలనూ గుర్తించడానికి సామ్రాజ్యవాద వ్యతిరేక, భూస్వామ్య వ్యతిరేక, ప్రభుత్వ వ్యతిరేక నియంతృత్వ (అథారిటేరియన్) వ్యతిరేక అంశం ఏదైనా వారి కార్యక్రమంలో ఉందా అనేదే కాక వాస్తవమైన ఆచరణలోనూ వారు అలా వున్నారా లేదా అని చూడాల్సి వుంటుంది. ఎంఎల్ విప్లవ శక్తుల్లో అత్యధికుల్ని మేం ఇందులో భాగంగా భావిస్తాం. జాతి విముక్తి సంస్థలైన ఎన్.ఎస్.సి.ఎన్, ఉల్ఫా, మణిపూర్‌లోని పి.ఎల్.ఎ. కాశ్మీర్‌లోని జెకెఎల్ఎఫ్ లను భారత రాజ్యానికి వ్యతిరేకంగా పోరాడుతున్న విశాల ప్రజాస్వామిక శక్తుల్లో భాగంగా చూస్తాం. వివిధ పార్లమెంటేతర ట్రేడ్ యూనియన్ సంస్థలూ; రాజ్యం అండగల హిందూ ఫాసిస్టు సంస్థలచే వేధింపులకు గురవుతున్న మత మైనారిటీలకు చెందిన వివిధ ప్రగతిశీల సంస్థలూ; వివిధ దళిత, ఇతర పీడిత కులాల, ఆదివాసీ, మహిళా సంస్థలూ; ప్రత్యేక తెలంగాణ, గోర్ఖాల్యాండ్, విదర్భ, బుందేల్‌ఖండ్ వంటి డిమాండ్లతో పోరాడుతున్న పార్లమెంటేతర సంస్థలూ; ఎస్.ఈ.జడ్.లకూ, గనులకూ, ప్రజలను భారీగా విస్థాపనకు గురిచేసే బూటకపు అభివృద్ధి ప్రాజెక్టులకు వ్యతిరేకంగా పోరాడే సంస్థలూ; అభివృద్ధి నిరోధక పాలకులు తీసుకొచ్చిన ఉదారీకరణ-ప్రైవేటీకరణ-గ్లోబలీకరణ విధానాలకు వ్యతిరేకంగా పోరాడే సంస్థలూ; బూటకపు ఎన్‌కౌంటర్లకూ, సామూహిక హత్యలకూ, ప్రజల మౌలిక హక్కులన్నిటి ఉల్లంఘనకూ దారి తీస్తున్న అడ్డూ ఆపూలేని రాజ్య నిర్బంధానికీ, పెరుగుతున్న నియంతృత్వానికీ వ్యతిరేకంగా పోరాడేవారూ-ఇలాంటి వాటినన్నిటినీ మేం ఈ విశాల పార్లమెంటేతర ప్రజాస్వామిక ప్రజా వేదికలో భాగంగా పరిగణిస్తాం.

ప్రజల బాగోగుల గురించీ, మొత్తంగా మన దేశ సార్వభౌమత్వం గురించీ నిజంగా అక్కడ వున్న మేధావులూ, ఇతర ప్రజాస్వామికవాదులూ కూడా పెద్ద సంఖ్యలో వున్నారు. ప్రధాన స్రవంతి రాజకీయ పార్టీలనబడే వాటి ద్వారా దేశాన్ని నడిపిస్తున్న ఒక చిన్న పరాన్నభుక్కు వర్గం బాగోగుల పట్ల కాక, దేశ భవిష్యత్తు పట్లా, అత్యధిక మెజారిటీ భారత ప్రజల బాగోగుల పట్లా లోతైన అక్కర కలిగిన నిజమైన దేశభక్తియుత శక్తులుగా వీరందిరినీ మేం పరిగణిస్తాం. మన దేశాన్ని ఒక స్వయం సమృద్ధమైన, నిజమైన ప్రజాస్వామిక సమాజంలో విప్లవకర పరివర్తన చెందించడంలో కీలకమైన పాత్ర వహించగలరు అని మేం భావించే సంస్థల, వ్యక్తుల పేర్లను నేను కావాలనే ప్రస్తావించడం లేదు. **నేడు చిదంబరం, అతడి యుద్ధ క్యాబినెట్ చేపట్టిన భారత మెకార్థిజం దశ గుండా మనం సాగుతున్నాం. వెంటాడి వేధించడాన్నీ, పాశవిక నిర్బంధాన్నీ సమర్థించుకోవడానికీ అన్ని రూపాల నిరసననూ, భారత ప్రభుత్వ నియంతృత్వాన్ని ప్రశ్నించే ప్రతి ఒక్క వ్యక్తినీ మావోయిస్టుగా ముద్ర వేస్తున్నారు వీరు.**

నేడు భారతదేశంలో విప్లవ యుద్ధం వేగంగా పురోగమించడానికి బ్రహ్మాండమైన అవకాశాలు తలుపులు తెరుచుకున్నాయి. ఈ ప్రస్తుత పరిస్థితిని ప్రభావయుతంగా వినియోగించుకుని, మన దేశాన్ని పాలిస్తున్న దళారీ-భూస్వామ్య శక్తులు అమలుచేస్తున్న సామ్రాజ్యవాద నిర్దేశిత విధానాలకు బలౌతున్న వారినందరినీ ర్యాలీ చేసి, మన సమాజంలో ఈ బాధిత సెక్షన్లన్నిటినీ, విప్లవకర, ప్రజాస్వామిక, దేశభక్తియుత శక్తులన్నిటినీ కలుపుకుని ఒక విశాల ఐక్య సంఘటనను ఏర్పర్చడమే విప్లవ పార్టీ కర్తవ్యం. **ఈ అన్ని శక్తుల విశాల ఐక్యతను సాధించడంలో మేం విఫలమైతే, మొత్తంగా భారత ప్రజలకు దాని పరిణామాలు వినాశకరంగా వుంటాయి. ఎందుకంటే ఈ క్రూరమైన సాయుధ దాడి లక్ష్యం కేవలం మావోయిస్టు ఉద్యమాన్ని అణచివేయడం కాదు, భారత రాజ్యం, సామాజిక-రాజకీయ వ్యవస్థల నియంతృత్వ, భూస్వామ్య, పీడన నిర్మాణానికి వ్యతిరేకంగా ప్రజలు చేసే ప్రతి ప్రజాస్వామిక నిరసననూ, పోరాటాన్నీ అణచివేయడం.** ఇదే విషయాన్ని మా పార్టీ జనరల్ సెక్రటరీ కామ్రేడ్ గణపతి ఇటీవల ఇచ్చిన అదే ఇంటర్వ్యూలో వివరించారు.

ఇక సి.పి.ఐ., సి.పి.ఐ(ఎం)ల గురించి మీరు నిర్దిష్టంగా అడిగిన ప్రశ్నకు వద్దాం. వారు విశాలమైన ప్రజాస్వామిక, దేశభక్తియుత శక్తులలో భాగం అవునా, కాదా? **అవును, కాదు** అని కూడా అంటాను. ఈ పార్టీల కింది శ్రేణి కార్యకర్తలకు సంబంధించినంత వరకూ, వారిలోని ఒక సెక్షన్‌లో ఇప్పటికీ కొంత నిజాయితీ, ప్రజల కోసం పని చేయాలనే తపనా కనిపిస్తాయి. కానీ నాయకత్వం సంపూర్ణంగా దోపిడీ వర్గాల వైపుకు చేరిపోయి, కొన్ని పై పై మెరుగులతో ప్రస్తుత వ్యవస్థను యథాతథంగా కొనసాగించే సంస్కరణవాద పంథాని చేపట్టింది. ఇక్కడ కూడా మనం సి.పి.ఐ.కీ, సి.పి.ఐ.(ఎం)కీ తేడా చూడాలి. **మేం రెండిటినీ ఒకే గాటన కట్టడం లేదు. సి.పి.ఐ. నాయకత్వం సి.పి.ఐ.(ఎం) విధానాలపై విమర్శలు చేసింది, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిలబెట్టిన సల్వాజుడుం వంటి విప్లవ ప్రతీఘాతుక హంతక ముఠాలను స్థిరంగా వ్యతిరేకిస్తూ వచ్చింది, అలాగే కేంద్రం చేపట్టిన ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను వ్యతిరేకిస్తోంది.**

సి.పి.ఐ.(ఎం) విధానాల అభివృద్ధి నిరోధక, ప్రజావ్యతిరేక స్వభావాన్ని మనం ముఖ్యంగా అది అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో గమనించవచ్చు. సింగూరు, నందిగ్రాం, లాల్‌గఢ్, ఇంకా ఇలాంటి ఎన్నో పేర్లు సి.పి.ఐ.(ఎం) వేసుకున్న సామ్రాజ్యవాద వ్యతిరేక, నయా ఉదారవాద వ్యతిరేక ముసుగును చించేశాయి. సి.పి.ఐ.(ఎం), దాని వామపక్ష ప్రభుత్వంలోని భాగస్వామ్య పక్షాల సోషల్ ఫాసిస్టు స్వభావం లాల్‌గఢ్‌లో శాంతియుత, ప్రజాస్వామిక ప్రజా ఉద్యమం మీద, ముఖ్యంగా జంగల్ మహల్‌లోని మావోయిస్టు ఉద్యమం మీద వారు చేపట్టిన సంయుక్త దాడి తర్వాత నూట ఒకటోసారి బహిర్గతమయింది. కేంద్రానికి లొంగిపోయిన తర్వాత, బుద్ధదేవ్ జంగల్‌మహల్‌లో తన రక్తపాతాన్ని మరింతగా పెంచడానికి పెద్దెత్తున కేంద్ర బలగాలు కావాలని మొత్తుకుంటున్నాడు. **సి.పి.ఐ.(ఎం) కమ్యూనిస్టు కాదు కదా కనీసం ఒక సంపూర్ణమైన ప్రజాస్వామిక**

## విప్లవోద్యమంతో అనుబంధాల్ని పెనవేసుకున్న కమ్యూనిస్టు వెంకాయమ్మ, శ్యామలలకు జోహార్లు!

ఈ సంవత్సరం జూలై నెలలో కామ్రేడ్ వెంకాయమ్మ (90) అమరురాలైంది. 'స్టాలినో నీ ఎర్రసైన్యం' పాటను వేటపాలెం వెంకాయమ్మ నోట వినని విప్లవాభిమానులుండరు. గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో జరిగిన ప్రతీ విప్లవ కార్యక్రమంలో కామ్రేడ్ వెంకాయమ్మ వుంటుంది. అన్ని తరాల కామ్రేడ్స్‌తో కలగలిసి పోయి అందరినీ ప్రేమించి, అందరి ప్రేమాభిమానాల్ని చూరగొన్న ప్రియమైన అమ్మ. వీరతెలంగాణా పోరాటాన్నీ, రష్యా విప్లవాన్నీ, హిట్లర్ ఫాసిజాన్ని ఓడించిన ఎర్రసైన్యం వీరత్వాన్నీ గొప్ప వుత్సాహంతో చెప్పి పార్టీ శ్రేణుల్ని వుత్సాహపరిచేది. దృఢమైన శరీరంతో, అంతకంటే దృఢమైన చిత్తంతో, ఆత్మీయమైన చిరునవ్వుతో ప్రజాసంఘాలకు మంచి స్ఫూర్తినిస్తూ చివరిశ్వాస వరకూ కమ్యూనిస్టు వెంకాయమ్మగా ప్రజల హృదయాల్లో నిత్యం వెలుగొందింది. విప్లవ సాంప్రదాయాలకు, పార్టీ క్రమశిక్షణకు మంచి నమూనాగా నిలిచిన 'అమ్మ' పట్టుదల ప్రాణంగా బతికింది. మానసికంగా ఎదగని ఒక బిడ్డను చేరదీసి ఓపికగా పెంచి, చివరి వరకు ఆ బిడ్డ పట్ల బాధ్యతలు నెరవేర్చిన తీరు ఆమెలోని మానవీయతను గొప్పగా ఎత్తిపడుతుంది. మనుషులూ, పోరాటాలూ, వర్గ దృక్పథాల పట్ల చెక్కుచెదరని విశ్వాసాన్ని కల్గివుండి, నిరంతరం ఆ విశ్వాసాన్ని ప్రకటిస్తూ, ఆచరిస్తూ తన చుట్టూ వున్న వారిని ప్రభావితం చేస్తూ కన్ను మూసిన కామ్రేడ్ వెంకాయమ్మకు 'క్రాంతి' వినమ్రంగా జోహార్లు అర్పిస్తోంది.

విప్లవోద్యమంతో పాటు వచ్చిన కష్టాలూ, కన్నీళ్లనూ జీవితంలో భాగంగా అనుభవించిన కామ్రేడ్ శ్యామల (60) గుండెపోటుతో జూలై 20న తుదిశ్వాస విడిచింది. విప్లవ రచయిత చెరబండరాజు సహచరిగా విప్లవోద్యమానికి పరిచయమైన శ్యామల ఏనాడూ విప్లవ స్రవంతి నుండి విడివడినది లేదు. తన జీవిత భాగస్వామిని రాజ్యం నిరంతరం వేధించి చివరికి మరణానికి గురిచేసింది. తన అల్లుడినీ హత్య చేసింది. ఆమెను కూడా నిత్యం వెంటాడి వేధించింది. ఆ వేదనకూ, వేధింపులకూ తోడు నిండా అలుముకున్న దారిద్ర్యం, కూతురు అనారోగ్యం, అకాలమరణం... వీటన్నింటినీ సహనంతో భరించి చిరునవ్వుతో జీవితనావను నడిపిన కామ్రేడ్ శ్యామల భవిష్యత్తరాలకు విప్లవ సాంప్రదాయాన్నీ, విలువలనూ అందించిన ఆదర్శమూర్తి. చెరబండరాజు మరణానంతరం ఆయన నవలకు ప్రకటించిన ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డును తిరస్కరిస్తూ కామ్రేడ్ శ్యామల స్పందించిన తీరు, చేసిన విమర్శనాత్మక విశ్లేషణ ఆమెలో పరిణతి చెందిన చైతన్యానికి సూచిక. కాలికొనగోటితో కూడా ఆ అవార్డ్‌ను తాకనని ఆమె రాజ్య ధిక్కారాన్ని నిర్భయంగా ప్రకటించింది. విప్లవ శిబిరంలో ఎన్నటికీ చెదిరిపోని జ్ఞాపకంగా నిలిచినపోయిన కామ్రేడ్ శ్యామలకు 'క్రాంతి' వినమ్రంగా జోహార్లు అర్పిస్తోంది.

**శక్తి కూడా కాదు. అయితే వారు ప్రజల మౌలిక సమస్యల మీద పార్లమెంటేతర పోరాటాల్లో ముందుకు వస్తే, వారు ప్రజాస్వామిక విలువల్ని ఎత్తిపట్టిన మేరకు మేం ఈ రివిజనిస్టులతో కూడా కలిసి పని చేయడానికి సిద్ధం.**

మేం సి.పి.ఐ.(ఎం) కార్యకర్తలను చంపుతున్నామనడం సరికాదు. మేం వారి పార్టీ నాయకత్వం పోషించే హర్మద్ బాహిని వంటి సోషల్ ఫాసిస్టు దళాల, ఇతర సాయుధ గూండాల సాయుధ దాడిని ఎదుర్కుంటూ వీరోచితంగా ప్రతిఘటిస్తున్నాం. వేలాది మంది ఆదివాసులూ, ఇతర ప్రజలూ ఏ విధంగా సి.పి.ఐ.(ఎం) ఆఫీసులకు వెళ్లి వాటిని ధ్వంసం చేశారో, సి.పి.ఐ.(ఎం) పూర్తి కాలం కార్యకర్తగా చెప్పబడే అనుజ్ పాండేకి చెందిన రాజభవనం లాంటి ఇల్లును క్రోధిత ప్రజారాశులు ఎలా కూలగొట్టాయో మీకు తెలిసే వుంటుంది. వారి ముఖాల్లోని ఆగ్రహం సంవత్సరాల తరబడి సి.పి.ఐ.(ఎం) గూండాలు చేసిన పీడన ఫలితంగా జ్వలించినదే. మావోయిస్టులు ఆ ఆగ్రహ ప్రవాహాన్ని కృత్రిమంగా సృష్టించడం సాధ్యంకాదు. **సి.పి.ఐ.(ఎం)కి వ్యతిరేకంగా జరిగిన పోరాటం దోపిడీ, పీడనలకు వ్యతిరేకంగా ప్రజలు చేసే వర్గపోరాటంలో భాగమే.** మేం వారిని ఏ సమస్య మీదనైనా గానీ బహిరంగ చర్చకు రమ్మని సవాలు చేస్తున్నాం. మావోయిస్టుల పై మా పోరాటం ప్రధానంగా రాజకీయమైనది అంటూ వారు కూటిలనీతిపరమైన, అవకాశవాద వైఖరిని ప్రకటించినప్పటికీ (వారు తమ కొత్త గురువు చిదంబరంగారి నుండి వాస్తవాన్ని మసిపూసి మారేడుకాయ చేసే విద్యను నేర్చుకున్నట్లున్నారు), మావోయిస్టుల పై భారత పాలకవర్గాలు చేపట్టిన యుద్ధంలో వారు ముందు పీఠిన ఉన్నారు. మమ్మల్ని సైద్ధాంతికంగా, రాజకీయంగా ఎదుర్కోలేక, వారి నాయకులూ, అధికార ప్రతినిధులూ మాపై పచ్చి అబద్ధాలూ, బురద చల్లడాలతో కూడుకున్న దుష్ప్రచార క్యాంపెయిన్‌ను చేపట్టారు. **కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వినాశకరమైన విధానాలకు వ్యతిరేకంగా చేసే పోరాటంలో ఇతర శక్తులతో కలిసి పోరాడేలా ఐక్యం కావడానికి ముందుకు రావాలనీ, మావోయిస్టు ఉద్యమంపైనా, అన్ని రూపాల ప్రజాస్వామిక నిరసన పైనా అమెరికా సామ్రాజ్యవాదుల మార్గదర్శకత్వంలో అభివృద్ధి నిరోధక పాలకులు చేస్తున్న పాశవిక యుద్ధాన్ని వ్యతిరేకించడంలో ఇతరులతో చేయి కలపాలనీ మేం సి.పి.ఐ.(ఎం), ఇతర వామపక్షాల(?) పార్టీల కార్యకర్తలకు పిలుపునిస్తున్నాం. విశాల ప్రజారాశుల పక్షం వహించడానికి మేం సిద్ధంగా వున్నాం.**

★

(...29వ పేజీ తరువాయి)

హతమార్చి ముగ్గురిని గాయపర్చడం ద్వారా శత్రు కిరాయి మూకల్ని నారాయణపట్నా వరకూ వురికే విధంగా బెంబేలెత్తించాడు. ఈ ఘటన చిన్నదే అయినా ప్రజల్లో ఆత్మవిశ్వాసాన్ని ఎంతగానో పెంచింది. దీంతో పంటల కోతల ఉద్యమం పూర్తిగా విజయవంతమైంది.

ఆ తర్వాత ఆ ప్రాంతంలో కత్తులపేట గ్రామంలో విప్లవోద్యమానికి వ్యతిరేకంగా శాంతి సంఘంగా సంఘటితమైన రివిజనిస్టు భూస్వాములకు వ్యతిరేకంగా వందలాది మిలీషియాను కూడగట్టి వారిని నిర్మూలించిన, బల్లిపట్ట గ్రామంలో ప్రజా వ్యతిరేకి గోకుల్ పండాను ఖతం గావించిన చర్యలకు, నారాయణపట్నం పట్టణానికి దగ్గరగా 2010 జనవరి 23 గెత్తెల వద్ద, 24న బాసుపుట్ వద్ద జరిగిన ఆంబుష్‌లకు కూడా తానే నాయకత్వం వహించాడు. నారాయణపట్నం భూస్వామ్య వ్యతిరేక వుద్యమం నుంచి ఆవిర్భవించిన విప్లవ ప్రజా మిలీషియా 'ఘెనువా బాహిని' బలగాలకు మిలిటరీ క్యాంపులు నిర్వహించి బూబీట్రాపులు అమర్చడం, శత్రువుపై మాటుదాడి చేయటం (ఆంబుష్)లో ప్రత్యేకించి శిక్షణ నిచ్చేందుకు కృషి చేశాడు.

ఈ కాలంలో 'రిపబ్లిక్ డే'కు నిరసనగా, కా.అప్పారావు, రమణల బూటకపు ఎన్‌కౌంటర్లకు నిరసనగా మార్చి చివరో జరిగిన బంద్ సందర్భంగా కామ్రేడ్ సూర్యం పెద్దయెత్తున వేలాది మంది ప్రజలను, ప్రజా మిలీషియా బలగాలను కూడగట్టి అనేక ప్రతిఘటనా చర్యలు, రోడ్డు బ్లాకులను విజయవంతం చేశాడు.

ఒకవైపు మిలిటరీ చర్యలు నిర్వహిస్తూనే, మరోవైపు కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు సాగిస్తున్న పాశవిక గ్రీన్‌హంట్ ఆపరేషన్‌కు వ్యతిరేకంగా ప్రజల్ని చైతన్యవంతం చేసేందుకు ప్రచార కార్యక్రమాలు, అందులో భాగంగానే మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినం శతాబ్ది వుత్సవాల సభలు, నారాయణపట్నంలో వేలాది ప్రజలతో ర్యాలీ నిర్వహించటం వంటి ప్రజాకృషిలో కూడా కామ్రేడ్ సూర్యం క్రియాశీలంగా పాలుపంచుకున్నాడు. తన బలగాలను గైడ్ చేశాడు.

**వైవాహిక జీవితం**

1998లో కామ్రేడ్ సూర్యంకు తన దళంలోనే పనిచేస్తున్న ఒక కామ్రేడ్‌తో వివాహం జరిగింది. వైవాహిక జీవితం ఉద్యమానికి తోడ్పడేలా, లోబడి వుండాలని తాను దృఢంగా విశ్వసించేవాడు. అందువల్లే వ్యక్తిగత జీవితం ఎన్నడూ ఉద్యమానికి ఆటంకం కాకుండా చూసుకోగలిగాడు. తన సహచరికి వీలైనంత మేరకు తోడ్పడుతూ సహకరించేవాడు. పితృస్వామిక ధోరణులు అతి తక్కువగా వున్న కామ్రేడ్లలో తనని ఒకడిగా చెప్పుకోవచ్చు.

**కామ్రేడ్ సూర్యం ఆదర్శాలను ఎత్తిపడదాం! నేర్చుకుందాం!!**

కామ్రేడ్ సూర్యం సాదాసీదా మనిషి. తాను ఎక్కడ వున్నా కొత్త పాత అనేది లేకుండా ప్రజలతో, క్యాడర్లతో కలిసిమెలసి వుంటూ వారి విశ్వాసాన్ని చూరగొనేవాడు. తద్వారా ఎక్కడికి వెళ్లినా అక్కడి పరిస్థితులను తెలుసుకునేవాడు. ఏరియా రాజకీయ పరిస్థితి, ప్రజల చైతన్యం-వారి స్థితిగతులు, అక్కడి టెర్రయిన్‌ను అధ్యయనం చేస్తూ పట్టు సాధించి ఆత్మవిశ్వాసంతో పిఎల్‌జిఏ బలగాలకు నాయకత్వం వహించేవాడు. తాను సెంట్రల్ రీజియన్‌కు వచ్చినప్పుడు డికె, ఎఒబి, ఎన్‌టి వుద్యమాలను అర్థం చేసుకుంటూ, అక్కడ టెర్రయిన్ అర్థం చేసుకుంటూ అనేక ప్రాంతాలను సర్వే చేసి మ్యాపులు తయారు చేస్తూ తన కంపెనీకి అర్థం చేయిస్తూ వుండేవాడు. తన సహచర కామ్రేడ్స్‌కు ప్రతి విషయంలోనూ చేదోడు వాదోడుగా వుంటూ తమ బాధ్యతలను తాము నిర్వహించే విధంగా వారిని ప్రోత్సహిస్తూ వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేవాడు. కామ్రేడ్ సూర్యంకు కుయి, ఒడియా భాషలు రాకపోయినా నేర్చుకునేందుకు ప్రయత్నం చేస్తూ కుయి ప్రజలతో, క్యాడర్లతో కలిసిపోయి వచ్చిరాని కుయి భాషలో మాట్లాడుతూ, వాళ్ల సమస్యలను తెలుసుకుంటూ వాళ్లకు రాజకీయాలు బోధించేందుకు పట్టుదలతో కృషి చేశాడు. తనకు భాష ఎన్నడూ ఒక ఆటంకం కాలేదు.

తాను కష్టపడి పనిచేస్తూ, శ్రమను గౌరవిస్తూ ఇతరులకి శ్రమలో పాల్గొనమని ప్రోత్సహించేవాడు. ఎంత దూరమైనా నడిచేవాడు. బరువులు మోయడంలో పోటీ పడేవాడు. కష్టాలలో వున్న కామ్రేడ్స్‌కు మద్దతునిచ్చేవాడు. ఆర్థిక విషయాల్లో కూడా పొదుపుగా వుండేవాడు. సామాన్య ప్రజలు ఏ విధంగా వుంటున్నారో అదే విధంగా మనమూ వుండాలనేవాడు. కమ్యూనిస్టు విలువలను, నియమాలను పాటిస్తూ, సామ్రాజ్యవాద సంస్కృతిని గట్టిగా వ్యతిరేకించేవాడు. ఎప్పుడూ ఆదర్శవంతంగా వుండేందుకు ప్రయత్నించేవాడు. రెయిడ్లలో, ఆంబుష్‌లలో కామ్రేడ్స్ అంతా అలసిపోతే తానే వంట చేసేవాడు. ప్రజలను గౌరవించడం, వారిని ప్రేమించడం కామ్రేడ్ సూర్యం సహజ లక్షణంగా వుండేది. ప్రజలతోనే వుంటూ వారి ఆప్యాయతలను పొందిన ప్రజా నాయకుడు అతను.

కొంతమంది కామ్రేడ్స్ మంచిగా వున్న ఏరియాలోకి పోయి వుండాలని కోరుకుంటారు. కాని కామ్రేడ్ సూర్యం అలా కాదు. కష్టాలు ఎక్కడ వుంటాయో అక్కడకి పోయి ఆ కష్టాలను స్వీకరించి పనిచేయాలని కోరుకునేవాడు. చాలామంది నల్లమలలోని వెనుకబడిన చెంచు ఆదివాసుల్లోకి వెళ్లి పనిచేయడానికి వెనకా ముందూ ఆడితే తను మాత్రం చెంచు ప్రజల్లోకి పోయి వారి సమస్యలు తెలుసుకొని వారి వెనుకబాటుతనాన్ని పోగొట్టేందుకు కృషి చేశాడు. తద్వారా చెంచు ఆదివాసీలలో చెరగని ముద్ర వేశాడు. పార్టీ అవసరం ఎక్కడుంటే అక్కడికి వెళ్లి తన బాధ్యతల్ని నిర్వహించిన కమ్యూనిస్టు విప్లవకారుడు కామ్రేడ్ సూర్యం. పార్టీ, విప్లవోద్యమ అవసరాలకు అనుగుణంగా తన జీవితాన్ని మలచుకున్నాడు. అమరుడయ్యేంత వరకూ కూడా ఎన్ని కష్టాలు వచ్చినా వెనుకా ముందూ ఆడకుండా పనిచేస్తూ మన పార్టీ, పిఎల్‌జిఏ శ్రేణులకు ఆదర్శంగా నిలిచిపోయాడు.

రాజకీయంగా, మిలిటరీపరంగా తాను ఎదుగుతూ ఇతరులను ఎదిగించటం కోసం ఎప్పుడూ ప్రోత్సాహించేవాడు. కేడర్‌ను ప్రేమిస్తూ వారి ప్రేమా ఆప్యాయతలను చూరగొన్నవాడు. మహిళా కామ్రేడ్స్‌ను గౌరవిస్తూ, వారి ఎదుగుదల కోసం ప్రత్యేకంగా వారితో మాట్లాడేవాడు. మహిళల్లో వుండే న్యూనతాభావం వారి ఎదుగుదలకు

ఎంత ఆటంకంగా వుంటుందో అర్థం చేయించేవాడు. మహిళలు ఎదగాలి, పార్టీలో వారి పాత్రను పెరగాలని తపించేవాడు.

కామ్రేడ్ సూర్యం మంచి విమర్శకుడు. మొదట దళ సభ్యుడుగా వున్నప్పటి నుండి సాటి కామ్రేడ్స్‌పై సద్విమర్శలు పెట్టి వారిని సరిదిద్దేందుకు కృషి చేసేవాడు. పార్టీ ప్రయోజనాలకు, ప్రజల ప్రయోజనాలకు విరుద్ధమైన ప్రతిదానిని విమర్శించటం ఆయన సహజ లక్షణంగా వుండేది. అదే విధంగా తన తప్పులను కూడా నిర్మొహమాటంగా ఎప్పటికప్పుడు గుర్తించి సరిదిద్దుకుంటూ అందరికీ ఆదర్శంగా నిలిచేవాడు.

కామ్రేడ్ సూర్యం అమరత్వంతో ఒక సాహసిక కమాండర్‌ను, పొలిటికల్ కమీస్సార్‌ను, ప్రజల పట్ల, అంచెంచల విశ్వాసం వున్న ఒక ఆదర్శ కమ్యూనిస్టును, ప్రేమాస్పదుణ్ని విప్లవోద్యమం కోల్పోయింది. ఒకవైపు కన్నీటిని తుడుచుకుంటూ మరోవైపు కామ్రేడ్ సూర్యం అనురించిన, ఆచరించి చూపిన అరుణారుణ మార్గంలో సమసమాజం కోసం అవిశ్రాంతంగా పోరాడడం ద్వారా ఆయన కన్న కలల్ని నిజం చేద్దాం! ఇదే ఆ కామ్రేడ్‌కు నిజమైన అరుణాంజలి!!

## కామ్రేడ్ కల్మ నందా (జగదీష్)



దండకారణ్యంలోని దంతెవాడ జిల్లా ఊసూరు బ్లాక్ మురుకుం గ్రామంలో పుట్టిన నిరుపేద ఆదివాసీ ముద్దుబిడ్డ కామ్రేడ్ జగదీష్. తల్లిదండ్రులు పెట్టుకున్న పేరు నందాల్. తండ్రి పేరు కల్మూం లింగాల్. ఈయన మన పార్టీలోని డిఏకెఎంఎస్‌లో రేంజి కమిటీలో సభ్యుడుగా బాధ్యతలు నిర్వహించే క్రమంలో అరెస్టయ్యాడు. రెండు సంవత్సరాలు దంతెవాడ జైలులో వుండి విడుదలై తిరిగి వుద్యమంలో కొనసాగాడు. విప్లవ కార్యకలాపాల్లో మమేకం అవుతూ తన పిల్లలను కూడా అందులో భాగం చేశాడు. ఇందులో భాగంగానే నందాల్ గంగనపాడు అనే ఊరిలోని ధనిక వర్గం వారి యింట్లో జీతగాడిగా పనిచేస్తూ గ్రామంలోని బాలల సంఘంలో చేరి పనిచేశాడు. సల్వాజుడుం ఫాసిస్టు దాడిని ఎదిరించాలనే చైతన్యంతో 2005లో మిలీషియాకు బదిలీ అయ్యాడు.

ప్రజల నెత్తురు కళ్లజూపిన సల్వాజుడుం గూండాగాళ్లపై వర్గకసితో మండుతూ ఎక్కడ శత్రువు సమాచారం దొరికినా విల్లుకాడితో సాయుధమై శత్రువుని చికాకుపరిచేవాడు.

2006 డిసెంబర్‌లో పార్టీలోకి రిక్రూట్ అయ్యి ఊసూరు దళంలో సభ్యుడిగా చేరాడు. 2007 జనవరిలో పార్టీ కామ్రేడ్ నందాల్‌కు పార్టీ సభ్యత్వం ఇచ్చింది. 2008 ఏప్రిల్‌లో పార్టీ అతనిని రీజినల్ కంపెనీ-2కి బదిలీ చేసింది.

కామ్రేడ్ జగదీష్‌లోని క్రమశిక్షణ, రాజకీయ - మిలటరీ చైతన్యాన్ని చూసి రీజినల్ కంపెనీ-2 సెక్రటరీ కామ్రేడ్ సూర్యంకు గార్డుగా నియమించారు. కామ్రేడ్ జగదీష్ తన బాధ్యునికి అని రకాలుగా సహకరించేవాడు. బాధ్యుని నుండి నేర్చుకునేవాడు. ఫైరింగులలో ఏమాత్రం అవకాశం దొరికినా శత్రువును నిర్మూలించడం కోసం ముందుండేవాడు. ఇందులో భాగంగా బంద ఆంబుష్‌లో గార్డుగా తన బాధ్యతను నిర్వహించాడు. దామన్‌జోడి (నాల్కో) రెయిడ్‌లో తన బాధ్యునికి గార్డుగా వుంటూ అస్సాల్ట్ టీంలో పాల్గొని సాహసోపేతంగా శత్రువుతో పోరాడాడు. 2009 డిసెంబర్‌లో కోరాపుట్ జిల్లా నారాయణపట్నం ప్రాంతంలో జరిగిన డైగూడ ఆంబుష్‌లో గార్డ్‌గా పాల్గొన్నాడు.

కోరాపుట్ జిల్లా కత్తుల పేట గ్రామంలో 2010 జనవరి 10న ప్రజా శత్రువులైన భూస్వాములను ఖతం చేసిన చర్యలో కామ్రేడ్ జగదీష్ ముందు వరసలో వుండి సమయస్ఫూర్తితో మెరుపులాగా బాయినెట్ చార్జి చేసి వారిని నిర్మూలించాడు.

రాయగడ జిల్లా పాండ్రుతల గ్రామంలో 2009 నవంబర్ 10న కరుడుగట్టిన ముగ్గురు భూస్వాములను ఖతం చేసిన చర్యలో కూడా స్వయంగా ముందుండి పాల్గొన్నాడు. 2010 ఏప్రిల్ 2న నారాయణపట్నం బ్లాక్‌లో ఝంఝావతి నదిలో స్నానాలకు వచ్చిన పోలీసులపై చేసిన దాడిలో కామ్రేడ్ జగదీష్ స్వయంగా వారిపై బాంబు పేల్చి పోలీసుల్ని భయభ్రాంతం చేసాడు. 2008 డిసెంబర్‌లో ఖమ్మం జిల్లాలో అల్‌బాకా పంచాయితీలో బాధ్యునికి గార్డుగా వుంటూ సతీష్ అనే ఇన్ఫార్మర్‌ను స్వయంగా ముందుండి నిర్మూలించాడు.

కామ్రేడ్ జగదీష్ మంచి క్రమశిక్షణ గలిగిన ప్రజా పోరాట యోధుడు. ప్రతి విషయాన్ని నేర్చుకోవడంలో ముందుండేవాడు. నిరంతరం తన బాధ్యుడికి రక్షణగా వుండేవాడు. దాడుల్లో మంచి రన్నర్‌గా పనిచేశాడు. కమ్యూనికేషన్‌లో (వాకీటాకీ) తన బాధ్యునికి మద్దతుగా వుండేవాడు. గ్రౌండ్ పిటి, డ్రిల్లు చేయడంలో ముందుండేవాడు. శత్రువును నిర్మూలించడం కోసం మిలటరీపరంగా కొత్త టెక్నిక్స్ నేర్చుకోవడంలో నిరంతరం ముందుండేవాడు. కోరాపుట్ ప్రజలు తమ భూముల్లో పంట కోసుకునేటప్పుడు కంపెనీ బలగాల్లో భాగంగా వారికి రక్షణగా నిలబడి వారి భూముల్లో ఎర్రజండయ్యాడు. వారి కడుపుల్లో మెతుకయ్యాడు.

చురుకుదనం, సాహసం, క్రమశిక్షణ, పట్టుదల వంటి అనేక మంచి లక్షణాలు కల కామ్రేడ్ జగదీష్ సాహసిక అమరత్వాన్ని మన పిఎల్‌జిఏ శ్రేణులన్నీ ఆదర్శంగా తీసుకోవాలి. ఆ కామ్రేడ్ ఆశయాల సాధన కోసం చివరి కంటా పోరాడుదామని శపథం చేద్దాం. ★

# దండకారణ్య విప్లవోద్యమ తొలితరం మహిళా నాయకురాలు

# కామ్రేడ్ మడావి రామక్క (అనిత, శారదక్క)కు విప్లవ జోహార్లు!

దండకారణ్య విప్లవోద్యమంలో తొలితరం మహిళా నాయకురాలైన కామ్రేడ్ మడావి రామక్క (శారదక్క) 2010 జూన్ 29వ తేదీ రాత్రి తీవ్ర అనారోగ్యంతో కన్నుమూసింది. సుదీర్ఘమైన, కష్టభరితమైన విప్లవ జీవితం మూలంగా అనారోగ్యం పాలయ్యి ఆమె చాలా కాలంగా బాధపడుతూ వుండింది. అనారోగ్యాన్ని లెక్క చేయకుండానే ఆమె విప్లవ కార్యకలాపాలలో నిర్విరామంగా పాల్గొంటూ వచ్చింది. వీలైన మేరకు పార్టీ ఆమెకు వైద్యచికిత్స చేయించడం కోసం తీవ్రంగానే ప్రయత్నించింది. మధ్యలో కొంత మెరుగైనప్పటికీ మళ్లీ గత కొంత కాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ వచ్చింది. చివరకు అదే ఆమె అకాల మరణానికి దారి తీసింది. ఆమె తన జీవిత భాగస్వామితో పాటు మరికొందరు నాయకత్వ కామ్రేడ్స్, సహచర కామ్రేడ్స్ వున్న క్యాంపులో, అందరినీ దుఃఖంలో ముంచుతూ జూన్ 29 మధ్యరాత్రి తుది వీడ్కోలు తీసుకుంది. ఆమెను కాపాడడానికి చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. ఆ ప్రాంత ప్రజలు, గెరిల్లాలు, జనతన సర్కార్ నాయకులు అందరూ ఆమెకు విప్లవ సాంప్రదాయాలతో అంత్యక్రియలు జరిపారు. కొన్ని వందల గొంతులు 'కామ్రేడ్ శారదక్క అమర్ రహే' అంటూ చేసిన నినాదాల మధ్య ఆమె చితికి నిప్పంటించారు. కామ్రేడ్ శారదక్క ఆశయాల్ని కొనసాగిస్తామని ప్రతిన బూనారు. ఆ మరుసటి రోజు, జూలై 1న జరిగిన సంస్మరణ సభలో పార్టీ నాయకులు, కార్యకర్తలు విప్లవోద్యమంలో దాదాపు పాతికేళ్ల పాటు ఆమె చేసిన సేవల్ని గుర్తు చేసుకుంటూ మాట్లాడారు.



1962లో మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా అహిరి తహసిల్ గడ్డిగూడెం గ్రామంలో ఒక పేద రైతు కుటుంబంలో పుట్టి, రెండు దశాబ్దాలకు పైగా పూర్తికాలం విప్లవ కార్యకర్తగా పని చేసిన కామ్రేడ్ శారదక్క మరణంతో దండకారణ్య విప్లవోద్యమం ఒక విలువైన విప్లవకారిణిని కోల్పోయింది. డీకేలో విప్లవోద్యమం మొదలైన నాటి నుండీ దానితో మమేకమై, ప్రారంభం నుండీ క్రాంతికారీ ఆదివాసీ మహిళా సంఘం కార్యకలాపాల్లో భాగమై, దాన్ని నేటి స్థితికి తీసుకురావడంలో పునాదులు వేసిన ప్రముఖుల్లో ఒకరైన కామ్రేడ్ రామక్క అమరత్వం విప్లవ మహిళా ఉద్యమానికి ప్రత్యేకించి ఎంతో నష్టం. దండకారణ్యంలో విప్లవోద్యమం వేళ్లూనుకున్న 1980ల చివరి నుండి విప్లవోద్యమంతో పెనవేసుకున్న కామ్రేడ్ రామక్క 1988 నుండి చురుకైన మహిళా సంఘ కార్యకర్త. అనతి కాలంలోనే ఆమె కమలాపూర్ రేంజి కమిటీలోకి ఎన్నికయింది. కె.ఎ.ఎం.ఎస్. ఆర్గనైజర్‌తోపాటు తిరుగుతూ విప్లవ మహిళా వుద్యమ అభివృద్ధి కోసం కృషి చేసింది. 1990 నుండి పూర్తికాలం కార్యకర్తగా, మహిళా సంఘ ఆర్గనైజర్‌గా, పార్టీ ఏరియా కమిటీ సభ్యురాలిగా, కార్యదర్శిగా వివిధ బాధ్యతల్లో, అనితక్కగా, శారదక్కగా గడ్చిరోలి (మహారాష్ట్ర), మాడ్ (ఛత్తీస్‌గఢ్), శ్రీకాకుళం (ఆంధ్రప్రదేశ్), మల్కన్‌గిరి (ఒడిషా) వంటి వివిధ ప్రాంతాల్లో ప్రజల మధ్య పని చేసిన సీనియర్ కార్యకర్త ఆమె.

తొలుత గడ్చిరోలి జిల్లాలో క్రాంతికారీ ఆదివాసీ మహిళా సంఘంలో పని చేస్తూ దాని అభివృద్ధి కోసం కృషి చేసింది. ఎన్నో మార్లు క్యాంపెయిన్లు చేసి గ్రామాల్లో విప్లవ ప్రచారాన్ని నిర్వహిస్తూ ప్రత్యేకించి మహిళల్ని విప్లవోద్యమంలోకి ఆకర్షించడానికి ఆమె చేసిన కృషి చాలా గొప్పది. 1980లో ఉద్యమ ప్రారంభ సమయంలోనే కామ్రేడ్ పెద్ది శంకర్‌ను కాల్చిచంపి విప్లవోద్యమ విస్తరణను అడ్డుకోగలమని కలలు గన్న దోపిడీ పాలకవర్గాలకు గడ్చిరోలిలో వెల్లువెత్తిన ప్రజా పోరాటాలు సవాలుగా నిలిచాయి. కామ్రేడ్ పెద్ది శంకర్ అమరత్వాన్ని, ఆయన మోసుకొచ్చిన విప్లవ సందేశాన్ని గ్రామగ్రామానా వినిపిస్తూ అమరుల ఆశయసాధనకు పాటుపడాలని చేసిన విప్లవ ప్రచార కార్యకలాపాల్లో కామ్రేడ్ రామక్క పాల్గొన్నది. అటవీ విభాగం వాళ్లు సాగిస్తుండిన దోపిడీదౌర్జన్యాలకు అడ్డుకట్ట వేయడంలో, పేపరుమిల్లు యాజమాన్యం చేసే దోపిడీకి, మహిళలపై సాగించే లైంగిక దోపిడీకి వ్యతిరేకంగా ప్రజలను కూడగట్టడంలో, పోరాటాలు నిర్వహించడంలో కామ్రేడ్ రామక్క ముందు వరుసలో నిలబడింది. పేపరు మిల్లు కూలీ రేట్ల పెంపుదల కోసం సాగిన పోరాటాల్లో గడ్చిరోలి ప్రజానీకం అనేక సార్లు విజయం సాధించారు. ఆ క్రమంలో పార్టీకి నిధులు సమకూర్చడం కోసం ముందుకొచ్చిన 'వర్క్ డే' పద్ధతిని ప్రజల్లో ప్రచారం చేసి పార్టీ కోసం ఒక రోజు శ్రమ చేసి దాని ద్వారా వచ్చే ఆదాయాన్ని పార్టీకి అందించే సాంప్రదాయాన్ని నెలకొల్పిన వాళ్లలో కామ్రేడ్ రామక్క ఒకరు. ఇంకా అనేక రకాల కూలీ పనుల్లో రేట్ల పెంపుదల కోసం సాగిన ప్రజా పోరాటాల్లో కామ్రేడ్ రామక్క ముందు నిలిచింది. ఆనాటి అహిరి మహారాజు విశ్వేశ్వరరావు గడ్చిరోలిలో విప్లవోద్యమాన్ని వేళ్లూనుకోనివ్వకుండా, గ్రామాలపై తన ఫ్యూడల్ పట్టును సడలిపోనివ్వకుండా చేసిన కుయుక్తులన్నిటినీ ఓడిస్తూ, ప్రజలపై అతను సాగించే దోపిడీపీడనలకు వ్యతిరేకంగా చేసిన పోరాటాల్లో కామ్రేడ్ రామక్క కృషి వుంది. ఇంటి వద్ద వుండగానే పార్టీ సభ్యత్వం పొంది సెల్ సభ్యురాలైన కామ్రేడ్ రామక్క ఒకవైపు ప్రజాసంఘ కార్యకలాపాల్ని చురుగ్గా నిర్వహిస్తూ పలువురు

మహిళల్ని పార్టీలోకి భర్తీ చేసింది. ఆ తర్వాత 1990లో ఆమె పూర్తికాలం కార్యకర్తగా గెరిల్లా దళాల్లో చేరింది. అప్పటి నుండీ ఆమె 'అనిత' పేరుతో పనిచేసింది. పేదరికం మూలంగా చిన్నతనం నుండీ పౌష్టికాహార లోపంతో బాధపడిన కామ్రేడ్ అనితక్క బలహీనంగా వుండేది. బక్కగా, పొడుగ్గా, బలహీనంగా వుండే ఆమె విప్లవ లక్ష్యం పట్ల ఎంతో దృఢంగా వుండేది. చిన్నతనంలో చదువుసంధ్యలకు దూరంగా వుండిపోయిన తను పార్టీలోకి వచ్చి పట్టుదలతో చదవడం, రాయడం నేర్చుకుంది. 1990లో కామ్రేడ్ అనితక్క పార్టీలో కేంద్రకమిటీ సభ్యుడైన కామ్రేడ్‌ను పెళ్లి చేసుకుంది.

పూర్తికాలం కార్యకర్తగా రిక్రూట్ అయిన కొద్దికాలంలోనే మాడ్ డివిజన్‌కు బదిలీ అయింది. మొదట ఎస్‌జడ్‌సి దళంలో పనిచేసి తర్వాత ఆర్గనైజేషన్‌లోకి మారి 1996 వరకు అక్కడి మాడియా ప్రజల్ని, ముఖ్యంగా మహిళల్ని సంఘటితం చేసే కృషిలో పాల్గొన్నది. 'నాగరికత'కు ఆమడ దూరంలో విసిరేసినట్టుగా వుండే మాడ్ ప్రాంత మాడియా ప్రజల్లో విప్లవోద్యమ నిర్మాణానికి కృషి చేసింది. ముఖ్యంగా మాడియా మహిళలు ఎదుర్కుంటున్న బలవంతపు పెళ్ళిళ్ల సమస్యకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యవంతం చేయడంలో కామ్రేడ్ అనితక్క ముందు నిలిచింది. తెగ రీతిరివాజుల్లో భాగంగా మహిళలపై సాగే అన్యాయాలను ఎదిరించడం కోసం ఆమె మహిళల్ని కూడగట్టింది. మాడ్ ప్రాంతంలో క్రాంతికారీ ఆదివాసీ మహిళా సంఘ నిర్మాణానికి పునాదులు వేయడంలో కామ్రేడ్ అనితక్క కృషి ఎంతో వుంది. మాడ్ ప్రాంతంలో పార్టీ నిర్వహించే వివిధ కార్యక్రమాలను విజయవంతం చేయడం కోసం ఆమె శక్తిమేరకు కష్టించి పని చేసేది. 1996 నుండి 1999 వరకూ నేటి తూర్పు బస్తర్ ప్రాంతంలోని కొండగాం ఏరియాలో ఏరియా కమిటీ సభ్యురాలిగా పని చేసింది. బాబా బిహారీదాస్ ఈ ప్రాంత ఆదివాసులను రకరకాల ప్రలోభాలకు గురిచేసి హిందూమతంలోకి ఆకర్షించి ఆదివాసీ సంస్కృతిని ఛిన్నాభిన్నం చేయడానికి వ్యతిరేకంగా జరిగిన ప్రజా పోరాటంలో ఆమె చురుగ్గా పాల్గొన్నది. భక్తి పేరుతో ఆదివాసీ యువతుల్ని ప్రలోభపెట్టి తమ లైంగిక కోర్కెలను తీర్చుకోవడానికి వ్యతిరేకంగా మహిళల్ని కదిలించి నాహ్కనార్ అనే గ్రామంలో బాబా బిహారీదాస్‌ను ప్రజల ముందుకు లాగి తప్పు ఒప్పించిన సంఘటనలో కామ్రేడ్ అనితక్క వుంది. కన్నార్‌గాంలో సుక్‌దాల్ అనే మాల్‌గుజార్‌కు వ్యతిరేకంగా పోరాడి దాదాపు 150 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకొని ప్రజలకు పంచిన పోరాటంలో కామ్రేడ్ అనితక్క ప్రజలకు నాయకత్వం వహించింది. వెడమకోట్ అనే గ్రామంలో తహసీల్‌దార్ శ్రీమాలి, బీజేపీ నాయకుడు బాల్‌సాయ్ వద్దె ఆదివాసీ మహిళలపై సాగిస్తున్న లైంగిక దోపిడీకీ, అత్యాచారాలకూ వ్యతిరేకంగా ప్రజలను, ముఖ్యంగా మహిళల్ని కూడగట్టి వాళ్లను ప్రజల ముందుకు లాగి శిక్షించిన సంఘటనలో కామ్రేడ్ అనితక్క ఏసీ సభ్యురాలిగా తన వంతు బాధ్యతను పోషించింది. తునికాకు పోరాటాల్లో ప్రజలను కదిలించడంలో, రేట్లు పెంచడంలో కామ్రేడ్ అనితక్క ఎంతో కృషి చేసింది. నరియా అనే గ్రామంలో కలప దోచుకెళ్తున్న అటవీ అధికార్లకు వ్యతిరేకంగా ప్రజలను కదిలించింది.

1999లో ఆమెను పార్టీ నేటి ఏఓబీలోని శ్రీకాకుళం డివిజన్‌కు బదిలీ చేసింది. అక్కడ ఆమె ఉద్దానం ఏరియా ప్రజలలో పని చేస్తూ అక్కడి యాసను నేర్చుకోవడానికి బాగా కృషి చేసింది. దళంలో డిప్యూటీ కమాండర్ బాధ్యతల్ని నిర్వహిస్తూ ప్రజల అభిమానాన్ని చూరగొంది. 2000 చివరి వరకూ శ్రీకాకుళం డివిజన్‌లో పని చేసిన కామ్రేడ్ శారదక్క 2000 సంవత్సరంలో జరిగిన ఈస్ట్ రీజియన్ పార్టీ కాన్ఫరెన్సులో ప్రతినిధిగా పాల్గొన్నది. ఆ తర్వాత ఏఓబీ ఎస్‌జెడ్‌సీ ఆమెను మల్కనగిరి డివిజన్‌లోని పప్పులూరు ఏరియాకు బదిలీ చేసింది. అక్కడ ఆమె దళ కమాండర్‌గా పని చేస్తూ కొండరెడ్డి ప్రజల అమితమైన అభిమానాన్ని పొందింది. వాళ్లతో కలగలిసి పోయి వాళ్లను పోరాటాల్లోకి సమీకరించింది. ఆ తర్వాత మోటు ఏరియాకు బదిలీ అయ్యి ఏరియా కమిటీ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించి పని చేసింది. అలా ఏఓబీ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయింది.

2006 మధ్యలో కామ్రేడ్ శారదక్క దండకారణ్యానికి వచ్చి దాదాపు పదేళ్ల తర్వాత మళ్లీ మాడ్ డివిజన్ ఉద్యమంలో భాగమైంది. ఆమెకు ఇంద్రావతి ఏరియాలోని ఆదేడ్ ప్రాంతంలో ఏసీ సభ్యురాలిగా బాధ్యతలిచ్చారు. అప్పటికి మాడ్ డివిజన్ విప్లవోద్యమం ఎంతో ప్రగతిని సాధించి జనతన సర్కార్, గ్రామ పార్టీ కమిటీ, ప్రజా మిలిషియా నిర్మాణాలు అభివృద్ధి చెందాయి. వీటిని తను బాధ్యత వహించే ప్రాంతంలో సక్రమంగా నడిపించడం కోసం ఎనలేని కృషి చేసింది. జనతన సర్కార్ కింద గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణలో కామ్రేడ్ శారదక్క నిర్వహించిన పాత్ర మరవలేనిది. గ్రామాల్లో, పార్టీలో పితృసామ్యానికి వ్యతిరేకంగా ఆమె చివరి దాకా పోరాడింది.

కామ్రేడ్ శారదక్క గెరిల్లా జీవితం గురించి కూడా ప్రత్యేకంగా చెప్పుకోవాలి. 1996లో దండకారణ్యంలో జరిగిన ప్రత్యేక మహిళా మిలిటరీ ట్రెయినింగ్ క్యాంపులో ఆమె చాలా ఉత్సాహంగా పాల్గొన్నది. క్యాంపు చివరన జరిగిన పోటీలలో ఆమె తన ప్రతిభను ప్రదర్శించి బహుమతులు గెల్చుకుంది. బక్కగా, బలహీనంగా కనిపించే కామ్రేడ్ శారదక్క తనలోని శక్తినంతా వెలికితీసి మిలిటరీ శిక్షణను నేర్చుకోవడంలో ముందు నిలబడింది. 2000లో ఈస్ట్ రీజియన్‌లో రీజనల్ స్థాయిలో జరిగిన మిలిటరీ క్యాంపులోనూ పాల్గొంది. 2001 సంవత్సరంలో పార్టీ చేపట్టిన మొదటి టీసీఓసీలో భాగంగా జరిగిన కలిమెల రెయిడ్‌లో ఆమె ఒక టీంకు కమాండర్‌గా వుంటూ అదనపు బలగాలను నిలువరించే బాధ్యతలు చేపట్టింది. ఆ రెయిడ్ విజయవంతమై 42 ఆయుధాలు స్వాధీనం చేసుకోవడంలో కామ్రేడ్ శారద తన వంతు బాధ్యతను పట్టుదలగా నిర్వర్తించింది. శత్రు బలగాలతో జరిగిన కొన్ని ఎన్‌కౌంటర్లలో ఆమె దృఢంగా నిలబడి పోరాడింది.

కామ్రేడ్ రామక్క అకాల మరణం మాడ్ డివిజన్ ప్రజానీకానికి ఎంతో దుఃఖాన్ని కలిగించింది. ఆమె ఆశయసాధన కోసం ప్రజలూ, విప్లవ కార్యకర్తలూ, పార్టీ పునరంకితమవుతామని ప్రతిన బూనారు. కామ్రేడ్ శారదక్క పట్టుదల, విశ్వాసం, శ్రమపడేతత్వం మనందరికి ఆదర్శం కావాలి. ★

# సాహస గెరిల్లాలు, యాక్షన్ టీం అమరులు కామ్రేడ్స్ దివాకర్, రాజేష్‌లకు ఎర్రెర్రని జోహార్లు!

ప్రజాశత్రువులను శిక్షించడంలో భాగంగా ఒక యాక్షన్‌కు వెళు తున్న సమయంలో కోవర్ట్ అందించిన సమాచారం మేరకు మల్కన్‌గిరి డివిజన్ యాక్షన్ టీం కమాండర్ కామ్రేడ్ దివాకర్, సభ్యుడు కామ్రేడ్ రాజేష్‌లు పోలీసుల చేతికి చిక్కారు. వీళ్లిద్దరూ ఒక యింటిలో నిద్రిస్తున్న సమయంలో పోలీసులు పట్టుకొని తీవ్ర చిత్రహింసలకు గురిచేశారు. అయినప్పటికీ ఈ కామ్రేడ్స్ దృఢంగా నిలబడి, శత్రువుకు తలవంచకుండా, పార్టీ రహస్యాలను కాపాడి తమ అమూల్యమైన ప్రాణాలను తృణప్రాయంగా అర్పించారు. ఈ ఇద్దరు కామ్రేడ్స్‌కు తలవంచి వినమ్రంగా నివాళులు అర్పిద్దాం.

## కామ్రేడ్ దివాకర్



కామ్రేడ్ దివాకర్ ఒడిషా రాష్ట్రంలోని మల్కన్‌గిరి జిల్లా కలిమెల ఏరియాలోని టేకుగూడ గ్రామంలో ఒక పేద ఆదివాసీ గ్రామంలో పుట్టాడు. తల్లిదండ్రులు అతనికి పెట్టుకున్న పేరు బీరాల్. బీరాల్‌కు ఒక అన్న, తమ్ముడు, ఇద్దరు చెల్లెళ్లు వున్నారు. గ్రామంలో బలంగా కొనసాగుతున్న విప్లవ రాజకీయాలతో ఆ కుటుంబం కూడా ప్రభావితమయింది. ఆ ప్రభావం వల్లనే కామ్రేడ్ దివాకర్ సోదరుడు చిన్న తనంలోనే జన మిలీషియాలో చేరి, చురుకైన పాత్ర వహించి కమాండర్ అయ్యాడు. కమాండర్‌గా పనిచేస్తూ అనారోగ్యంతో దివాకర్ అమరత్వానికి కొద్దిరోజుల ముందుగానే అమరుడయ్యాడు. కామ్రేడ్ దివాకర్ 4వ తరగతి చదువుతూ మానేసి బాలల పిఎడిలో చేరాడు. 2005 ఆఖరులో పార్టీలోకి పూర్తికాలం సభ్యుడిగా చేరి పిఎడిలో పనిచేశాడు. 2006లో ఎల్.జి.ఎస్.కు బదిలీ అయ్యాడు. 2007లో యాక్షన్ టీంలో సభ్యుడయ్యాడు. అదే సమయంలో విద్యార్థులను సంఘటితం చేసే కృషిలో భాగమయ్యాడు.

2006 మేలో మోటు ఎస్.ఐ.ని చంపి ఒక 9 ఎం ఎం పిస్టల్‌ను స్వాధీనం చేసుకున్న ఘటనలో పాల్గొన్నాడు. అదే సంవత్సరంలో కలిమెల ఏరియాలో 124 గ్రామం వద్ద సిఆర్‌పిఎఫ్‌పై చేసిన దాడిలోనూ పాల్గొన్నాడు. ఈ దాడిలో ఇద్దరు పోలీసులు చనిపోగా ఇద్దరు గాయపడ్డారు. 2007లో ఎం.పి.వి– 79 పోలీస్ స్టేషన్‌పై యాక్షన్ చేసి ముగ్గురు ఎస్ఒజి పోలీసులను గాయపరిచి ఒక ఇన్‌సాస్, ఒక ఎకె–47 స్వాధీనం చేసుకున్న ఘటనలో పాల్గొన్నాడు. ఈ యాక్షన్ చేసి తిరిగి వస్తున్న క్రమంలో శత్రువు వెంబడించి జరిపిన కాల్పులను ప్రతిఘటించడంలో ముందున్నాడు. 2007లో నల్గురితో కూడిన యాక్షన్ టీం వెళ్లి కలిమెల ఎస్.ఐ.ని గాయపరిచిన ఘటనలో పాల్గొన్నాడు.

2008లో తెల్లరాయి మైన్‌ప్రూఫ్ వాహనాన్ని పేల్చిన ఘటనలోనూ పాల్గొన్నాడు. ఈ దాడికి సంబంధించి రెక్కీలో చేయడంలో చురుకైన పాత్ర వహించాడు.

మిలిటరీపరంగా చురుకైన పాత్ర వహిస్తున్న కామ్రేడ్ దివాకర్‌కు యాక్షన్ టీం కమాండర్ బాధ్యతలను ఇవ్వడం జరిగింది.

కామ్రేడ్ దివాకర్ మంచి సాహసవంతుడు, సృజనాత్మకత, క్రమశిక్షణ, కష్టపడేతత్వం గలవాడు. క్యాడర్‌తో, ప్రజలతో మంచి సంబంధాలను కల్గివుండే వాడు. ప్రజలకు రాజకీయాలను చెప్తూ పాలకవర్గాల కుట్రలను అర్థం చేయించేవాడు. ఇన్‌ఫార్మర్లను ఏరిపారేయడంలో చురుకైన పాత్ర వహించాడు.

కామ్రేడ్ దివాకర్ నెలకొల్పిన ఆదర్శాలను నేర్చుకుందాం. అసంపూర్ణంగా మిగిలిన తన కలలను, ఆశయాలను నెరవేరుస్తామని శపథం చేద్దాం.

## కామ్రేడ్ రాజేష్

కామ్రేడ్ రాజేష్ ఒడిషా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లా కలిమెల ఏరియాలో సింగవరం గ్రామంలో  పేద ఆదివాసీ కుటుంబంలో పుట్టాడు. 10వ తరగతి వరకూ చదువుకున్నాడు. ఆ తర్వాత మిలీషియాలో చేరాడు. కలిమెల ఏరియాలో పార్టీ చేపట్టిన ప్రతి కరువుదాడిలోనూ పాల్గొన్నాడు. 2009లో పూర్తి కాలం కార్యకర్తగా జనమిలీషియాలో చేరి క్రమంగా కమాండర్‌గా ఎదిగాడు. స్థానిక దళానికి చేదోడువాదోడుగా వుండేవాడు.

2008లో దళం మకాం మీదికి దాడికి వచ్చిన పోలీసులపై చేసిన కౌంటర్ దాడిలోనూ, తెల్లరాయి ఆంబూష్‌లోనూ కామ్రేడ్ రాజేష్ పాల్గొన్నాడు. 2009లో మల్కన్‌గిరి నుండి చిత్రకొండకు డబ్బులు తీసుకువెళ్తున్న పోలీసు వాహనంపై దాడిచేసి కోటి రూపాయలనూ, రెండు డబుల్ బ్యారెల్ తుపాకులను స్వాధీనం చేసుకున్న చర్యలో పాల్గొన్నాడు.

ఇన్‌ఫార్మర్స్‌ను పసిగట్టడంలో కామ్రేడ్ రాజేష్ మంచి నేర్పరి. తనలో వున్న చురుకుదనాన్నీ, వర్గకసినీ గమనించి పార్టీ కామ్రేడ్ రాజేష్‌ను యాక్షన్ టీం సభ్యుడిగా నియమించింది. కోవర్టు ఇచ్చిన సమాచారంతో కామ్రేడ్ రాజేష్, దివాకర్‌తో పాటు అమరుడయ్యాడు. కామ్రేడ్ రాజేష్ ఆశయాలను కొనసాగిద్దాం. ★

# కొంగెర ఎర్ర మందారం పిఎల్‌జిఏ సాహస వీర నారి కామ్రేడ్ మంగ్లి అమర్ రహే!

కామ్రేడ్ మంగ్లి దండకారణ్యంలోని కాంకేర్ జిల్లా అంతగఢ్ తహసీల్ కేశ్‌కల్ ఏరియాలోని కొంగెర గ్రామంలో పేద ఆదివాసీ కుటుంబంలో పుట్టింది. చిన్న వయసులోనే ఆమె తల్లిదండ్రులను కోల్పోయింది. ఏడవ తరగతి వరకూ చదువుకుంది. పాఠశాలలో ఆటపాటల్లో చురుగ్గా వుండేది. చదువు మానేసిన తర్వాత ఆమె దళం పరిచయాల్లోకి వచ్చింది. క్రమంగా దళం చెప్పే రాజకీయాలను అర్థం చేసుకుని, తమ బతుకులు మారాలంటే పోరు తప్ప మార్గం లేదని గ్రహించి 2004లో 16 ఏళ్ల వయసులో కేశ్‌కల్ దళంలో భర్తీ అయింది.



ఒక సంవత్సరం పాటు కేశ్‌కల్ దళంలో పని చేసింది. తర్వాత 2005లో సల్వాజుడుం ఫాసిస్ట్ దాడి సమయంలో ఆమెను పార్టీ ఆయుధాల తయారీ విభాగానికి బదిలీ చేసింది. అందులో ఆమె క్రమశిక్షణతో, క్రియాశీలంగా తన బాధ్యతలను నిర్వర్తించింది. 2006లో ఉత్తర బస్తర్ డివిజన్‌లోని బార్‌దా దళానికి బదిలీ అయింది. అక్కడ కూడా తన బాధ్యతలను చక్కగా నిర్వర్తించింది. దళంలో టీచర్‌గా వుండి కొత్త సభ్యులకు చదువు నేర్పేది. ఏ పనినైనా పట్టుదలగా చేసి అందరి మెప్పును పొందింది.

2007 మే నెలలో సిఆర్‌సికి చెందిన ఒకటవ కంపెనీలో సభ్యురాలైంది. అందులో భాగంగా 2007 ఆగస్ట్‌లో విశాఖ జిల్లాలో కొంద్రు గ్రామం వద్ద గ్రేహౌండ్ పోలీసులపై చేసిన ఆంబుష్‌లో పాల్గొంది. ఈ ఘటనలో ఇద్దరు గ్రేహౌండ్స్ పోలీసులు గాయపడ్డారు. నవంబర్ నెలలో నాగావళి నది దాటి కోరాపుట్–శ్రీకాకుళం డివిజన్ మీదుగా నయాగఢ్ వరకూ పిఎల్‌జిఏ చేసిన సుదీర్ఘ ప్రయాణంలో కామ్రేడ్ మంగ్లి కూడా వుండింది. భాష తెలియక పోయినా కుయి ప్రజలతో కలిసి పోతూ కొండలు, గుట్టలు, నదులు దాటుతూ స్ఫూర్తినీ, పట్టుదలనూ ప్రదర్శించిందామె.

ఆ తర్వాత చారిత్రాత్మక నయాగఢ్ దాడిలోనూ, రిట్రీట్ సమయంలో గొసామా వద్ద శత్రువుతో హోరాహోరీగా తలపడిన పోరులోనూ ఆమె పాల్గొని ధైర్య సాహసాలను ప్రదర్శించింది. ఆ సమయంలో రెండు తుపాకులు వేసుకొని, కిట్‌నిండా తూటాలు నింపుకొని నయాగఢ్ నుండి శబరి ఒడ్డు వరకూ ప్రయాణించిందామె. కామ్రేడ్ మంగ్లి వయసు చిన్నదే అయినా ధైర్య సాహసాలు గొప్పవి.

2008 లో గ్రేహౌండ్స్‌కు గుబులు పుట్టించిన గునుకురాయి ఆంబుష్‌లో కూడా కామ్రేడ్ మంగ్లి పాల్గొంది. ఆ ఆంబుష్‌లో కంపెనీ కమాండర్ కామ్రేడ్ రణదేవ్ తీవ్రంగా గాయపడ్డాడు. ఆ సమయంలో కామ్రేడ్ రణదేవ్‌కు సహాయం చేయడం కోసం రాపిడ్ ఫైరింగ్‌లో సైతం ఆమె ధైర్యంగా అడ్వాన్స్ అయింది. ఆ సమయంలో ఆమెకు కూడా తూటా తగిలింది. అయితే ఆమె త్వరగానే కోలుకొని మళ్లీ యుద్ధ రంగంలోకి దూకింది.

ఆ తర్వాత మరో చారిత్రక దాడి బలిమెల ఆంబుష్‌లో పాల్గొంది. ఈ ఆంబుష్‌లో ఆమె ఎంతో వర్గ కసిని ప్రదర్శించింది. 2009లో మళ్లీ నయాగఢ్ ప్రాంతానికి వెళ్లి అక్కడ డంప్ చేసిన తుపాకులను ఎంతో ప్రయాసకు ఓర్చి మోసుకువచ్చిన టీంలో కామ్రేడ్ మంగ్లి కూడా వుంది.

ఇలా ప్రతి సంఘటనలోనూ ఎంతో స్ఫూర్తి దాయకంగా పోరాడిన కామ్రేడ్ మంగ్లి 2009 డిసెంబర్ 24న నారాయణపట్నా ప్రాంతంలో దైగూడ వద్ద జరిగిన ఆంబుష్‌లో శత్రువుతో పోరాడుతున్నప్పుడు శత్రు తూటా తగిలి అమరురాలైంది.

కామ్రేడ్ మంగ్లి పేద ప్రజల కోసం తన జీవితాన్ని చిరునవ్వుతో అర్పించి పిఎల్‌జిఏకు ఆదర్శంగా నిలిచింది. నేడు ఆమె ఎర్ర నక్షత్రం వలె వెలిగిపోతూ మనందరికీ దారి చూపుతోంది. ఆ దారిలో మనం దృఢంగా నడుస్తూ కామ్రేడ్ మంగ్లి అసంపూర్ణ స్వప్నాలను నెరవేరుద్దామని ప్రతిజ్ఞ చేద్దాం. ★

## సవరణ

గత సంవత్సరం జూలై 28 సందర్భంగా ఆంధ్రప్రదేశ్ విప్లవోద్యమ చరిత్రను తడుముతూ ముఖ్య నాయకత్వ కామ్రేడ్స్ జీవిత చరిత్రలను ప్రచురించిన విషయం తెలిసిందే. కొండపల్లి సీతారామయ్యను పార్టీ అమరుడుగా గుర్తించడం లేదని ప్రకటించినప్పటికీ అమరుల చరిత్రలు ప్రచురిస్తున్న సందర్భంగా ఆయన పాత్రను చెప్పడం సరిగా లేదని గుర్తిస్తున్నాం. **–సంపాదక మండలి**

# గ్రీన్ హంట్‌లో భాగంగా కామ్రేడ్ కుమ్లి దారుణ హత్య

నేడు దండకారణ్య ప్రజాయుద్ధంపై తలపెట్టిన బహుముఖ దాడిలో భాగంగా పాలక వర్గాలు తమ నెట్‌వర్క్‌ను బలోపేతం చేసుకుంటున్నాయి. ప్రజా వ్యతిరేకులనూ, విప్లవోద్యమం మూలంగా ప్రయోజనాలు దెబ్బ తిన్న పెత్తందారులనే కాకుండా సాధారణ ప్రజలను సైతం నయానా భయానా ఇన్ఫార్మర్లుగా, ఎస్పీవోలుగా మలుచుకుంటున్నాయి. ఇలా ఇన్ఫార్మర్లుగా, ఎస్పీవోలుగా తయారైన వాళ్లు ప్రజలపై, ప్రజా సంఘాల కార్యకర్తలపై, వృత్తి విప్లవకారులపై దాడులు చేస్తూ విప్లవోద్యమానికి నష్టం తలపెడుతున్నారు.

ఇటువంటి కోవకి చెందినవారే మాడ్ డివిజన్‌లోని కుతుల్ గ్రామానికి చెందిన కేశ భైర, మిచ్చు, పిర్తు, పరస్‌వేడ గ్రామానికి చెందిన దల్లులు. వీళ్లు మొదటి నుండి లంపెన్ శక్తులు. ఇక్కడ పెంపొందుతున్న విప్లవోద్యమం అన్ని రకాల అరాచకాలకు అడ్డుకట్ట వేయడంతో వీళ్లు కుక్కిన పేన్ల లాగా మారిపోయారు. 2005లో పశ్చిమ బస్తర్‌లో మొదలైన సల్వాజుడుంలో ఇటువంటి వాళ్లందరినీ పోలీసులు చేరదీసి తమ పనిముట్లుగా మార్చుకున్నట్టుగానే వీళ్లను కూడా పోలీసులు తమ నెట్‌వర్క్‌లో భాగం చేసుకున్నారు. 2006 నుండి వీరు నారాయణ్‌పూర్‌లో వుంటూ విప్లవ వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొంటున్నారు. దీనికి పరాకాష్టగా 2010 ఫిబ్రవరి 10న వీరు కామ్రేడ్ కుమిలిని అత్యాచారం చేసి హత్య చేశారు. కామ్రేడ్ కుమిలి మాడ్ డివిజన్‌లోని కుతుల్ ఏరియా జనతన సర్కార్‌లో వ్యవసాయ శాఖలో వృత్తి విప్లవకారిణిగా పని చేస్తోంది. నిండా ఇరవై ఏళ్లయినా లేని కామ్రేడ్ కుమిలి ఫిబ్రవరి 10న దుమ్‌నార్ గ్రామంలోని వ్యవసాయ క్షేత్రానికి వంటరిగా వెళ్లి పనిచేసుకుంటూ వుండగా పై నల్గురి ముఠా దాడి చేసి సమీపంలోని అడవిలోకి ఆమెను ఎత్తుకెళ్లి పాశవిక అత్యాచారానికి పాల్పడ్డారు. అక్కడి నుండి మరికొంత దూరం తీసికెళ్లి ఆమెను దారుణంగా చంపేశారు.

వ్యవసాయ క్షేత్రానికి వెళ్లిన కామ్రేడ్ కుమిలి తిరిగి రాకపోవడంతో ఆమె కోసం సహచర కామ్రేడ్లూ, ప్రజలు ఆందోళనగా వెతికారు. ఫిబ్రవరి 13న ఆమె మృతదేహాన్ని గ్రామస్తులు కనుక్కోగలిగారు. ఆమె మృతదేహాన్ని చూసిన వాళ్లంతా దిగ్భ్రాంతికి లోనయ్యారు. ఈ హత్యను ఎంత బీభత్సంగా చేశారంటే ఆమె మృతదేహం నగ్నంగా పడివుంది. గొంతును పూర్తిగా కోసివేశారు. నాలుకను తెగ్గోసి తమతో పాటు తీస్కెళ్లారు– తాము చేసిన హత్యకు తమ పోలీసు బాస్‌ల దగ్గర సాక్ష్యంగా ఆ నాలుకను చూపించి కిరాయిని పొందడం కోసం అలా చేశారు. అంతేకాదు ప్రజలను భయభ్రాంతులకు గురి చేయడం కోసం కూడా వాళ్లు అంత క్రూరత్వానికి పాల్పడ్డారు. క్రూరుడైన ఇంటలిజెన్స్ పోలీసు అధికారి ఫ్రాన్సిస్ ఇందువార్‌ను విప్లవకారులు గొంతు కోసి చంపినప్పుడు పాలకవర్గాలు తమ చెప్పుచేతుల్లో వుండే ప్రసార మాధ్యమాల ద్వారా విపరీతమైన ప్రచారం చేశాయి. కానీ ప్రజల కోసం తన జీవితాన్ని అంకితం చేసిన ఒక ఆదివాసీ అమ్మాయిని అవే పాలకవర్గాల పెంపుడు కుక్కలు అత్యంత ఘోరంగా సామూహిక అత్యాచారం చేసి, గొంతు, నాలుక తెగ్గోసి చంపిన విషయాన్ని దండకారణ్య పార్టీ బహిర్గత పర్చినప్పటికీ ఏ ప్రసార మాధ్యమాలు పట్టించుకోలేదు. 'దేశ అంతర్గత భద్రతకు పెను ప్రమాదం'గా వున్న పార్టీకి చెందినంత మాత్రాన ఒక ఆదివాసీ యువతి అంత ఘోరమైన మరణానికి అర్హురాలు అవుతుందా?

కుమిలి దారుణ హత్య ప్రజల్లో పాలక వర్గాల పట్లా, వాటి 'కాపలా కుక్కల' పట్లా తీవ్ర ఆగ్రహాన్ని కల్గించింది. తమ కోసం ప్రాణాలిచ్చిన ఆ పీడిత ప్రజల ప్రియతమ పుత్రిక మృతదేహాన్ని ఆమె స్వగ్రామం పైవేర్‌కు తీసుకెళ్లి, విప్లవ సాంప్రదాయాలతో అంత్యక్రియలు చేశారు. ఆ యువ విప్లవకారిణి త్యాగాన్ని వృధా పోనియ్యమని శపథం చేశారు.

ఇంతకూ కామ్రేడ్ కుమిలిని హత్య చేసింది ఎవరన్న విషయం ఎలా తెలిసింది? ఆమె హత్యకు గురయిందంటేనే కచ్చితంగా అది పోలీసుల, లేదా ఎస్పీవోల పనేనని అర్థం కావడం పెద్ద కష్టం కాదు. లేకుంటే పీడిత ప్రజలకు తలలో నాలుకగా మారిన ఆమెను హత్య చేసే తలంపు ఎవరికుంటుంది? ఆమె హత్య జరిగిన కొద్ది రోజులకు పిర్తు అనే ఎస్పీవోను మిలీషియా కామ్రేడ్స్ అరెస్ట్ చేశారు. ఆ ద్రోహిని ఇంటరాగేషన్ చేసినపుడు ఈ ఘోరానికి పాల్పడ్డ ప్రజా ద్రోహులు ఎవరో స్పష్టంగా తెల్సిపోయింది. పిర్తుకు ప్రజాన్యాయస్థానం మరణశిక్ష విధించింది. మిగతా ద్రోహులకూ ఇదే గతి పడుతుందని ప్రకటించింది.

చిన్న వయసులోనే విప్లవానికి జీవితాన్ని అంకితం చేసి ప్రజా ద్రోహులకు కంటిలో నలుసుగా మారిన కామ్రేడ్ కుమిలిది మాడ్ డివిజన్‌లోని కుతుల్ ఏరియా పైవేరు గ్రామం. ఆమె విప్లవోద్యమంలోకి రావడమే ఒక అద్భుతమైన విషయం. బాల్యంలోనే కన్నతల్లిని కోల్పోయిన ఆమె పినతల్లి సంరక్షణలో పెరిగింది. యుక్తవయసులోకి అడుగు పెడుతుండగానే ఆమెకు టైఫాయిడ్ జ్వరం వచ్చి బాగా కృశించిపోయింది. దానికి తోడు వళ్లంతా పుళ్లు పడ్డాయి. ఆదివాసీలకు వైద్యం అందుబాటులో లేకపోవడం సహజమైన విషయమే కనుక ఆమె చావుకు దగ్గరైంది. కొన ఊపిరితో వున్న ఆమె ఇక చచ్చిపోవడం ఖాయమని భావించి తల్లిదండ్రులు ఆమెను పెంటకుప్ప మీద ఒక మంచం వేసి పడుకోబెట్టారు. (అలా

⇨

# అమరవీరులకు ఎర్రెర్రని జోహార్లు

గతంలో కొందరు కామ్రేడ్స్ జీవిత చరిత్రలు ప్రచురించిన సమయంలో వారి ఫోటోలు ప్రచురించలేకపోయాం. ఆలస్యంగా లభించినందున ప్రస్తుతం ప్రచురిస్తున్నాం. ఇప్పటికీ పలువురి కామ్రేడ్స్ చరిత్రలు, ఫోటోలు అందలేదు. ఆలస్యంగానైనా వాటిని పంపగలరని కోరుతున్నాం. – సంపాదకమండలి



కామ్రేడ్ కైలాసం (ఎసిఎం-ఎఒబి)
అమరత్వం: 2005



కామ్రేడ్ గౌతం (ఎ.ఒ.బి.ఎస్.జడ్.సి.సభ్యుడు)
అమరత్వం: నవంబర్ 23, 2006



కామ్రేడ్ హరి (సెంట్రల్ యాక్షన్ టీం సభ్యుడు)
అమరత్వం: ఏప్రిల్ 29, 2007



కామ్రేడ్ ప్రసన్న (ఇంటెలిజెన్స్ రంగం)
అమరత్వం: మే 24, 2009



కామ్రేడ్ సాగర్ (ఎన్.టి.)
అమరత్వం: జనవరి 28, 2009



కామ్రేడ్ అరవింద్ (ఎన్.టి.)
అమరత్వం: జనవరి 28, 2009

➪

చేస్తే బతుకుతారనే ఒక మూఢ నమ్మకం) ఆ సమయంలో అక్కడికి దళం వెళ్లింది. దాదాపు శవంలా వున్న ఆమెకు వైద్యం చేసింది. దానితో ఆమెకు అక్షరాల ప్రాణం తిరిగొచ్చింది. అలా ఆమె కోలుకున్న తర్వాత మూడు నెలలకు విప్లవోద్యమం ఇచ్చిన ఆ పునర్జన్మను విప్లవోద్యమానికే అంకితం చేయాలనే కృత నిశ్చయంతో విప్లవోద్యమంలోకి భర్తీ అయింది. 2007లో భర్తీ అయిన ఆమె ఒక సంవత్సర కాలం పాటు కుతుల్ ఏరియాలోనే ఎల్‌జిఎస్‌లో సభ్యురాలిగా పనిచేసింది. పట్టుదలతో తక్కువ కాలంలోనే చదవడం, రాయడం నేర్చుకుంది.

2008లో ఆమె జనతన సర్కార్‌లోని వ్యవసాయ శాఖలో సభ్యురాలయింది. ఆమె చాలా కష్టజీవి. వ్యవసాయంలో ఏ కొత్త పద్ధతినైనా ఆమె వేగంగా పట్టుకొని దాన్ని ఆచరణలో పెట్టడానికి క్రియాశీలకంగా కృషి చేసేది. ఆలుగడ్డలు వంటి ఎన్నో కొత్తరకం పంటలను పరిచయం చేయడంలో ముఖ్యపాత్ర వహించింది.

అలా ప్రజల ఆర్థిక విధానాన్ని విప్లవీకరించే కృషిలో ఆమె క్రియాశీల భాగస్వామి అయింది. అందుకే ప్రత్యామ్నాయ వ్యవస్థను సహించలేని పాలక వర్గాలకు శత్రువయింది. ఫలితంగా వాళ్ల చేతుల్లో దారుణహత్యకు గురయింది.

కామ్రేడ్ కుమిలి నేడు భౌతికంగా మన మధ్య లేదు. ఆమె మరణించి పీడిత ప్రజల ఆగ్రహంగా మారింది. ఆ ఆగ్రహం నుండి దోపిడీ పాలక వర్గాలను కాపాడే శక్తి ఎవరికుంది? ★

# భోపాల్ దారుణంపై కోర్టు ఇచ్చిన తీర్పును నిరసిద్దాం! అణువిద్యుత్ కేంద్రాలను బలంగా వ్యతిరేకిద్దాం!!

భోపాల్ దారుణంపై కోర్టు ఇచ్చిన తీర్పు 26 సంవత్సరాల పాటు జరిగిన రాజకీయ నైతిక విలువల పతనాన్ని తెలియజేస్తుంది. 1984 డిసెంబర్ 2 రాత్రి మిక్ గ్యాస్ సృష్టించిన విధ్వంసం 15 వేల 274 మంది ప్రాణాలను, 5 లక్షల 74 వేల మంది బతుకుల్లో వెలుగుల్ని చిదిమేసింది. 37 వేల మంది శాశ్వత అంగవైకల్యం పొంది బాధలనుభవిస్తున్నారు. రోజూ (26 సంవత్సరాల తర్వాత కూడా) 6 వేల మంది ఆస్పత్రుల చుట్టూ వివిధ రోగాలతో తిరుగుతూనే వున్నారు. 2010 జూన్ 7న కోర్టు ఎనిమిది మందికి రెండు సంవత్సరాల జైలు శిక్ష విధించింది. అంత ఘోర నిర్లక్ష్యానికి ఇంతేనా శిక్ష?! దానికి 26 సంవత్సరాల సమయమా? ఆశ్చర్యపోకండి. వారిని సంపూర్ణంగా రక్షించేందుకు, కేసును నీరు కార్చడానికి, ప్రధాన నిందితుడిని తప్పించడానికి ఆ మాత్రం సమయం తప్పలేదు. ఇందుకు జరిగిన ఖర్చు ఎంతో లెక్కలు తీస్తే అది అసలు బాధితులకు చెల్లించిన నష్టపరిహారంకన్నా ఎక్కువే వుంటుంది.

సరే ఇంత దారుణం జరిగింది కదా! రాగల ప్రమాదాన్ని ముందుగా గుర్తించలేకపోయామా? అనే సందేహానికి తావు లేకుండా ఆ ప్రమాద హెచ్చరికలు చేసినా లక్ష్య పెట్టలేదనేందుకు అనేక ఆధారాలున్నాయి.

1981 నుండి భోపాల్‌లోని యూనియన్ కార్బైడ్ వ్యవహారాలను జర్నలిస్టు రాజకుమార్ కేశ్వాని పరిశీలించి హెచ్చరిస్తూనే వున్నాడు. ప్రజలలో ప్రచారం చేస్తూనే వున్నాడు. మొదటగా 'రాఫత్' పత్రికలో వ్యాసం రాసాడు. సెప్టెంబర్ 1982లో ఆయన మిత్రుడు మహమ్మద్ అష్రాఫ్ 'ఫోజీన్' గ్యాస్ ప్రభావం కారణంగా ఆ పరిశ్రమలో ప్రాణాలు కోల్పోయాడు. ఆ తర్వాత అక్టోబర్ నుండి వారం వారం వరుస కథనాలు రాసాడు. 1982లో ఆడిట్ బృందం వచ్చి పరిశీలించి, హెచ్చరించి వెళ్లింది. ఆ నివేదిక 'జనసత్తా' పత్రికలో ప్రచురించారు కూడా.

భారత ప్రధాన న్యాయమూర్తిని అభ్యర్థించినా, మధ్యప్రదేశ్ శాసనసభలో ప్రశ్నించినా ఫలితం శూన్యం. జోక్యం చేసుకోవాలని సంస్థలో పని చేసే ఉద్యోగులు అనేకసార్లు పరిస్థితిని వివరించినా ఫలితం లేకపోయింది. 1976–84 వరకు 12 హెచ్చరికలు అందినా లెక్క చేయలేదు. లాభాల కోసం భద్రతను పట్టించుకోని యూనియన్ కార్బైడ్ ఘోర నిర్లక్ష్యమే ఈ ప్రమాదానికి కారణం అనడానికి ఇంతకన్నా ఆధారాలేమికావాలి.

**1947 ఆగస్టు 15న భారతదేశానికి వచ్చిన 'స్వాతంత్ర్యాన్ని'**

**అవహేళన చేసిన భోపాల్ దుర్ఘటన**

1968–84 మధ్య మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో ఒక పురుగుల మందు కర్మాగారం పని చేసింది. 'యూనియన్ కార్బైడ్ ఇండియా లిమిటెడ్' దాని యాజమాన్య వ్యవస్థ. ఇది అమెరికాలో 'యూనియన్ కార్బైడ్' అనే బహుళజాతి సంస్థకు అనుబంధ సంస్థ. దీని వాటా 50.9 శాతం. అంటే నిర్ణయాధికారంకు తగిన వాటా ఇది.

ఘోర ప్రమాదం తర్వాత ఫ్యాక్టరీ మూతబడినా గాని ఇతర వ్యాపారాలు సాగుతూనే వుండేవి. 2001లో దీని మాతృ సంస్థను 'డౌ కెమికల్స్ సంస్థ' కొనేసింది. నష్టపరిహార బాధ్యత, నేర బాధ్యత మాకు లేదని అది ప్రకటించింది. దానికి భారతదేశంలోని కాంగ్రెస్‌కి చెందిన ప్రముఖ నాయకులు కేంద్ర మంత్రులు చిదంబరం, కమలనాథ్, అభిషేక్ మనుసింఘ్వి, బి.జె.పి. నాయకుడు అరుణ్‌జైట్లీ లాంటి వారి బలమైన అండ వుంది. మధ్యప్రదేశ్ ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వాలు అనుసరించిన విధానాలు, వ్యవహరించిన తీరు అత్యంత నీచమైనవి. ఆనాటి సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి అహ్మది కూడా ఏమాత్రం విలువలను పాటించలేదు. కేసును నీరుకార్చడమే కాకుండా ఆ తర్వాత ఏర్పడిన ట్రస్టుకు అధ్యక్షుడుగా సిగ్గు విడిచి నిన్నటి (జూలై 19) వరకూ కొనసాగాడు.

1960 దశకంలో హరిత విప్లవంలో భాగంగా ఎరువులు, పురుగు మందుల వాడకం 10 రెట్లు పెరిగింది. నిబంధనల ప్రకారం కర్మాగారాల్లో 3–4 టన్నులు మాత్రమే ఎం.ఐ.సి. రసాయనం నిలువ చేయాల్సి వుండగా ఇక్కడ 42 టన్నులు నిలువ చేసారు. అది కూడా ఎటువంటి జాగ్రత్తలూ, నిబంధనలనూ, ప్రమాణాలను పాటించకుండా జనావాసాల దగ్గరనే నిలువ చేసారు. చిన్న చిన్న డ్రమ్ముల్లో విడి విడిగా నిలువ చేస్తే కూడా ఇంత పెద్ద ఎత్తున ప్రమాదం జరిగి వుండేది కాదు. కొన్ని దేశాల్లో ఇలా నిలువ చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటారు. లైసెన్సును రద్దు చేస్తారు. కంపెనీ లాభాల్లో వాటా కోసం నిబంధనల్ని గాలికొదిలేసారు మన దళారీ పాలకులు. పరిస్థితిని అర్థం చేసుకోవడం, హెచ్చరికలు వచ్చాకనయినా మార్పులు చేయడం, చర్యలు తీసుకోవడం అవసరం. ఘటన తర్వాత దోషులను పట్టుకుని చట్టానికి అప్పగించడం, బాధితులకు నష్టపరిహారం చెల్లించడం ప్రభుత్వం బాధ్యత. ఈ బాధ్యతలన్నింటి నుండి వైదొలగి, బాధితుల తరపున వకాల్తా తీసుకుని కూడా బాధితులకు వ్యతిరేకంగా తీవ్రంగా నష్టం కలిగించి, మానసికంగా వేదనకు గురిచేసిన భారత దోపిడీ పాలకవర్గ పార్టీల

రాజకీయ నైతిక పతనాన్ని లోతుగానే విశ్లేషించుకోవలసిన అవసరం ఎంతైనా వుంది.

ప్రభుత్వం బాధితులకు నష్టపరిహారాన్ని దోషుల నుండి కట్టించలేదు. దానికి బదులుగా కోర్టు బయట రాజీ జరిగేలా చేసింది. పరిహారాన్ని తక్కువ చేయడమే కాకుండా, ప్రభుత్వ ఖజానా మీద భారం వేసి వేలకోట్ల రూపాయలు ప్రభుత్వం చెల్లించేలా చేసింది. విష పదార్థాల తొలగింపు బాధ్యత నుండి కూడా దోషులను తప్పించి ఆ పనికి కూడా ప్రజా ధనం వినియోగిస్తున్నది. నేరస్తులపై ఈగ వాలకుండా, నష్టం కలగకుండా రక్షించి అన్ని రకాల ఆర్థిక భారాలను ప్రజలపైకి నెట్టివేసే మన భారతదేశ పాలకులు బహుళజాతి సంస్థల సేవకులు. రాజ్యాంగ విరుద్ధంగా, బాధ్యతారహితంగా వ్యవహరించే ప్రజా వ్యతిరేకమైన పాలనా వ్యవస్థలున్నాయిక్కడ.

ప్రజల యొక్క ప్రజల చేత, ప్రజల కొరకు ఉందని చెప్పుకునే ప్రభుత్వం పూర్తిగా దోపిడీ వర్గాల సేవకే అంకితమయిందనేది నగ్న సత్యం. ఈ ప్రభుత్వంతో పాటు అధికార, న్యాయ వ్యవస్థలు ముడిపడి వున్నాయి. అందుకే తీర్పు క్రూరంగా, దుర్మార్గంగా వుంది. ఈ తీర్పుకు అన్ని బూర్జువా రాజకీయ పక్షాలు కూడా స్పందించిన తీరు ఏహ్యమైనది. దీనికి కారణం భారత దళారీలు, విదేశీ బహుళజాతి సంస్థలు పెనవేసుకుని పోవడమే. వారి ప్రయోజనాలు ప్రజా వ్యతిరేకం. ప్రజల ప్రాణాలు, ప్రయోజనాలు వారికి అక్కరలేదు. దేశంలోని పాదార్థిక వనరులు, మానవ శ్రమ మాత్రమే వారికి కావాలి. లాభాలే వారి లక్ష్యం. అందుకే 'భారత దేశాన్ని పరిశ్రమల యొక్క, పరిశ్రమలచేత పరిశ్రమల కొరకు పాలించబడే ప్రజాస్వామిక' దేశంగా చెప్పుకోవాల్సి వుంటుంది.

"ఘరానా సంపన్నులు భారత్‌లో ఎంతటి నేరానికి పాల్పడినా సునాయసంగా తప్పుకోవడానికి అనేక దారులున్నాయని భోపాల్ తీర్పు భరోసా ఇచ్చింది." అని న్యూయార్క్ టైమ్స్ వ్యాఖ్యానించిందంటే భారతదేశ ఖ్యాతి ప్రపంచంలో ఎంతగా వర్ధిల్లుతున్నదో అర్థం చేసుకోవచ్చు.

భోపాల్ విషాదానికి కారణమైన అమెరికన్ గుత్త సంస్థ యూనియన్ కార్బైడ్‌కు చెందిన సి.ఇ.ఓ. వారెన్ అండర్సన్‌ను అమెరికా అధ్యక్షుడు రీగన్ ఒత్తిడితో భారత ప్రధాని రాజీవ్‌గాంధీ సగౌరవంగా ప్రభుత్వ విమానంలో అమెరికాకు సాగనంపాడు. భోపాల్ బాధితులను నిర్లక్ష్యం చేసి, దేశ సార్వభౌమాధికారాన్ని, నైతికతను మంటగలిపి ప్రపంచ కార్పోరేట్‌కు దాసోహమన్నాడు. ఈ అపరాధి గౌరవానికేమీ భంగం కలగకుండానే రాష్ట్రపతి జ్ఞానీజైలుసింగ్‌ను కలిసి మరీ వెళ్లాడంటే మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి అర్జున్‌సింగ్‌తో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతగా సహకరించారో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికీ ఆ ఘరానా పెద్ద మనిషి పరారీలో ఉన్నాడని రికార్డుల్లో చూపిస్తున్నారు. ఇక ఆ 'రారాజు'ను పిలిపించగల ధైర్యసాహసాలు, సామర్థ్యాలు మన పాలకులకు ఉన్నాయా? అంటే లేవని చెప్పడానికి గత ఉదాహరణలు, నేటి కార్యాచరణ సాక్ష్యంగా ఉన్నాయి.

హర్షద్‌మెహతా సృష్టించిన కుంభకోణంలో రెండు విదేశీ బ్యాంకుల ప్రమేయాన్ని గుర్తించి చర్య తీసుకుందామన్నప్పుడు ఆనాటి ఆర్థిక మంత్రి మన్‌మోహన్‌సింగ్ 'తప్పుడు సంకేతాలు వెడతాయని' చెప్పాడు. తర్వాత కాలంలో ఈయనే 'భారత్ జార్జిబుష్‌ను ప్రేమిస్తుంది' అని 'సరైన' సంకేతాలను పంపాడు. బ్రిటన్ ప్రభుత్వాన్ని పొగిడి అన్ని విధాల సమర్థించి ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ నుండి డాక్టరేట్ సంపాదించాడు. ఇప్పుడు అణు ఒప్పందాలు చేసుకున్న భారత ప్రభుత్వానికి ప్రధాన మంత్రిగా రేపు పార్లమెంటులో 'అణు ప్రమాద పరిహార బాధ్యతా బిల్లు'ను ఆమోదింపచేసి హార్వార్డ్ యూనివర్సిటీ నుండి కూడా డాక్టరేట్ పొందే కృషిలో తలమునకలై ఉన్నాడు. వీరు వారన్ అండర్సన్‌ను అప్పగించమని అడుగుతారని మనం ఆలోచించగలమా?

భోపాల్ దుర్ఘటన ఆపలేని, నేరస్తుల్ని శిక్షించలేని భారత పాలకవర్గాలు ఆ ఘోరాన్నీ, ఆర్థిక భారాన్ని ప్రజలపైకే నెట్టివేసిన ఘన కీర్తి గల మహానుభావులు బహుళజాతి సంస్థలకు దళారీలుగా వ్యవహరిస్తూ వందల అణు కుంపట్లను మన నెత్తిమీద రుద్దేందుకు, ఆ ప్రమాదాల భారాన్ని ప్రజలపైనే నెట్టి వేయడానికి చట్టం (బిల్లు) తెస్తున్నారు. ఆ విషయంలో భారత ప్రజలు, మేధావులు, ప్రజాస్వామికవాదులు అప్రమత్తంగా లేకపోతే, అడ్డుకునేందుకు ఉద్యమాలు చేపట్టకపోతే భోపాల్ లాంటి స్మశానవాటికలు వందలు, వేలు పెరుగుతాయి. 1991 తర్వాత వచ్చిన నూతన ఆర్థిక విధానాలు, ఎల్.పి.జి. విధానాలు, నూతన బ్యాంక్ విధానాలు, బీమా రంగ సంస్కరణలు, ఎస్.ఇ.జడ్.లు, విద్య, రిటైల్ రంగాల్లోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు రావడం లాంటి విపత్కర పరిణామాలకు తోడు అణు విద్యుత్ కేంద్రాల్లో ఏదైనా ప్రమాదం సంభవిస్తే జరిగే హాని అంచనాకు అందనంత భయానకమైనది. మన పాలకుల నిర్లక్ష్యం, పరాధీనత వర్ణించనలవికానివి.

మన దేశంలో అమెరికా, కెనడా దేశాల బహుళజాతి సంస్థలు భారీ ఎత్తున అణు విద్యుత్ కేంద్రాలు నెలకొల్పడానికి, 2010–20 సంవత్సరాల మధ్య 60 వేల కోట్ల రూపాయల విలువైన అణు రియాక్టర్ల కొనుగోలుకు రంగం సిద్ధం అయింది. ప్రమాదం జరిగితే పరిమితి లేకుండా నష్టపరిహారం చెల్లించే వీలు చాలా దేశాల్లో వుంది. అమెరికాలో ఇది 40 వేల కోట్ల రూపాయలు వుంది. కానీ భారతదేశంలో దీనిని 2,500 కోట్ల రూపాయలకు కుదిస్తూ చట్టం తెస్తున్నారు. మిగిలిన భారం భారత ప్రభుత్వంపై, పరోక్షంగా భారత ప్రజల పైన వుంటుంది. వారు ప్రమాదాలు కల్పిస్తారు. మనం అనుభవిస్తాం. ఇది వారి కార్పోరేట్ నీతి. దానికి సై అనడం

⇨

# తాకిలోడు నరమేధం - గ్రీన్‌హంట్ దురాగతం

ఆపరేషన్ గ్రీన్‌హంట్‌లో భాగంగా ఫిబ్రవరి 3న మాడ్ డివిజన్‌లోని తాకిలోడు గ్రామం వద్ద జరిగిన ఎన్‌కౌంటర్లో ఏడుగురు మావోయిస్టులు చనిపోయినట్టు పోలీసు అధికారులు నిస్సిగ్గుగా చేసిన పచ్చి అబద్ధాల ప్రకటనను ప్రసార మాధ్యమాలు ప్రచారం చేశాయి. కానీ కొంత కాలంగా దండకారణ్యంలో జరుగుతున్న పరిణామాలను కనీసంగా పరిశీలిస్తున్న ప్రజలెవ్వరూ జరిగింది ఎన్‌కౌంటరనీ, చనిపోయింది సాయుధ మావోయిస్టు గెరిల్లాలని విశ్వసించలేదు. సింగారం, సింగనమడుగు, గొంపాడు, కోకవాడ అమానుష హత్యాకాండల పరంపరలో జరిగిన మరొక హత్యాకాండగా అనుమానించారు. ఆ అనుమానం అక్షరాల నిజం!

సింగారం తదితర హత్యాకాండల పరంపరలోనే ప్రభుత్వ సాయుధ బలగాలు తాకిలోడు గ్రామంలోనూ నిరాయుధ ప్రజలను పట్టుకొని అత్యంత అమానుషంగా, క్రూరంగా హింసించి, కాల్చి చంపి తమకు అలవాటయిన ఎన్‌కౌంటర్ కట్టుకథను నిస్సిగ్గుగా అల్లారు.

దండకారణ్యంలో అంకురించిన ప్రజా రాజ్యాధికారాన్ని చిదిమెయ్యడానికి సామ్రాజ్యవాదుల దన్నుతో దేశ పాలకవర్గాలు సాగిస్తున్న దమనకాండకు ముద్దుపేరు మొన్న జనజాగరణ్ అభియాన్, నిన్న సల్వాజుడుం, నేడు గ్రీన్‌హంట్. ఈ దమనకాండలో పార్టీపై, ప్రజలపై విచ్చలవిడి హింస కొనసాగుతోంది. అందులో భాగమే తాకిలోడు హత్యాకాండ.

భైరంగఢ్ నుండి వంద మందికి పైగా వచ్చిన సి.ఆర్.పి.ఎఫ్., ఎస్పీవో తదితర సాయుధ మూకలు 2010 ఫిబ్రవరి 3న, ఉదయం ఆరు గంటల సమయంలో తాకిలోడు గ్రామాన్ని చుట్టుముట్టాయి. తాకిలోడు గ్రామానికే చెందిన రాము అనే జనతన సర్కార్ (ప్రజా ప్రభుత్వం) పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయుడిని పోలీసులు గత నవంబర్‌లో ఎస్పీవోగా మార్చుకున్నారు. విప్లవోద్యమాన్ని అణచడంలో భాగంగా పోలీసులు ప్రజలనూ, కుటుంబాలను చీల్చి కొందరిని నయాన భయానా తమ వైపుకు తిప్పుకొని మొత్తం ప్రజలకే కాక స్వయాన తమ తల్లిదండ్రులకూ, తోబుట్టువులకూ, భార్యా పిల్లలకూ శత్రువులుగా మార్చుతున్నారు. పాలక వర్గాలు పన్నుతున్న నీచమైన ఎత్తుగడల్లో ఇదొకటి. ఇందులో భాగంగా కొన్నాళ్ల క్రితం రాము తమ్ముడిని ఎస్పీవోగా మార్చుకుని అతడి ద్వారా రామును రహస్యంగా ఎస్పీవోగా మలిచారు. రాము ద్రోహిగా మారి గ్రామం నుండి పారిపోయేంత దాకా ఇక్కడి ప్రజా ప్రభుత్వం గుర్తించలేకపోయింది. ఈ ద్రోహి సహా మరికొందరు ఇన్ఫార్మర్ల సహాయంతో పోలీసులు తాకిలోడు గ్రామంపై దాడి చేశారు. ఇదే సమయంలో దాని సమీప గ్రామాలైన ధర్మ, మర్రమెట్ట, జాడ్కపారలపై మరికొన్ని సాయుధ మూకలు దాడి చేశాయి.

ఈ మూకలు ఈ గ్రామాల్లోకి ప్రవేశిస్తూనే విచక్షణా రహితంగా కాల్పులు జరిపారు. టియర్ గ్యాస్ వదిలారు. కనబడ్డవాళ్లను దుడ్డుకర్రలతో బాదారు. భీతావహులై పారిపోతున్న ప్రజలను వెంటాడి వెంటాడి కొందర్ని పట్టుకున్నారు. ఇలా తాకిలోడులో 14 మందినీ, జాడ్కపారలో ఒకరినీ, మర్రమెట్టలో ఇద్దర్నీ పట్టుకోగలిగారు. ఇలా పట్టుబడిన వారిలో తాకిలోడు గ్రామానికి చెందిన మోటు, మోటు కూతురు పద్నాలుగేళ్ల అమ్మాయి, జైరాం, ఆశారాం అనే ఇద్దరు అన్నాదమ్ములు, కల్మం అనంత్‌రాం, అతని తమ్ముడు శిశు, వేకో అనంతరాం, రాజు, రాము సహా మరికొందరూ, జాడ్కపార గ్రామానికి చెందిన ఇర్పాల్, మర్రమట్ట గ్రామానికి చెందిన కుయేర్, మరొక వ్యక్తి వున్నారు. పోలీసులు మొదట పాఠశాల ఉండిన చోటికి వెళ్లి అంతా వెతికారు. కానీ ప్రజా ద్రోహి రాము ఊళ్లో నుండి పారిపోయి ఎస్పీవోగా మారిన తర్వాత పాఠశాలను ఇంకొక చోటుకు మార్చడం వల్ల ఆ పాఠశాలా, అందులో చదువుకునే చిన్నారులు పోలీసుల చేతికి చిక్కకుండా తప్పుకోగలిగారు. పట్టుబడిన వాళ్లందర్నీ పోలీసులు విచక్షణారహితంగా కొడుతూ తీసుకువెళ్తూ వుంటే తాకిలోడు గ్రామ మహిళలు, వృద్ధులు అడ్డుకోవడానికి తీవ్రంగా ప్రయత్నించారు. అలా అడ్డగించిన వారందరినీ వృద్ధులనే విచక్షణ సైతం లేకుండా దారుణంగా కొట్టారు. పోలీసుల ఈ అమానుష కృత్యం ఫలితంగా పలువురు మహిళలు, వృద్ధులు తీవ్రంగా గాయపడ్డారు. వాళ్ల శరీరాలు కదుములు తేలాయి. అలా చాలాసేపు పోలీసులను వెంబడిస్తూ తమ ఆప్తులను విడిపించుకోవడానికి తీవ్రంగా పెనుగులాడిన వాళ్లందరినీ పోలీసులు తమ పాశవిక బలాన్నీ, విచక్షణా రహిత హింసను ప్రయోగించి తరిమి కొట్టారు. ఇంద్రావతి నది సమీపిస్తుండగా పి.ఎల్.జి.ఎకు చెందిన ఒక ప్లటూన్ ఎదురుపడి పోలీసుల పైకి కాల్పులు జరిపారు. దీని వలన బందీలుగా పట్టుబడిన కొందరికి పోలీసుల కబంధహస్తాల నుండి తప్పించుకునే అవకాశం

⇨

భారత దళారీ రీతి. కోపెన్‌హెగెన్‌లో కర్బన ఉద్గారాల ప్రమాదం గురించి ఆందోళన చెందిన ప్రపంచం అణుకుంపట్ల విషయంలోను వ్యతిరేకంగా వుంది. భారత్ లాంటి దేశాలు రాబోయే అణు ప్రమాదాల నుండి బయటపడాలంటే భోపాల్ పరిణామాల నుండి నేర్చుకోవాల్సిందే. లేకుంటే భవిష్యత్‌లో తగిన మూల్యం చెల్లించక తప్పదు. సార్వభౌమాధికారం, స్వావలంబనల కోసం రాజీలేకుండా పోరాడుదాం. సాయుధ పోరాట మార్గమే ఈ వ్యవస్థ దోపిడీ మూలాల్ని ఛేదించగలదని, ప్రజలకు భద్రత కల్పించగలదని ఎలుగెత్తి చాటుదాం. ★

దొరికింది. పారిపోగా మిగిలిన వాళ్లను ఇంద్రావతి నది దాటించి పోలీసులు వారికి యూనిఫారాలు తొడిగారు. పోలీసులు యూనిఫారాలు తొడుగుతున్నారంటే తర్వాత జరగబోయేదేంటో ఉద్యమ ప్రాంతాల్లోని పసిపిల్లలకు కూడా బాగానే తెలుసు కనుక, తన తండ్రికి యూనిఫాం తొడుగుతున్నప్పుడు మోటు కూతురు ఏడుస్తూ అడ్డుకోవడానికి పెనుగులాడింది. ఆమె తమకు బంధువే అయిన ద్రోహి రాముతో 'మాకు బంధువు అయి వుండి మా నాన్నను ఎందుకు చంపిస్తున్నావు? మా నాన్న ఏం నేరం చేశాడు?' అని దీనంగా వేడుకుంది, కోపంతో తిట్టిపోసింది. అన్నదమ్ములైన జైరాం, ఆశారాంలు తమకు యూనిఫారాలు తొడుగుతున్నప్పుడు ఒకర్నొకరు కౌగిలించుకొని భోరు భోరున ఏడ్చారు. 'ఒకర్నొకరు పట్టుకొనే చనిపోదాం' అని ఒకరితో ఒకరు చెప్పుకున్నారు. కానీ ఇటువంటి హృదయవిదారక దృశ్యాలు హృదయం లేని పోలీసులను ఎలా కదిలించగలవు? అందుకే కూతురు ముందే తండ్రిని చెట్టుకు తలకిందులుగా వేలాడదీశారు. అన్నదమ్ములిద్దరినీ క్రూరంగా కొట్టి విడదీసి చెట్లకు వేలాడదీశారు. వీరితో పాటు రాము, రాజు, వేకో అనంతరాం, కల్మం అనంతరాంలను చెట్లకు వేలాడదీసి అత్యంత ఘోరంగా, మానవత్వం సిగ్గుతో తలదించుకునేలా చిత్రహింసలు పెట్టారు. వాళ్ల కండరాలను కత్తులతో కోసివేశారు. కొందరి కళ్లు పెకిలించారు. నాలుకలు కోసేశారు. ఆ చిత్రహింసలకు తాళలేక వాళ్లు చేసిన గుండెల్ని పిండేసే ఆర్తనాదాలకు మోటు కూతురూ, కల్మం అనంతరాం తమ్ముడు కల్మం శీశులు ప్రత్యక్షసాక్షులుగా నిలిచారు. ఆ తర్వాత పోలీసులు ఈ ఏడుగురినీ కాల్చిచంపి శవాలను తాము తెచ్చిన వాహనంలో వేసుకొని వెళ్లిపోయారు. వాళ్లను కాల్చి చంపుతున్నప్పుడు మోటు కూతురు, కల్మం శీశులు తప్పించుకోగల్గారు.

ఇలా పోలీసులు పొట్టన పెట్టుకున్న వారిలో బార్స మోటు (35)కు భార్యా, అయిదుగురు పిల్లలు వున్నారు. అందర్లోకి చిన్నవాడికి రెండు నెలల వయసు మాత్రమే. కల్మం అనంత్‌రాం (23)కు భార్యా, ముగ్గురు పిల్లలున్నారు. మరొక మృతుడు వేకో అనంత్‌రాం (30). 2007లో ఈ గ్రామంపై సల్వాజుడుం దాడి చేసినపుడు ఇతని భార్య ఐతేను జుడుం మూక పట్టుకొని ముక్కలు ముక్కలు చేసి చంపారు. అప్పటికి ఆమె చంటి బిడ్డ తల్లి. (ఆమెతో పాటు సిలుక్ అనే మరొక మహిళను కూడా కాల్చి చంపారు.) ఆ తర్వాత అనంతరాం తిరిగి పెళ్లి చేసుకున్నాడు. ప్రస్తుతం వారికి ఏడాది నిండని ఒక బాబు వున్నాడు. ఏముల జైరాం (30)కు భార్యా, ఇద్దరు చిన్న పిల్లలున్నారు.ఏముల ఆశారాం (25)కు భార్యా, ఇద్దరు చిన్న పిల్లలున్నారు. ప్రస్తుతం భార్య గర్భవతిగా వుంది. కల్మామి రాము (22)కు భార్యా, రెండేళ్ల పాపాయి వున్నారు. మురామి రాజు(20)కు ఇటీవలే పెళ్లయింది. ప్రస్తుతం భార్య గర్భవతి. ఈ ఏడుగురిని పొట్టన పెట్టుకోవడం మూలంగా ఈ కుటుంబాలన్నీ ఛిన్నాభిన్నమయ్యాయి.

పోలీసులు చెప్పినట్టు వీళ్లెవరూ మావోయిస్టు పార్టీకి చెందిన సాయుధ గెరిల్లాలు కాదు. తమ భార్యా పిల్లలతో పాటు తమ యిండ్లల్లో తాముగా, తమ బతుకులు తమవిగా జీవిస్తున్నవారు. ప్రభుత్వం మావోయిస్టులను దేశ అంతర్గత భద్రతకు అతిపెద్ద శత్రువులుగా బహిరంగంగా ప్రకటిస్తోంది. కానీ నిజానికి అది తమ యిండ్లల్లో తాముగా, తమ బతుకులు తమవిగా జీవిస్తున్న సాధారణ పౌరులను కూడా శత్రువులుగానే పరిగణిస్తోంది. ఇందులో ఆశ్చర్యపోవాల్సిందేమీ లేదు. అర్థం కానిది కూడా ఏం లేదు. పాలక వర్గాలు దండకారణ్యాన్ని, ఆ మాటకొస్తే మొత్తం దేశాన్ని సమూలంగా దోచుకోడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్న నేటి సందర్భంలో ఈ అడవి నాది, ఈ ఇల్లు నాది, నేను ఈ గాలినే పీల్చుకుంటాను, ఈ మట్టిలోనే కలిసిపోతాను అని ఎవరు మాట్లాడినా వారిని శత్రువులుగానే పరిగణిస్తుంది. ప్రభుత్వమూ, పోలీసులు ఎంత భయపెట్టినా, భ్రమ పెట్టినా 'రాహత్ శిబిరా'ల్లో బందీలు కాకపోవడమూ, ఎస్పీవోలుగానో, ప్రజా ద్రోహులుగానో మారకపోవడమూ, తమ కంటిని తమ వేలుతో పొడుచుకోవడానికి నిరాకరించడమూ – ఇవికూడా పాలకుల దృష్టిలో నేరాలయ్యాయి. సామూహికంగా హత్యలకు పాల్పడి మావోయిస్టులనే ముద్ర వేసే ఘోరాలయ్యాయి.

పట్టుకుపోయిన తమ వారిని పోలీసులు దారుణంగా చంపేశారని తెల్సిన కుటుంబీకులూ, బంధువులూ, గ్రామస్తులు భోరున విలపించారు, ఆగ్రహించారు. తమ వాళ్లను కాపాడుకోలేక పోయినా, వారి మృతదేహాలనైనా తీసుకువచ్చి తమ గడ్డ మీద వారికి సగౌరవంగా అంత్యక్రియలు చేయాలని నిర్ణయించుకున్నారు. ఇక్కడి జనతన సర్కార్ కూడా మృతదేహాల స్వాధీనానికి కదలాలని ప్రజలకు, ముఖ్యంగా మహిళలకు పిలుపునిచ్చింది. అందుకోసం మృతుల తల్లులూ, భార్యలూ సహా 150 మహిళలు, వృద్ధులు కదిలి అదేరోజు రాత్రికిరాత్రే భైరంగఢ్‌కు వెళ్లారు. కానీ మనుషులను చంపి కనీసం శవాలను సైతం ఇవ్వనిరాకరిస్తున్న అత్యంత అప్రజాస్వామిక పరిస్థితుల్లో శవాల స్వాధీనానికి వాళ్లు తీవ్ర పోరాటమే చేయాల్సి వచ్చింది. వాళ్లేమీ హరించిన తమ వాళ్ల ప్రాణాలను తిరిగి ఇవ్వమని అడగలేదు. పొట్టన పెట్టుకున్న తమ వాళ్లను తిరిగి బతికించమనీ అడుగలేదు. కనీసం నిర్జీవంగానైనా తమ వాళ్లను తమకు ఇవ్వమని అడిగారు. కానీ ఫాసిస్టు పాలకులూ, వాళ్ల కాపలా కుక్కలైన పోలీసులు దాన్ని కూడా సహించలేక పోయారు. శవాల కోసం వచ్చిన వారందరినీ పచ్చిబూతులు తిట్టారు. విచక్షణా రహితంగా లాఠీలతో కొట్టారు. బెదిరించారు. మృతుల తల్లులను సైతం విచక్షణా రహితంగా కొట్టారు. మృతుడు జైరాం తల్లి ఇందులో తీవ్రంగా గాయపడింది. అయినా వాళ్లెవరూ వట్టి చేతులతో తిరిగి రాదల్చుకోలేదు. 'చంపితే చంపండి శవాలను వదిలి మేం వెళ్లం' అన్నారు. వాళ్లను శారీరకంగా హింసించడమే కాదు వాళ్ల మనోభావాలు తీవ్రంగా గాయపడేలా శవాల మీదికి ఎక్కి తొక్కడం, ఎగరడం చేస్తూ వికృతానందాన్ని చాటుకుంటూ కేరింతలు కొట్టారు. దీన్ని భరించలేని మహిళలు

⇨

# ప్రతిఘటనా - పోరాటాలూ - సభలు

## విజయవంతమైన నూరేళ్ల శ్రామిక మహిళా పోరాట దినం
## కోరాపుట్ డివిజన్

కోరాపుట్ జిల్లా, నారాయణపట్నం ఏరియాలో ఆదివాసీ విప్లవ మహిళా సంఘం మార్చి 1న ఏరియా ప్రథమ మహాసభను ముగించుకొని, మార్చి 3-7 వరకు గ్రామాలలో క్యాంపెయిన్ చేపట్టింది. నూరేళ్ల 'మార్చి 8' సభను విజయవంతం చేయాలంటూ నారాయణపట్నా, బందుగామ్ బ్లాక్‌లలో 9 పంచాయితీల్లో 70 గ్రామాలకు పైగా ప్రచారం చేశారు. పంచాయితీకి ఒకటి, రెండుచొప్పున 19 చోట్ల మీటింగులు జరిపారు. ఒక్కొక్క మీటింగ్‌కు దాదాపు 500 మంది ప్రజలు హాజరయ్యారు. మొత్తం 50 మంది ఎ.వి.ఎం.ఎస్. (ఆదివాసీ విప్లవ మహిళా సంఘం), మిలీషియా సభ్యులు కలిసి ప్రచారంలో పాల్గొన్నారు. ఏరియా వ్యాప్తంగా 500 పోస్టర్లు, 30 బ్యానర్లు కట్టారు. గోద్రగూడలో ప్రచారం టీమ్ సమాచారం ఇన్‌ఫార్మర్స్ ద్వారా అందుకున్న ఎస్.ఒ.జి., ఒ.ఎస్.ఎ.పి. పోలీసులు 50 మంది గోద్రగూడకు చేరుకుంటుండగా, ప్రజల సహకారంతో క్యాంపెయిన్ టీమ్ సురక్షితంగా బయటపడింది.

**బహిరంగ సభ:** 7వ తేదీనే తమ తమ గ్రామాల నుండి మీటింగుకు చేరిన ప్రజలు ముఖ్యంగా మహిళలు ఎత్తైన కొండలు ఎక్కుతూ దిగుతూ 8వ తేదీ 10 గంటలకల్లా సభాస్థలికి చేరుకున్నారు. సభ ఉదయం జె.ఎన్.ఎం. పాటలతో ప్రారంభమైంది. ఈ సభకు వక్తలుగా కామ్రేడ్స్ పద్మ, కిందో, జీర్మో ఎ.వి.ఎం.ఎస్. నుండి ప్రసంగించారు. వీరంతా తమ మాతృభాష కుయిలోనే ప్రసంగించారు. కా. రవి ఎ.ఆర్.సి.ఎస్. నుండి ప్రసంగించాడు. విస్థాపనా విరోధ్ మంచ్ నుండి కా. జెన్ని ప్రసంగించాడు. వక్తలు మార్చి 8 పోరాట స్ఫూర్తిని ఎత్తిపడుతూ పోరాట వారసత్వాన్ని కొనసాగించాలనీ, ప్రభుత్వం మార్చి 8ని అందాల పోటీలు, ముగ్గులు, వంటల పోటీలుగా మార్చివేస్తున్నదనీ, ఇదే ప్రాంతంలో 2004 మార్చి 8న, కామ్రేడ్ శశి, విజయ్‌లతోపాటు కుమారిని హత్య చేసి మార్చి 8 పోరాట స్ఫూర్తి, మహిళా సాధికారతల పట్ల ప్రభుత్వం తనకున్న 'ప్రేమ'ను చాటుకున్నదన్నారు. మహిళ లేని విప్లవం గెలువబోదంటూ సభా ప్రాంగణం మారుమోగింది. జె.ఎన్.ఎం. కామ్రేడ్స్ ఆట పాటలతో మధ్యాహ్నం 3 గంటలకు సభ ముగిసింది.

---

⇨

పోలీసులను తిట్టారు. ఒక మృతుని తల్లి ఒక ఎస్పీవోను కొట్టింది కూడా. ఇలా మహిళలు పట్టుదలగా పోరాడడం వల్ల తప్పనిసరై పోలీసులు 4వ తేదీ మధ్యాహ్నానికి మృతదేహాలను అప్పగించారు. మహిళలే ఆ మృతదేహాలను తమ గ్రామం వరకూ మోసుకువచ్చారు. అదే రోజు రాత్రి జనతన సర్కార్ ఆధ్వర్యంలో, చుట్టుపక్కల నుండి తరలి వచ్చిన వందలాది ప్రజానీకం రాజ్యహింసకు వ్యతిరేకంగా చేసిన నినాదాల నడుమ సగౌరవంగా ఆ ఏడుగురికి అంత్యక్రియలు జరిగాయి. ఫిబ్రవరి 7న తాకిలోడులో మృతుల స్మారకసభ జరిగింది. ఈ సభకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలందరూ హాజరై నివాళిని అర్పించారు. ఈ అమానుష హత్యాకాండను ముక్త కంఠంతో ఖండించారు. ఇటువంటి హత్యాకాండలకు పాల్పడుతున్న ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను నిలిపివేసేలా ప్రభుత్వం మీద వత్తిడి తేవాల్సిందిగా దేశ ప్రజానీకానికీ, ప్రజాస్వామ్యవాదులకూ విజ్ఞప్తి చేశారు.

అయితే పోలీసుల చేతిలో బందీలుగా వుండి వారి అమానుషత్వాన్ని ఆ రోజు కళ్లారా చూసిన వారు మాత్రం చాలా రోజుల వరకు మానసికంగా కోలుకోలేక పోయారు. మోటు కూతురుకు పిచ్చెక్కింది. చాలా రోజుల వరకూ ఆ అమ్మాయి మాటా మంతీ తిండీ నిద్రా లేకుండా గడిపింది.

మృతుల కుటుంబ సభ్యుల్లో మనోధైర్యాన్ని కల్పించడానికీ, ప్రజలూ, పార్టీ, జనతన సర్కార్ వారికి అండగా వుంటుందనే హామీనివ్వడానికి స్థానిక పార్టీ, మృతుల కుటుంబసభ్యులతో సమావేశం ఏర్పాటు చేసింది. వారి సాధక బాధకాలు తెల్సుకొని వారికి అవసరమైన ఆర్థిక సహాయం చేసింది.

ఆ తర్వాత ఈ ఘటనకు కారకులైన ఇద్దరు ఇన్ఫార్మర్లను పార్టీ శిక్షించింది.

దేశ భవిష్యత్తు కోసమూ, దేశ భవిష్యత్తుతో ముడిపడి వున్న తమ అస్తిత్వం కోసమూ పోరాడుతున్న ప్రజలపై పాలక వర్గాలు పాల్పడుతున్న ఇటువంటి హత్యాకాండలను ఖండించడం, ఇటువంటి దురాగతాలకు అడ్డుకట్టను వేసే ఉద్యమాలను చేపట్టడం ప్రజలూ, ప్రజాస్వామిక వాదుల కనీస బాధ్యత.

ప్రజలను పోరు మార్గాన్ని వీడేలా చేయడం కోసం పాలకవర్గాలు నిరాయుధ ప్రజలపై సైతం ఇటువంటి బీభత్స హత్యాకాండలను జరుపుతున్నాయి. అయితే సమస్యలు ఉన్నంత వరకూ ప్రజలు పోరు మార్గాన నడుస్తూనే వుంటారు. నిర్బంధం మరింతగా ప్రతిఘటనను పెంచుతుందే తప్ప పోరాటాన్ని ఆపలేదు. ఇది చరిత్ర తేల్చిన సత్యం.

విప్లవ ప్రతిఘటనను మరింతగా పెంచడం ద్వారానే పాలకుల హింసాకాండను తుడిచిపెట్టగలం. ఈ దిశలో మన కృషిని మరింతగా పెంచుకోవడమే మనముందున్న కర్తవ్యం. ★

ఈ సభకు 4 వేల మంది మహిళలు, వేయి మందికిపైగా పురుషులు హాజరయ్యారు. 7వ తేదీన బయలుదేరిన ప్రజలకు ప్రతి గ్రామంలోనూ ప్రజలు అంబలి ఇచ్చి ఆకలిదప్పులు తీర్చి మీటింగు విజయవంతం కావడానికి సహకరించారు.

### ఎం.కె.బి. డివిజన్

ఏరియాలో పోస్టర్ల ద్వారా నూరేళ్ల 'మార్చి 8'ని విస్తృతంగా ప్రచారం చేయడం జరిగింది. మార్చి 8న మాచిఖండ్ ఎల్.ఒ.ఎస్. ఏరియాలోని మల్కన్‌గిరి జిల్లా కొయిర్‌పుట్ బ్లాక్‌లోని మద్కపొద్దూరు పంచాయితీలోని సుమారు 17 గ్రామాల ప్రజలు (ప్రధానంగా మహిళలు) కదిలి మార్చి 8న 1500 మందిలో బ్యానర్స్, ప్లకార్డ్సు చేతబూని ప్రదర్శన జరిపారు. ఆనంతరం మహిళా విముక్తి జెండాని ఎగురువేసి భారత నూతన ప్రజాస్వామిక విప్లవంలో అసువులుబాసిన అమరులకు వినమ్రంగా జోహార్లు అర్పించారు. ప్రజా సంఘాల నుండి ముగ్గురు వక్తలు ప్రసంగించారు. ప్రధానంగా మహిళల హక్కులు, రాజ్యహింస, పితృస్వామిక అణచివేత వీటి విముక్తికై జరుగుతున్న పోరాటాలను వివరిస్తూ మహిళా విముక్తి నూతన ప్రజాస్వామిక విప్లవంతోనూ, ప్రపంచ సోషలిస్టు విప్లవంతోను ముడిపడి వుందని అందులో మహిళలు తాము ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. పార్టీ నుండి మహిళలు మాట్లాడి అంతర్జాతీయ మహిళా దినం ప్రాముఖ్యతనూ, మహిళా ఉద్యమ చరిత్రను వివరించారు. భారతదేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవంలో భాగంగా జరుగుతున్న మహిళా విముక్తి పోరాటాలను ఎత్తిపడుతూ మహిళలందరూ ఉద్యమంలో భాగం అవుతామని శపథం చేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మల్కన్‌గిరి జిల్లా సాంస్కృతిక (పితూరు ఏందన) దళం పాటలు, నృత్యాలు, నాటికల ద్వారా ప్రజలను రాజకీయంగా ఉత్తేజపరిచింది.

### మల్కన్‌గిరి డివిజన్

జిల్లాలోని పప్పులూరు ఏరియాలో నిర్వహించిన నూరేళ్ల 'మార్చి 8' సభకు 600 మంది ప్రజలు హాజరయ్యారు.

అంతర్జాతీయ శ్రామిక మహిళా దినపు ప్రాముఖ్యత ఏరియాలో 10 రోజుల ముందు నుండే స్థానిక దళం ప్రచారం చేయడం, పోస్టర్లు వేయడం ఏరియాలో అన్ని గ్రామాల ప్రజలకు సభను విజయవంతం చేయాలని పిలుపునివ్వడంతో మార్చి 8 ఉదయం ఆర్.వి.ఐ. గ్రామానికి జనం బారులుతీయడం మొదలుపెట్టారు.

మధ్యాహ్నం 2 గంటలకు సభా ప్రాంగణం మొత్తం జనంతో కళకళలాడింది. ప్రజలు రెండు లైన్లుగా బారులుతీరి బ్యానర్లు, ప్లకార్డులు పట్టుకొని నినాదాలతో ర్యాలీ చేశారు. ర్యాలీ ముగిసిన తర్వాత అమరవీరులకు మౌనం పాటించి జోహార్లు అర్పించారు.

గ్రామ మహిళా సంఘం అధ్యక్షురాలు మహిళా అమరవీరుల జెండా ఆవిష్కరణ చేసి గ్రామ గ్రామాన మనం మహిళా సంఘాలు పెట్టుకోవాలి, మనందరం పోరాటం చేయాలని పిలుపునిచ్చింది. తర్వాత ఏరియా కమిటీ నుండి మహిళా కామ్రేడ్ అధ్యక్షత వహిస్తూ సమాజంలో మహిళలను ఎలా అణచివేస్తున్నారో మాట్లాడింది. ఇంకో ఏసీఎం మాట్లాడుతూ అంతర్జాతీయ శ్రామిక మహిళా దినం ప్రాముఖ్యతనూ రోజు రోజుకు మహిళలపై పెరుగుతున్న రాజ్యహింసను వివరించింది. మహిళా విముక్తి మావోయిస్టు పార్టీ పోరుతోనే సాధ్యం అని నొక్కిచెప్పింది. మరొక ఏసీఎం ప్రజల సంస్కృతి ఎలా మటుమాయం అవుతున్నదో, మహిళ అంగట్లో సరుకుగా ఎలా మారిందో, ఈ సామ్రాజ్యవాద విష సంస్కృతి మహిళల్ని ఎలా తయారు చేస్తున్నదో మాట్లాడింది.

చివరలో డీసీఎం ఒడిషా ప్రభుత్వం మహిళలవట్ల వ్యవహరిస్తున్న తీరు మాట్లాడాడు. సమస్యలన్నింటికి కారణం సామ్రాజ్యవాదులు, భూస్వాములు, ఈ ప్రభుత్వాలేనని ఈ దోపిడి అసమానత పోవాలంటే పోరాటమే మార్గమని పిలుపునిచ్చాడు.

మధ్య మధ్యలో పి.ఎ.డి. కామ్రేడ్స్ కోయ, ఒడియా, తెలుగు భాషల్లో పాడిన పాటలతో, ఆటలతో ప్రజలను ఉత్తేజపరిచారు. స్త్రీ, పురుషుల సామూహిక, సాంప్రదాయక నృత్యాలు, కోలాటంతో ఉత్సాహభరితంగా సభ ముగిసింది.

## ఆపరేషన్ గ్రీన్‌హంట్‌కు వ్యతిరేకంగా

### కోరాపుట్ డివిజన్

కోరాపుట్ జిల్లా, నారాయణపట్నా, బందుగాం, సిమిలిగూడ, లక్ష్మీపూర్ బ్లాక్‌లలో ప్రభుత్వం ఆదివాసీ ప్రజలపై కొనసాగిస్తున్న ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను బందచేసి, ఆదివాసీ ప్రజల మౌలిక సమస్యలు పరిష్కరించాలని, ఆదివాసీ విప్లవ మహిళా సంఘం నాయకత్వంలో ఏప్రిల్ 15న నారాయణపట్నా బ్లాక్ సెంటర్‌లో ర్యాలీ నిర్వహించాలని నిర్ణయించి 10 రోజులపాటు అన్ని గ్రామాలలో విస్తృతంగా ప్రచారం చేపట్టారు. మొత్తం నాలుగు బ్లాక్‌లలో 14 పంచాయితీలలో ప్రచారం చేసారు. ఈ సందర్భంగా 500 పోస్టర్లు వేసి, 100 బ్యానర్లు కట్టారు.

14న ప్రజలు ర్యాలీ ప్రారంభించాలనుకున్న గ్రామానికి అందుబాటులోకి చేరుకుని, 15న ఉదయం 10 గంటలకు 12 వేల మంది ప్రజలతో పాడొపాద్రో నుండి ర్యాలీ ప్రారంభమైనది. ఇందులో దాదాపు 10 వేల మంది మహిళలు వున్నారు. ర్యాలీకి ముందు అధ్యక్షురాలు ఉపన్యసించారు. రెండు వరుసలుగా సాగిన ర్యాలీ 6 కి.మీ. పొడవు నారాయణపట్నా నుండి బసనాపుట్ వరకు సాగుతూనే వుంది. ర్యాలీలో ప్రజలు తమ డిమాండ్‌లతో కూడిన రిబ్బన్లు తలకు, మెడలో, చొక్కాలపైన అంటించుకోవడం ప్రదర్శనలో ప్రత్యేక ఆకర్షణగా వుండింది. ర్యాలీలో పాల్గొన్న

ప్రజలతో నారాయణపట్నా సరిపోలేదంటే అతిశయోక్తికాదు. గ్రీన్‌హంట్‌ను బంద్‌చేయాలి. సాగునీరు, తాగునీరు, విద్య, వైద్య, గృహవసతి మొదలగు సమస్యలు పరిష్కరించాలనీ, అక్రమంగా అరెస్టుచేసిన 130 మంది ఆదివాసీ మహిళలు, పురుషులు, పిల్లలను బేషరతుగా విడుదల చేయాలని నినదించారు. ర్యాలీ బి.డి.ఒ. ఆఫీసుకు చేరేటప్పటికి అధికారులు ఎవ్వరూ రాలేదు. ర్యాలీ సమాచారం ముందే తెలుసుకున్న అధికారులు ఆఫీస్‌కు సెలవు పెట్టారు. విషయం తెలుసుకున్న ప్రజలు, మహిళా సంఘం నాయకులు ఆఫీస్‌లో వున్న ప్యూన్‌కు డిమాండ్ పత్రాన్ని ఇచ్చి అధికారులకు ఇవ్వాలని తెలియజేసారు. మెమోరాండంలో ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించడానికి నెలరోజుల లోపు చర్యలు చేపట్టాలని లేనిచో తమ ఆందోళనను తీవ్రతరం చేస్తామని కూడా లిఖితపూర్వకంగా తెలియజేశారు.

సుదూర ప్రాంతాల నుండి వచ్చిన వేల మంది ప్రజలకు ఆకలిదప్పులు తీర్చడానికి ప్రతి గ్రామంలో నీళ్లు, అంబలి వంటివి అందించి, ర్యాలీని విజయవంతం చేయడంలో అన్ని గ్రామాల ప్రజలు ఎంతో సహకారాన్నందించారు.

నెలరోజులు గడిచినా ప్రభుత్వం ఏ ఒక్క విషయంలో కూడా ఎలాంటి చర్యలను, పరిష్కారాలను చూపలేదు. అందువలన మే 10న ప్రజలను కదిలించి మిలిటెంట్ రూపంలో మరో ధర్నా కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించడం జరిగింది. అన్ని పంచాయితీల్లోని గ్రామాలకు ఈ సమాచారం చేరి, మే 10న కార్యక్రమం కోసం చివరి సన్నాహాల్లో ప్రజలంతా నిమగ్నమై వున్నారు. దీన్ని విఫలం చేయాలని పోలీసులు, ప్రభుత్వం పెద్ద ఎత్తున కుట్ర పన్ని గ్రామాలపై దాడులకు పూనుకున్నారు. ఏరియాలో ముఖ్యమైన గ్రామాల్లో, పరిసర ఏజెన్సీ కొండలపై కూంబింగ్‌లు నిర్వహించారు. ఈ క్రమంలోనే 'సామన' గ్రామంలో ఎన్‌కౌంటర్ జరిగింది. సామన గ్రామ ప్రజలను పోలీసులు అదుపులోకి తీసుకొని టెర్రర్ సృష్టించారు. సభను విఫలం చేయడం, వీలైతే సంఘం నాయకత్వాన్ని నష్టపర్చడం లక్ష్యంగా ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఘటనలోనే కామ్రేడ్స్ సూర్యం, జగదీష్‌లు అమరులయ్యారు. అనేక గ్రామాల నుండి ప్రజలు 9వ తేదిన వచ్చి తిరిగి వెళ్లిపోయారు.

### ఎం.కె.బి. డివిజన్:

కట్‌ఆఫ్ ఏరియా పోరాట నాయకత్వంపై ప్రభుత్వం అక్రమంగా బనాయించిన తప్పుడు కేసులను ఎత్తివేయాలనీ, ఆదివాసీ ప్రాంతాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తలపెట్టిన ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ పానసపుట్, జోడాంలు, ఓంద్రపల్లి పంచాయితీలలోని సుమారు 70 గ్రామాలకు చెందిన 4 వేల మంది ప్రజలు గురిశెట్టి వద్ద మే 10న ఆపరేషన్ గ్రీన్‌హంట్ వ్యతిరేక ప్రజాగర్జన (శబుజో శికారో విరోధ్ జనఘర్జన) పేరుతో సభ జరుపుకొని నినాదాలతో కూడుకున్న బ్యానర్లు చేతబట్టి భారీ ప్రదర్శనను చేశారు. గ్రామాలపై పోలీసులు దాడులకు వస్తే సంఘటితంగా ఎదుర్కోవాలని నిర్ణయానికి వచ్చారు. కలెక్టర్ అనుసరిస్తున్న ద్వంద్వనీతిని నిరసించారు. కట్ ఆఫ్ ఏరియా ప్రజల మౌలిక సమస్య అయిన సాగుభూమి, నీటి సమస్య ఆందోళన చేపట్టాలని నిర్ణయం తీసుకున్నారు. ఇలా కట్ ఆఫ్ ఏరియా ప్రజల పోరాటం అప్రతిహతంగా కొనసాగుతోంది.

### మల్కన్‌గిరి డివిజన్:

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గ్రీన్‌హంట్ పేరుతో ప్రజలపై తలపెట్టిన దాడికి వ్యతిరేకంగా, సాగునీరు, తాగునీరు, కరెంటు, కొండరెడ్ల రిజర్వేషన్ సమస్య, తునికాకు ఇప్పపువ్వు రేట్ల సమస్య పరిష్కరించాలనే డిమాండ్‌తో 2010 ఏప్రిల్ 2న మల్కన్‌గిరిలో 10 వేల మంది ప్రజలతో భారీ ర్యాలీ జరిగింది.

ఈ ర్యాలీ కోసం జిల్లావ్యాప్తంగా ప్రజలు మల్కన్‌గిరికి తరలి వచ్చి దాదాపు రెండు గంటల సేపు ప్రదర్శన జరిపి కలెక్టర్‌కు డిమాండ్ల పత్రాన్ని అందించారు. ఈ ప్రదర్శనలో దాదాపు సగం మంది మహిళలు పాల్గొని విజయవంతం చేశారు.

గ్రీన్‌హంట్ నేపథ్యంలో ఈ ర్యాలీ మంచి ప్రభావాన్ని వేసింది.

## కామ్రేడ్స్ శాఖమూరి అప్పారావు, కొండల్ రెడ్డిల సంస్మరణ సభ

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించిన గ్రీన్‌హంట్ నిర్బంధంలో భాగంగా శాఖమూరి అప్పారావు, కొండల్ రెడ్డిలను పట్టుకుని హత్యచేయడాన్ని నిరసిస్తూ బ్యానర్లు, పోస్టర్లు రాసి ఒడిషాలోని మల్కన్‌గిరి జిల్లా పప్పులూరు ఏరియాలో అంటించడం జరిగింది. ఈ ప్రియతమ నాయకులను స్మరించుకుంటూ కామ్రేడ్ శాఖమూరి అప్పారావుకు పరిచితమైన పప్పులూరు ఏరియా నాగులూరు గ్రామంలో సంస్మరణ సభ నిర్వహించారు.

మధ్యాహ్నం 2 గంటలకు మొదలైన ఈ సభకు ఏసీఎం అధ్యక్షత వహించింది. ఇంకొక ఏసీఎం నల్లమలలో కామ్రేడ్ శాఖమూరి అప్పారావు కృషినీ, కష్టాల్లో ఉన్నప్పుడు తను ప్రదర్శించిన ధైర్యం, దృఢ సంకల్పాన్ని తడిమింది. మరొక ఏసీఎం కామ్రేడ్ శాఖమూరి పేరు తలుస్తూనే కన్నీరు మున్నీరు అయింది. బాధను దిగమింగి క్యాడర్ పట్ల కామ్రేడ్ అప్పారావు ప్రేమను, జైల్లో ఖైదీల హక్కుల కోసం చేసిన పోరాటాన్ని వివరించి, తమ నాయకులను చంపిన శత్రువును అంతం చేసి నెత్తుటిబాకి తీరుస్తాం అని శపథం చేస్తూ ప్రజలు కూడా వారి ఆశయాలను కొనసాగించాలని పిలుపునిచ్చింది. డీసీఎం మాట్లాడుతూ ప్రజల్లో క్యాడర్‌లో కామ్రేడ్ అప్పారావు వేసిన ప్రభావాన్నీ, శత్రువును తుదముట్టించడంలో తన పాత్రను చెప్పాడు.

చివరలో ఎస్.జడ్.సి.ఎం. మాట్లాడుతూ కామ్రేడ్ అప్పారావు విప్లవ ప్రయాణం, విప్లవ నేపథ్యం, కుటుంబ జీవితం, మెదక్ ఉద్యమంలో తన పాత్రనూ, కామ్రేడ్ కొండల్‌రెడ్డి విప్లవ జీవితం, టెక్ రంగంలో తన నైపుణ్యం, తన ఆరోగ్య పరిస్థితిని అధిగమించిన తీరును వివరించాడు. ఈ ఇద్దరి మరణం మనకు తీవ్రమైన నష్టం అని మాట్లాడాడు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రీన్‌హంట్‌ను ఎందుకు తలపెట్టాయో వివరిస్తూ ఈ గ్రీన్‌హంట్‌ను ఓడించాలని పిలుపునిచ్చాడు.

## అమరుల సంస్మరణ సభ

కామ్రేడ్స్ శాఖమూరి అప్పారావు, రమణల, ముకురాం అమరుల, కామ్రేడ్స్ సూర్యం, జగదీష్‌ల సంస్మరణ సభ కోరాపుట్ జిల్లా గుమ్మండి గ్రామంలో మే 20న సాయంత్రం జరిగింది. ఈ సభలో ఆ గ్రామ ప్రజలందరే కాక చుట్టుపక్కల గ్రామాల సంఘసభ్యులు కూడా పాల్గొన్నారు.

ఈ సభలో కామ్రేడ్స్ నందాల్, సుగుణ, మహేష్, పూర్ణ తదితరులు అమరులతో తమ జ్ఞాపకాలను పంచుకున్నారు. ముఖ్యంగా కొంతకాలంగా అదే ప్రాంతంలో పనిచేస్తూ, అక్కడి పోరాటాలకు రక్షణ కల్పించి, ప్రజలందరికీ చిరపరిచితుడై వాళ్లపై చెరగని ముద్రను వేసి, మే 9న జరిగిన ఎన్‌కౌంటర్‌లో అమరుడైన కామ్రేడ్ సూర్యం ఆదర్శాలనూ, త్యాగాన్ని వక్తలందరూ కొనియాడారు. అమరుల ఆశయ సాధనలో ముందుకు సాగుదామని శపథం చేశారు.

## నారాయణపట్నాలో కొనసాగుతున్న నిర్బంధం

నారాయణపట్నా భూపోరాటాన్ని అణచడంలో భాగంగా ప్రభుత్వం శాంతిసేన పేరుతో ఒక అరాచక గూండా మూకను ఏర్పాటు చేసింది. ఈ శాంతిసేన, అర్ధసైనిక బలగాలు, పోలీసులు కల్సి ఈ ప్రాంతంలో ప్రజలపై తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నారు. ఇందులో భాగంగా 2009, నవంబర్ 20న నారాయణపట్నాలో కాల్పులు జరిపి సింగన్న, ఆంద్రులను పొట్టన పెట్టుకున్నారు. ఆ తర్వాత నిర్బంధం నేటికీ కొనసాగుతూనే వుంది.

ఈ సంఘటన నుండి మొదలుకొని ఇప్పటివరకు నారాయణపట్నా పోలీసు వలయంగా మారింది. ఆ రోజు 3 వేల మంది పోలీసు బలగాలను మోహరించి నారాయణపట్నా చుట్టుపక్కల గ్రామాలపై దాడులు చేశారు. కిలువ, బిక్రాంపురం, దుంశిలి, పచ్చింగి, పొడపొద్ర, బలియాపుట్, పాలూరు, కుంబారి, పగ్గం తదితర గ్రామాలపై రాత్రింపగల్లు 100, 200 మందితో కూడిన పోలీసు బృందాలు దాడులు చేశాయి. గ్రామాలకు గ్రామాలను దిగ్బంధించి ప్రజలను అంతా పోగేసి విపరీతంగా కొట్టి యువకులను అరెస్టులు చేశారు. మొదట డొంబగూడ అనే గ్రామంలో మహిళలపై (నవంబర్ 20కి ముందు) అత్యాచారం చేశారు. తర్వాత జరిగిన దాడుల్లో బలియాపుట్‌లో మరో మహిళపై నల్గురు సి.ఆర్.పి.ఎఫ్. పోలీసులు అత్యాచారం చేశారు. నాచికలింగా ఇంటిపై దాడిచేసి ఇళ్ల తలుపులు, కిటికీలు, వంట పాత్రలు, బట్టలను ధ్వంసం చేశారు, ఎత్తుకపోయారు. బలియాపుట్ కిలువ, పచ్చింగి, పొడపొదర, దుంశిలి, రేంగ గ్రామాలపై దాడుల సందర్భంగా మేకలు, కోళ్లు, బంగారం, డబ్బులు ఎత్తుకపోయారు. దాడుల్లో దొంగిలించిన మేకలతో, కోళ్లతో పోలీసులు, శాంతి సంఘం వాళ్లు విందులు చేసుకుంటున్నారు. ధాన్యం, చోళ్లు, కొహల వంటి చిరుధాన్యాలన్నింటినీ కలియకలపడం, వాటిలో కిరోసిన్ పోయడం వంటి బీభత్సకాండను సృష్టించారు. ఈ క్రమంలోనే ఇప్పటివరకు 135 మంది వరకు సాధారణ ప్రజల నుండి నాయకత్వం వరకూ అరెస్టు చేసి జైలులో బంధించారు. జైలులో చిత్రహింసలకు గురిచేసి వైద్యం అందించకపోవడం వలన పగ్గం గ్రామస్థుడైన కొండగొర్రి గంగులు జైలులో మరణించాడు. ప్రతిగా ఎలాంటి నష్టపరిహారం ఇవ్వలేదు. ఇంటికి శవాన్ని కూడా పంపించలేదు.

పచ్చింగి గ్రామంలో ఒక చిన్న పిల్లల తల్లిని అరెస్టు చేశారు. నారాయణపట్నాకు దగ్గరలో వుండటం భూపోరాటంలో చురుకుగా కదలడం వలన ఈ గ్రామంపై భూస్వాములకు కన్నెర్ర. ఇప్పటికి ఏడుగురు జైలులో వున్నారు. నిరంతరం ఆ గ్రామంపై దాడులు చేస్తున్నారు.

2010 ఫిబ్రవరి వరకు ఈ విధమైన దాడులకు పాల్పడి విధ్వంసాన్ని సృష్టించారు. ముఖ్యంగా భూ ఆందోళనకు నాయకత్వం వహిస్తున్న వాళ్లలో 20 మంది నాయకత్వంను పోలీసులు టార్గెట్ చేస్తున్నారు. కుముదిని, గోపాల్ శిరిక వంటి లీడర్లు అరెస్టు అయి జైలులో వున్నారు. ఇప్పటి నుండి అరెస్టులు చేయడంకన్నా దాడుల్లో (మావోయిస్టు పేరుతో) నిర్మూలించడం అనంతరం గ్రామాలకు గ్రామాలు లొంగదీసుకోవడం ప్రభుత్వ ఎత్తుగడగా వుంది.

నిర్బంధ బాధితులను ఆదుకోవడం అనేది అందరి బాధ్యత అనే రాజకీయ కార్యక్రమం ప్రజల్లోకి వెళ్లింది. ఇప్పటికి అన్ని గ్రామాల్లో జైళ్లలో వున్న వారి వ్యవసాయ పనులను సంఘం చేసి వారి కుటుంబాలకు తోడ్పాటును అందించింది. ప్రజలందరు బాధ్యతగా స్వీకరించి చేస్తున్నారు. వంట చెరుకును కూడా కొన్ని కుటుంబాలకు తెచ్చి ఇస్తున్నారు. ఇలా నిర్బంధాన్ని వ్యతిరేకిస్తూ ప్రజలు ఎంతో చైతన్యాన్ని ప్రదర్శిస్తున్నారు. ★

**అమరుల ఆశయసాధనలో సాహసంగా పోరాడుదాం, గ్రీన్‌హంట్‌ను ఓడిద్దాం!**

(...60వ పేజీ తరువాయి)

బిర్సు ప్రధాన వక్తగా ప్రసంగించాడు. మొదటగా ఆయన భారత విప్లవానికి సరైన పంథాను రూపొందిన పార్టీ సంస్థాపకులు, అమరులు కామ్రేడ్ చారుమజుందార్, కన్నయ్ ఛటర్జీలకు నివాళు లర్పించాడు. ఇదే క్రమంలో 1857 నుండి నేటి వరకూ అమరులైన ప్రజావీరులందరికీ ఆయన నివాళులర్పించాడు. వాళ్లందరి త్యాగాలకు మనం వారసులం అని చెప్పాడు. 'మన రక్తం పారని కొండ లేదు, మైదానం లేదు పట్టణం లేదు. ఈ అమరత్వం వట్టి పోదు. ఇది తప్పక విప్లవ విజయానికి దారి తీస్తుంది. శత్రువుకు రోజులు తగ్గిపోతున్నాయి. మనకు పెరుగుతున్నాయి. వాడి రోజులు ఎందుకు తగ్గిపోతున్నాయంటే వాడి ఆర్థిక పునాదే కుళ్లిపోయింది. దాని సాంఘిక పునాదే బలహీనమయింది. అందుకే సామ్రాజ్యవాదం మరణశయ్యపై వుందని లెనిన్, మావో మహాశయులు పదే పదే చెప్తూ వచ్చారు. ప్రపంచ సోషలిస్టు విప్లవంలో భాగంగా భారతదేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవాన్నీ, సోషలిస్టు విప్లవాన్ని విజయవంతం చేయాలనే లక్ష్యంలో భాగంగా మనం ప్రాణత్యాగం చేస్తున్నాం. మన లక్ష్యంతో త్యాగం విడదీయలేనిది. మరణానికి సిద్ధపడుతూనే మనం యుద్ధంలో పాల్గొంటున్నాం. ఆ మరణానికి సిద్ధపడకపోతే మనం సాహసించలేము. మన వునికిని కాపాడుకోవాలంటే, బానిస సంకెళ్లను తెంచుకోవాలంటే, మనం మనుషులుగా బతకాలంటే మనకు పోరాటం తప్ప మరో మార్గం లేదు. రాజకీయాల కొనసాగింపే యుద్ధం. ఈ ఒక్క సంవత్సరంలో 300 మందిని కోల్పోయాం. ఇంత మందిని పొట్టన పెట్టుకున్నది దోపిడీ రాజకీయాలే. నేడు దోపిడీ వర్గాలు సంక్షోభాన్ని పరిష్కరించుకోవాలంటే దోపిడీని తీవ్రతరం చెయ్యాలి. దోపిడీని తీవ్రతరం చెయ్యాలంటే ఫాసిస్టు దమనకాండను మరింతగా పెంచాలి. అందులో భాగంగానే ఈ రక్తపాతం. ఈ 300 మందిలో ఎన్నో నైపుణ్యాలు వున్న కామ్రేడ్స్‌ను కోల్పోయాం. కాబట్టి నేడు శత్రువు ఉత్సాహపడుతుండవచ్చు. మన ఇంటెలిజెన్స్‌ను దెబ్బ తీశాడు. మన సరాఫరాలను దెబ్బతీశాడు. మన ప్రచారాన్ని దెబ్బతీశాడు. కామ్రేడ్స్ ఆజాద్, వికాస్, అప్పారావు వంటి సుదీర్ఘ అనుభవం వున్న కామ్రేడ్స్‌ను హత్య చేశాడు. ఎంతో అనుభవాన్ని పొందిన సీనియర్ కామ్రేడ్స్‌ను అరెస్టు చేశారు. సూర్యం వంటి విలువైన కమాండర్స్‌ను చంపేశాడు. నాయకత్వాన్ని దెబ్బకొట్టడం ద్వారా ఉద్యమాన్ని నిర్మూలించవచ్చని శత్రువు అనుకుంటున్నాడు. ఒక పెద్ద శత్రువుతో పోరాడుతున్నప్పుడు చిన్న భాగాన్ని కోల్పోతాం, మనల్ని మనం పరిరక్షించుకోవడం కోసమే మనం ఒక చిన్న భాగాన్ని కోల్పోతాం అది తప్పదు. అమరత్వం లేకుండా మన విప్లవం ముందుకు సాగదు. వీళ్ల అమరత్వంతోనే మనం సాయుధ సంపత్తిని పెంచుకుంటున్నాం, ప్రజల్లో ఉత్తేజాన్ని నింపుతున్నాం.

ఈ గ్రీన్‌హంట్‌లో భాగంగా బీభత్సకరంగా హింసను కొనసాగిస్తున్నారు. ఈ బీభత్స యుద్ధాన్ని ఓడించాలంటే మనం యుద్ధాన్ని తీవ్రతరం చేయడం తప్ప మరో మార్గం లేదు. తీవ్రతరం చేయాలంటే మనం నాయకత్వాన్ని కాపాడుకోవడం అవసరం, అలా కాపాడుకోవడం ద్వారానే యుద్ధాన్ని ముందుకు తీసుకుపోగలం. దానికోసం మన సైద్ధాంతిక, రాజకీయ పటిష్టతను పెంచుకోవాలి. సైద్ధాంతిక శక్తి మన సృజనాత్మక శక్తిని, నైపుణ్యాన్ని, డైనమిజాన్ని పెంచుతుంది. ఇది లేకుండా మనం యుద్ధాన్ని గానీ మరే కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లలేం. మన నష్టాల్ని తగ్గించుకోవాలంటే మనకు యుద్ధ సూత్రాల మీద పట్టురావాలి. అలా వచ్చినపుడు పరిస్థితులకు అనుగుణంగా యుద్ధ సూత్రాలను అన్వయించి మనం వంద యుద్ధాలనైనా గెలుస్తాం. శత్రువు ఎన్ని ఎల్.ఐ.సి. పథకాలు తెచ్చినా ప్రజలతో మనం మమేకం అయి వున్నంత కాలం మనల్ని ఏం చేయలేడు. ప్రజల్ని పెద్ద ఎత్తున కదిలించాలి కదిలించకపోతే మనకు రిక్రూట్‌మెంట్ పెరగదు. ఇది రాజకీయ పోరాటం ఇదే మనకు కవచం. లెనిన్ చెప్పినట్టు ప్రతిపౌరుడు సాయుధం కావాలి, ప్రతి ఇల్లు సెల్లు కావాలి, ప్రతి ఊరు ఉక్కుకోట కావాలి.

శత్రువు శక్తితో పోల్చినపుడు మన శక్తి తక్కువ కాబట్టి దానికి తగ్గట్టుగా మన పోరాటరూపాలు వుండాలి. ఇప్పటి దాకా చేసిన యుద్ధం ఒక ఎత్తు. రేపు చేసే యుద్ధం మరొక ఎత్తుగా వుంటుంది. శత్రువు హైటెక్ విధానాన్ని తీసుకువస్తాడు. హెలీకాప్టర్స్ తెచ్చి దాడి చేస్తామని బెదిరిస్తున్నాడు. కాబట్టి ప్రజల మనోస్థైర్యాన్ని పెంచుతూ యుద్ధాన్ని కొనసాగిస్తూ వాళ్ల క్రియాశీలశక్తిని పెంచాలి. సాయుధంగా నిరాయుధంగా రకరకాల పోరాటాలు చేయాలి. అమరులు కష్టపడి అభివృద్ధి చేసిన విషయాలను పుణికిపుచ్చుకొని ముందుకు సాగాలి. మనం ఎంతో కష్టపడాలి. త్యాగాలు చేయాలి. మన పార్టీ, పిఎల్‌జిఎ, ఐక్య సంఘటన, జనతన సర్కార్లను అభివృద్ధి చేసినపుడు మాత్రమే మన ప్రియతమ కామ్రేడ్స్ ఆశయాలను నెరవేర్చిన వాళ్లమవుతాం.మన అమరులకు నిజమైన నివాళి ఇదే' అంటూ ముగించాడు.

తర్వాత దండకారణ్యం సౌత్ రీజనల్ బ్యూరో ఇన్‌ఛార్జ్ కామ్రేడ్ రామన్న ప్రసంగించాడు. ఈ సందర్భంగా ఆయన ఈ సంవత్సర కాలంలో అమరులైన పలువురు కామ్రేడ్స్‌ను పేరు పేరునా స్మరించుకున్నాడు. ముఖ్యంగా ముక్రాం అమరుల త్యాగాన్ని గొప్పగా ఎత్తిపట్టాడు. దాదాపు ఐదేళ్లుగా దండకారణ్యంలో రాజ్యహింస ఎంత బీభత్సంగా కొనసాగుతున్నదో, సింగారం, సింగనమడుగు, గొంపాడు, తాకిలోడు వంటి పాశవిక హత్యాకాండలు ఎలా జరుగుతున్నాయో తడిమాడు. ఈ

హత్యాకాండను అడ్డుకోవడంలో భాగంగా ముక్రాం వంటి వీరోచిత దాడులను విజయవంతం చేయడానికి కామ్రేడ్స్ రుక్మతి, వాగాల్, ఇంగాల్, విజ్జాల్, రామాల్, మంగు, రాజు, రతన్లు సాహసోపేతంగా పోరాడి అమరులయ్యారన్నాడు. దాడి జరుగుతున్న క్రమంలో తమ కళ్ల ముందే కామ్రేడ్స్ గాయపడుతున్నా, అమరులవుతున్నా కొంచెం కూడా వెనకడుగు వేయకుండా మన వీర కిశోరాలు శత్రువు సమీపంలోకి దూసుకువెళ్లిన తీరును ఎత్తిపట్టాడు. ముక్రాం ప్రాధాన్యత చరిత్రలో ఎంతగా వున్నదో చెప్తూ ఈ కామ్రేడ్స్ త్యాగాలు లేకుంటే ఈ విజయం కూడా వుండేది కాదన్నాడు. అలాగే కొంగెర అమరులు కామ్రేడ్స్ బండు, శంకర్, రమేష్ల త్యాగాన్ని కొనియాడాడు.

ఆ తర్వాత సిఆర్బి రెండవ కంపెనీకి చెందిన సి.పి.సి. సభ్యురాలు కామ్రేడ్ సుగుణ ప్రసంగించింది. ఆమె నారాయణపూర్ ప్రాంతంలో శత్రు దాడిలో అమరులైన కామ్రేడ్స్ సూర్యం, జగదీష్ల అమరత్వాన్ని ఎత్తిపడుతూ మాట్లాడింది. మొదటగా ఆమె కామ్రేడ్ జగదీష్ గురించి మాట్లాడుతూ చిన్న వయసులోనే ఉద్యమంలోకి వచ్చి, మిలిటరీ రంగంలో చురుకైన పాత్రను వహించిన తీరును వివరించింది. అలాగే కామ్రేడ్ సూర్యం అట్టడుగు వర్గం నుంచి ఉద్యమంలోకి వచ్చి అంచెలంచెలుగా ఎదుగుతూ తన పాత్రను పెంచుకుంటూ నల్లమల, గుంటూరు ఉద్యమ చరిత్రలో విడదీయరాని భాగంగా మారిన తీరునూ, నిప్పులు చెరిగే నిర్బంధంలో ఆంధ్రప్రదేశ్ ఉద్యమంలో తన వంతు పాత్రను సమర్థవంతంగా నిర్వహించిన తీరునూ, సిఆర్సిలో భాగమై రెండవ కంపెనీ కమిస్సార్గా తన పాత్రను నిర్వహించిన తీరును, క్యాడర్తోనూ, తనతోనూ ఆత్మీయంగా, ప్రజాస్వామ్యయుతంగా వ్యవహరించే తీరును వివరించింది.

29న ఉదయం కొనసాగిన సభలో మొదటగా కామ్రేడ్ భాను మాట్లాడింది. ఈ సందర్భంగా ఆమె ఈ సంవత్సరకాలంలో అమరులైనవాళ్లలో తనకు పరిచయమున్న కామ్రేడ్స్ గురించిన కొన్ని జ్ఞాపకాలను పంచుకుంది. కేంద్ర కమిటీ అధికార ప్రతినిధిగా కామ్రేడ్ ఆజాద్ చేసిన కృషినీ, దండకారణ్య ఉద్యమంతో కామ్రేడ్ అప్పారావు మమేకమయిన తీరును ఎత్తిపడుతూ, ఉత్తర తెలంగాణ అమరుల్లో కామ్రేడ్ భాస్కర్, రమేష్లతో తన స్నేహాన్ని తలుచుకుంది. కామ్రేడ్ రమేష్కు క్రాంతి యూనిట్తో వున్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంది.

ఆ తర్వాత కామ్రేడ్ రజిత మాట్లాడుతూ నక్సల్బరీ, ఇంకా ముందు నుండి నేటి వరకూ సీసీ స్థాయి నుండి ప్రాథమిక స్థాయి వరకూ ఎందరో కామ్రేడ్స్ అమరులయ్యారు. వాళ్లంతా మన మీద వాళ్ల బాధ్యతలను వుంచి అమరులయ్యారు. ఆ బాధ్యతలను మనం నెరవేర్చాలని చెప్పింది.

చివరగా కామ్రేడ్ సంతోష్ ప్రసంగిస్తూ ' సరిగ్గా 38 సంవత్సరాల క్రితం దేశంలోని పాలక వర్గాలు, దాని యజమానులైన సామ్రాజ్యవాదులు నిన్నటి రోజున మన నేత కామ్రేడ్ చారు మజుందార్ను హత్య చేశారు. ఈ హత్య వెనుక వాళ్లకొక భయమున్నది. ఈ దేశంలోని పాలకవర్గాలకు ఒక్కటే ప్రమాదం– అది ప్రజా యుద్ధం. ఆ ప్రజా యుద్ధం అనే భావనను మొట్ట మొదటగా తీసుకు వచ్చిన వారు చారుమజుందారు, కన్నయ్ఛటర్జీ. అందుకే చారుమజుందార్ను హత్యచేశారు. హత్య చేసి కునుకు తీద్దామనుకున్నారు. ఆయన వెదజల్లిన భావాలను కూడా వ్యాపించకుండా చేయడం కోసం ఎమెర్జెన్సీని పెట్టారు. అయినా ఆ భావాలను ఆపలేక పోయాడు. ఆ భావాలు సంఘటితపడి ప్రజాయుద్ధంగా జగిత్యాలలో ముందుకు వచ్చాయి. మళ్లీ వాళ్లకు కునుకు పట్టకుండా ఆగిపోయింది. మరోసారి కామ్రేడ్స్ శ్యాం, మహేష్, మురళిలను హత్యచేసి ప్రజాయుద్ధ పురోగమనాన్ని ఆపామని సంతృప్తికి గురయ్యారు. కానీ వాళ్ల ఆశలు అడియాశలు అయ్యాయి. ఒక సంవత్సరం లోగానే మనం పిఎల్జిఎని ఏర్పాటు చేసుకున్నాం. కామ్రేడ్ ఆజాద్ను చంపి శత్రువు సంతోష పడి వుండవచ్చు కానీ అది తాత్కాలికమే' అని చెప్తూ నారాయణపట్నా పోరాటంలో అమరుడైన కామ్రేడ్ సింగన్న; కామ్రేడ్సూర్యం, కామ్రేడ్ రవిల ఆదర్శాన్ని ఎత్తిపడుతూ మాట్లాడాడు. ఈ సందర్భంగా ఆయన కామ్రేడ్ సింగన్న గురించి తాను రాసిన ఒక స్పందనను చదివి వినిపించారు.

సమావేశాన్ని ముగిస్తూ సభాధ్యక్షుడు కామ్రేడ్ జీవన్ మాట్లాడ్తూ 'ఒక్కొక్క అమరుల చరిత్ర సుదీర్ఘంగా వుంది. అందులోంచి మనం నేర్చుకోవాల్సినవి అనేకం ఉన్నాయి. అయితే మన శక్తినీ, జ్ఞానాన్ని పెంచుకోకుండా వాటిని మనం నేర్చుకోలేం, వాటిని ఆచరించలేం. మనలో వున్న కొన్ని భావాలను, స్వార్థాన్ని వదిలించుకోకుండా కూడా నేర్చుకోలేం. మనం కామ్రేడ్స్ ఆజాద్, అప్పారావు, సూర్యం, బండు, శారద తదితరుల గురించి మాట్లాడుకుంటున్నామంటే వాళ్లు కొన్ని విప్లవ సాంప్రదాయాలను నెలకొల్పారు, క్యాడర్తో, ప్రజలతో మమేకం అయ్యారు. ఆ మమేకం అవడంలో వాళ్లు మనకు ఆదర్శంగా వున్నారు. కోల్పోయిన కామ్రేడ్స్ మనకు తిరిగిరారు గానీ, ఆ కామ్రేడ్సను తీర్చిదిద్దిన ఉద్యమం వుంది. ఆ ఉద్యమమే మళ్లీ అటువంటి కామ్రేడ్సను తయారు చేసుకుంటుంది. ఆ ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోవడమే మన ముందున్న కర్తవ్యం' అన్నాడు.

ఈ సమావేశం పొడుగూతా అమరుల స్మృతిగీతాలతో, నృత్యాలతో కొందరు కామ్రేడ్స్ సభికులందరినీ ఉత్తేజపరిచారు. ★

# అమరుల ఆశయసాధనకు పునరంకితమంటూ ప్రతినబూనిన అమరుల సంస్మరణ సభ

అమరుల సంస్మరణ వారం సందర్భంగా ఒక క్యాంపులో వున్న కామ్రేడ్సందరూ జూలై 28–29న అమరవీరుల సంస్మరణ సభను జరుపుకున్నారు. భారత విప్లవోద్యమ చరిత్రలో ధృవతారగా వెలిగిపోయిన కామ్రేడ్ చెరుకూరి రాజ్‌కుమార్, ఆంధ్రప్రదేశ్ విప్లవోద్యమ చరిత్రలో చెరిగిపోని ముద్రను వేసిన కామ్రేడ్ శాఖమూరి అప్పారావు, వీరేశ్ (సూర్యం)లను ఇటీవలే కోల్పోయి తీవ్రమైన నష్టాన్ని పొంది వున్న ఒక విషాదకర నేపథ్యంలో ఈ సంస్మరణ సభ జరిగింది.

ఈ సందర్భంగా విశాలమైన మిలిటరీ గ్రౌండ్‌లో అమరుల స్థూపాన్ని నిర్మించారు. దాని పక్కనే అమరుల ఫోటో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. అందులో మన ప్రియతమ నేతలూ, పార్టీ స్థాపకులూ కామ్రేడ్స్ చారుమజుందార్, కన్నయ్ ఛటర్జీలతో పాటు ఈ సంవత్సరకాలంలో అమరులైన అనేక మంది కామ్రేడ్స్ ఫోటోలను వుంచారు. అలాగే ఈ మధ్యకాలంలో అమరులైన కామ్రేడ్స్ సంక్షిప్త జీవిత చరిత్రలతో కూడిన ఏడు పుస్తకాలను ప్రచురించారు.

28న మధ్యాహ్నం రెండు గంటలకు క్యాంపులో వున్న కామ్రేడ్సందరూ, అమరవీరులకు పేరు పేరునా జోహార్లు చెబుతూ, విప్లవ నినాదాలు చేస్తూ ర్యాలీగా వెళ్లి గ్రౌండ్‌కు చేరుకుని, స్థూపం ఎదురుగా బారులు తీరి నిలబడ్డారు. కామ్రేడ్ మైను ప్రోటోకాల్ చేయించి, కామ్రేడ్ జీవన్‌ను సభకు అధ్యక్షత వహించాల్సిందిగా ఆహ్వానించాడు. సిఆర్‌బి కార్యదర్శి కామ్రేడ్ ఆనంద్ ఎర్రజెండాను ఆవిష్కరించాడు. కామ్రేడ్ భాను అమరుల స్థూపాన్ని ఆవిష్కరించింది. రెండు నిమిషాలు అమరుల స్మరణలో మౌనం పాటించిన తర్వాత కామ్రేడ్ ఆనంద్ ప్రారంభోపన్యాసం చేశాడు. పిబి సభ్యుల నుండి సాధారణ కార్యకర్తల వరకూ అనేక మంది కామ్రేడ్స్‌ను కోల్పోయిన విషాద సందర్భంలో ఈ సమావేశాన్ని జరుపుకుంటున్నామని గుర్తుచేశాడు. 'ఒకవైపు విజయాలను పొంది మన రాజకీయ ప్రతిష్ట ఉన్నత స్థాయికి చేరిన తరుణంలో, మరోవైపు నష్టాలను పొంది వున్న క్లిష్ట సమయమిది. గ్రీన్‌హంట్ నేపథ్యంలో మన కష్టాలు పెరిగాయి, అయితే పొందిన విజయాలూ తక్కువేం లేవు. గత నాలుగు దశాబ్దాల కాలంలో ఎన్నడూ లేని ప్రతిష్ట మన పార్టీకి పెరిగింది. ప్రపంచవ్యాప్తంగా విప్లవోద్యమం తక్కువ స్థాయిలో ఉన్న సమయంలో భారతదేశంలో అమోఘంగా పురోగమిస్తుంటే ప్రపంచవ్యాప్తంగా కార్మికవర్గం మనవైపే చూస్తోంది. ఈ పరిస్థితి మనం సృష్టించినది. మన అమరులు సృష్టించినది. వాళ్ల త్యాగాలు సృష్టించినది.

సామ్రాజ్యవాదం తన సంక్షోభాన్ని పరిష్కరించుకోవడానికి గ్రీన్‌హంట్‌ను మొదలుపెట్టింది. అమెరికాలో ప్రారంభమయిన సంక్షోభం గ్రీస్ వరకూ వ్యాపించింది. మొత్తం యూరప్‌ను చుట్టుముట్టింది. ఈ సంక్షోభాన్ని పరిష్కరించుకోవడానికి ఫాసిజం మరింత పెరుగుతుంది. మన కష్టాలు పెరుగుతాయి. అదే సమయంలో విప్లవానికి అనుకూలతలు పెరుగుతాయి. లాల్‌గఢ్, నారాయణపట్నా వంటి పోరాటాలు సాధారణ ప్రజల్ని కూడా సాయుధ పోరాటంలోకి తెచ్చాయి. ఈ నేపథ్యంలో మనం ప్రజా పోరాటాల్లో ఒక నూతన శకాన్ని ప్రారంభించబోతున్నాం. ముకురాం, సిల్దా, కొంగెర వంటి చారిత్రక, సాహసోపేత విజయాల నేపథ్యంలో మిలిటరీ రంగంలో మరిన్ని విజయాలను సాధించుకోవడానికి ప్రాతిపదిక ఏర్పడింది. ప్రపంచవ్యాప్తంగా మేధావుల మద్దతు మనకు పెరిగింది. ఉన్న ఆ అవకాశాలను ఉపయోగించుకొని ముందుకు సాగాలి' అంటూ తన ప్రసంగాన్ని ముగించాడు.

ఆ తర్వాత పుస్తకావిష్కరణ కార్యక్రమం జరిగింది. మొదటగా కామ్రేడ్స్ ఆజాద్, హేమచంద్ర పాండేల జీవిత చరిత్రను కామ్రేడ్ మహిత ఆవిష్కరించింది. ఆ తర్వాత వరుసగా కామ్రేడ్స్ శాఖమూరి అప్పారావు, సోలిపేట కొండల్ రెడ్డిల జీవిత చరిత్రను కామ్రేడ్ జంగ్; కామ్రేడ్ సూర్యం, జగదీష్‌ల చరిత్రను కామ్రేడ్ సంతోష్; ముకురాం అమరుల చరిత్రను కామ్రేడ్ మైను, కొంగెర అమరుల చరిత్రను కామ్రేడ్ జయరాం; ఇటీవలే అనారోగ్యంతో మరణించిన దండకారణ్యం తొలితరం విప్లవ మహిళ కామ్రేడ్ శారద చరిత్రను కామ్రేడ్ అజిత్; గత సంవత్సరం అమరులైన కామ్రేడ్స్ పటేల్ సుధాకర్, వెంకటయ్యల చరిత్రను కామ్రేడ్ హరిభూషణ్ ఆవిష్కరించారు.

అనంతరం సెంట్రల్ మిలిటరీ కమీషన్ ఇన్‌ఛార్జ్ కామ్రేడ్

*(మిగతాది 58వ పేజీలో...)*